సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 245

బుధవారం 26-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో భారత్ పోరు

వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా జరిగే టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న అమెరికాతో... ఫిబ్రవరి 12న నమీబియాతో.. ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్తాన్‌తో ఆడుతుంది. ఫిబ్రవరి 18న చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో టీమిండియా ఆడుతుంది. 14 లో

నన్ను దెబ్బ తీయాలని చూస్తే..

బెంగాల్‌లో తనను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే మీ పునాదులు కదిలించేస్తానని బీజేపీకి బెంగాల్ సీఎం మమత వార్నింగ్ ఇచ్చారు.

వివరాలు 6లో ▸

హెచ్1బి వీసాదార్లకు ఊరట

భారత హెచ్–1బి వీసాదారులను వెళ్లగొట్టి, వారిని అమెరికన్లతో భర్తీ చేస్తారనే వార్తలకు వైట్‌హౌస్ ఫుల్‌స్టాప్ పెట్టింది.

వివరాలు 6లో ▸

అన్నంలో పురుగులు..

శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల గిరిజన సంక్షేమ పాఠశాలలో పురుగుల అన్నం తిన్న నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు 10లో ▸



ఆస్కార్ బరిలో..

యానిమేషన్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచింది. వచ్చే నెలలో నామినేషన్స్ షార్ట్‌లిస్ట్ నిర్ణయిస్తారు.

వివరాలు 12లో ▸

బాబు అక్రమాలకు
'పచ్చ' తర్పణం!

దోపిడీ నాదే.. దర్యాప్తూ నాదే!

అధికారంలో ఉండగానే అవినీతి ఇల్లు చక్కబెడుతున్న టీడీపీ పెద్దలు

కూటమి సర్కారు అధికారంలోకి రాగానే కుట్రకు శ్రీకారం

ఫిర్యాదుదారులు, సాక్షులను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు, పిటిషన్లు

చంద్రబాబు అవినీతిపై గతంలోనే ఫిర్యాదు చేసిన బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ

ప్రస్తుతం దర్యాప్తు అవసరం లేదని ఆయనే మళ్లీ కోర్టులో పిటిషన్ దాఖలు.. అదే బాటలో అప్పటి సీఆర్‌డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్

గతంలో ఇచ్చిన సీఆర్‌పీసీ 164 వాంగ్మూలానికి భిన్నంగా అబద్ధపు వాంగ్మూలం.. అదే పచ్చ పాటపాడిన అప్పటి ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డి

చంద్రబాబుపై అవినీతి కేసులు అర్ధాంతరంగా మూసివేతకు పక్కా పన్నాగం.. ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రా నేతృత్వంలో కుతంత్రం

ఇప్పటికే దర్యాప్తు నిలిపివేసిన పోలీసులు

2 లో

చార్జ్‌షీట్లను అటకెక్కించిన సీఐడీ

గతంలో చంద్రబాబు అవినీతిని నిగ్గు తేల్చిన సీఐడీ.. అబ్బే.. ఆధారాలు లేవని తాజాగా నివేదిక!.. క్లైమాక్స్‌కు చేరిన కుతంత్రం

తనపై అవినీతి కేసుల మూసివేతకు చంద్రబాబు బరితెగింపు ఇదీ!

వైఎస్సార్ జిల్లా పులివెందులలో తనను కలిసేందుకు వచ్చిన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

దయలేని ప్రభుత్వమిది

2 లో

చంద్రబాబు సర్కారుపై వైఎస్ జగన్ మండిపాటు

పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం

బాబు పాలనలో తమకు ఎలాంటి మేలు జరగలేదని రైతుల ఆవేదన

గతంలో ధైర్యంగా బతికాం.. ఇప్పుడు దీనంగా గడుపుతున్నాం

తుపాన్లు, వర్షాలతో అల్లాడిపోయినా సాయం అందలేదని ఆవేదన

పులివెందుల మెడికల్ కాలేజీ రాకుండా చేశారన్న ఓ విద్యార్థి

ఈ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చిన జగన్

బాబు పాలనలో గిల'గెల'!

- దారుణంగా పతనమైన అరటి ధరలు.. కిలో రూపాయికీ కొనేవారు కరువు
- వేలాది ఎకరాల్లో తోటలు దున్నేస్తున్న రైతులు
- గుడ్లప్పగించి చూస్తున్న చంద్రబాబు సర్కారు
- మొక్కుబడి సమీక్షలతోనే సరి.. రైతులను ఆదుకునే దిశగా చర్యలు శూన్యం
- మిరప.. పొగాకు.. మామిడి.. ఉల్లి తరహాలోనే అరటి రైతుల జీవితాలతో చెలగాటం
- కరోనా విపత్తు వేళ అరటి రైతును ఆదుకున్న వైఎస్ జగన్

3 లో

అమ్మకానికి భవానీ ద్వీపం!

- ఇప్పటికే తొలి దశలో 10 ఎకరాలు విక్రయం
- అడ్వెంచర్ థ్రిల్ సిటీ పేరుతో విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్.. విశ్వనాథ్ అవెన్యూస్ సంస్థలకు కట్టబెట్టిన వైనం
- మాజీ మంత్రి గంటా సన్నిహితులవే ఈ సంస్థలు
- సర్వే నంబర్ కూడా లేకుండా జీవో ఇచ్చిన బాబు సర్కార్
- రూ.4,600 కోట్ల విలువైన 230 ఎకరాల భూములు కొల్లగొట్టేందుకు పన్నాగం

5 లో

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల ట్రేటెల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108	డ్రస్డ్ స్కిన్‌తో	196
	రిటైల్ లైవ్ బర్డ్	135	స్కిన్ లెస్	223

అయోధ్యలో అద్భుత ఘట్టం

కన్నులపండువగా ధర్మ ధ్వజారోహణ కార్యక్రమం

బాలరాముని గర్భగుడి ప్రధాన గోపురంపై జెండాను ప్రతిష్ఠించిన ప్రధాని మోదీ

6 లో

శతాబ్దాలనాటి గాయాలు మానాయి

ధ్వజారోహణ కార్యక్రమం తర్వాత ప్రధాని మోదీ



కొత్తగా మరో మూడు జిల్లాలు



- రాష్ట్రంలో కొత్తగా పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేయనున్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లు కలిపి పోలవరం జిల్లా.. మార్కాపురం, కనిగిరి డివిజన్లతో మార్కాపురం జిల్లా.. మదనపల్లె, పీలేరు డివిజన్లతో మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

3 లో

అన్నమయ్య జిల్లా కేంద్రం మారిస్తే రాజీనామా
మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి

రెండు మాత్రలు, ఒక సెలైన్..

- ప్రాణాపాయంతో ఉన్నా డాక్టర్లు పట్టించుకోకపోవడంతో కాకినాడ జీజీహెచ్‌లో మరో నిండు ప్రాణం గాల్లో కలిసింది. ఆరోగ్యం విషమించిన గళ్ల గోదారయ్య అనే రైతుకు వైద్యులు రెండు మాత్రలు, ఒక సెలైన్ పెట్టి వదిలేయడంతో ఆయన మరణించాడు.

2లో

క్లుప్తంగా...

2027 జూన్ 26–జూలై 7 మధ్య గోదావరి పుష్కరాలు?

సాక్షి, అమరావతి: గోదావరి పుష్కరాలను 2027 జూన్ 26 నుంచి జూలై 7 తేదీల మధ్య నిర్వహణకు వేదపండితులతో దేవదాయశాఖ జరిపిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. దీనిపై వేద పండితుల సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని దేవదాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, గోదావరి పుష్కరాల నిర్వహణ, ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు త్వరలోనే మంత్రులు, అధికారులతో సమీక్షించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే పుష్కరాలపై దేవదాయశాఖ అధికారులు మంగళవారం సచివాలయంలో సమావేశమై ప్రాథమికంగా చర్చించినట్టు సమాచారం. కాగా, ఈ నెల 27న వెంకటాయపాలెం టీటీడీ ఆలయంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో టీటీడీపై చంద్రబాబు సమీక్షించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

28న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ఈనెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 28వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం జరుగుతుందని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టెట్–1బీ పేపర్ సిలబస్ మార్చండి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు ఉద్దేశించిన 1బీ పేపర్ సిలబస్ సరిగా లేదని, దీన్ని 2బీ పేపర్ సిలబస్‌లా మార్చాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, ఏపీ స్పెషల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో విద్యాశాఖను కోరారు. స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు 60 మార్కులు, అనుసంధానమైన సైకాలజీకి 30 మార్కులు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉద్దేశించిన 1బీ పేపర్ ప్రాథమిక పాఠశాలలకు, 2బీ ఉన్నత పాఠశాలల్లో బోధించే స్కిల్స్‌కు ఉద్దేశించిందని, కానీ 1బీ సిలబస్ కంటెంట్‌ను 30 మార్కులకే ఇవ్వడం సరికాదన్నారు.

తెలంగాణలో 11 నుంచి పంచాయతీ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పల్లెల్లో పంచాయతీ పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 564 మండలాల్లో 12,728 గ్రామ పంచాయతీల్లోని 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు (32 జీపీలు, 292 వార్డులు మినహా) 3 విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. వచ్చేనెల 11న తొలి, 14న రెండో, 17న మూడో విడత జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఏ దశకు ఆ దశ ఎన్నిక ముగియగానే అదే రోజు సాయంత్రం సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్లు లెక్కించాక విజేతలను ప్రకటించనున్నారు. ఈ షెడ్యూల్ జారీతోనే 31 గ్రామీణ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి వెంటనే అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహిస్తున్నారు. హైకోర్టులో ఉన్న వివిధ కేసుల్లో స్టే విధించిన కారణంగా ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లా కుర్మపల్లి, రామచంద్రాపూర్ పంచాయతీలు, ఖమ్మం జిల్లాలోని 4 జీపీలు, పెనుబల్లి మండలంలోని ఒక గ్రామపంచాయతీకి, అలాగే వీటిలోని మొత్తం 292 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడంలేదని కమిషనర్ తెలిపారు. గత సెప్టెంబర్ 29న ఐదు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ విడుదల చేసిన షెడ్యూల్‌ను నిలుపుదల చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలకు రీనోటిఫికేషన్ విడుదల చేస్తున్నామన్నారు.

మనకు అమరావతి కంటే వైజాగ్ బాగా గిట్టుబాటు అయ్యేలా ఉంది!

దయలేని ప్రభుత్వమిది

చంద్రబాబు సర్కారుపై వైఎస్ జగన్ మండిపాటు

పులివెందుల క్యాంప్ కార్యాలయం వెలుపల అశేష జనవాహినికి నమస్కరిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి కడప : రాష్ట్రంలో పేద ప్రజలు, రైతులంటే దయలేని ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో వివిధ సమస్యలతో సతమతమవుతున్న వారికి మంగళవారం ఆయన ధైర్యం చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుని ప్రజలతో మమేకమయ్యారు. ఆయన్ను చూడగానే కార్యాలయ ఆవరణలోని అభిమానులు, ప్రజలు జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం అందరి బాధలు, కష్టాలు విన్నారు. పరిష్కార మార్గాలు సూచిస్తూ భరోసా కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏమి చేయాలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి మేలు జరగలేదని వచ్చిన వారంతా తమ గోడు వెళ్లబోసుకున్నారు. అన్ని వర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చిన వైఎస్ జగన్.. అందరి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. వరుస తుపాన్లు, వర్షాలతో తాము అల్లాడిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం నుంచి కనీస సాయం అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తామంతా ధైర్యంగా బతికామని, కానీ ఇప్పుడు వ్యవసాయం అంటేనే అన్నదాతలు భయపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అరటితోపాటు ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని చెప్పారు. వీటిపై స్పందిస్తూ రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వంపై రైతుల తరుపున పోరాడతామని వైఎస్ జగన్ భరోసానిచ్చారు.

బాబు సర్కార్ తీరుతో సీటు కోల్పోయా

తమ సమస్యను వైఎస్ జగన్‌కు వివరిస్తున్న జయప్రకాశ్, చరణ్ సాయి

నీట్ యూజీలో తనకు 470 మార్కులు వచ్చాయని, అయితే 471 మార్కులు కటాఫ్‌గా రావడంతో సీటు రాలేదని, అదే పులివెందుల మెడికల్ కాలేజీ ప్రారంభమై ఉంటే తనకు తప్పకుండా సీటు వచ్చేదని పులివెందులకు చెందిన జయప్రకాశ్ కుమారుడు చరణ్ సాయి వైఎస్ జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. 'మీ హయాంలో మీరు 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో ఏడు కళాశాలలు ప్రారంభమవ్వగా, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పులివెందుల కాలేజీకి అయితే గత ఏడాది సీట్లు కూడా కేటాయించారు. చంద్రబాబు ప్రభుత్వం ఆ సీట్లు రద్దు చేయాలంటూ ఎన్ఎంసీకి ఏకంగా లేఖ రాసింది. అలా చేయకుండా ఉండివుంటే ఈ ఏడాది నాకు తప్పకుండా ఎంబీబీఎస్ సీటు వచ్చేది' అని వాపోయాడు. దీనిపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. ప్రస్తుత చంద్రబాబు సర్కార్ వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తోందన్నారు. పీపీపీ విధానంతో పేదలకు వైద్యాన్ని అందకుండా చేస్తోందని మండిపడ్డారు. మహోన్నత ఆశయంతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి, ఉన్నత వైద్యంతోపాటు మెడికల్ విద్యను అందించాలన్న తమ లక్ష్యాన్ని నీరుగారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని, ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

దివ్యాంగుడితో ఆప్యాయంగా వైఎస్ జగన్

ముస్లిం అక్కచెల్లెమ్మల సమస్యలను వింటున్న వైఎస్ జగన్

పులివెందుల క్యాంప్ కార్యాలయం వద్ద జగన్‌ను చూసేందుకు పరుగుపెడుతున్న ప్రజలు

• దోపిడీ నాదే.. దర్యాప్తూ నాదే!

బాబు అక్రమాలకు 'పచ్చ' తర్పణం!

అధికారంలో ఉండగానే అవినీతి ఇల్లు చక్కబెడుతున్న టీడీపీ పెద్దలు

కూటమి సర్కారు అధికారంలోకి రాగానే కుట్రకు శ్రీకారం

సాక్షి, అమరావతి: చంద్రబాబు బరితెగించి సాగించిన అవినీతి దందాను చాప చుట్టేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్ర కార్యాచరణను వేగవంతం చేసింది. అధికారంలో ఉండగానే ఆ అవినీతి కేసులను క్లోజ్ చేసేయాలన్న కుతంత్రమే ఏకైక అజెండాగా చెలరేగిపోతోంది. తనపై నమోదైన అవినీతి కేసులకు సంబంధించి దర్యాప్తు అధికారులతో చంద్రబాబు కొద్ది నెలల క్రితం సమీక్షా సమావేశం నిర్వహించడం గమనార్హం. అంటే ఆ కేసులను ఎలా క్లోజ్ చేయాలో ఆయనే దిశానిర్దేశం చేసినట్లు అప్పుడే స్పష్టమైంది. అనంతరం చంద్రబాబు తన ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు ఆ కేసుల మూసివేత బాధ్యతను ప్రత్యేకంగా అప్పగించారు. మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, ప్రస్తుత డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ ద్వారా రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేశారు. గతంలో చంద్రబాబు అవినీతిపై సీఐడీకి ఫిర్యాదు చేసిన అప్పటి బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఎండీ మధుసూదన్ రెడ్డి, అప్పటి సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్... ఇలా అందరూ ప్రభుత్వ వేధింపులకు

తలొగ్గారు. గతంలో తాము చేసిన ఫిర్యాదులు, ఇచ్చిన వాంగ్మూలాలకు విరుద్ధంగా అబ్బే..! దర్యాప్తు అవసరం లేదని న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి పూర్తి భిన్నంగా అబద్ధపు వాంగ్మూలాలు ఇచ్చారు. అలా సామ దాన బేధ దండోపాయాలను ప్రయోగించి మరీ చంద్రబాబుపై అవినీతి కేసులు అర్థాంతరంగా మూసివేతకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా సాగిస్తున్న కుతంత్రాన్ని క్లైమాక్స్‌కు తెచ్చింది. బరితెగించి అడ్డగోలుగా సాగించిన అవినీతి కేసుల్లో అసలు ఆధారాలే లేవని చంద్రబాబు గూటి చిలుక సీఐడీ ఇప్పటికే నివేదించినట్లు సమాచారం. ఇక అధికారిక ప్రకటనే తరువాయి అని పోలీసువర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

దర్యాప్తును అటకెక్కించిన కూటమి సర్కారు

చంద్రబాబే ప్రధాన నిందితుడుగా ఉన్న స్కిల్ స్కామ్ కేసు దర్యాప్తును టీడీపీ కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది. స్కిల్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూముల కుంభకోణం కేసుల చార్జిషీట్లను సీఐడీ గతంలోనే న్యాయస్థానానికి సమర్పించింది. అయితే కొన్ని వివరణలు కోరుతూ న్యాయస్థానం వాటిని గత ఏడాది మేలో సీఐడీకి పంపింది. అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాటిని కేస్ స్టడీలతో సీఐడీ అధికారులకు అందచేశారు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ కేసులను నీరుగార్చేలా టీడీపీ పెద్దలు సీఐడీపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సీఐడీ ఆ చార్జిషీట్లను న్యాయస్థానానికి సమర్పించనే లేదు. కేసుల దర్యాప్తును పూర్తి చేసేందుకు ప్రయత్నించలేదు. ప్రభుత్వ పెద్దల కుట్రను అమలు చేస్తూ చార్జిషీట్లను తొక్కిపెట్టింది.

సాక్షులకు బెదిరింపులు... తప్పుడు వాంగ్మూలాలు

చంద్రబాబుపై అవినీతి కేసులను నీరుగార్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం వేధింపులకు బరి తెగించింది. గతంలో వాంగ్మూలాలు ఇచ్చిన ఉన్నతాధికారులు, ఇతరులను తీవ్రస్థాయిలో బెదిరించి బెంబేలెత్తించింది. సాక్షులను బెదిరించి దారికి తెచ్చుకోకపోతే చంద్రబాబును ఈ అవినీతి కేసుల నుంచి బయటపడేయడం సాధ్యం కాదని తేలడంతో పోలీసు, సీఐడీ అధికారులు కుట్రపూరితంగా చెలరేగిపోతున్నారు. చంద్రబాబు అవినీతిపై గతంలో ఫిర్యాదు చేసిన అప్పటి బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఫైబర్ నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డి తదితరులను పోలీసులు బెదిరించి వేధించారు. ఇప్పటికే గత ప్రభుత్వ మద్యం విధానంపై అక్రమ కేసులో అబద్ధపు వాంగ్మూలాలు ఇచ్చిన వాసుదేవరెడ్డి... తాజాగా చంద్రబాబు హయాంలో మద్యం దోపిడీకి సంబంధించిన కేసులో గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదుకు విరుద్ధంగా స్పందించినట్టు సమాచారం. తద్వారా ఆ కేసు మూసివేతకు ఆయన సహకరించారని తెలుస్తోంది. అదే రీతిలో మధుసూదన్‌రెడ్డి కూడా పోలీసుల వేధింపులకు తలొగ్గి అబద్ధపు వాంగ్మూలం నమోదు చేసినట్లు సమాచారం. ఇక అసైన్డ్ భూముల కేసులో గతంలో చంద్రబాబు అవినీతిపై న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం ఇచ్చిన అప్పటి సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఇప్పటికే ప్లేటు ఫిరాయించారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి, పోలీసు ఉన్నతాధికారుల వేధింపులతో ఆయన గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధమైన వాంగ్మూలాన్ని గుంటూరు కోర్టులో నమోదు చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కేసు, ఇసుక కేసు, స్కిల్ స్కామ్‌లలో కూడా టీడీపీ పెద్దలు ఇదే రీతిలో ఫిర్యాదుదారులు, సాక్షులను బెదిరించి లొంగదీసుకుంటున్నారు.

అటూ ఇటూ బాబే... ఇక మూసివేతే!

ఇలా చంద్రబాబు అవినీతి కేసులను అర్థాంతరంగా మూసివేసే కుట్రను టీడీపీ కూటమి ప్రభుత్వం క్లైమాక్స్‌కు తెచ్చింది. అందుకు అవసరమైన న్యాయపరమైన ప్రక్రియను కూడా దాదాపుగా పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అయితే చంద్రబాబు పాల్పడిన అవినీతి కేసుల్లో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. స్కిల్ స్కామ్, అసైన్డ్ భూముల దోపిడీ, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు, ఫైబర్ నెట్ ప్రాజెక్టులో కుంభకోణం, మద్యం దందా, ఇసుక మాఫియా... ఇలా అన్ని కేసుల్లోనూ ప్రధాన నిందితుడు చంద్రబాబే. ఆ అవినీతి బాగోతం కేసులపై దర్యాప్తు చేసి న్యాయస్థానానికి ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్షపడేలా చేయాల్సింది దర్యాప్తు సంస్థ సీఐడీ, పోలీసు శాఖలే. కానీ ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబే పోలీసు, సీఐడీ విభాగాలకు బాస్‌గా వ్యవహరిస్తున్నారు. ఐపీఎస్ అధికారుల పోస్టింగులు, పదోన్నతులు అన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆ రెండు విభాగాలూ ఆయన చెప్పినట్లు వినాల్సిందే. దీంతో తనపై అవినీతి కేసులను వెంటనే క్లోజ్ చేయాలని ఆయన ఆదేశించగానే పోలీసు, సీఐడీ విభాగాలు అమలు చేస్తున్నాయి. గతంలో చంద్రబాబు అవినీతిపై అప్పటి ప్రభుత్వ అధికారులు పోలీసులు, సీఐడీకి ఫిర్యాదు చేశారు. వారిపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. చంద్రబాబు అవినీతిపై ఇచ్చిన ఫిర్యాదుల మేరకు నమోదు చేసిన కేసుల్లో నిష్పాక్షిక, సమగ్ర దర్యాప్తు కోసం పట్టుబట్టకూడదని వేధిస్తోంది. ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక ఆ అధికారులు అందుకు తలొగ్గుతున్నారు. దీనిపై ఎవరైనా తటస్థ వ్యక్తులు, సామాజికవేత్తలు ప్రశ్నిస్తే .. సాంకేతిక కారణాలు చెబుతూ తప్పించుకుంటున్నారు. చంద్రబాబు అవినీతి కేసుల్లో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ల కాపీల కోసం పాత్రికేయుడు బాలగంగాధర్ తిలక్ పిటిషన్ దాఖలు చేశారు. కానీ 'మీరు ఫిర్యాదుదారుడు కాదు.. బాధితుడు కూడా కాదు కదా.. !'అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారులైన అప్పటి అధికారులు ప్రస్తుతం కూటమి సర్కారు వేధింపులతో మౌనం దాలుస్తున్నారు. టీడీపీ పెద్దల కుట్రలకు వంతపాడుతున్నారు. దాంతో అటు దొంగ... ఇటు పోలీసు రెండూ బాబే అన్నట్టుగా పరిస్థితి తయారైంది. దీన్నే అవకాశంగా చేసుకుని చంద్రబాబుపై అవినీతి కేసులను గుట్టుచప్పుడు కాకుండా మూసివేసేందుకు పావులు చకచకా కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది.

న్యాయ విచారణకు సహాయ నిరాకరణ

న్యాయస్థానాల్లో కొనసాగుతున్న చంద్రబాబు అవినీతి కేసుల విచారణకు న్యాయ శాఖ సహాయ నిరాకరణ చేస్తోంది. స్కిల్‌స్కామ్ కేసులో 2023లో బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు, హైకోర్టు విధించిన షరతులను చంద్రబాబు నిర్భీతిగా ఉల్లంఘించారు. దర్యాప్తు అధికారులను బెదిరిస్తూ.. రెడ్‌బుక్ పేరిట హెచ్చరిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. షరతులు ఉల్లంఘించినందున చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ 2023 డిసెంబర్‌లోనే సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దానిపై విచారణ కొనసాగుతోంది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఐడీ రూటు మార్చేసింది. సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణకు సహకరించడం లేదు. సుప్రీం కోర్టులో సీఐడీ వాదనను వినిపించాల్సిన ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాయిదాల మీద వాయిదాలు కోరుతున్నారు. అది సరి కాదని సుప్రీం కోర్టు హితవు పలికినా తీరు మారడంలేదు.

కేసుల మూసివేతకు పక్కా పన్నాగం... లూథ్రా గుప్పిట్లో పోలీసు శాఖ

చంద్రబాబే సూత్రధారి, లబ్ధిదారుగా సాగిన కుంభకోణాల కేసుల మూసివేత కుతంత్రానికి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెరతీసింది. ఈ అవినీతి బాగోతంపై గతంలో సీఐడీ ఆధారాలతో సహా నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. 2014–19 మధ్య టీడీపీ హయాంలో చంద్రబాబు సూత్రధారిగా పాల్పడిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం, అమరావతిలో అసైన్డ్ భూముల దోపిడీ, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం, ఫైబర్ నెట్ ప్రాజెక్టులో నిధులు కొల్లగొట్టడంతోపాటు మద్యం, ఇసుక కుంభకోణాల్లో భారీ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది. వీటిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తి ఆధారాలతో నివేదించింది. అందులో స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయగా.. ఏసీబీ న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. 52 రోజులపాటు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో చంద్రబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మిగిలిన ఐదు కేసులు కూడా సీఐడీ విచారణలోనే ఉన్నాయి. కాగా ఆ కేసులను అడ్డగోలుగా మూసివేయించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా కుతంత్రాన్ని సాగిస్తోంది. అందుకోసం చంద్రబాబు తన ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను ప్రత్యేకంగా పురమాయించారు. యావత్ పోలీసు, న్యాయ శాఖలను ఆయన గుప్పిట్లో పెట్టారు. ఈ క్రమంలో ఆయన కొన్ని నెలల క్రితం విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ కావడం గమనార్హం. అవినీతి కేసుల ఎఫ్ఐఆర్‌ల నుంచి చంద్రబాబు పేరును తప్పించడం.. అనంతరం ఆ కేసులను మూసివేయడం... అందుకు ఆ కేసుల్లో సాక్షులను ఎలా వేధించాలి..? ఎలా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయాలి..? న్యాయపరంగా ఇబ్బందులు రాకుండా ఎలాంటి అడ్డదారులు తొక్కాలి..? అనే విషయాలను ఆయన పోలీసు, సీఐడీ అధికారులకు అంశాలవారీగా వివరించారని తెలుస్తోంది.

రెండు మాత్రలు, ఒక సెలైన్..

- కాకినాడ జీజీహెచ్‌లో ఇదే వైద్యం
- డాక్టర్లు పట్టించుకోక మరో రోగి మృతి
- 4 నెలల్లో ఆరు ప్రాణాలు బలి
- ఇక్కడికి తెచ్చి చేజేతులా చంపుకొన్నాం..
- బాధిత కుటుంబసభ్యుల ఆవేదన

కాకినాడ క్రైం: సీటీ స్కాన్‌కు తీసుకెళ్లేందుకు లంచం .. అత్యవసర విభాగం నుంచి వార్డుకు మార్చేందుకు లంచం.. ప్రాణాపాయంతో కొట్టుకుంటున్నా పట్టించుకోని డాక్టర్లు..! ఫలితంగా కాకినాడ జీజీహెచ్‌లో మరో నిండు ప్రాణం గాల్లో కలిసింది. నాలుగు నెలల వ్యవధిలో ఈ తరహాలో ఇది ఆరో మరణం కావడం గమనార్హం. మంగళవారం మృతి చెందిన వ్యక్తి కుమార్తె వరలక్ష్మి కథనం ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన గళ్ల గోదారయ్య (56) రైతు. ఆదివారం పొలంలో పనిచేస్తూ పక్షవాతానికి గురయ్యాడు. ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్యులు పరీక్షించి తలలో రక్తం గడ్డ కట్టిందని, కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. సాయంత్రం జీజీహెచ్‌కు తీసుకురాగా అత్యవసర విభాగంలో చేర్చారు. అర్ధరాత్రి ఎస్–8 వార్డుకు తరలించారు. సోమవారం ఉదయం నుంచి రెండు మాత్రలు, ఒక సెలైన్ మాత్రమే ఎక్కించారు. వైద్యులెవరూ రాలేదు. రాత్రి వేళ గోదారయ్య పరిస్థితి విషమించడంతో వరలక్ష్మి, ఆమె సోదరులు... నర్సుకు తెలిపారు. డాక్టర్ ఐసీయూలో ఉంటారని చెప్పగా అక్కడకు వెళ్లారు. 'మా నాన్న ఆరోగ్యం సీరియస్‌గా ఉంది. వచ్చి చూడండి' అని కోరినా ఆయన స్పందించలేదు. కసురుకుంటూ... 'వస్తాలే వెళ్లండ'ని చెప్పి, కొన్ని గంటల తర్వాత వచ్చారు. అప్పటికే గోదారయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. డాక్టర్ మందులిచ్చి వెళ్లిపోయాక మంగళవారం తెల్లవారుజామున గోదారయ్య ఆరోగ్యం విషమించింది. 'ఒకసారి చూడండి. నోట్లోంచి నురగ వస్తోంది' అని పక్క బెడ్ మీద ఉన్న రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలిని కోరగా తన బాధ్యత కాదని వెళ్లిపోయారు. నర్సు వచ్చి ఆక్సిజన్ పెట్టినా, మళ్లీ నురగ మొదలైంది. వరలక్ష్మి కుటుంబసభ్యులు మూడంతస్తుల్లోని ఐసీయూలన్నీ తిరిగినా ఒక్క డాక్టరూ రాలేదు. చివరకు గోదారయ్య వద్ద నిస్సహాయంగా కూర్చున్నారు. మధ్యాహ్నం సమయంలో గోదారయ్య చనిపోయాడు. వైద్యులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ తండ్రి ప్రాణాలు కోల్పోయాడని, జీజీహెచ్‌కు తెచ్చి చేజేతులా చంపుకొన్నామని గోదారయ్య కుమార్తె, కుమారులు విలపించారు.

ఆస్పత్రిలో గళ్ల గోదారయ్య మృతదేహం

నిబంధనల సడలింపు, మినహాయింపులకు స్టాండింగ్ కమిటీ

సాక్షి, అమరావతి: సచివాలయంలోని వివిధ విభాగాల నుంచి నిబంధనల సడలింపు, మినహాయింపులకు సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్దిష్ట సిఫార్సులు చేయడానికి అధికారులతో కూడిన స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సచివాలయ నిబంధనలకు సడలింపులు, మినహాయింపులకు వివిధ విభాగాలనుంచి వచ్చిన ప్రతిపాదనలను స్టాండింగ్ కమిటీ ఆ ప్రతిపాదనల ఆధారంగా సిఫార్సులు చేయనుంది.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

వాయుగుండంగా మారిన అల్పపీడనం

సాక్షి,అమరావతి: అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని సూచించింది. మరో వైపు నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక మరియు హిందూ మహాసముద్రం మీదుగా మరో అల్పపీడనం కేంద్రీకృతమైందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఇది ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా మారి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అన్నమయ్య జిల్లా కేంద్రం మారిస్తే రాజీనామా

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని మారిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం జిల్లాల పెంపు, మార్పులలో భాగంగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మారుస్తారన్న ప్రచారంపై మంగళవారం ఆయన రాయచోటిలో మీడియా ఎదుట స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల మార్పు జరిగినా.. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ జిల్లా కేంద్రంగా రాయచోటిని మారిస్తే తాను రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు మధ్య రాయచోటి జిల్లా కేంద్రంగా ఉండటం అన్ని ప్రాంతాలకు అనుకూలమని చెప్పారు.

బాబు పాలనలో గిల‘గెల’!

దారుణంగా పతనమైన అరటి ధరలు..

- కిలో రూపాయికీ కొనేవారు కరువు
- వేలాది ఎకరాల్లో తోటలు దున్నేస్తున్న రైతులు
- గుడ్లప్పగించి చూస్తున్న చంద్రబాబు సర్కారు
- మొక్కుబడి సమీక్షలతోనే సరి.. రైతులను ఆదుకునే దిశగా చర్యలు శూన్యం
- మిరప.. పొగాకు.. మామిడి.. ఉల్లి తరహాలోనే అరటి రైతుల జీవితాలతో చెలగాటం
- కరోనా విపత్తు వేళ మార్కెట్‌లో జోక్యం చేసుకొని అరటి రైతును ఆదుకున్న వైఎస్ జగన్

అనంతపురం జిల్లా యాడికి మండలం చందన గ్రామంలో అరటి గెలలను మేకలు, గొర్రెలకు మేతగా వదిలేసిన రైతులు (ఫైల్)

సాక్షి, అమరావతి: అరటి రైతు ఆక్రందన.. అరణ్య రోదనగా మారింది. ఓ పక్క చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ధరలు పాతాళానికి దిగజారిపోయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు. ముందెన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడిపోతున్న అరటి రైతును ఆదుకునేందుకు కనీస చర్యలూ తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇలాంటి విపత్తు వేళ నిజంగా రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి, మానవత్వం పాలకుల్లో ఉంటే యుద్ధ ప్రాతిపదికన స్వయంగా రంగంలోకి దిగాలి. అన్నదాతకు అండగా నిలవాలి. ఆపన్న హస్తం అందించాలి. తక్షణమే జోక్యం చేసుకొని కనీస మద్దతు ధరకు రైతుల వద్ద ఉన్న అరటిని కొనుగోలు చేసి ప్రభుత్వమే స్వయంగా మార్కెటింగ్ చేయాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మొక్కుబడి సమీక్షలు, కంటితుడుపు చర్యలతో సరిపెడుతోంది తప్ప రైతులను ఆదుకునే దిశగా ఒక్క అడుగూ ముందుకేసిన పాపాన పోలేదు. మిరప.. పొగాకు.. మామిడి.. ఉల్లి తరహాలోనే అరటి రైతుల జీవితాలతోనూ బాబు సర్కారు చెలగాటమాడుతోంది.

టన్ను రూ.1,000కు దిగజారిన ధర..

రాష్ట్రంలో 2.77 లక్షల ఎకరాల్లో అరటి సాగవుతోంది. వైఎస్సార్ కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోనే లక్ష ఎకరాలకుపైగా సాగవుతోంది. ఇక్కడ మాత్రమే సాగయ్యే జీ–9 వెరైటీకి అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువ. ఇది పూర్తిగా ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులవుతున్నాయి. దాదాపు 70 లక్షల టన్నులకు పైగా దిగుబడులొస్తుండగా, వాటిలో 53 శాతం రాయలసీమ జిల్లాల నుంచే వస్తున్నాయి. టిష్యూకల్చర్ ద్వారా నాటిన మొదటి పంట దిగుబడులు అనంతపురం, నంద్యాల జిల్లాలలో డిసెంబర్ నుంచి మార్చి వరకు, వైఎస్సార్ కడప నుంచి జనవరి నుంచి మే వరకు కొనసాగుతుంది. రెండో పంట పిలకల ద్వారా వచ్చే పంట (రెండో పంట) జూలై నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. 2023–24లో టన్ను రూ.30వేలకు పైగా పలికింది. అలాంటిది చంద్రబాబు సర్కారు అసమర్థ విధానాల వల్ల ప్రస్తుతం టన్ను రూ.1,000 పలకడం గగనమైపోయింది.

సంక్షోభానికి కారణమిదే..

ఈ ఏడాది మహారాష్ట్రలో ఉన్న ఏరియా కంటే 30–40 శాతం పెరిగింది. మరొక వైపు మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లో కొత్తగా అరటి సాగు మొదలైంది. సాధారణంగా మహారాష్ట్రలో ఏటా అక్టోబర్ కల్లా పంట కోతలు పూర్తయ్యేవి. దీంతో నవంబర్ నుంచి ఢిల్లీ వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌కు వచ్చేవారు. ఈసారి మహారాష్ట్రలో ఏరియా పెరగడం వలన కోతలు కొనసాగుతున్నాయి. అక్కడ నుంచి ఉత్తర భారతదేశానికి ఏపీతో పోలిస్తే రవాణా ఖర్చులు తక్కువ. ఉదాహరణకు ఒక లారీ ట్రాన్స్‌పోర్టు చేయాలంటే ఏపీ నుంచి ఢిల్లీకి రూ.60 వేల నుంచి రూ.70 వేలు ఖర్చవుతుండగా, మహారాష్ట్ర నుంచి రూ.30 వేల నుంచి రూ.40వేలు ఖర్చవుతుంది. పంట ఉన్నంత కాలం అక్కడ నుంచే కొనుగోలు చేసేందుకు ఢిల్లీ వ్యాపారులు మొగ్గుచూపుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో మన రాష్ట్రంలో మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో పిలక ద్వారా వచ్చే రెండో పంట (రెటూన్ క్రాప్) కోతకొచ్చింది. ధరల పతనాన్ని ముందుగానే పసిగట్టిన అధికారులు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా అక్టోబర్ రెండో వారం వరకు కిలో రూ.8 నుంచి రూ.10 వరకు పలికిన ధర కాస్తా ఆ తర్వాత క్రమేపి క్షీణించి రూపాయికి దిగజారింది.

చంద్రబాబుకు నిజంగా మానవత్వం ఉండి ఉంటే..

వైఎస్ జగన్ హయాంలో కరోనా విపత్తు వేళ కూడా ఇదే రీతిలో ధరలు పతనమవుతున్న సందర్భంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని అరటి రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొని అండగా నిలిచింది. ఈ విధంగా దాదాపు 16వేల టన్నులకుపైగా అరటిని కొనుగోలు చేసి సబ్సిడీ ధరపై వినియోగదారులకు అందజేసింది. ఒక్క అరటే కాదు.. ఆ తర్వాత బత్తాయికి ధర లేనప్పుడు కూడా ఇదే రీతిలో చొరవ తీసుకుని 4,109 టన్నుల బత్తాయిని రైతుల నుంచి మద్దతు ధరకు సేకరించి డ్వాక్రా సంఘాల సభ్యులకు సబ్సిడీపై అందజేసింది. కిలో రూపాయికి కూడా కొనేవాడు లేకపోవడంతో రేయింబవళ్లు కంటికిరెప్పలా పెంచిన పచ్చని అరటి తోటలను తమ చేతులతోనే నేలకూల్చేస్తూ..పంటలను దున్నేస్తుంటే సీఎం చంద్రబాబు కనీసం మానవత్వం చూపడం లేదు. నిజంగా పాలకులకు చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈపాటికే చొరవ తీసుకుని రైతుల నుంచి కనీసం కిలో రూ.15 నుంచి రూ.20 మధ్య కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా వినియోగ దారులకు సబ్సిడీపై పంపిణీ చేయడం లేదా కనీసం మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందించే ఆలోచన చేసేవారు. కానీ అలా చేయలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష చేసినప్పుడు ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. కానీ చంద్రబాబు మాత్రం మొక్కుబడి సమీక్షలతో సరిపెడుతున్నారు. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించండి.. ఢిల్లీ వ్యాపారులతో అనుసంధానం చేయండి అంటూ ఆదేశాలివ్వడం తప్ప రైతులను ఆదుకునే దిశగా ఎలాంటి ప్రత్యక్ష చర్యలూ తీసుకున్న పాపాన పోవడం లేదు. ఆకులు కాలాక చేతులు పట్టుకున్న చందంగా ఇప్పుడు ఢిల్లీ వ్యాపారులతో ట్రేడర్స్ మీట్స్ అంటూ హంగామా చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.40-100

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అరటి నాణ్యతను బట్టి కిలో రూ.40 నుంచి రూ.60 పలుకుతున్నాయి. కాస్త పెద్ద సైజు (ఎక్స్‌పోర్టు క్వాలిటీ) అయితే కిలో రూ.60 నుంచి రూ.80 కూడా పలుకుతున్నాయి. హైపర్ మార్కెట్లలో అయితే కిలో రూ.100 కూడా పలుకుతున్నాయి. చివరికి అరటి పంట ఎక్కువగా ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లోనూ కిలో రూ.40కు తక్కువ అమ్మడం లేదు. కానీ అరటి పండించే రైతుకు మాత్రం కిలో రూపాయికి మించి పలకడం లేదు. మధ్యలో ఈ సొమ్ములంతా దళారుల మాటున అధికార టీడీపీ నేతలు జేబుల్లోకి వెళ్తున్నాయి. కారణం ప్రధాన అరటి మార్కెట్లతోపాటు సీమలోని మార్కెట్ యార్డులన్నీ అధికార టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఉన్నాయి. ఇక్కడ వ్యాపారం చేయాలంటే పచ్చ ముఠాలకు మామూళ్లు ముట్టజెప్పాల్సిందే. దీంతో ఇక్కడి టీడీపీ నేతలు వ్యాపారులతో కుమ్మక్కైన రైతులకు ధర లేకుండా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

కొత్తగా మరో మూడు జిల్లాలు

- ఇక జిల్లాలుగా పోలవరం, మదనపల్లె, మార్కాపురం
- రంపచోడవరం కేంద్రంగా ఒకే ఒక్క నియోజకవర్గంతో పోలవరం జిల్లా
- ప్రస్తుత పోలవరం ఏలూరు జిల్లాలోనే కొనసాగింపు
- మొత్తంగా 26 నుంచి 29కి పెరగనున్న జిల్లాల సంఖ్య
- కొత్తగా మరో ఐదు రెవెన్యూ డివిజన్లు.. ఇప్పుడున్న వాటిలో మార్పులు
- రాష్ట్ర ప్రభుత్వం ఖరారు..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా పోలవరం తోపాటు మార్కాపురం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేయనున్నారు. రంపచోడవరం కేంద్రంగా కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాత పోలవరం ప్రాంతంలో ఎలాంటి మార్పులు చేయకుండా ఏలూరు జిల్లాలోనే కొనసాగించనుంది. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లు కలిపి కొత్తగా పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదికపై సీఎం చంద్రబాబు సచివాలయంలో మంగళవారం చర్చించి ఖరారు చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే ఈ మూడు జిల్లాలతో రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 29కి పెరగనుంది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివాణం మండలాన్ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

3.49 లక్షల జనాభాతో పోలవరం జిల్లా

పాడేరు కేంద్రంగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాను విడగొట్టి పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తున్నారు. కేవలం రంపచోడవరం నియోజకవర్గంతో 3.49 లక్షల అతి తక్కువ జనాభాతో ఈ జిల్లా ఏర్పాటవుతోంది. రాష్ట్రంలో అతి చిన్న జిల్లా ఇదే కాబోతోంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వై రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు.. చింతూరు డివిజన్‌లోని యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

ప్రకాశం జిల్లాను విడగొట్టి కొత్తగా మార్కాపురం జిల్లా

ప్రకాశం జిల్లాను విభజించి మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది. యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉండనున్నాయి. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు.. కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బెస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్త జిల్లాలో ఉండనున్నాయి. 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

పీలేరు, మదనపల్లి రెవెన్యూ డివిజన్లతో మదనపల్లి జిల్లా

మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉండనున్నాయి. మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకల చెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు.. పీలేరు డివిజన్‌లోని సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారి పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఈ జిల్లాలో ఉండనున్నాయి.

డివిజన్లు, మండలాల్లో మార్పులు

- శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలపనున్నారు.
- అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.
- కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లో కలుపుతున్నారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, మండలాలను రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపనున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం పేరు వాసవీ పెనుగొండ మండలంగా మారనుంది.
- బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. అద్దంకి, దర్శి నియోజకవర్గాలతో కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.
- కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు.
- కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు.
- నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో కలపనున్నారు.
- పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో కలుపుతున్నారు.
- సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ, కేవీ పల్లి, కలికిరి, వాల్మీకిపురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.
- పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు.
- వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు.
- శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు.
- కదిరి డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పుట్టపర్తి డివిజన్‌లో ఉన్న గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో కలపనున్నారు.
- నంద్యాల జిల్లా డోన్ రెవెన్యూ డివిజన్‌లోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల.. నంద్యాల డివిజన్‌లోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

చెదిరిపోతున్న 17 జిల్లాలు

ఈ పునర్వ్యస్థీకరణతో 17 జిల్లాలు చెదిరిపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్లమెంటు నియోజకవర్గం ప్రాతిపదికగా ఏర్పాటైన జిల్లాల స్వరూపం చాలా వరకు మారిపోనుంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. మంత్రుల కమిటీ చేసిన ఈ ప్రతిపాదనలను ఈ నెల 28వ తేదీన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదించనున్నారు.

28 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మంగళవారం మావోయిస్టు పార్టీకి చెందిన 28 మంది ముఖ్య నేతలు లొంగిపోయారు. ఈ మేరకు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ నారాయణపూర్ జిల్లా ఎస్పీ రాబిన్‌సన్ గురియాతో కలిసి వివరాలు వెల్లడించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పెద్దఎత్తున కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్లకు తోడు, పార్టీలో అంతర్గత విభేదాలు, జనజీవన స్రవంతిలో కలుస్తున్న మావోయిస్టుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న వందలాది మంది నక్సల్స్ లొంగిపోతున్నారని తెలిపారు. తాజాగా మాడ్ డివిజన్‌లోని కుతుల్, ఇంద్రావతి ఏరియా కమిటీలకు చెందిన 28 మంది ఆయుధాలతో సహా సరెండర్ అయ్యారని, వారిపై మొత్తంగా రూ.89 లక్షల రివార్డులు ఉన్నాయని తెలిపారు. లొంగిపోయిన వారిలో కుతుల్ ఏరియా కమిటీ కార్యదర్శి మంకు కుంజం అలియాస్ సుఖ్లాల్, సప్లయ్ టీం ఏసీఎం హిడ్మే కుంజం, నెల్నార్ ఏరియా జన్ మిలీషియా కమాండర్ పున్నాలాల్, డివిజనల్ కమిటీ సభ్యులు మర్కం పొడియం, అలియాస్ రతన్, మనోజ్ దుగ్గా, సుమిత్రా అలియాస్ సన్నీ, వనీలా పర్సా తదితరులు ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పిస్తామని ఐజీ వివరించారు.

పూర్వోదయ నిధులతో ఉద్యాన రైతులకు సౌకర్యాలు

- రూ.40 వేల కోట్లతో కార్యాచరణ
- సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు పూర్వోదయ పథకం కింద మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకమైన పూర్వోదయ అమలుపై మంగళవారం సచివాలయంలో ఉద్యాన శాఖాధికారులతో సీఎం సమీక్షించారు. అరటి, చీనీ, బొప్పాయి, దానిమ్మ, మామిడి, ఉల్లి, టమోటా, మిరప, నిమ్మ తదితర ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో 92 క్లస్టర్ల ద్వారా రైతులకు జీవనోపాధి కల్పనకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈ పథకం కింద రూ.40 వేల కోట్లతో 5.98 లక్షల మంది రైతులకు ఉపయోగపడేలా రహదారులు, జల వనరుల ప్రాజెక్టులు, పంచాయతీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఉద్యాన పంటల సాగు, మార్కెటింగ్ ప్రాజెక్టులకు తొలుత రూ.14,800 కోట్ల ఖర్చు చేయనున్నామన్నారు. ఇందులో సబ్సిడీ రూపంలో రూ.9 వేల కోట్లు ఇస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మంత్రులు, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తనిఖీలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర సదుపాయాలపై సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు.

రైతన్నా మీకోసం’ అనే హక్కు మీకుందా?

- అన్నదాతలను మభ్యపెట్టేందుకే ఈ కొత్త డ్రామా
- 18 నెలల పాలనలో రైతులకేం చేశారు?
- పెట్టుబడి సాయం రూ.30 వేలు ఎగ్గొట్టారు
- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి కన్నబాబు ధ్వజం

కాకినాడ రూరల్: ‘రైతన్నా మీకోసం’ అనే హక్కు మీకుందా చంద్రబాబు?’ అని ముఖ్యమంత్రిని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ప్రశ్నించారు. ‘రైతన్నా మీకోసం’ అంటూ అన్నదాతలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని మండిపడ్డారు. అసలు 18 నెలల పాలనలో రైతులకేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాకినాడలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ‘‘అరటి మొదలు కొబ్బరి దాక చంద్రబాబు 18 నెలల పాలనలో కంటతడి పెట్టని రైతు లేడు. ఉచిత పంటల బీమా రద్దు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ మర్చిపోయారు. ప్రకృతి విపత్తుల కన్నా రైతులకు మీరు చేసే నష్టమే ఎక్కువ. రైతన్నా మీకోసం అంటూ స్లోగన్లు ఇచ్చే మీకు ఇదంతా ఎందుకు కనిపించడం లేదు? ఇది వింటుంటే... రైతన్నా మీకోసం ఏమీ చేయలేమని మనసులో చెప్పినట్లు అనిపిస్తోంది. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు, అనకాపల్లి నుంచి అనంతపురం దాక రైతు ఎక్కడ బాగున్నాడో చూపించండి. పంటలకు మద్దతు ధర లేక రైతులు పొలాల్లోనే వదిలేస్తుంటే, పంచసూత్రాల పేరుతో ప్రచారం చేసుకుంటున్నారు’’ అని కన్నబాబు ధ్వజమెత్తారు.

అది వ్యాపారుల హామీ

‘‘వైఎస్సార్ కడప జిల్లాలో అరటిని అధిక విస్తీర్ణంలో పండిస్తారు. అకస్మాత్తుగా డిమాండ్ పడిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే త్వరలో ఏపీ అరటిని కొంటామంటూ టీడీపీ కరపత్రిక ఈనాడులో వార్త వచ్చింది. ఇది ప్రభుత్వ హామీ కాదు ఢిల్లీ వ్యాపారుల హామీ. అధికారులు అడిగితే 15 రోజుల్లో వస్తామని వారు చెప్పారట. ఈలోగా కాయ, పండు కుళ్లిపోతాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో క్వింటా మొక్కజొన్న రూ.2,300కు కొన్నారు. ఇప్పుడు రూ.1,700 పలుకుతోంది. నాడు మార్క్‌ఫెడ్ ద్వారా అన్నిచోట్ల 30–35 శాతం లక్ష్యంగా పంట కొనుగోలు చేశాం. చంద్రబాబు సర్కారు ఎక్కడా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.’’ అని కన్నబాబు అన్నారు. ‘‘వైఎస్సార్‌సీపీ హయాంలో అరటిని విదేశాలతో పాటు ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేశాం. టన్నుకు సగటున ధర రూ.25 వేలు పలికింది. ఇప్పుడు రూ.500. ధాన్యం మద్దతు ధర కంటే రూ.300 తక్కువకే కొంటున్నారు. బత్తాయి రైతులు తోటలు తీసేస్తున్నారు. పంట తీత ఖర్చులు రాక ఉల్లి రైతులు వదిలేస్తున్నారు. ఎంతమంది మామిడి రైతులకు కేజీకి రూ.4 సబ్సిడీ ఇచ్చారో చెప్పాలి. పత్తి కనీస మద్దతు ధర క్వింటా రూ.7,023 ఉంటే రూ.4,500 నుంచి రూ.5 వేలు పలుకుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేరుశనగ క్వింటా రూ.6,370 ఉంటే నేడు రూ.4,300. అంబాజీపేటలో కొబ్బరి ధర నెలలో రూ.9 వేలు పడిపోయింది.’’ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రచార మార్కెటింగ్ తప్ప వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ లేదని కన్నబాబు ఎద్దేవా చేశారు. కౌలు రైతులను గాలికొదిలేశారని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.30 వేలు ఎగ్గొట్టారని, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడమే లేదని విమర్శించారు. రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఎందుకివ్వడం లేదని నిలదీశారు.

అమరావతిలో ఎందుకు భూములివ్వడం లేదు?

ఐటీ కంపెనీలకే కాకుండా రియల్ ఎస్టేట్ కంపెనీలకు కూడా విశాఖలో భూములను 99 పైసలకే ధారాదత్తం చేస్తున్నారని, ఇలా అమరావతి భూములు ఎందుకు ఇవ్వడం లేదని కన్నబాబు నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు భూకంపాలు, తుపాన్లు, సునామీలు అంటూ ‘పచ్చ’ పత్రికలు రాశాయని.. మరి అవన్నీ ఇప్పుడు రావా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులకు కస్టోడియన్‌గా ఉండాల్సిన ముఖ్యమంత్రే వేల ఎకరాలు ధారాదత్తం చేస్తున్నారని.. దీని బదులు రైతుల బాగోగులు చూడొచ్చు కదా.. ఇళ్లు లేని పేదలకు గజం స్థలం 99 పైసలకే ఇవ్వవచ్చు కదా అని సూచించారు.

మీరు ఎంత నిశ్శబ్దంగా ఉంటే
అంత ఎక్కువగా వినగలరు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 26 నవంబర్ 2025

బేలగా మిగిలిన బెలేమ్!

నిర్ణయాత్మకంగా వ్యవహరించలేని సదస్సులు చివరాఖరికి నిరర్థకంగా మిగులుతాయి. బ్రెజిల్‌లోని బెలేమ్‌లో శనివారం ముగిసిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్)–30 ముచ్చటదే. ఐక్యరాజ్యసమితి ఛత్రఛాయలో ఏటా జరిగే కాప్ సదస్సులు ఎప్పుడూ పెద్దగా ఒరగబెట్టింది లేదు. 2015 నాటి ప్యారిస్ ఒడంబడికలో అంగీకరించిన లక్ష్యాలను ఏ దేశం ఏ మేరకు నెరవేర్చిందో చూసి, ఆ విషయంలో చేయాల్సిందేమిటో నిర్దేశించటం దీని ఉద్దేశం. బెలేమ్‌లో ఈసారి అన్ని దేశాల నుంచీ ఆ లక్ష్యాల సాధనకు అవలంబించబోయే కార్యాచరణేమిటో తెలుసుకోవటమే ధ్యేయమన్నట్టు చెప్పారు. తీరా సాధించింది స్వల్పమే. వాతావరణ మార్పులు, పర్యావరణం అంటేనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కంపరం. ప్యారిస్ ఒడంబడిక నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన ముందే ప్రకటించారు గనుక ఆ దేశం నుంచి ఆశించటానికేం లేదు. ప్రపంచ కాలుష్య కారక దేశాల్లో అగ్రభాగాన ఉన్న అమెరికా ఎగవేత ధోరణి సౌదీ అరేబియా వంటి చమురు ఉత్పత్తి దేశాలకు ధైర్యాన్నిచ్చింది. ఇదే అదనని చైనా మందకొడిగా మిగిలిపోయింది. పాశ్చాత్య దేశాల పాత్ర అంతంత మాత్రం. శిలాజ ఇంధనాల వినియోగాన్ని అంచెలంచెలుగా తగ్గించటానికుద్దేశించిన మార్గనిర్దేశనాన్ని కాప్ ప్రకటించాల్సి ఉండగా చమురు దేశాలు, రష్యా, భారత్ తదితర దేశాలు ఒత్తిళ్లు తెచ్చి దాన్ని వమ్ముచేశాయి. భూగోళం వేడెక్కడానికి దారితీసే కారణాల్లో ప్రధానమైన శిలాజ ఇంధన వాడకంపైనే ఏమీ సాధించలేని స్థితిలో ఐక్యరాజ్యసమితి పరిధి వెలుపల వాటి తగ్గింపు కృషి కొనసాగుతుందనీ, ఇందుకు కొలంబియా, మరో 90 దేశాలూ సమష్టిగా ప్రణాళిక రచనకు పూనుకుంటాయనీ బ్రెజిల్ ప్రతినిధి ప్రకటించారు. వచ్చే ఏప్రిల్‌లో జరిగే 'సమ్మతి కూటమి' దేశాల శిఖరాగ్ర సదస్సు ఈ విషయంలో ప్రగతి సాధిస్తుందంటున్నారు.

బెలేమ్ సదస్సు గురించి చెప్పుకోదగ్గదల్లా వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే దేశాలకు చేసే ఆర్థిక సాయాన్ని మూడు రెట్లు పెంచుతామని సంపన్న దేశాలిచ్చిన హామీ మాత్రమే! అందువల్ల ఏటా 12,000 కోట్ల డాలర్లు సమకూరుతాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది 30,000 కోట్ల డాలర్లకు పెంచితే తప్ప ఏ మూలకూ చాలదని పర్యావరణ సంస్థలంటున్నాయి. అభివృద్ధి పేరుతో, ప్రగతి పేరుతో సంపన్న దేశాలు అనుసరించే విచ్చలవిడి పోకడల వల్ల కర్బన ఉద్గారాలు వ్యాపించి, వాతావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. సముద్ర మట్టాలు పెరిగి, లేదా కార్చిచ్చులు వ్యాపించి జనావాసాలు నాశనమవుతున్నాయి. పునరావాసం కల్పించటానికి అవసరమైన నిధులు ఆ పేద దేశాల వద్ద లేవు. శిలాజ ఇంధనాల వాడకాన్ని ఆపడం మాట అటుంచి, తగ్గించటానికి కూడా సంపన్న దేశాలు ముందుకు రావటం లేదు. కాప్–30 సదస్సును బ్రెజిల్ అమెజాన్ అటవీప్రాంతం ముంగిట్లో నిర్వహించటంలో ఉద్దేశం అడవుల నిర్మూలన వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పటం కోసమే! 92 దేశాలు దీన్ని సమర్థించాయి. కానీ ఒక్క దేశం కూడా అడవుల నిర్మూలన నివారణకు తమ వంతు ఏం చేస్తామన్నది చెప్పింది లేదు.

వాతావరణ క్షీణత వల్ల మన దేశం సైతం ప్రమాదకర స్థితిలో ఉంది. సదస్సులో రెండు సంస్థలు సమర్పించిన నివేదికలే ఈ సంగతి చెబుతున్నాయి. గత దశాబ్ద కాలంలో వివిధ రాష్ట్రాల్లో ఏటా 0.1 డిగ్రీ సెల్సియస్ నుంచి 0.5 డిగ్రీ సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఆ నివేదికలు వివరించాయి. నిరుడు ఈ పెరుగుదల 0.65 డిగ్రీల సెల్సియస్‌కు చేరిందని తేలింది. మన దేశంలో ఉత్తరాదిన ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో దేశం తీవ్ర వాతావరణ పరిస్థితులు చవిచూసిందని మరో సంస్థ గణాంక సహితంగా తెల్పింది. వడగాడ్పులు, చలిగాలులు, పిడుగుపాట్లు, పెనుగాలులు, భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడటాలు వగైరాల వల్ల 4,064 మంది మరణించగా, దాదాపు 95 లక్షల హెక్టార్ల పంట దెబ్బతింది. 99,533 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో కూడా కాప్–30 సదస్సు మెరుగైన ఫలితాలు రాబట్టలేకపోయిందంటే అది మానవాళి దురదృష్టమనుకోవాలి. కాప్–30 విఫలం కానీయరాదన్న సంకల్పంతో ప్రకటించిన అరకొర చర్యలు తప్ప బెలేమ్ సాధించిందేమీ లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.షష్ఠి రా.7.22 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** శ్రవణం రా.10.04 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.2.08 నుండి 3.46 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.23 నుండి 12.08 వరకు, **అమృత ఘడియలు:** ప.11.07 నుండి 12.46 వరకు, **సుబ్రహ్మణ్య షష్ఠి.**

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

అనుకోకుండా...



గణితశాస్త్రంలో ఒక అద్భుతమైన ఆలోచన ఎప్పుడు వస్తుందో చెప్పలేం. మీరు కారు నడుపుతుండగా రావచ్చు, లేదా స్నానం చేస్తున్నప్పుడు తట్టవచ్చు. అదే పనిగా కష్టపడితే మీకు ఆ ఆలోచన వస్తుందని కూడా చెప్పలేం. ఇక్కడ ఆలోచనతో పాటుగా ఓర్పు ఉండాలి.

– సౌరవ్ ఛటర్జీ, గణిత శాస్త్రజ్ఞుడు

గౌరవించండి!

ఫిట్‌నెస్ మీ లోపలి నుండి రావాలి. మీరు మీ శరీరాన్ని గౌరవించాలి. అప్పుడే దానిని కాపాడుకోవాలన్న ఉత్సాహం మీకు వస్తుంది. ఫిట్‌గా ఉండటం నా జీవన శైలిలో ఒక భాగం. ఫిట్‌గా ఉండటం వల్ల ఏకాగ్రత కుదురుతుంది. మనోబలం పెరుగుతుంది.

– అర్జున్ రాంపాల్, నటుడు–మోడల్

వెంచర్ సరదా

సొంతంగా కంపెనీ పెట్టడం సరదాగా ఉంటుంది. అయితే అమాంతం దూకేయకూడదు. ముందుగా మీ కాలి బొటనవేలిని నీటిలో ముంచి చూడాలి. అంటే... ఒక వెంచర్ లేదా కార్యాచరణను మెల్లిగా, అంటీ ముట్టనట్లుగా ప్రారంభించాలి. క్రమంగా లోపలికి దిగాలి.

– కరణ్ బిలిమోరియా, వ్యాపారవేత్త

స్వీయ శోధన

నేను ఏదైనా అర్థం చేసుకోవటానికి, లేదా వివరించటానికి ప్రయత్నం చేసిన ప్రతిసారీ అందులోంచి నేనూ ఒక కొత్త అర్థాన్ని కనుగొంటాను. కళాకారుడు తన ఉనికి కోసం నిరంతరం తనను తను తవ్వుకుంటూ ఉన్నప్పుడే ఏదైనా సృష్టించగలడు. కళను విస్తృతం చేయగలడు.

– జార్జి చక్రవర్తి, బహుళ కళా నిపుణుడు

దూకుడు వ్యూహం

జెనరేషన్ 'జెడ్'... వాణిజ్య ప్రకటనల్ని చూడటం లేదు. ప్రైవసీ స్విచ్‌లను తిప్పికొడుతోంది. 'పేవాల్స్' వెనుక నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒక దూకుడైన ప్రచార వ్యూహానికి నిర్ణయం తీసుకునే గదిలో 'బటన్'ని నొక్కడానికి ఎవరూ ముందుకు రాకపోవటం సహజమే. కానీ రావాలి.

– శుభదీప్ బెనర్జీ, ఐటీసీ డిజిటల్ చీఫ్

నా ఉద్దేశం

గెలవటం వల్ల నేర్చుకునే దానికంటే, దెబ్బలు తినటం వల్లే ఎక్కువ నేర్చుకుంటాం అనే వారితో నేను విభేదిస్తాను. గెలుపు కోసం ఆడుతున్నప్పుడు గెలవటం కోసం మాత్రమే ఆడాలి. ఓటమి మనకేమీ నేర్పదు. ఓటమి గెలుపునకు ఒక మెట్టు అని అనుకోకండి.

– టామ్ క్రూజ్, హాలీవుడ్ నటుడు

'శ్రమదోపిడీ లేని భారత్' కావాలి!

అభిప్రాయం

రంగనాయకమ్మ

2026 మార్చ్ 31 నాటికి, 'నక్సలిజం లేని భారత్‌ని ఏర్పాటు చేస్తాము'– అని, దేశ ప్రధానీ, హోమ్ మంత్రీ కూడా పదే పదే ప్రకటిస్తున్నారు. నక్సలైట్లు 'లొంగే వరకూ, లేదా పట్టుబడేవరకూ, లేదా నిర్మూలనం అయ్యేవరకూ, తమ ప్రభుత్వం నిద్రపోదు' అని కూడా ప్రకటించారు. అందుకోసం అనేక రకాల పేర్లతో, పోలీసు దళాలను రంగంలోకి దించారు. ఆ పేర్లలో ఒకటి 'కోబ్రా' (నాగు బాము) దళం, ఇంకోటి 'గ్రే హౌండ్స్' (వేట కుక్కల) దళం. 'గ్రే హౌండ్స్' అనేవి ఒక జాతి కుక్కలు. ప్రాచీన ఈజిప్టులో, వేటల కెళ్ళినప్పుడు, జంతువుల్ని పట్టెయ్యడానికి, ఆ కుక్కల్ని ఉపయోగించేవారట! ఇప్పుడు, నక్సలైట్లని పట్టుకోవడానికి, పోలీసు దళాల్ని అదే పేరుతో ఏర్పాటు చేసి ఉపయోగిస్తున్నారు! నిన్న గాక మొన్న, ఈ పేరుగలిగిన పోలీసు దళం వాళ్ళే, ఆదివాసీల తరపున పోరాడుతున్న నక్సలైట్ల నాయకుల్ని చాలా మందిని చంపేసినట్టు వార్తలు వచ్చాయి. ఈ వార్తలు చదివాక, నాకు వచ్చిన ఆలోచనలు కొన్ని ఇవి:

◆ సమాజం బాగుపడాలని కోరుకునే ఎవ్వరైనా, అనుకోవలిసింది: 'నక్సలిజం లేని భారత్ కాదు, శ్రమ దోపిడీ లేని భారత్' కావాలి! – అని.

పరస్పర శత్రుత్వం వెనక...

(1) నేను తెలుగులో, 1978లో, పరిచయం చేసిన 'అంకుల్ టామ్స్ కేబిన్' ('టామ్ మామ ఇల్లు') అనే ఒక ఇంగ్లీషు నవలలో చదివిన ఒక 'వ్యాపార ప్రకటన' ఈ సందర్భంలోనే కాదు, ఎప్పుడూ గుర్తే వస్తుంది. అమెరికాలో, నీగ్రోల బానిసత్వం కొనసాగుతున్న కాలంలో, బానిసలుగా ఉండటం ఇష్టం లేని శ్రామికులు పారిపోతే, వారిని వెతికి పట్టుకోవడానికి, వారి యజమానులు నిజం వేట కుక్కల్ని వాడేవారు. వాటికి సంబంధించినదే ఆ వ్యాపార ప్రకటన! దాని హెడ్డింగు: 'నీగ్రో కుక్కలు!' ఆ ప్రకటనలో ఇలా వుంది: ''నగర వాసులందరికీ, ఈ క్రింద సంతకం చేసిన వ్యక్తి విన్నవించుకొనేదేమనగా– 'నేను మన్రో రోడ్డులో తూర్పున రెండున్నరమైళ్ళ దూరాన నివసిస్తున్నాను. నా దగ్గిర, నీగ్రోల్ని పట్టుకోడానికి చాలా మంచి కుక్కలు ఉన్నాయి! పారిపోయిన నీగ్రోల్ని పట్టుకోవాలని కోరే వ్యక్తులు నాకు ఒక్క పిలుపు ఇస్తే చాలు. నేను వేటకెళ్ళినప్పుడు తప్ప మిగతా సమయాలలో నా నివాసంలోనే ఉంటాను. నేను లేకపోయినా, నా నివాసం దగ్గర నా సమాచారం మీకు అందుతుంది. నీగ్రోని పట్టుకున్న కుక్క కోసం– 25 డాలర్లు. నీగ్రోని పట్టుకోకపోతే 5 డాలర్లు మాత్రమే'. – ఇట్లు, గాఫ్. ఫిబ్రవరి 17, 1852.'' – ఇదీ ఆ ప్రకటన!

ఎంత ఆశ్చర్యం! అక్కడ, ఆ నాడు, 170 ఏళ్ళనాడు, స్వేచ్ఛ కోసం పారిపోయిన బానిసల్ని పట్టుకోవడానికి, ఆ నాటి బానిస యజమానులు వేటకుక్కల్ని ఉపయోగించారు. ఈనాడు, ఉద్యమకారులు తప్పించుకుంటూ, ఉద్యమాన్ని నిలబెట్టుకోవడానికి, భద్రమైన స్థలాలకు వెళ్తూ వుంటే, ఈ ప్రభుత్వ పాలకులు, వేట కుక్కల పేరుతో వున్న పోలీసుల దళాలను ఉపయోగిస్తున్నారు. అయితే, ఆ పోలీసుల గురించి, కవి చెరబండరాజు, ఒక పాటలో ఇలా చెప్పాడు: ''మాలోని మనిషివే! మా మనిషివే నీవు!/ పొట్ట కూటికి నీవు పోలీసువైనావు!'' నిజానికి పోలీసులంటే ఎవరు? వారూ మానవులే! శ్రామిక కుటుంబాలనించీ వచ్చిన వారే! సైనికుల లాగే, యజమానులు ఆజ్ఞాపించే 'బలప్రయోగం' అనే శ్రమ చేస్తూ, వచ్చిన జీతాలతో బతుకుతారు. ఈ పోలీసుల గురించి, మార్క్స్ మాటల్లో చెప్పాలంటే, ''తప్పుడు సామాజిక సంబంధాల కారణంగా దోపిడీ సమాజానికి అవసరమైన అనుత్పాదక శ్రామికులు.'' అంటే, 'శ్రమ దోపిడీ' అనే తప్పుడు సామాజిక సంబంధాల వల్లే, సమాజంలో వర్గాలూ, వర్గాల మధ్య ఘర్షణలూ తలెత్తుతాయి! వాటిని నివారించడానికీ, శ్రమ దోపిడీని సాఫీగా సాగనివ్వడానికీ నిరంకుశ ప్రభుత్వాలు, సాయుధ భటులతో అణిచివేయడం అన్నది బానిస యజమానుల కాలం నించీ వస్తున్నదే! ఆనాటి సాయుధ భటులకు బదులుగా ఈ నాడున్నది 'పోలీసులు'! పత్రికల్లో, ఈ వార్తలు చదివే పాఠకులు గ్రహించ వలిసింది ఏమిటంటే: ఆ నాడైనా, ఈ నాడైనా, పాలకులు, ప్రజల్లోనే వున్న రెండు భాగాలను, (వృత్తి ధర్మం పేరుతో, ఇటు పోలీసులనూ; శాంతి భద్రతల పేరుతో, అటు శ్రమ దోపిడీని అడ్డుకునే నక్సలైటు ఉద్యమకారులనూ) శత్రువులుగా నిలబెట్టి, పరస్పరం సంఘర్షించుకునేలా చేస్తారు! ఆ సంఘర్షణలో, ప్రాణాలు పోగొట్టుకునేది ఇటు పోలీసులూ, అటు ఉద్యమకారులూనూ. ఇరు పక్షాల కుటుంబాలూ ఎంతో క్షోభని అనుభవిస్తాయి! బిరుదులతోనూ, ఎవార్డులతోనూ, రివార్డులతోనూ, ఆ క్షోభని తగ్గించలేరు! అందుచేత, సమాజం బాగుపడాలని కోరుకునే ఎవ్వరైనా అనుకోవలిసింది: 'నక్సలిజం లేని భారత్ కాదు, శ్రమ దోపిడీ లేని భారత్' కావాలి!– అని.

విమర్శకు అతీతులా?

(2) 'మరి నక్సలైట్లు అనుసరించే రాజకీయ పంథాని విమర్శించవద్దా' అని ఎవరైనా అడగవచ్చును. తప్పులున్నప్పుడు, తప్పకుండా విమర్శించవలిసిందే! 'మావోయిస్టులూ! మీ అంతిమ లక్ష్యం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, మంచిదే! కానీ ఎన్నెన్నో పోరాటాల తర్వాత, తప్పనిసరిగా చెయ్యవలిసి వచ్చే 'ఆయుధాల' పోరాటాన్ని, ప్రారంభంలోనే మొదలు పెడితే, మీది 'వామపక్ష బాలారిష్టమే' అవుతుంది – అని విమర్శించవలిసిందే! దీన్ని బట్టి రాజకీయంగా, నక్సలైట్లు ఇంకా శైశవ దశలోనే వున్నారనుకోవాలి. ఒక హిందీ కవి శిశువుల గురించి ఇలా చెపుతాడు: 'శిశువు పడుతూ, పడుతూ, నడవడం నేర్చుకున్నాడు! శిశువు ఏడుస్తూ, ఏడుస్తూ, నవ్వడం నేర్చుకున్నాడు!' ('శిశూ నే గిర్ గిర్ కర్, చల్నా సీఖా! రో రోకర్, హస్నా సీఖా!). భవిష్యత్తులో ఈ ఉద్యమకారులు కూడా శిశువుల లాగే నేర్చుకుంటారని ఆశించాలి.

ఏం మారిందని?

(3) ఇంకో వార్త! లొంగిపోకుండా తప్పించుకు తిరిగే ఉద్యమకారులకు, వారి తలకి కొంత వెలకట్టి, వారిని పట్టిచ్చిన వారికి కొన్ని లక్షల బహుమతీ, ఒక ఉద్యోగమూ ఇస్తామని ప్రభుత్వ ప్రకటనలు కూడా వున్నాయి. ('ది ఎకనామిక్ టైమ్స్', 16–4–2024). ఇలాంటి ప్రకటనలు, అమెరికాలో బానిసత్వం వున్న రోజుల్లో (1619–1865), కూడా వున్నట్టు, 'అంకుల్ టామ్స్ కేబిన్' నవల చెపుతుంది. ఆ ప్రకటన హెడ్డింగు: '25 డాలర్ల బహుమానం!' ప్రకటన ఇలా వుంది: ''అక్టోబర్ 17న బానిస ఒకడు పారిపోయాడు. పేరు యాలెన్. వయస్సు 23 సం.లు. ఎత్తు 6 అడుగులు. రంగు ములాటో. కుక్క పీకిన మచ్చలుంటాయి. లావెల్ పాంటూ, కాటన్ షర్టూ ఒంటి మీద ఉన్నాయి. బాగా చదవలేడు. చిన్న చిన్న పదాలు రాస్తాడు. చిన్న చిన్న లెక్కలు చేస్తాడు. మాట్లాడేటప్పుడు నవ్వుతూ ఉంటాడు. తొందరగా మాట్లాడుతాడు. జైల్లో పెట్టి, నాకు తెల్పండి. ఇట్లు – చీతం, నవంబరు 6, 1852.''

అంటే, యజమానుల కోసం పనిచేసే ప్రభుత్వాల చర్యల్లో అప్పటికీ, ఇప్పటికీ ఏదైనా తేడా వుందా? ఎప్పుడో, 175 ఏళ్ళ నాడే, 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'లో చెప్పినట్టు, ''ప్రభుత్వం అనేది, పెట్టుబడిదారీ వర్గపు ఉమ్మడి వ్యవహారాలను నిర్వహించే కమిటీ మాత్రమే!''

వ్యాసకర్త ప్రసిద్ధ రచయిత్రి

అంబేడ్కర్ ప్రాధాన్యం తగ్గించే కుట్ర!

ఈ దేశంలో మహాత్మా గాంధీ తర్వాత అత్యధికంగా వాడవాడల్లో ఉన్న విగ్రహాలు బహుశా బి.ఆర్. అంబేడ్కర్‌వే. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని గత ప్రభుత్వాలు అంబేడ్కర్ భారీ విగ్రహాలు సైతం నెలకొల్పి ఆయన పట్ల తమకున్న గౌరవ భావాన్ని చాటుకున్నాయి. దేశంలోని అత్యధికులు అంబేడ్కర్‌ను తమ వాడిగా భావించి ఆరాధిస్తుంటే, కొందరు మాత్రం ఆయన ప్రతిభనూ, నవ భారత నిర్మాణంలో... ముఖ్యంగా రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రనూ తక్కువ చేయాలని చూస్తున్నారు.



భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచాయి. దేశం దాన్ని కాలానుగుణంగా సవరణలు చేసుకొంటూ ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసుకుంటోంది. ఇదే సమయంలో అనేక దేశాలు రాజ్యాంగ వైఫల్యం కారణంగా ప్రజాస్వామ్య పునాదులు చెదిరిపోయి అధ్యక్ష పాలనలోకో, నియంతృత్వ పాలనలోకో జారుకున్నాయి. మన పొరుగు దేశమైన శ్రీలంక గడిచిన ఆరేళ్ళ నుండి ఎలాంటి రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొందో అందరికీ తెలిసిందే. బంగ్లాదేశ్‌లో 'జూలై ఛార్టర్' పేరుతో విద్యార్థులు చేసిన ఉద్యమం రాజ్యాంగ సంక్షోభానికి దారి తీసి, సాక్షాత్తు ప్రధాని దేశం వదిలి పారిపోవాల్సిన పరిస్థితిని కల్పించింది. మనతో పాటుగా స్వాతంత్ర్యం తెచ్చుకున్న పాకిస్తాన్ పరిస్థితి మరింత ఘోరం.

ఇదే సమయంలో మన దేశంలోని పరిస్థితులను చూస్తే అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తాయి. అందుకు ప్రధాన కారణం డా॥ బి.ఆర్. అంబేడ్కర్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగమే. భారత రాజ్యాంగ సభలో 299 మంది సభ్యులు, వివిధ కమిటీలకు వేర్వేరు అధ్యక్షులు ఉండగా అంబేడ్కర్‌కు ఇంతటి ప్రాచుర్యం, ప్రాధాన్యం రావడానికి కారణమేమిటి? అనే విషయమై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. భారత రాజ్యాంగ రచనా సంఘంలో అంబేడ్కర్‌తో కలిపి 7 మంది సభ్యులు ఉన్నారు. కార్మిక సంస్కరణలు, సామాజిక సమానత్వం, ప్రాథమిక హక్కుల విషయంలో... ఇతర సభ్యులెవరూ అంబేడ్కర్ పాత్రకు సాటిరాగలవారు డ్రాఫ్టింగ్ కమిటీలో లేరంటే అతిశయోక్తి కాదు. రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేడ్కర్ కంటే ఎక్కువ శ్రద్ధ, జాగ్రత్త తీసుకున్న వారు మరొకరు లేరని స్వయంగా జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. అంబేడ్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించడమే తాము చేసిన అతి గొప్ప కార్యం అని భారత తొలి రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్‌కు అధిక గుర్తింపు ఎందుకు ఇవ్వాలనే కొందరి వితండవాదానికి ముసాయిదా కమిటీ సభ్యుడైన టి.టి. కృష్ణమాచారి మాటలను ఒకసారి గుర్తు చేసుకోవడం సబబుగా ఉంటుంది. 'మేం ఎన్నుకున్న సభ్యులలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాకు వెళ్లారు. ఇంకొకరు సంస్థ పనిలో నిమగ్నమయ్యారు. ఒకరిద్దరు అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయారు. చివరికి అంబేడ్కర్ మాత్రమే ఈ మహత్తర బాధ్యతను స్వీకరించి, రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ కష్టమైన పనిని ఆయన ఎంతో అంకిత భావంతో పూర్తి చేశారు' అని అన్నారు. అలానే మరో సభ్యుడు అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ 'ఈ రాజ్యాంగ రచనను ముందుకు నడపడంలో చైర్మన్‌గా అంబేడ్కర్ చూపిన నైపుణ్యాన్నీ, సామర్థ్యాన్నీ, నిరంతరంగా ఆయన చేసిన పనినీ మెచ్చుకొనకపోతే నేను నా కర్తవ్యాన్ని విస్మరించిన వాడినవుతాను' అని స్పష్టం చేశారు.

– వడ్డి జితేంద్ర మోహన్ లోహియా
న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి (ఆంధ్రప్రదేశ్)
(నేడు భారత రాజ్యాంగ దినోత్సవం)

ఇది ముమ్మాటికీ నయవంచనే!

ఇన్ బాక్స్

విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కారణం దానికి సొంతగనులు లేకపోవడమే. వాటిని సమకూర్చమని కార్మికులు నెత్తీనోరు కొట్టుకొని అడుగుతున్నా పట్టించుకోకుండా, నష్టాలకు ఉద్యోగులు, కార్మికులే కారణం అన్నారాయన. కానీ నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే ప్రైవేట్ మిత్తల్ స్టీల్‌కు మాత్రం వేల కోట్ల రాయితీలివ్వడానికి సిద్ధపడింది ప్రభుత్వం.

ప్రతిపక్షంలో ఉండగా విశాఖ ఉక్కును కాపాడుకోవాలని చెప్పిన పెద్ద మనిషి చంద్రబాబు, ఇప్పుడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై కారాలు నూరుతున్నారు. 'తమాషాగా ఉందా' అని బెదిరిస్తున్నారు. 'పని చేయనివారు', 'తెల్ల ఏనుగు' అంటూ కార్మికులు, స్టీల్ ప్లాంట్‌ను తక్కువ చేసి మాట్లాడారు.

'కార్మికులు పనిచేయాలి. పనిచేయకపోతే గవర్నమెంట్ ఎక్కడ నుండి డబ్బులు తెస్తుంద'ని వ్యాఖ్యానించారు. వారు పనిచేయకపోతే ప్లాంట్ 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం నుండి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి ఎలా పెరిగింది? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు 60 వేల కోట్ల రూపాయలు పన్నులు, డివిడెండ్ల రూపంలో చెల్లించిన విషయం చంద్రబాబుకు గుర్తులేక కాదు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే తక్కువ చేశారు.

సంస్థ పునరుద్ధరణ కోసం 11,444 కోట్ల రూపాయలు నిధులు సమకూర్చామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నిధులు, బ్యాంకు, ఇతర అప్పులు తీర్చడానికి; ఉద్యోగులు, కార్మికులు తొలగింపునకు వినియోగించడానికి తప్ప ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు, స్పేర్ పార్ట్స్ కొనుగోలుకు, ఉద్యోగుల జీత భత్యాలకు చెల్లించకూడదని ఆంక్షలు పెట్టారు. ఒకవైపు ఆటంకాలు సృష్టించి, మరోవైపు ప్లాంటు రివైవల్ కోసం కృషి చేస్తున్నామని చెప్పడం ముమ్మాటికీ నయవంచనే. అత్యంత నైపుణ్యం గల ఆఫీసర్లను, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను వేల సంఖ్యలో తొలగించి, నైపుణ్యం లేని ఇతర రాష్ట్రాల కార్మికులను కొత్తగా నియమించి ఉత్పత్తికి ఆటంకం సృష్టిస్తున్నది డబుల్ ఇంజిన్ సర్కార్.

సొంత గనులు లేకపోవడంతో విశాఖ ఉక్కు ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి సుమారు 6,000 రూపాయలు అదనపు ఉత్పత్తి ఖర్చు భరిస్తోంది. ఈ నష్టాలకు కారణం కూటమి సర్కార్. కాగా కార్మికులపై చంద్రబాబు అభాండాలు వేయడం ప్రజలను మోసగించడమే. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించాలి. ఉద్యోగుల, కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపివేసి స్టీల్ ప్లాంట్ పురోగతికి సహాయపడాలి.

– అల్లు రాజు | సీపీఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు

చిన్న కార్లంటేనే మోజు

ఈ ఏడాది సెప్టెంబరు – అక్టోబరులో అమ్ముడైన కార్లలో సుమారు 78 శాతం రూ.10 లక్షల లోపు ధర ఉన్నవే. రూ.20 లక్షలకుపైగా ధర ఉన్న కార్ల అమ్మకాలు కేవలం 2 శాతం.



కనిపించే దైవాలు



దైవరూపాలను చిత్రపటాలలోనూ, రాతి విగ్రహాలలోనూ చూస్తూ వాటినే పూజిస్తాం. దైవం ఆ యా రూపాలలో ఉంటాడనే భావనే భక్తికి పునాది. కానీ కళ్ళకు కనిపించే ప్రత్యక్ష దైవాలు, నిత్య మార్గదర్శులు... తల్లితండ్రులు. వారిని పూజిస్తే సమస్త దేవతలనూ పూజించినట్లే! మాతృ దేవోభవ, పితృ దేవోభవ అన్నది అందుకే!

పరమ భాగవతోత్తములైన దంపతులకు లేక లేక కలిగిన ఏకైక సంతానం పుండరీకుడు. తల్లితండ్రుల అతి గారాబం వల్ల పెడదారి పట్టి కన్నవారి దుఃఖానికి కారణమయ్యాడు. ఒక సుగుణవతితో వివాహం కూడా అయింది. ఒకసారి స్నేహితులతో పుండరీకుడు వినోదం కోసం కాశీ వెళ్లి ఒక సత్రంలో బస చేశాడు. తెల్లవారుజామున పుండరీకుడు బయటకు వచ్చి చూస్తే ఒక ఆశ్రమ ప్రాంగణంలో ముగ్గురు అసమాన సౌందర్యవతులు ఆశ్రమం శుభ్రం చేస్తూ కనిపించారు. వారు అతనితో తాము గంగ, యమున, సరస్వతీ నదుల మనీ, ప్రతిరోజూ ఎందరో తమ జలాలలో స్నానం చేస్తూ పాపాలు అంటగట్టటం వల్ల తాము సాయంత్రానికి తేజో విహీనులం అవుతున్నామనీ, ఈ మహాత్ముని ఆశ్రమం శుభ్రం చేయటం వల్ల తిరిగి తేజస్సు పొందుతున్నామనీ చెప్పి అదృశ్యమయ్యారు.

వెంటనే పుండరీకుడు ఆశ్రమం లోపలికి వెళ్లి చూడగా అక్కడ ఒక సాధువు నేలపై కూర్చుని మంచంపై పడుకుని ఉన్న వృద్ధ దంపతుల కాళ్ళను ఒత్తుతూ కనపడ్డాడు. వెంటనే పుండరీకునికి జ్ఞానోదయమై ఇంటికి వెళ్లి తల్లితండ్రులను క్షమాభిక్ష వేడి, వారి సేవలో గడపసాగాడు. ఒకనాడు పుండరీకుడు తల్లితండ్రుల సేవలో ఉండగా వాసుదేవుడు గుమ్మం వద్ద నిలిచాడు. పుండరీకుడు 'ప్రస్తుతం పెద్దల సేవలో ఉన్నాను, కాసేపు వేచి ఉంటే వచ్చి దర్శించుకుంటాను, అంతవరకూ ఇటుకపై కూర్చో'మని కోరాడు. దీంతో ఆ ఇటుకపై కటి హస్తుడై నిలబడి, వాసుదేవుడు పుండరీకునికి, అతని తల్లితండ్రులకు కూడా మోక్ష మిచ్చాడు. భక్తుని పేరున పాండురంగనిగా వెలిశాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

కాకినాడ పోర్టు వాటాల కేసులో విక్రాంత్ రెడ్డి పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, అమరావతి: కాకినాడ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను వ్యాపారవేత్త వైవీ విక్రాంత్ రెడ్డి ఉపసంహరించుకున్నారు. వాటాల బదిలీ కేసులో ఎలాంటి ఆధారాలు లేవంటూ సీఐడీ కింది కోర్టులో రెఫర్డ్ చార్జిషీట్ దాఖలు చేసిందని, దీంతో కేసుని మూసివేస్తూ ఆ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని విక్రాంత్ తరఫు న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి హైకోర్టుకి నివేదించారు. ఈ నేపథ్యంలో వాటాల బదిలీ కేసును కొట్టేయాలంటూ తాము దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతినివ్వాలని ఆయన హైకోర్టుని కోరారు. నాగిరెడ్డి చెప్పిన విషయాలను రికార్డు చేసిన హైకోర్టు.. క్వాష్ పిటిషన్ ఉపసంహరణకు అనుమతినిచ్చింది.

గ్రామ, వార్డు సచివాలయాలపై అధ్యయనం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో మార్పులకు, సిబ్బంది పదోన్నతులపై ఏర్పాటు చేసిన 8 మంది మంత్రుల కమిటీ మంగళవారం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాలయంలో సమావేశమైంది. గ్రామ సచివాలయాల పని తీరు, ఆ వ్యవస్థ నిర్మాణంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. గ్రామ స్థాయిలో వివిధ శాఖల నిర్మాణం, సచివాలయాల ఉద్యోగులను వాటికి అనుసంధానించడం పైనా చర్చ జరగాలని అన్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

కొల్లేరులో తీవ్ర ఉద్రిక్తత

దాళ్వా సాగుకు అనుమతి ఇవ్వాలని రైతుల డిమాండ్

సాయన్నపాలెం వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న కొల్లేరు ప్రాంత రైతులు, మహిళలు

భీమడోలు: కొల్లేరులో దాళ్వా సాగుకు అనుమతివ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆ ప్రాంత రైతులు మంగళవారం భారీ ఆందోళనకు దిగారు. ఏలూరు జిల్లా నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాలకు చెందిన వందలాది మంది కొల్లేరు రైతులు, మహిళలు భోజనం క్యారేజీలతో తెల్లవారుజామున సాయన్నపాలెం కొల్లేరు నిషేధిత కాంటూరులోని 1,600 ఎకరాల దాళ్వా సాగు ప్రాంతానికి బయల్దేరారు. అటవీ శాఖ ఏలూరు రేంజర్ పి.మోహిని విజయలక్ష్మి, నిడమర్రు సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో అటవీ, పోలీస్ సిబ్బంది నిలువరించారు. మోటార్ బైకులు, జీపులను అడ్డుపెట్టారు. దీంతో భీమడోలు మండలం పూళ్ల రెవెన్యూ పరిధి సాయన్నపాలెం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొల్లేరులో ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో సాగుకు ఒప్పుకోవాలని రైతులు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అవన్నీ ప్రభుత్వానివేనని అటవీ అధికారులు తేల్చిచెప్పడంతో ఘర్షణ నెలకొంది. రైతులు రోడ్డుపై బైఠాయించారు. అధికారులు ఎంత వారించినా విరమించలేదు. డీఫారం పట్టా నమూనాలను ప్రదర్శించారు. 70 ఏళ్లుగా దాళ్వా సాగు చేస్తున్నామని, 40 సెంట్ల చొప్పున డీఫారం భూమి ఉందని, సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో అనుమతి ఇవ్వకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కొల్లేరులో పక్షులు ప్రధానమా మనుషులు ముఖ్యమా అని నిలదీశారు. అటవీ అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. సుమారు ఆరు గంటల పాటు ఆందోళన కొనసాగింది. రైతులు డీఫారం పట్టాల సర్వే నంబర్లు ఇస్తే ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని రేంజర్, సీఐ హామీ ఇవ్వడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

అమ్మకానికి భవానీ ద్వీపం!

ఇప్పటికే తొలి దశలో 10 ఎకరాలు విక్రయం

అడ్వెంచర్ థ్రిల్ సిటీ పేరుతో ధారాదత్తం

సాక్షి, అమరావతి: కృష్ణమ్మ ఒడిలో ప్రకృతి రమణీయత మధ్య హాయిగా ఆహ్లాదాన్ని పంచే కీలక పర్యాటక ప్రాజెక్టు 'భవానీ ద్వీపం'పై చంద్రబాబు సర్కార్ కన్నుపడింది. ఇంద్రకీలాద్రి అమ్మవారి పాదాల చెంత దాదాపు 230 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రకృతి స్వర్గధామం విలువ అక్షరాలా రూ.4,600 కోట్లు! ఇప్పటికే కృష్ణా నదికి అటు వైపు రాజధాని ప్రాంతం అమరావతిలో వేల ఎకరాలు బినామీల పేరుతో కొల్లగొట్టిన ఎల్లో గ్యాంగ్.. నది నడి మధ్యలో ఉన్న భవానీ ద్వీపాన్ని కూడా చెర బట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అందుకు సీఎం చంద్రబాబు తనకు అలవాటైన పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానాన్ని పక్కా పన్నాగంతో తెరపైకి తెచ్చారు. ఆ విధానం ముసుగులో తన బినామీలకు భవానీ ద్వీపాన్ని ధారాదత్తం చేసేందుకు కుతంత్రాన్ని వేగవంతం చేశారు. మార్కెట్ అంచనాల ప్రకారం భవానీ ద్వీపంలో ఎకరా భూమి విలువ పుష్కరకాలం కిందటే రూ.4 కోట్లకుపైగా ఉంది. ప్రస్తుతం రాజధాని నేపథ్యంలో ఎకరం రూ.20 కోట్లు పైగా పలుకుతోంది. ఈ లెక్కన రూ.4,600 కోట్లు చేస్తుంది. ఇంతటి ఖరీదైన భూమిని చంద్రబాబు ప్రభుత్వం తమ పార్టీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అనుచరుడికి అప్పనంగా దోచి పెడుతోంది.

సూత్రధారి బాబు.. నారాయణ, గంటా పాత్రధారులు

గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం.. అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావుకు చెందిన ప్రత్యూష అసోసియేట్స్ ఫిషింగ్ లిమిటెడ్ మౌలిక సదుపాయాలు–పెట్టుబడుల సంస్థకు భవానీ ద్వీపాన్ని 55 ఏళ్ల పాటు లీజు రూపంలో కట్టబెట్టేందుకు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని నాటి ప్రతిపక్ష పార్టీలైన వైఎస్సార్‌సీపీతోపాటు టీడీపీ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రాగానే ప్రభుత్వ పెద్దే సూత్రధారిగా.. నాటి పాత్రధారులను తెరపైకి తెచ్చి ఈ భారీ భూ దోపిడీకి కుతంత్రం రచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమరావతిలో తన దోపిడీ భాగస్వామి మంత్రి నారాయణ, ఆయన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు ద్వారానే కథ నడిపిస్తుండటం గమనార్హం. గంటా శ్రీనివాసరావు బినామీగా గుర్తింపు పొందిన కాశీ విశ్వనాథ్‌కు చెందిన విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్ ప్రైవేటు లిమిటెడ్, విశ్వనాథ్ అవెన్యూస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను తెరపైకి తెచ్చింది. ఆ సంస్థలకు 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ' పేరుతో భవానీ ద్వీపాన్ని దశల వారీగా కట్టబెట్టేందుకు సిద్ధపడుతోంది. ఇప్పటికే పది ఎకరాలను కట్టబెడుతూ కనీసం సర్వే నంబర్లు కూడా లేకుండా ఈ నెల 13వ తేదీన జీవో జారీ చేయడం ప్రభుత్వ కుట్రకు నిదర్శనం. అంతేకాకుండా ఏకంగా 99 ఏళ్లకు లీజుకు కట్టబెట్టడం ప్రభుత్వ బరితెగింపును బట్టబయలు చేస్తోంది. కాశీ విశ్వనాథ్ కేవలం ముసుగు అన్నది బహిరంగ రహస్యం.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

TOURISM – Allotment of Land and grant of incentives to the Consortium of M/s. Vishwanadh Sports and Conventions Private Limited and M/s. Vishwanadh Avenues (India) Private Limited for Development of an 'Adventure Thrill City' in Bhavani Island at Undavalli Village, Tadepalli Mandal, Guntur District as per the provisions of Andhra Pradesh Tourism Policy 2024 -2029 - Orders - Issued.

YOUTH ADVANCEMENT, TOURISM AND CULTURE (TOURISM) DEPARTMENT

G.O.MS.No. 42 Dated: 13-11-2025

Read the following:

4. Government, after careful consideration of the recommendations of the State Investment Promotion Board (SIPB) in its meeting held on 7.11.2025 and keeping in view the provisions of Andhra Pradesh Tourism Policy 2024-2029, hereby grant the following incentives to the Consortium of M/s. Vishwanadh Sports and Conventions Private Limited and M/s. Vishwanadh Avenues (India) Private Limited for Development of an 'Adventure Thrill City' in Bhavani Island at Undavalli Village, Tadepalli Mandal, Guntur District subject to condition that, the proposed development shall comply with all environmental norms and the proposed snow world shall be removed:-

a) To allot 10.00 acres land parcel in Undavalli Village, Tadepalli Mandal, Guntur District for development of an Adventure Thrill City in Bhavani Island.

b) The exact alignment of the land parcel shall be finalized with the approval of CCLA, and subject to compliance with all applicable conditions stipulated by the Irrigation Department.

c) Lease tenure shall be 66 years with an extension for 33 years upon successful operation of the project.

ఈ నెల 13న భవానీ ద్వీపంలో పది ఎకరాల భూమిని విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

నిర్లక్ష్యం మాటున కబ్జా కుట్ర!

ప్రపంచంలోనే మంచి నీటి సముదాయ ద్వీపంగా విశేష గుర్తింపు పొందిన భవానీ ద్వీపాన్ని కొల్లగొట్టడం కోసమే చంద్రబాబు ప్రభుత్వం దానిని పర్యాటకపరంగా అభివృద్ధి చేయకుండా ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత ఏడాది వరదల్లో దెబ్బతిన్న భవానీ ద్వీపంలో కనీస మౌలిక సదుపాయాలను పునరుద్ధరించనే లేదు. 230 ఎకరాల్లో భవానీ ద్వీపం భూములను నోటిఫై చేయగా, 30 ఎకరాల్లో భవానీ ఐలాండ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (బీఐటీసీ) ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇందులో ఏపీటీడీసీకి చెందిన 45 గదుల కాటేజీల ద్వారా ఆతిథ్య సేవలను అందిస్తోంది. ఈ క్రమంలో ఇంద్రకీలాద్రి కింద ఉన్న అత్యంత విలువైన, ఏపీటీడీసీకి కీలక ఆదాయ వనరుగా ఉన్న బెరంపార్కు హోటల్‌తో పాటు ద్వీపంలోని 45 గదులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఈ టెండర్ ప్రక్రియ ముగిసి ప్రైవేటు వ్యక్తులకు వీటిని కట్టబెడితే.. అదే బెరంపార్కులో నుంచి భవానీ ద్వీపానికి వెళ్లే మార్గంలో సామాన్యులు అడుగు పెట్టలేని దుస్థితి దాపురిస్తుంది.

4 వేల ఎకరాల్లో ద్వీప సముదాయం!

కృష్ణానదిలో భవానీ ద్వీపంతో పాటు గుంటూరు జిల్లాలోనూ విస్తరించిన ద్వీప సముదాయాలన్నీ కలిపితే సుమారు 4 వేల ఎకరాలు ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఇందులో 700 ఎకరాల భూమిని అనువైనదిగా గుర్తించి వినియోగంలోకి తీసుకొచ్చేలా కాన్సెప్ట్ ప్లాన్‌ను రూపొందించింది. వాటిని నాలుగు జోన్లుగా విభజించి ప్రైవేటుకు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిని అప్పట్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు తాజాగా పర్యాటక ప్రాధికార సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 3,913.96 ఎకరాల పర్యాటక భూములను నోటిఫై చేసి.. అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టేలా కుట్రలు చేస్తోంది.

గత ప్రభుత్వంలో పర్యాటక వెలుగులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–24లో భవానీ ద్వీపాన్ని రాజధాని ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దింది. పర్యాటక శాఖ ద్వారానే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. దాంతో సందర్శకుల ద్వారా భారీగా పెరిగి ఆదాయం వృద్ధి చెందింది. 2022–23లో రికార్డు స్థాయిలో రూ.3.13 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది 2023–24లో రూ.4 కోట్లకు చేరుకుంది. గత ప్రభుత్వంలోనే దుర్గగుడి సమీపం నుంచి భవానీ ద్వీపానికి రోప్‌వే కూడా మంజూరైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదాయం పడిపోయింది.

వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపే

టీడీపీ కూటమి టార్గెట్

ఆ దిశలోనే కన్ఫెషన్ స్టేట్‌మెంట్స్.. కాన్సిపిరసీ థియరీ

- ఇదే సీఎం చంద్రబాబు ఏడాదిన్నర దారుణ పాలన
- చంద్రబాబు మోసాలను ప్రజలంతా గుర్తించారు
- అందుకే కోటి సంతకాల సేకరణకు భారీ స్పందన
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీపై కక్షసాధింపే టీడీపీ కూటమి సర్కారు టార్గెట్ అని, ఆ నినాదాన్ని భుజానికెత్తుకుని తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఆ దిశలోనే కన్ఫెషన్ స్టేట్‌మెంట్స్‌తో కాన్సిపిరసీ థియరీని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ఆక్షేపించారు. అందులో నుంచి వచ్చినవే తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి , పరకామణి, లిక్కర్ వంటి కేసులు అని వెల్లడించారు. ఏ ఆధారాలు లేకుండానే అక్రమంగా కేసులు నమోదు చేసి ఎవరో ఒకరిని అరెస్టు చేయడం, బెదిరించడం.. ఆ తర్వాత వాంగ్మూలాలు నమోదు చేయడం.. వాటి ఆధారంగా టార్గెట్ లిస్ట్‌లో ఉన్న వారిపై కేసులు పెడుతూ, వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధిస్తున్నారని.. అదే సీఎం చంద్రబాబు నమ్ముకున్న కన్ఫెషన్, కాన్సిపిరసీ థియరీ అని సజ్జల మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆయనేమన్నారంటే..

నెయ్యిపై ఏ ఆధారాలతో సిట్ విచారణ?..

2019లో మా ప్రభుత్వం ఏర్పడినప్పుడు, మేము కూడా ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నట్లుగా కన్ఫెషన్, కాన్సిపిరసీ థియరీని అమలు చేసి ఉంటే,

అధికారంలోకి వచ్చిన తొలి మూడు నెలలకే ఆయన్ను అరెస్ట్ చేసే వాళ్లం. కానీ, ఏనాడూ మేము కక్షపూరితంగా వ్యవహరించలేదు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంటూ, ఏ ఆధారాలతో సిట్ ద్వారా విచారణ చేయిస్తుందో అర్థం కావడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి సరఫరాపై విచారణ చేస్తున్న సిట్, 2014–19 మధ్య జరిగిన నెయ్యి సరఫరాపైనా విచారణ చేస్తే అసలు నిజాలు తెలుస్తాయి. 2019 –24 మధ్య కేజీ నెయ్యి రూ.320 చొప్పున సేకరిస్తేనే కల్తీ అన్న నాయకులు. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో కేజీ నెయ్యి రూ.270కే సేకరించినప్పుడు కల్తీ జరిగినట్లు కాదా? ప్రభుత్వాలు మారినా టీటీడీలో దశాబ్దాలుగా నడుస్తున్న వ్యవస్థల ప్రకారమే టెండర్ల నిర్వహణ, క్వాలిటీ చెకింగ్ జరుగుతుంది. పరకామణి చోరీ అంటూ కేసు పెట్టి, వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించే ఉద్దేశంతోనే విచారణ పేరుతో ఏవీఎస్‌వో సతీష్ కుమార్‌ను సిట్ వేధించింది. ఆ బాధతోనే ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మేం మాట్లాడితే.. ఆధారాలు లేకుండానే హత్యగా ప్రచారం చేసిందే కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులే చంపించారని మాపై బురదజల్లారు.

రిజెక్ట్ చేసిన నెయ్యిని ఎలా వాడారు?..

''టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది జూలైలో క్వాలిటీ చెక్ తర్వాత నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి వెనక్కి పంపారని చెబుతున్నారు. వెనక్కి పంపిన నెయ్యిని తిరిగి తీసుకొస్తే వాడినట్టు సిట్ రిపోర్టులో ఉంది. అలాంటప్పుడు రిజెక్ట్ చేసిన నెయ్యినే కూటమి ప్రభుత్వంలో ఎలా వాడారు?

ఎందుకంత కడుపు మంట?

''తెలంగాణలో బలనిరూపణ చేసుకోవాల్సిన అవసరం మాకేంటి. వైఎస్ జగన్ సీబీఐ కోర్టుకు హాజరవుతున్న సందర్భంలో స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చారు. 2014 తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తే వైఎస్సార్‌సీపీకి 7శాతం ఓట్లు వచ్చాయి. అయినా తెలంగాణ రాజకీయాలు వద్దనుకుని వచ్చిన మాకు బలనిరూపణ చేసుకోవాల్సిన అవసరం లేదు. వైఎస్ జగన్‌కు జనాదరణ పెరుగుతుంటే టీడీపీ, ఎల్లో మీడియాకు ఎందుకంత కడుపుమంట?'' అని సజ్జల ప్రశ్నించారు.

కోటి సంతకాల సేకరణకు భారీ స్పందన

''వైఎస్సార్‌సీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. అందుకే వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో భారీగా పాల్గొని సర్కారుపై గళమెత్తుతున్నారు. కోటి సంతకాల సేకరణ గొప్ప ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచిపోతుంది.'' అని సజ్జల పేర్కొన్నారు.

ఒక్క ఇల్లు కట్టించకపోయినా క్రెడిట్ చోరీ..

''వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తి చేసిన 3 లక్షల ఇళ్లను కూటమి ప్రభుత్వంలో ఇచ్చినట్టు చెప్పుకోవడం దారుణం. పేదల కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా క్రెడిట్ చోరీకి పాల్పడటం సిగ్గుచేటు.'' అని సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్ అయ్యారు.

టీడీపీ హయాంలో జరిగిన తప్పునకు చంద్రబాబు బాధ్యత తీసుకోరా? లిక్కర్ కేసులో ఇన్నాళ్లుగా విచారణ చేస్తున్న ప్రభుత్వం ఏం సాధించినట్టు? న్యాయస్థానాల దగ్గర విచారణ పేరుతో మా నాయకులను అదుపులోకి తీసుకుని నెలల తరబడి జైలుపాలు చేశారు.'' అని రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

ఎస్ బ్యాంకులో టీటీడీ నిధుల జమ నియమాలకు విరుద్ధం కాదా?

''ప్రైవేట్ బ్యాంకులో 10 శాతానికి మించి టీటీడీ నిధులు డిపాజిట్ చేయకూడదనే నిబంధన ఉంది. కానీ టీటీడీ హయాంలో నిబంధనలు ఉల్లంఘించి ఎస్ బ్యాంక్ అనే ప్రైవేట్ బ్యాంకులో రూ.1300 కోట్లకు పైగా జమ చేశారు. వైవీ సుబ్బారెడ్డి చైర్మన్ అయ్యాక దాన్ని జాతీయ బ్యాంకుల్లోకి మార్చారు. ఎస్ బ్యాంకులో డిపాజిట్ చేసిన దానికి చంద్రబాబే కారణమని మేం ఆరోపించామా? కుట్ర రాజకీయాలు చేశామా?'' అని సజ్జల ప్రశ్నించారు.

లాయర్‌కు రూ.8 కోట్ల ఫీజు!

''చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఆయన కోసం వాదించిన లాయర్ సిద్ధార్థ లూథ్రాని తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల మీద బనాయించిన అక్రమ కేసులన్నీ ఆయనకే అప్పజెప్పారు. ఈ కేసులకు ఆయనకు ఇప్పటి వరకు రూ.8 కోట్లకు పైగా జనం సొమ్మును ఫీజు కింద చెల్లించారు'' అని సజ్జల విమర్శించారు.

కేసుల క్లోజర్ కుట్ర!

''సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగంతో కేసులు క్లోజ్ చేయించుకునే కుట్ర చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతోపాటు, బార్లకు ప్రివిలేజ్ ఫీజు రద్దు కేసులను మాఫీ చేసుకునేందుకు యత్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బాబుపై ఉన్న అన్ని కేసులూ మళ్లీ బయటకు తీస్తాం.'' అని రామకృష్ణారెడ్డి తేల్చిచెప్పారు.

అమ్మణమ్మ చెప్పిన కథలో నక్క చంద్రబాబే..

''చంద్రబాబు తల్లి అమ్మణమ్మ చెప్పిన కథలో నక్క చంద్రబాబే. లోకేశ్ పక్కనే ఉన్నారు కాబట్టి ఆ కథనే చాగంటి మరో రకంగా చెప్పారు. గూగుల్ డేటా సెంటర్‌కి సంబంధించి అదానీ పేరెత్తితే వైఎస్ జగన్‌కి క్రెడిట్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే చంద్రబాబు కిక్కురుమనడం లేదు. విశాఖలో అనామక కంపెనీలకు బాబు అప్పనంగా భూములు కట్టబెడుతున్నారు. అదే హెరిటేజ్ ఆస్తులైతే అంత తక్కువ ధరకు ఇస్తారా?'' అని సజ్జల నిలదీశారు.

20 సార్లు వచ్చినా పవన్ కళ్యాణ్ కలవలేదు

జనసేన కార్యాలయం ఎదుట మల్లవల్లి రైతుల నిరసన

సాక్షి, అమరావతి: పారిశ్రామికవాడ వల్ల భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని గన్నవరం సమీపంలోని మల్లవల్లి రైతులు మంగళవారం రాత్రి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ అంశంపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలవడానికి 20 సార్లు జనసేన కార్యాలయం వద్దకు వచ్చినా తమను కలవలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ తమ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు వస్తాయని చంద్రబాబు ప్రభుత్వం చెబితే 2016లో భూములు ఇచ్చామని, పరిసర గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇచ్చినా తమకు మాత్రం ఇవ్వలేదని వివరించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రలో భాగంగా తమ ప్రాంతానికి వచ్చినప్పుడు సమస్యను వివరిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా తమకు పరిహారం ఇప్పించలేదని వివరించారు.

స్వస్థలాలకు చేరిన 43 మంది మయన్మార్ బాధితులు

సాక్షి, అమరావతి: మయన్మార్ సైబర్ క్రైమ్ ముఠాల చెర నుంచి విముక్తి పొంది, స్వదేశానికి తిరిగివచ్చిన విజయవాడ, విశాఖ ప్రాంతాలకు చెందిన 43 మంది బాధితులను వారి స్వస్థలాలకు చేర్చినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సూచనల మేరకు ఏపీ భవన్ బృందం సహాయక చర్యలు చేపట్టిందన్నారు.

ఆధారాలు అడిగి అడ్డంగా దొరికాడు!

- డొమైన్ రిజిస్ట్రీ ద్వారా చిక్కిన 'ఐబొమ్మ' ఆధారం
- అమెరికాలోనూ కంపెనీ ఏర్పాటు చేసిన ఇమంది రవి
- వేరొకరిదిగా భావించి మెయిల్స్ పెట్టిన పోలీసులు
- ఆధారాలు అడగటంతో దానిపై బలపడిన అనుమానాలు
- రెండు నెలల పాటు నిఘా ఉంచి పట్టుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: నగరంలోనే ఉంటూ దాదాపు ఆరేళ్లపాటు 'ఐబొమ్మ', 'బప్పం' వెబ్‌సైట్లను నడిపించిన రవి ఆచూకీ నాటకీయంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కింది. గేమింగ్ యాప్స్ కంపెనీలతో ముడిపడి ఉన్న ఓ అమెరికన్ కంపెనీ నుంచి దర్యాప్తు అధికారులు వివరాలు కోరుతూ మెయిల్ పెట్టారు. దాని యజమాని అయిన రవికే ఆ మెయిల్ చేరగా... సమాధానం ఇస్తూ అతడు ఆధారాలు కోరడంతో మొదలైన అనుమానం అతగాడి అరెస్టు వరకు వెళ్లింది. ఈ వివరాలను అదనపు సీపీ (నేరాలు) ఎం.శ్రీనివాసులు మంగళవారం మీడియాకు వెల్లడించారు.

వారికి వచ్చే ట్రాఫిక్‌ను బట్టే చెల్లింపులు..

ఐబొమ్మ వెబ్‌సైట్ డొమైన్‌ను రవి ఎన్ జెలా అనే సంస్థలో రిజిస్టర్ చేశాడు. ఆ సమయంలో తన గుర్తింపుకార్డు, ఈ–మెయిల్ ఐడీలు ఇవ్వడంతో పాటు తన క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు జరిపాడు. ఐబొమ్మ వెబ్‌సైట్‌ను హోస్ట్ చేయడం

కోసం ఐపీ వాల్యూమ్ అనే సంస్థతో ఒప్పందం చేసుకున్నాడు. కొన్నాళ్లకు గేమింగ్, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకుని తన సైట్స్ ద్వారా వారి యాప్స్‌కు రీడైరెక్ట్ అయ్యేలా ప్రోగ్రామింగ్ మార్చాడు. ఈ గేమింగ్/బెట్టింగ్ యాప్స్ రవి వెబ్‌సైట్ ద్వారా తమకు వచ్చే ట్రాఫిక్ (వినియోగదారులు) ఆధారంగా చెల్లింపులు చేసే వాళ్లు. ఈ చెల్లింపులు తొలుత గేమింగ్ కంపెనీ నుంచి యాడ్ క్యాష్, యాడ్ స్టెరా అనే కంపెనీలకు వెళ్లేవి. వాటి నుంచి రవికి చెందిన యాడ్ బుల్ అనే సంస్థ ద్వారా రవి ఖాతాల్లోకి వచ్చేవి. ఇక్కడి వరకు అంతా యూఎస్‌డీటీగా పిలిచే డిజిటల్ కరెన్సీ రూపంలో జరిగినా.. దీన్ని భారత కరెన్సీలోకి మార్చి రవి డ్రా చేసుకునే వాడు.

డొమైన్ రిజిస్ట్రీ ఇచ్చిన సమాచారంతో...

యూఎస్‌డీటీని సాధారణ కరెన్సీగా మార్చడం కోసం రవి గెటింగ్ అప్ పేరుతో అమెరికాలోనూ ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. ఐబొమ్మ ద్వారా రీడైరెక్ట్ అవుతున్న గేమింగ్/బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులను సంప్రదించిన సైబర్ క్రైమ్ పోలీసులు చెల్లింపుల విధానానికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఇలా గెటింగ్ అప్ కంపెనీ పేరు బయటకు వచ్చింది. ఇది రవికి చెందినదని తెలియని సైబర్ క్రైమ్ అధికారులు దీని నుంచి నగదు ఎక్కడికి వెళ్తోందో తెలుసుకోవాలని భావించి అధికారిక మెయిల్ ఐడీకి ఈ–మెయిల్ పంపారు. దీన్ని అందుకున్న రవి.. పోలీసుల్ని తప్పుదారి పట్టించే ఉద్దేశంతో నేరం నిరూపించే బలమైన ఆధారాలు చూపాలంటూ సమాధానం ఇచ్చాడు. సాధారణంగా అమెరికన్ కంపెనీలు ఆ దేశ పోలీసు, కోర్టు లేదా ఎం–లెట్‌గా పిలిచే ఒప్పందం ద్వారా సంప్రదించాలని అంటాయి.

భిన్నంగా స్పందించడంతో ఆరా

గెటింగ్ అప్ సంస్థ భిన్నంగా స్పందించడంతో సైబర్ క్రైమ్ అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో ఈ కంపెనీ పూర్వాపరాలు, డొమైన్ వివరాలు తదితరాలు సేకరించగా... అవి రవికే చెందిన ఈఆర్ ఇన్ఫోటెక్‌కు దారి తీశాయి. ఇలా తొలిసారి ఐబొమ్మ నిర్వాహకుడు రవిగా గుర్తించిన పోలీసులు అతడి వివరాలు ఆరా తీయడం మొదలెట్టారు. ఈలోపు పోలీసుల ద్వారా తన సైట్స్ పేరు బయటకు రావడంతో దేశం వదిలేసి విదేశాలకు పారిపోయాడు. అప్పటికే అతడి ఫోన్ నంబర్ సహా ఇతర వివరాలు సేకరించిన అధికారులు సాంకేతిక నిఘా ఉంచారు. ఇలా అతడి రాకను గుర్తించి అరెస్టు చేశారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో సినిమా పోస్టర్ తయారీకి రవికి నిఖిల్ అనే స్నేహితుడు సహకరించినట్లు తేలింది. అతడినీ విచారించిన పోలీసులు పాత్ర రూఢీ అయితే అరెస్టు చేయాలని నిర్ణయించారు. మిగిలిన కేసుల్లోనూ రవిని అరెస్టు చేసి కస్టడీకి కోరతామని పోలీసులు తెలిపారు.

పరదాల మాటున పవన్‌కళ్యాణ్

- ప్రజల్ని దగ్గరకు రానివ్వకుండా బారికేడ్లు
- ఐఎస్ జగన్నాథపురంలో పర్యటనపై సర్వత్రా విమర్శలు
- సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్

ద్వారకాతిరుమల: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో సోమవారం పరదాల మాటున పర్యటించడం చర్చనీయాంశమైంది. ప్రజలను ఆయన దగ్గరకు రానివ్వకుండా బారికేడ్లు అడ్డుపెట్టడం విమర్శలకు దారితీసింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ అవుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పరదాల సీఎం.. కంచెలు వేస్తున్న సీఎం అని గతంలో విమర్శించిన పవన్ కళ్యాణ్ తాజాగా పరదాల మాటున పర్యటించడం , బారికేడ్లు అడ్డుపెట్టి ప్రజల్ని అడ్డుకోవడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తిపోస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఐఎస్ జగన్నాథపురంలో పర్యటించిన పవన్‌కళ్యాణ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయినేజీని పరిశీలించిన తరువాత సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయన పర్యటన ఆద్యంతం పరదాల మాటున, బారికేడ్ల మధ్య సాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను, గోడును చెప్పుకొనేందుకు ఎంతో ఆశగా వస్తే.. కనీసం పవన్‌ను కలవనివ్వలేదని, అడుగడుగునా పోలీసులు అడ్డుపడ్డారని పలువురు వాపోయారు. ఎన్నికల ముందు ప్రశ్నించేందుకు వచ్చానన్న పవన్ ఇప్పుడు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈ క్రమంలోనే కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెం, తిమ్మనకుంట గ్రామాల ప్రజలు రోడ్ల సమస్యపై లక్ష్మీనరసింహ స్వామివారి కొండ దిగువన ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, పవన్‌కు తెలియజేసేందుకు వస్తే ఇక్కడ కలిసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరిద్దరు ధైర్యం చేసి కాన్వాయ్‌కి అడ్డంపడి వినతిపత్రాలు అందించగా, మిగిలిన వారు నిరుత్సాహంగా వెనుదిరిగారు.

ఐఎస్ జగన్నాథపురంలో పరదాల మాటున డ్రెయినేజీని పరిశీలిస్తున్న పవన్

ఇవి పరదాలు కావా.. పవన్!

ఐఎస్ జగన్నాథపురంలో మ్యాజిక్ డ్రెయినేజీలను పరిశీలించే సమయంలో అక్కడున్న ప్రజలు పవన్‌కళ్యాణ్‌ను కలవాలని ఎంతో ఆశపడ్డారు. కానీ.. అక్కడ వారికి పరదాలు అడ్డొచ్చాయి. వైఎస్ జగన్‌ను పరదాల సీఎం అన్న పవన్ ఇప్పుడు పరదాల మాటున ఎలా పర్యటించారు? ఇవి పరదాలు కావా?

– పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి

ప్రజలకు అడ్డుగా బారికేడ్లు

అధికారంలోకి రాకముందు ఎన్నో మాటలు చెప్పిన పవన్ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలపై ప్రశ్నించడం మానేశారు. ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో ఐఎస్ జగన్నాథపురంలో రహదారులకు ఇరువైపులా బారికేడ్లు పెట్టి మరీ వారిని అడ్డుకున్నారు.

– షేక్ అన్సారిబాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి

పవన్ కళ్యాణ్ పరదాల మాటున పర్యటించిన వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అద్భుత ఘట్టం

- కన్నులపండువగా ధర్మ ధ్వజారోహణ కార్యక్రమం
- బాలరాముని గర్భగుడి ప్రధాన గోపురంపై జెండాను ప్రతిష్ఠించిన ప్రధాని మోదీ
- ధర్మ ధ్వజంపై శ్రీరాముని వంశ వృక్షాన్ని తెలిపే సూర్యుడు, కోవిదార వృక్షాల చిహ్నాలు

అయోధ్య రామాలయం గర్భగుడి శిఖరంపై రెపరెపలాడుతున్న జెండా (ఇన్‌సెట్)జెండాపై కనిపిస్తున్న సూర్యుడు, కోవిదార వృక్ష చిహ్నం

అయోధ్య: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. బాలరాముని ఆలయ నిర్మాణ క్రతువు సంపూర్ణమైనందుకు చిహ్నంగా గర్భగుడి ప్రధాన గోపుర శిఖరంపై ధర్మధ్వజ జెండాను ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ స్వయంగా పూర్తిచేశారు. 161 అడుగుల ఎత్తయిన ప్రధాన గోపురం మీద 22 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పుతో లంబకోణ త్రిభుజాకృతిలో జెండాను ఎగరేశారు. తొలుత మోదీ శ్రీ రామజన్మభూమి ఆలయ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన సప్త మందిర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి ప్రతిమలతోపాటు అహల్య, నిషాద్‌రాజ్ గుహ, మాతా శబరిలను మోదీ దర్శించుకున్నారు. తర్వాత శేషావతార్ మందిర్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజ చేశారు. ఆ తర్వాత గర్భాలయంలో బాలరాముడిని దర్శించుకున్నారు. తర్వాత ఆలయ పైభాగానికి చేరుకున్నారు. జెండా ఆరోహణకు ముందు కింద ఉన్న జెండాకు ప్రధాని మోదీ నమస్కరించి పుష్పాలను వెదజల్లారు. తర్వాత బటన్‌ను నొక్కడానికి బదులు ప్రత్యేకంగా తయారుచేసిన ముఖిలిత హస్తాల ఆకృతిలో ఉన్న ఒక మీటను సవ్యదిశలో తిప్పారు. మోదీతోపాటు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఆర్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ సైతం మోదీతోపాటే మీటను తిప్పారు. దీంతో ధ్వజారోహణ పూర్తయింది. తాడు సాయంతో కాషాయరంగు జెండాను పైకి లాగి శిఖరాగ్రాన నిలిపారు. అత్యంత ఎత్తులో వీచే పెనుగాలులను సైతం తట్టుకుంటూ ఏమాత్రం చిరగకుండా ఉండేలా ప్యారాచూట్ నాణ్యత ఉండే వస్త్రంతో ఈ జెండాను తయారుచేశారు. కాషాయరంగు జెండాపై శ్రీరాముని వంశవృక్షాన్ని తెలిపే సూర్యభగవానుడి చిహ్నం, మధ్యలో ఓంకారం, పక్కన కోవిదార చెట్టు ప్రతిమలను బంగారు దారంతో చేతితో కుట్టారు. ఇందుకు మూడు వారాల సమయం పట్టింది. కోదండరాముడు సూర్యవంశానికి చెందిన రాజు. రుషి కశ్యపుడు మందార, పారిజాత వృక్షాలను అంటుకట్టి కోవిదార వృక్షాన్ని సృష్టించాడని పురాణాలు చెబుతున్నాయి. మొక్కలకు అంటుకట్టి కొత్త రకం మొక్కలను సృష్టించే శాస్త్రసాంకేతికత వేల సంవత్సరాల క్రితమే ఉందనేందుకు కోవిదార చెట్టే సజీవ సాక్ష్యమని పలువురు చెబుతున్నారు. లింఫ్ గ్రంథులు, థైరాయిడ్ సహా పలురకాల వ్యాధుల చికిత్సలో ఆయుర్వేదంలో ఇప్పటికీ కోవిదార చెట్టు బెరడు, ఆకులు, పువ్వులు, మొగ్గలు, వేర్లను ఉపయోగిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ మొక్కను దేవకాంచనం అని కూడా పిలుస్తారు.

నాలుగు రోజులుగా యజ్ఞం

అభిజిత్ ముహూర్తం కలిసిరావడంతో అత్యంత శుభప్రదమైన దినంగా భావించి మంగళవారం ధ్వజారోహణకార్యక్రమం పూర్తిచేశారు. ఇప్పటికే గత మూడ్రోజులుగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిరాటంకంగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అస్సాం, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి వచ్చిన పండితులు ఈ యజ్ఞంచేశారు. భారత పురాణాల ప్రకారం వివాహపంచమికి సంబంధించిన అభిజిత్ ముహూర్తంలోని శ్రీరాముడు, సీతల వివాహం జరిగింది. అందుకే ఇదే రోజున ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు.



ధ్వజారోహణం అనంతరం నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, భాగవత్, గవర్నర్ ఆనందీ బెన్, సీఎం యోగి

అంతటా పండుగ వాతావరణం

అయోధ్య: హిందువుల వందల సంవత్సరాల కల నెరవేరి ఆలయ నిర్మాణం పూర్తయిన శుభదినాన్ని అత్యంత ఆడంబరంగా పండుగలా జరిపారు. అయోధ్య నగర వ్యాప్తంగా ఉత్తరప్రదేశ్ నుంచి 500 మంది భిన్న కళాకారులతో పలు రకాల కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే అయోధ్య జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో నగరమంతా కోలాహలంగా తయారైంది. ముజఫర్‌నగర్, ఉన్నవో, లక్నో, వారణాసి, ప్రయాగ్‌రాజ్ ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉత్తరప్రదేశ్ స్థానిక జానపద కళాకారుల జానపద గేయాలతోపాటు శాస్త్రీయ కళలు, ఆధ్యాత్మిక సంగీతాల సమ్మేళనంగా పలు చోట్ల కార్యక్రమాలను రూపొందించారు. మహర్షి వాల్మీకి ఎయిర్‌పోర్ట్ మొదలు రామ్‌కీ పైడీ దాకా కీలక ప్రదేశాల్లో కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఇప్పించారు. వివాహ పంచమిని పురస్కరించుకుని రామాలయంలో ధ్వజారోహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఉత్తర ప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జైవీర్ సింగ్ చెప్పారు. శతాబ్దాల కలగా సాకరమైన ఆలయంలో జన్మలో ఒక్కసారి మాత్రమే కలిగే ధ్వజారోహణ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. అపురూప ఘట్టాన్ని కళ్లారాచూడడం నిజంగా అదృష్టం అని రాయ్‌బరేలీ నుంచి వచ్చిన స్వామి నరోత్తమానంద్ గిరీ వ్యాఖ్యానించారు. ఆలయ నిర్మాణం నేను బతికుండగానే పూర్తవుతుందని కలలోకూడా ఊహించలేదని 95 ఏళ్ల స్వామీజీ దేవేంద్రనంద్ గిరి ఆనందం వ్యక్తం చేశారు.

శతాబ్దాల నాటి గాయాలు మానాయి

అయోధ్య: ఐదు వందల సంవత్సరాల రామమందిర సాధనా సమరంలో భారతీయులకు తగిలిన గాయాలు నేడు ఆలయ నిర్మాణంతో మానిపోయాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మంగళవారం భవ్యరామ మందిర ప్రధాన శిఖరంపై ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించిన సందర్భంగా శ్రీరామ జన్మభూమి ఆలయ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వేలాది మంది భక్తులనుద్దేశిస్తూ ప్రధాని ప్రసంగించారు. జైశ్రీరాం నినాదంతో తన ప్రసంగాన్ని ఆరంభించారు ''నేడు భారత్‌సహా యావత్ ప్రపంచం రామస్మరణ చేస్తోంది. ఆలయ నిర్మాణం సంపూర్ణమవడంతో భారతీయుల శతాబ్దాల నాటి గాయాలు నేటితో మానిపోయాయి. భక్తుల వందల ఏళ్ల బాధాగ్ని చల్లారింది. ఇప్పుడు ప్రతి ఒక్క రామభక్తుడి మదిలో అనిర్వచనీయ ఆనందం ఉప్పొంగుతోంది. ధ్వజారోహణం నిజంగా అపూర్వం, అనిర్వచనీయ ఆధ్యాత్మిక ఘటన. కాషాయ జెండాలో సూర్యవంశ కీర్తి దాగిఉంది. కోవిద వృక్షం రామరాజ్య వైభవాన్ని చాటుతోంది. ఇది కేవలం మతసంబంధ జెండా కాదు. భారతీయ నాగరికతా జెండా. ఇది భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ జెండా అసత్యాలపై సత్యం విజయం శాశ్వతమని సగర్వంగా అంతెత్తున నిలిచి చాటిచెప్పే జెండా ఇది. ఆలయ నిర్మాణానికి అవిశ్రాంత కృషిచేసి తమ వంతు సాయమందించిన ప్రతి ఒక్క రామభక్తునికి నా మనస్ఫూరక కృతజ్ఞతలు. ఆనాడు శ్రీరాముడు అయోధ్యను యువరాజుగా వదిలివెళ్లాడు. తిరిగొచ్చేటప్పుడు మర్యాద పురుషోత్తమునిగా ఎదిగి వచ్చాడు. వశిష్టుడు వంటి రుషుల జ్ఞానసంపద, గురువుల మార్గనిర్దేశనం, నిశదరాజు వంటి స్నేహితుల సాంగత్యం, శబరి అవ్యాజమైన భక్తి, హనుమంతుని అచంచల భక్తి ఇలా అందరూ ఆ దశరథ తనయుడిని సర్వగుణసంపన్నుడిగా తీర్చిదిద్దారు. భారత్ అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే సమాజంలోనూ ఇలాంటి సమష్టి కృషి అవసరం. ప్రస్తుత తరాలకే కాదు భావితరాల అవసరాలు తీర్చేలా భారత్ పునర్‌నిర్మాణం జరగాలి. ఈరోజు గురించి మాత్రమే ఆలోచిస్తే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసినట్లే. 2047నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదిగే క్రమంలో రాముడు సైతం మనకు అండగా నిలబడ్డాడని అనిపిస్తోంది. రాముడు కేవలం ఒక వ్యక్తి కాదు. క్రమశిక్షణ, దార్శనికత, విలువలు మూర్తీభవించిన శక్తి'' అని మోదీ అన్నారు.

ధ్వజారోహణ తర్వాత ప్రధాని మోదీ ఉద్ఘాటన

మార్పు తరుణం ఆసన్నమైంది...

''ఆధునిక నాగరిక సమాజంలో భారత్ ఇకపై తనదైన గుర్తింపును సాధించాల్సిన తరుణం ఆసన్నమైంది. బానిస మనస్తత్వాన్ని భారత్ వదిలించుకోవాలి. 190 ఏళ్ల క్రితం మనలో మెకాలే ఒక బానిస మనస్తత్వ విషబీజాలను విజయవంతంగా నాటి విస్తృతపరిచాడు. భారతీయ సమాజ విలువల్ని కూకటివేళ్లతో పెకలించే కుట్ర అది. మనం బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యమైతే సాధించాంగానీ బానిసత్వపు ఆలోచనల నుంచి స్వాతంత్ర్యం సాధించలేకపోయాం. ఇకనైనా వచ్చే పదేళ్లలోపు ఈ మానసిక బానిసత్వపు బంధనాలను తెంచుకుందాం. విదేశాల తరహాలో ప్రజాస్వామ్యం కోసం భారత్ పోరాడిందన్న వలసపాలకుల వాదనల్లో నిజం లేదు. ప్రజాస్వామ్యం అనేది వేల సంవత్సరాల క్రితమే భారతీయ డీఎన్‌ఏలో నిక్షిప్తమై ఉంది. తమిళనాడులోని 1,000 సంవత్సరాల క్రితంనాటి ఉత్తర మేరూర్ గ్రామ శాసనంలో ప్రజాస్వామ్య ప్రస్తావన ఉంది. వలసపాలకులు మన జాతీయ గుర్తులను సైతం ప్రభావితంచేశారు. పరాయి పాలనకు చరమగీతం పాడుతూ ఇటీవలే నేవీ చిహ్నాన్ని సైతం రీడిజైన్ చేశాం. ఇది డిజైన్ మార్పు మాత్రమేకాదు ఆలోచనా మార్పు'' అని మోదీ అన్నారు.

అభివృద్ధి ధర్మాన్ని ప్రబోధిస్తోంది...

''త్రేతాయుగంలోనే అయోధ్య మానవాళికి నైతిక విలువల్ని ప్రసాదించింది. ఇప్పుడు 21వ శతాబ్దంలో అంతర్జాతీయ విమానాశ్రయం, అధునాతన రైల్వేస్టేషన్, అనుసంధానతతో అదే అయోధ్య మనకు అభివృద్ధి ధర్మాన్ని ప్రబోధిస్తోంది. నేడు అయోధ్య ప్రాచీనత, ఆధునికతల కలబోతగా కొత్త కళను సంతరించుకుంది. భవిష్యత్తులోనూ పురాతన, నూతనత్వాల సంగమ స్థిలిగా భాసిల్లుతుంది. ఇక్కడి సరయూ జలాల్లో అమృతంతోపాటు అభివృద్ధి కలిసి ప్రవహిస్తాయి. ప్రాణప్రతిష్ఠ పనులు ఆరంభమైన నాటి నుంచి ఇప్పటిదాకా అయోధ్యను 45 కోట్లమంది దేశ, విదేశీ భక్తులు సందర్శించారు. ఇది ఆర్థిక రూపాంతరీకరణకు నిదర్శనం'' అని మోదీ అన్నారు.

వాళ్ల ఆత్మలకు శాంతి: భాగవత్

అయోధ్య రామాలయం కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వాళ్ల ఆత్మలు ఇప్పుడు శాంతిస్తాయని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ''అవిశ్రాంత పోరాటం, అలుపెరగని కృషి, లెక్కలేని త్యాగాలకు నేడు సార్థకత చేకూరింది. ఈ రోజు మనకెంతో ప్రత్యేకం. అశోక్ సింఘాల్, మహంత్ రామచంద్ర దాస్, దాల్మియా, వేలాది మంది రుషులు, లక్షలాది కుటుంబాలు, విద్యార్థులు, ఎంతో మంది భక్తుల త్యాగాలకు ఫలితం లభించింది. ఈ మధుర ఘట్టాన్ని చూడాలని పరితపించిన వాళ్ల కల నెరవేరింది. జెండాను మాత్రమే కాదు మరెన్నో ప్రాథమిక విలువలను మరింత ఎత్తులో నిలబెట్టాం. వ్యక్తులు, కుటుంబం మొదలు దేశం, ప్రపంచం దాకా ఈ విలువలే అందరికీ దిశానిర్దేశంచేస్తాయి. అందరి సంక్షేమాన్ని కాంక్షించడమే ధర్మం. కాషాయ రంగు ధర్మానికి గుర్తు. అందుకే ఇది ధర్మధ్వజం అయింది'' అని అన్నారు.

కొత్త అధ్యాయానికి ఆరంభం: యోగి

''ధర్మధ్వజారోహణతో ధర్మమనేది కాంతి ఇకపై నేల నలుచెరుగులా వ్యాపించనుంది. ఇది కొత్తఅధ్యాయానికి అంకురార్పణ'' అని ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి అన్నారు.

అరుణాచల్ ప్రదేశ్ మా భూభాగమే

- మహిళను వేధించామనడం అబద్ధం
- చైనా ప్రభుత్వం వివరణ

బీజింగ్: చైనాలోని షాంఘై విమానాశ్రయం అధికారులు ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన మహిళ చూపిన భారత వీసా చెల్లదంటూ ఆమెను కొన్ని గంటలపాటు దిగ్బంధించిన ఘటన తీవ్ర సంచలన రేపడం తెల్సిందే. రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసే పరిణామంగా పేర్కొంటూ ఈ ఘటనపై భారత ప్రభుత్వం చైనాకు నిరసన తెలిపింది. అయితే, చైనా ప్రభుత్వం తనదైన శైలిలో స్పందించి, మరోసారి వివాదం రాజేసే ప్రయత్నం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగంలోనిదేనని తెలిపింది. షాంఘై విమానాశ్రయం అధికారులు వేధింపులకు పాల్పడలేదు, నిబంధనల ప్రకారం వారు చేసింది కరెక్టేనంటూ వెనకేసుకొచ్చింది. విమానాశ్రయాల్లో తనిఖీలు సర్వసాధారణంగా జరిగేవేనని తెలిపింది. పెమాను వేధించలేదు, నిర్బంధించలేదు అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ మీడియాకు తెలిపారు. జాంగ్నాన్(అరుణాచల్‌కు ఆ దేశం పెట్టిన పేరు) చైనా భూభాగమే. భారత్ అక్రమంగా ఏర్పాటు చేసిన అరుణాచల్ ప్రదేశ్‌ను మేం ఎన్నడూ గుర్తించలేదు'అని తెలిపారు. లండన్‌లో ఉంటున్న పెమా వాంగ్‌జొమ్ థోంగ్‌డొకను ఈ నెల 21వ తేదీన లండన్ నుంచి జపాన్ వెళ్తుండగా ట్రాన్సిట్ సమయంలో షాంఘైలో అధికారులు నిలిపివేయడం వివాదం రేపింది. తెల్సిన వెంటనే స్పందించిన షాంఘైలోని భారత కాన్సులేట్ అధికారులు ఆమెకు సాయంగా నిలబడ్డారు.

బూడిద మేఘాలతో భయపడాల్సిన పనిలేదు

అగ్నిపర్వతం బద్దలుపై భారత్ భరోసా

న్యూఢిల్లీ: ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం బద్దలైన కారణంగా అరేబియా ద్వీపకల్పం, ఉత్తర భారతదేశ గగనతలంపై కమ్ముకుంటున్న ధూళిమేఘాల కారణంగా భారత పౌరవిమానయాన సేవల్లో కేవలం స్వల్పస్థాయిలోనే అంతరాయం ఏర్పడింది. బూడిద మేఘాలతో భయపడాల్సిన పనిలేదని, ఉత్తరభారతంలోని రాష్ట్రాల్లో వాతావరణం, గాలి నాణ్యతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని భారత పౌర మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. సోమవారం నుంచి చూస్తే ఎయిర్‌ఇండియా సంస్థ 13 విమానసర్వీసులను రద్దుచేసుకుంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఏడు అంతర్జాతీయ విమానాల రాకపోకలు రద్దయ్యాయి. 12 అంతర్జాతీయ విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ''ట్రోపో ఆవరణ పైపొర ప్రాంతంలోకి మాత్రమే ధూళి చేరింది. ఇప్పుడా మేఘాలు చైనా దిశగా కదులుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రిలోపే అవి భారత గగనతలాల నుంచి దూరంగా వెళ్లిపోతాయి. ఉపగ్రహాల సాయంతో పరిస్థితిని గమనిస్తున్నాం'' అని భారత వాతావరణ విభాగ డైరెక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర స్పష్టం చేశారు.

హెచ్‌1బీ వీసాదార్లను వెళ్లగొట్టబోం

- ట్రంప్ ఉద్దేశం అది కాదు
- వాటిపై ఆయనకు అవగాహన లేదు
- వైట్‌హౌస్ కీలక ప్రకటన
- భారతీయులకు భారీ ఊరట

న్యూయార్క్: అమెరికాలో క్షణక్షణ గండంగా గడుపుతున్న భారత హెచ్–1బీ వీసాదారులకు భారీ ఊరట. వారిని అమెరికన్లతో భర్తీ చేసి వారిని భారత్‌కు తిప్పి పంపాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు వైట్‌హౌస్ ఫుల్‌స్టాప్ పెట్టింది. అలాంటి ఆలోచనకు అధ్యక్షుడు అస్సలు మద్దతివ్వడం లేదని స్పష్టం చేసింది. హెచ్–1బీ వీసాలను గురించి ఆయనకున్న అవగాహన అత్యంత పరిమితమని వెల్లడించింది! ఈ విషయమై ట్రంప్‌కు ఉన్నది కేవలం సాధారణ పరిజ్ఞానంతో కూడిన అవగాహన మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ స్పష్టం చేశారు. హెచ్–1బీ వీసాదార్లను అమెరికన్లతో భర్తీ చేస్తారన్న వార్తలను మీడియా ప్రస్తావించగా ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. దీనిపై ట్రంప్ వైఖరిని తప్పుగా ప్రచారం చేస్తున్నారని వాపోయారు. అధ్యక్షుని కోరికల్లా ఒక్కటే. విదేశీ కంపెనీలు అమెరికాలో లక్షలాది కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టాలి. విదేశీ వృత్తి నిపుణులతో తమతో పాటు వెంటబెట్టుకు రావాలి. కొత్త తరం వాణిజ్య పోరులో ఏ దేశాన్నైనా ముందు వరుసలో నిలిపే బ్యాటరీల వంటి కీలక ఉత్పత్తుల్లో అమెరికాను అగ్రగామిగా నిలపాలి. అయితే, అంతిమంగా ఆయా ఉద్యోగాల్లో అమెరికన్లే ఉండేలా చూడాలన్నది ట్రంప్ లక్ష్యమని కూడా లెవిట్ చెప్పుకొచ్చారు! 'మా దేశంలో వ్యాపారం చేయాలంటే మా దేశస్తులనే ఉద్యోగాల్లోకి తీసుకోవడం మంచిది'అని ఆయా కంపెనీలకు ట్రంప్ స్పష్టంగా చెప్పారన్నారు. ''ప్రస్తుత గందరగోళం అంతటికీ ఆ స్టేట్‌మెంటే కారణం. కానీ అధ్యక్షుని ఉద్దేశం అంతా అనుకుంటున్నది మాత్రం కాదు''అంటూ ముక్తాయించారు. అమెరికా ఉత్పత్తి రంగం మున్నెన్నడూ లేనంతగా కోలుకుని దూసుకుపోవాలన్నదే ట్రంప్ కల అన్నారు. నిజానికి ఆయా దేశాలపై టారిఫ్‌ల విధింపు వెనక అధ్యక్షుని ఏకైక ఉద్దేశం కూడా ఇదేనని చెప్పారు. విదేశీ కంపెనీలు తమతో పాటు సొంత వృత్తి నిపుణులను వేలాదిగా అమెరికాకు తీసుకురావాలని, వారంతా కీలక వృత్తి నైపుణ్యాలను అమెరికన్లకు నేర్పి స్వదేశాలకు వెళ్లిపోవాలని ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడం తెలిసిందే.

నేడు రాజ్యాంగ దినోత్సవం

- చారిత్రక సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమం
- పాల్గొననున్న ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాత పార్లమెంట్‌లోని చారిత్రక సెంట్రల్ హాల్లో జరిగే ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సారథ్యం వహించనున్నారు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని 2015 నుంచి ఏటా నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినం, సంవిధాన్ దివస్‌ను జరుపుకుంటున్నారు. రాజ్యాంగంలోని కొంత భాగం ఆ వెంటనే అమల్లోకి రాగా, మిగతావి దేశ రిపబ్లిక్‌గా అవతరించాక 1950 జనవరి 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. బుధవారం సంవిధాన్ సదన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతితోపాటు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ తెలిపింది. రాష్ట్రపతి రాజ్యాంగ పీఠికను చదువుతారని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రసంగిస్తారంది. ఈ సందర్భంగా తెలుగు, తమిళం, మలయాళం తదితర 9 భాషల్లో ఉన్న రాజ్యాంగ ప్రతులను డిజిటల్‌గా ఆవిష్కరించనున్నట్లు ఆ శాఖ తెలిపింది. పౌరులు ఆన్‌లైన్‌లో పాల్గొని రాజ్యాంగ పీఠికను చదవచ్చు. హమారా సంవిధాన్–హమారా స్వాభిమాన్ పేరుతో క్విజ్, వ్యాస రచన పోటీలు కూడా ఉంటాయని వివరించింది. దేశవ్యాప్తంగా కేంద్ర మంత్రులు, వివిధ శాఖలు, అనుబంధ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా సదస్సులు, సమావేశాలు, చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నాయి.

నన్ను టార్గెట్ చేస్తే..

- జాతిని మొత్తం ఏకం చేస్తా.. మీ పునాదులు కదిలించేస్తా
- బీజేపీకి మమతా బెనర్జీ వార్నింగ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై సీఎం మమతా బెనర్జీ తన వ్యతిరేకతను మరోసారి తీవ్రంగా వ్యక్తం చేశారు. బెంగాల్‌లో తనను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలయ్యాక దేశవ్యాప్తంగా పర్యటించి, బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేస్తానన్నారు. 'బెంగాల్‌లో మీరు నన్ను లక్ష్యంగా చేసుకుంటే, అది నా ప్రజలపై జరిగిన వ్యక్తిగత దాడిగానే భావిస్తా. ఎన్నికలయ్యాక దేశమంతటా పర్యటించి, యావద్దేశాన్ని గడగడలాడిస్తా'అని మంగళవారం మతువాల ప్రాబల్యమున్న బొంగావ్‌లో జరిగిన ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌కు ఓటరు జాబితా లోని ఒక్క పేరును తొలగించేందుకు కూడా అధికారం లేదు, భయపడ వద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు. 'రాష్ట్రంలో 2002లో ఎస్ఐఆర్ చేపట్టారు. మేం ఈ ప్రక్రియను వద్దనడం లేదు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వాస్తవమైన ఒక్క ఓటరును కూడా తొలగించవద్దని మాత్రమే అడుగుతున్నాం. బీజేపీ ఆఫీసు ఆదేశాల ప్రకారమే ఈసీ నడుచుకుంటోంది. ఈసీ నిష్పాక్షికంగా ఉండాలే తప్ప, దళారీగా వ్యవహరించరాదు'అని మమత పేర్కొన్నారు.

నాతో ఆటలొద్దు

ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్నందున రాష్ట్ర బీజేపీ నేతలు మతం ప్రాతిపదికగా ఉన్న దరఖాస్తులను ఎస్ఐఆర్‌లో భాగంగా పంపిణీ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. దీని వల్ల గందరగోళం తలెత్తి, కొందరు ఓటర్లకు అన్యాయం జరిగే ప్రమాదముందని తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం కింద విదేశీయులుగా ముద్ర పడితే, ఓటరు జాబితాలో పేరుండదని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. 'నాతో ఆటలాడా లని అనుకోవద్దు, నాతో పోరాడలేరు. నేను ఆడటం మొదలుపెడితే, మీరింక ఆడేందుకు ఏమీ ఉండదు. బెంగాల్‌లో నన్ను దెబ్బతీయాలని చూస్తే మాత్రం, దేశంలో మీ పునాదుల్ని కదిలించి వేస్తా'అని బెనర్జి హెచ్చరించారు. అనంతరం సీఎం మమతా బెనర్జి బొంగావ్‌లోని చాంద్‌పారా నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఠాకూర్‌నగర్ వరకు యాంటీ ఎస్ఐఆర్ పాదయాత్ర చేపట్టారు.

ఇది బీజేపీ కుట్రే

ఈ ర్యాలీకి రాకుండా అడ్డుకునేందుకే బుక్ చేసుకున్న అద్దె హెలికాప్టర్‌ను ఆఖరి క్షణంలో రద్దు చేశారు, ఇది బీజేపీ కుట్రేనని ఆమె ఆరోపించారు. అధికారులు మాత్రం ఆ హెలికాప్టర్ లైసెన్సు ముగిసిపోయిందని, బీమా సంబంధిత పొరపాట్లు ఉన్నాయని చెప్పారు.

సైన్యంలో ఇది చెల్లదు!

- తోటి సైనికుల మనోభావాలను గౌరవించరా?
- క్రైస్తవ ఆర్మీ ఆఫీసర్ తొలగింపు సరైనదే
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- మతపరమైన పరేడ్‌లకు హాజరుకాని అధికారిపై వేటుకు సమర్థన

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రక్షణ విధుల్లో ఉండి.. 'నా దేవుడు వేరు.. ఆ గుడిలోకి నేను రాను'అంటూ మొండికేసిన ఒక ఆర్మీ ఆఫీసర్‌కు సుప్రీంకోర్టు కోలుకోలేని షాక్ ఇచ్చింది. 'తోటి సైనికుల మనోభావాలను గౌరవించలేని మీకు.. మత అహంకారం అంత ఎక్కువగా ఉందా? సైన్యం అంటేనే లౌకికవాదానికి ప్రతీక.. అక్కడ మీ మత చాందసవాదం చూపించడానికి వీల్లేదు. ఇలాంటి వాళ్లను ఒక్క నిమిషం కూడా ఉపేక్షించొద్దు.. సర్వీస్ నుంచి పీకి పారేయండి'అంటూ సీజేఐ ధర్మాసనం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. రెజిమెంట్ నిర్వహించే మతపరమైన పరేడ్‌లను బహిష్కరించిన క్రైస్తవ అధికారిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం పూర్తిగా సమర్థించింది. 'ఇది సాదాసీదా తప్పు కాదు.. ఘోరమైన క్రమశిక్షణా రాహిత్యం. ఇలాంటి ప్రవర్తన సైన్యం పునాదులనే దెబ్బతీస్తుంది'అంటూ సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. తీర్పు సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది 'ఇది తప్పుడు సంకేతం ఇస్తుంది'అని అనగా.. 'కాదు.. ఇది గట్టి గుణపాఠం కావాలి.. స్ట్రాంగ్ మెసేజ్ వెళ్లాల్సిందే'అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కరాఖండిగా తేల్చిచెప్పారు.

మన సైన్యం క్రమశిక్షణకు పేరు

భారత సైన్యం అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. అక్కడ వ్యక్తిగత మత విశ్వాసాల కంటే, దళంలోని సైనికుల మనోభావాలు, ఐకమత్యమే ముఖ్యం. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. రెజిమెంట్ నిర్వహించే మతపరమైన పరేడ్‌లలో పాల్గొనడానికి నిరాకరించిన శామ్యూల్ కమలేషన్ అనే క్రైస్తవ ఆర్మీ అధికారిని సర్వీస్ నుంచి తొలగించడాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. 'ఇది తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం కిందకే వస్తుంది'అని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సదరు ఆఫీసర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల బాగ్చిలతో కూడిన ధర్మాసనం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. ఈ సందర్భంగా కోర్టు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

ఆమోదయోగ్యం కాదంటూ ఆగ్రహం

మంగళవారం విచారణ సందర్భంగా సీజేఐ ధర్మాసనం పిటిషనర్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'మీరు మీ తోటి సైనికుల మనోభావాలను గౌరవించడంలో విఫలమయ్యారు. ఇతరుల గురించి పట్టించుకోనంతగా మీ మతపరమైన అహంకారం పెరిగిపోయిందా?'అని సీజేఐ సూర్యకాంత్ సూటిగా ప్రశ్నించారు. ఒక అధికారిగా ఉండి, తోటి సైనికుల మనోభావాలను కించపరిచేలా ప్రవర్తించడం క్రమశిక్షణ ఉన్న ఫోర్స్‌లో ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు.

అసలేం జరిగింది?

శామ్యూల్ కమలేషన్ అనే అధికారి భారత ఆర్మీలోని 3వ క్యావలరీ రెజిమెంట్‌లో లెఫ్టినెంట్‌గా చేరారు. ఆ రెజిమెంట్‌లో సిక్కు, జాట్, రాజ్‌పుత్ సైనికులు ఉన్నారు. రెజిమెంట్ సంప్రదాయం ప్రకారం వారందరూ అక్కడి మందిరం, గురుద్వారాలో వారంవారం జరిగే మతపరమైన పరేడ్‌లలో పాల్గొంటారు. అయితే, తాను క్రై స్తవుడినని, ఏకేశ్వ రోపాసకుడినని చెబుతూ, ఆలయ గర్భగుడిలోకి వెళ్లడానికి గానీ, పూజల్లో పాల్గొనడానికి గానీ కమలేషన్ నిరాకరించారు. తన మతం ఇతర దేవుళ్ళను పూజించడానికి అంగీకరించదని తన ఉన్నతాధికారులతో అనేకసార్లు వాదించారు. దీంతో 'ఆర్మీ నిబంధనలను, లౌకిక స్ఫూర్తిని ఉల్లంఘించారు'అనే కారణంతో శామ్యూల్ కమలేషన్‌ను సర్వీస్ నుంచి తొలగించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 43.0610 టీఎంసీలు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు 3,711 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది.



క్రిస్మస్ ప్రారంభ వేడుక

దాచేపల్లి: ఏసుక్రీస్తు జనన వేడుకలు మంగళవారం జిల్లా అంతటా ప్రారంభమయ్యాయి. చర్చిలు, ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు.

పేదలకు రుణాలు అందేనా!

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం

- సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలపై సమీక్ష
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల పనితీరుపైనా చర్చ
- రుణాల కోసం ఎదురు చూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

జిల్లా పరిషత్ కార్యాలయ భవనం(ఫైల్)

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, కార్పొరేషన్ల పట్ల చిన్న చూపుచూపుతోంది. కొద్ది నెలల కిందట ఇదిగో రుణాలు ఇస్తున్నాం..వెంటనే దరఖాస్తు చేసుకోండి అని ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలను నమ్మించి మాట మార్చింది. ఎస్సీ రుణాలకు యూనిట్లు మారుస్తున్నామని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు రుణాలకు సంబంధించిన ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. బీసీ రుణాలకు సంబంధించి కూడా ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపరాదని ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్టీలకు కనీసం దరఖాస్తు చేసుకోమని చెప్పిన పాపన పోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బుధవారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలపై సమీక్షించనున్నారు. ఆయా వర్గాల ప్రజలు ప్రభుత్వ అసమర్థ పాలనపై గుర్రుగా ఉన్నారు.

ఎస్సీల ఆశలకు తెర

జిల్లా షెడ్యూల్డు కులాల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో గుంటూరు జిల్లాకు రూ.990 యూనిట్లు కింద రూ.41.33 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.992 యూనిట్లు కింద రూ.38.56 కోట్లు మేర సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు ఏప్రిల్ నెల మొదటి వారంలో ప్రకటించారు. రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల వరకు(40 నుంచి 60శాతం వరకు సబ్సిడీ) రుణాలు అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో నిరుద్యోగులు తమకు అనుభవం ఉన్న రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఉన్నా యూనిట్లను మారుస్తున్నామంటూ సైట్‌ను ప్రభుత్వం మూసివేసింది. దీంతో వివిధ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

సంక్షేమ హాస్టల్స్‌పై శీతకన్ను

గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం శీతకన్ను చూపుతుంది. ఎస్టీ హాస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడంతో, హాస్టల్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఎస్టీ నాయకులు మండిపడుతున్నారు. నెల రోజుల కిందట పెదనందిపాడు, అనపర్రు బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అయి 56 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో హాస్టల్స్‌లో విద్యార్థులు ఉండాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బాలికల హాస్టల్స్‌పై నియంత్రణ లేకుండా పోయింది.

బీసీలకు నిరాశే మిగిలింది

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు ప్రచారాన్ని హోరెత్తించారు. అదే స్థాయిలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం చేశారు. జిల్లాలోని బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన వారు వేలల్లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎంపికలు(క్రెడిట్ క్యాంపులు) జరిగాయి. తీరా రుణాలు అందుతాయనే సమయంలో సైట్ క్లోజ్ చేసి రుణాలకు సంబంధించిన ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండలాలు, మున్సిపాలిటీల నుంచి కూడా ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపరాదని తేల్చేశారు. దీంతో బీసీ రుణాల కోసం ఆశించిన పేద వర్గాలకు నిరాశే మిగిలింది.

వడ్లమూడి గ్రామంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్న నక్కలగుంట చెరువు

చెరువును మింగేస్తున్న తమ్ముళ్లు

- చేబ్రోలు మండలంలో యథేచ్ఛగా క్వారీ మట్టి తరలింపు
- డొంకలను సైతం వదలని టీడీపీ నాయకులు
- కాసులు కురిపిస్తున్న మట్టి అక్రమ తవ్వకాలు

నక్కల గుంట చెరువు సమీపంలో నాయకులు తవ్వేసిన డొంక

చేబ్రోలు: అధికార పార్టీ నాయకులకు అక్రమ క్వారీయింగ్ కాసులు కురిపిస్తోంది. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని నక్కల గుంట చెరువు ప్రాంతంలో యథేచ్ఛగా అక్రమ క్వారీయింగ్ జరుగుతుంది. సుద్దపల్లి నుంచి శలపాడు రైల్వేగేట్ వరకు రాకపోకలు సాగించే డొంక రోడ్డును నాలుగు రోజులుగా యంత్రాలతో తవ్వి పెద్ద పెద్ద లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అక్రమ క్వారీయింగ్‌ను అధికార పార్టీ నాయకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. నిత్యం లక్షలాది రూపాయలతో జేబులు నింపుకుంటున్నారు. నక్కల గుంట చెరువు సమీప ప్రాంతంలో కొంత మేర తవ్వకాలకు అనుమతులు తీసుకున్న నాయకులు రాకపోకలు సాగించే ప్రధాన డొంక రోడ్లును సైతం తవ్వేస్తున్నారు. డొంకరోడ్డును సుమారు ఐదు అడుగుల మేర తవ్వి అక్రమంగా మట్టిన తరలిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల కళ్లుగప్పి చెరువు, డొంక రోడ్లులను సైతం తవ్వేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రజలు రాకపోకలు సాగించే డొంక, చెరువు సమీప ప్రాంతాల్లో అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడుతున్న వారిపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగా హెచ్చరిక బోర్డు

చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని నక్కలగుంట చెరువు పరిసర ప్రాంతాల్లో రెండు చోట్ల గ్రామ పంచాయతీ వారు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన చెరువులో మట్టి తవ్విన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డు ఉన్న ప్రాంతంలోని చెరువు, డొంక రోడ్లను సైతం జేసీబీలతో తవ్వి లారీల ద్వారా ఎర్ర గ్రావెల్‌ను తరలించుకుపోయారు. దీంతో డొంక రోడ్డు ప్రమాదకరంగా మారింది.

న్యూస్‌రీల్

ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచాలి

తాడేపల్లిరూరల్: ప్రతి విద్యార్థి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచాలని ఆర్‌జేడీ పద్మ అన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచటానికి ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టిన సంకల్ప్–2026 అమలును పర్యవేక్షించటానికి మంగళవారం పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆర్‌జేడీ ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి తరగతిని పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎస్ఆర్‌కేవీఎం పథకం ద్వారా విద్యార్థులకు ఉచిత నీట్, జేఈఈ మెటీరియల్ అందజేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆర్‌జేడీ పద్మను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు.

కంది పంటకు పురుగు ఆశించే అవకాశం

అచ్చంపేట: తాడువాయిలో కంది పంటను క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఏవో పి.వెంకటేశ్వర్లుతో కలసి మంగళవారం పరిశీలించారు. కంది పంటను ఆకుచుట్టు పురుగు, పూత పురుగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉందని, ఈ పురుగు లేత ఆకులను, పూతను కలిపి గూడుగా చేసుకుని పంటకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తాయన్నారు. నివారణకు క్లోరిపైరిఫోస్, నోవల్యూరోన్, తయోదికార్బ్ నీటితో కలిపి మొక్క పూర్తిగా తడిసే వరకు పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి బాగా ఉన్నప్పుడు లామిడా సైహలోత్రిన్ మందును నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా బోరు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరులోని అమరావతి రోడ్డు భారత్‌పేట ఐదవ లైనులో వినియోగంలో ఉన్న బోరింగ్ పంపు కార్పొరేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూలన పడింది. స్థానికుల నీటి అవసరాలకు ఉపయోగకరంగా ఉన్న చేతిపంపు ఆర్నెల్ల క్రితం మరమ్మతుకు గురికావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు వచ్చి తీసుకెళ్లిన సిబ్బంది తిరిగి బిగించడం మరిచారు. అప్పటి నుంచి బోరును ఓపెన్‌గా అలాగే వదిలివేయడంతో చిన్నారులు ఎవరైనా అటువైపు వెళితే ప్రమాదం బారిన పడే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి తక్షణమే చేతి పంపును బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

సాతులూరు-నరసరావుపేట మధ్య రైల్వే గేటు మూసివేత

నరసరావుపేట: సాతులూరు–నరసరావుపేట రైల్వే స్టేషన్ల మార్గంలో లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు అత్యవసరంగా పట్టాలు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్‌వో వినయ్‌కాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని కారణంగా ఆ మూడు రోజులు రైల్వేగేటు మూసివేయటం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జుసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 582.80 అడుగులకు చేరింది. ఇది 290.5140 టీఎంసీలకు సమానం . సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,500, ఎడమకాలువకు 4,160, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 12,586, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,046 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది.

చోరీలు చేస్తూ.. గంజాయి అమ్ముతూ..

నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

- ఇరువురు నిందితులు అరెస్టు
- 3 కిలోల గంజాయి, 19 ద్విచక్రవాహనాల స్వాధీనం

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్రవాహనాలు చోరీలు, గంజాయి విక్రయాలకు అలవాటుపడిన ఇరువురు నిందితులను నల్లపాడు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ భానోదయ నిందితుల వివరాలు వెల్లడించారు. నగరంలోని పొన్నూరు రోడ్డు ఇందిరాప్రియదర్శిని కాలనీ 1వ లైనుకు చెందిన షేక్ ఖాజావలి చెడు వ్యసనాలకు బానిసై ద్విచక్రవాహనాలు చోరీ చేసేందుకు పూనుకున్నారు. వీరికి ఖాజావలి భార్య గొర్రె మిన్ని, అత్త గొర్రె రేణుకలు సైతం సహకరించేవారు. గుంటూరు సమీపంలో వాహనాలను చోరీ చేసి వాటిని లంబసింగికి తీసుకువెళ్లి అక్కడ విక్రయించేవారు. ఆ డబ్బుతో గంజాయి కొనుగోలు చేసి గుంటూరు సమీపంలో విక్రయించేవారు. 20 రోజుల క్రితం ఖాజావలి, మైనర్ బాలుడు ఇరువురు కలిసి చౌడవరం గ్రామం దాసరిపాలెం సమీపంలో ఇంటి ముందు పార్క్‌చేసిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించారు. దొంగిలించిన వాహనాన్ని లంబసింగికి తీసుకెళ్లి అక్కడ ఆ వాహనాన్ని విక్రయించారు. వచ్చిన డబ్బుతో అక్కడే 5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి లారీలో గుంటూరుకు వచ్చారు. అనంతరం ఆ గంజాయిని ఖాజావలి మైనర్ బాలునికి కేజీన్నర, మరో గుర్తు తెలియని వ్యక్తికి కేజీ ఇచ్చి దానిని 10 గ్రాముల చొప్పున ప్యాకెట్స్‌గా చేసి ఒకొక్క ప్యాకెట్‌ను రూ.200 విక్రయాలు చేస్తున్నారు. ఖాజావలి తన వద్దనున్న మిగిలిన గంజాయిని తీసుకుని పెదపలకలూరు రోడ్డులో విక్రయాలు చేస్తున్నాడని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో సీఐ వంశీధర్ సిబ్బందితో కలిసి ఖాజావలిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన స్టైల్‌లో విచారించగా నిందితుడు చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్దనుంచి 3 కిలోల గంజాయి, 19 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఖాజావలిని, మైనర్ బాలుడిని అరెస్ట్ చేశామని మిగిలిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తామని డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ వంశీధర్, ఎస్ఐ మహేష్‌కుమార్, సిబ్బంది సుబ్బారావు, బిక్షనాయక్, మస్తాన్‌వలి, సాంబశివరావులను అభినందించి రివార్డు అందజేశారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు!

- రిజిస్ట్రేషన్ లేకుండానే సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు
- జిల్లా వ్యాప్తంగా 100కు పైగా సంస్థల ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల నుంచి కార్లు తీసుకొస్తున్న దళారులు
- ఒరిజినల్ పత్రాల్లేకుండా.. పన్ను చెల్లించకుండా హల్‌చల్
- చోద్యం చూస్తున్న రవాణా శాఖ అధికారులు

ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల నెంబర్ ప్లేటుతో తిరుగుతున్న వాహనాలు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): జిల్లాలో సెకండ్ హ్యాండ్ వాహనాల వ్యాపారం మూడు కార్లు ఆరు బస్సులుగా వెలుగొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చిన వాహనాలకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో తక్కువ ధరకు వస్తుందని కొందరు వాహనాన్ని కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నారు. పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లాలో రోజుకో చోట సెకండ్ హ్యాండ్ వాహన విక్రయ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఢిల్లీ, బొంబే, హరియాణా, కర్ణాటక ప్రాంతాల నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి విక్రయించేస్తున్నారు. కొద్ది రోజుల పర్మిట్‌తో అక్కడ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు అనుమతిని ఇస్తారు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత అక్కడ కొనుగోలు చేసిన వాహనాలకు కచ్చితంగా ఏపీ రిజిస్ట్రేషన్‌తో నెంబర్ ప్లేటు తీసుకోవాల్సి ఉంటుంది. సుమారు పన్నులు మొదలుకుని రూ. 40వేల నుంచి రూ. 1లక్ష 50వేల వరకు వాహనాలకు రిజిస్ట్రేషన్ చార్జీలు పడతాయని ఆర్టీఏ వర్గాలు చెబుతున్నాయి.

రిజిస్ట్రేషన్ లేకుండానే..

సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు, కొనుగోలు వ్యాపారం చేయాలంటే రవాణా శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో 100కు పైగా సంస్థలు బోర్డులు పెట్టి వ్యాపారం చేస్తున్నాయి. అయితే వీటిలో సగానికి పైగా వాటికి రిజిస్ట్రేషన్ లేకపోవడం గమనార్హం. ఇటీవల ఢిల్లీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో పది సంవత్సరాల పైబడిన వాహనాలను తిరగకుండా నిషేధించారు. దీంతో పెద్ద కంపెనీలకు చెందిన వాటిని కూడా తక్కువ ధరకే అమ్మేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సెకండ్ హ్యాండ్ వ్యాపారులు ఢిల్లీతోపాటు గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల వాహనాలను కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు.

నిబంధనలు పట్టించుకోకుండా..

ఇతర రాష్ట్రాల వాహనాలు ఏపీలో ఏ ప్రాంతంలోనైనా నెలరోజుల కంటే ఎక్కువ రోజులు తిప్పకూడదనే నిబంధన స్పష్టంగా ఉంది. ఆయా రాష్ట్రాల్లో కొనుగోలు చేసి ఇక్కడ తిప్పుకోవాలంటే వాహన మోడల్‌ను బట్టి 8 నుంచి 14 శాతం పన్ను చెల్లించాలి. ఏపీ నెంబర్‌పై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. దీనికి వాహనాన్ని బట్టి రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. అయితే తక్కువగా కొనుగోలు చేసిన వ్యాపారులు ఎవరికో ఒకరికి అంటగడుతున్నారు. ఈ రీతిలో ఎలాంటి పత్రాల్లేని వాటిని తీసుకొచ్చి జిల్లాలో అమ్మకాలు సాగిస్తున్నారని రవాణాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ... వీటిపై ఉదాసీనంగా వ్యవహరించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చోద్యం చూస్తున్న ఆర్టీఏ అధికారులు....

జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పెద్ద ఎత్తున యథేచ్ఛగా తిరుగుతున్నా రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చిన వాహనాలకు పన్ను చెల్లించకుండా వాహనాలపై పోలీస్, ప్రెస్, రాజకీయ నేతల పేర్లు రాసి తిప్పుతున్నారని అధికారులే చెబుతున్నారు. పైగా పూర్తి స్థాయిలో బ్లాక్ ఫిల్మ్ వేస్తున్నారు. ఆర్టీఏ అధికారులు కొంత మందికి సెకండ్ హ్యాండ్ వాహన విక్రయదారులతో సత్సంబంధాలు ఉండటటం కారణంగానే దాడులు నిర్వహించటం లేదనే వాదనలు లేకపోలేదు.

తీగ లాగితే.... డొంక కదులుతోంది

మంగళగిరి, కురగల్లు సొసైటీలలో అవినీతి వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ

జీడీసీసీ చీఫ్ మేనేజర్ శ్రీలక్ష్మి

మంగళగిరిటౌన్: మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరిగిన అవినీతిపై తీగ లాగితే డొంక కదులుతోంది. గత అక్టోబర్‌లో మంగళగిరికి చెందిన కుక్కల సహదేవ రెడ్డి అనే రైతు 31 లక్షల 50 వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్, బత్తుల వెంకటేశ్వరరావు, పార్వతి దంపతులు 90 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను రద్దు చేసుకుని నగదు తీసుకునేందుకు మంగళగిరి పీఏసీఎస్‌కు వెళ్లగా వారిలో ఒకరివి నకిలీ ఫిక్స్‌డ్ బాండ్ అని, మరొకరి ఖాతాలో నగదు లేదనే విషయం వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా కురగల్లు గ్రామానికి చెందిన తాడిబోయిన హనుమంతరావు కుటుంబ సభ్యులు 90 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ విత్‌డ్రా చేసుకునేందుకు కురగల్లు సొసైటీకి వెళ్లారు. అయితే అక్కడ కూడా ఇవి నకిలీ బాండ్లు అని తేలడంతో మంగళగిరిలోని పరిపాలనా కార్యాలయానికి వచ్చి చీఫ్ మేనేజర్ శ్రీలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టగా వీరి ఖాతాల్లో నుంచి నగదును కొన్ని రోజుల క్రితమే కురగల్లు సొసైటీ సీఈవో రమేష్ విత్‌డ్రా చేసినట్లు విచారణలో తేల్చారు. అప్పుడే రమేష్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో కురగల్లు, మంగళగిరి కార్యాలయాల్లో డిపాజిట్లు చేసిన రైతులు ఆందోళనకు గురయ్యారు.

కొనసాగుతున్న విచారణ....

మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయాల్లో జరిగిన కుంభకోణంపై జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ (జీడీసీసీ) జాయింట్ రిజిస్ట్రార్ ఉమాదేవి నేతృత్వంలో సమగ్ర విచారణ జరుగుతున్నట్లు జీడీసీసీ మంగళగిరి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి. శ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. మంగళగిరి మండల పరిధిలోని కురగల్లులో ఉన్న పీఏసీఎస్‌లో 70 మంది రైతులకు చెందిన 112 ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి రూ.8,50,93,947 మంగళగిరి పీఏసీఎస్‌లో నలుగురు రైతులకి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి రూ.1,28,06,053 గోల్‌మాల్ జరిగినట్లు అధికారికంగా గుర్తించామని శ్రీలక్ష్మి తెలిపారు. మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో పోలీసులు ఆయా పీఏసీఎస్ సిబ్బందిని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన బాధితులు

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో బాధిత రైతులు మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. రైతులు కురగల్లులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70 మంది కలసి పొదుపు చేసిన రూ.8.50 కోట్ల నగదును సీఈవో రమేష్ దుర్వినియోగం చేశారని, విచారించి తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు విన్నవించారు.

మంగళగిరి జీడీసీసీ బ్యాంక్ కార్యాలయం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1200 గరిష్టం : రూ. 1600

మోడల్ ధర రూ. 1400

పసుపు ధరలు (మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు :96

కొమ్ములు : 96 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
12,275	12,275	12,275

కాయలు : 00 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
00	00	00

మొత్తం అమ్మకాలు : 72.00 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	51,138
అమ్మకాలు	50,502
నిల్వ	9,315

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-17,700
నంబరు-5	11,500-15,800
341	10,000-17,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	11,500-17,800
నంబరు-5	11,500-16,300
341	11,500-18,000
4884	12,000-14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,600
బాడిగ-355	11,000 - 18,000
దేవనూరు డీలక్స్	11,000 - 17,000
ఆర్మూర్	11,500 - 14,000
తాలుకాయలు	5,300 - 8,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000-15,600
బాడిగ - 355	11,000-18,200
దేవనూరు డీలక్స్	10,500-16,800
తాలు	5,300 - 8,300

-కొరిటెపాడు (గుంటూరు)

పాముకాటుకు రైతు మృతి

నాదెండ్ల: పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని కనపర్రు గ్రామానికి చెందిన రైతు నరిశెట్టి చిన్నయ్య (55) సోమవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చే క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

లింగ సమానత్వం ద్వారానే
మహిళా సాధికారత సాధ్యం

డీఆర్ఓ ఖాజావలి

గుంటూరు వెస్ట్ : లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి అన్నారు. మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని డీఆర్వో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టడానికి, లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో డిసెంబర్ 23వ తేదీ వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సులు జరుగుతున్నాయని, దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మహిళలపై వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి స్త్రీ, పురుషులు సమానమని తెలియజేయాలన్నారు.

■ డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ లింగ వివక్ష అరికట్టడానికి సమాజంలో అవగాహన కోసం ప్రతిరోజు ఒక అంశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థల్లో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహిస్తామన్నారు. గతంలో కంటే ఇప్పుడు మహిళలు మెరుగైన సమాజం ఉన్నప్పటికీ ఆర్థిక స్వాతంత్ర్యం అనేది ఇంకా పూర్తిస్థాయిలో లేదన్నారు.

■ తొలుత కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంపాలెం సెంటర్లో మానవహారం నిర్వహించి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఈఓ రేణుక, ఐసీడీఎస్ పీడీ ప్రసూనా, సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య, ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవం

గుంటూరు రూరల్: శివారెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ శాఖను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ కె ప్రమోద్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్‌చేసి బ్యాంక్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారెడ్డి పాలెంలో 2022లో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించటం జరిగిందని, నేడు బ్రాంచ్‌ను నూతన భవనంలోకి మార్చడం జరిగిందన్నారు. గతం కంటే విన్నూత్న స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ భారతదేశంలోనే అతిపెద్ద రెండవ గ్రామీణ బ్యాంక్ అని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వారి అవసరాలను తీరుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల చిన్న సన్నకారు రైతులకు, రైతు కూలీలకు, చిరు వ్యాపారులకు బ్యాంక్ సేవలు అందిస్తున్నామన్నారు. క్రాపు లోన్, గోల్డ్‌లోన్స్, మహిళా సంఘాలకు, ఇతన రంగాలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. టెక్నాలజీ పరంగా అన్ని రకాల ఆధునిక సదుపాయాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలనేదే మా ప్రధాన కర్తవ్యం, లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ బి. రామకృష్ణ, రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ నీరజ, కార్పొరేటర్ రమ్య, బిల్డింగ్ దుగ్గినేని మహాలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ను ప్రారంభించిన ఏపీ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

పెదకాకాని నవశక్తి క్షేత్రంలో చోరీ

50 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు హుండీలు ఎత్తుకెళ్లిన దొంగలు

పెదకాకాని: పెదకాకాని నవశక్తి క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి ఆభరణాలతో పాటు మూడు హుండీలను ఎత్తుకెళ్తిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రమైన పెదకాకాని శివారులో వెనిగండ్ల నుంచి అగతవరప్పాడు వెళ్లే రోడ్డులో నవశక్తి పీఠం ఉంది. ఈ క్షేత్రంలో నిత్యం పూజా కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే ఆలయ తలుపులకు అర్చకులు తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం గుడి వద్దకు వెళ్లి చూడగా తాళాలు వేసిన గడి పగులగొట్టి తలుపులు తీసి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూ టీం బృందంతో పెదకాకాని పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఆలయంలో అమ్మవారి ఆభరణాలు 12 మంగళసూత్రాలు, నల్లపూసల గొలుసు, 2 ముక్కు పుడకలు, ఆలయంలో అమర్చిన మూడు హుండీలు ఎత్తుకెళ్లారు. ఆభరణాలు సుమారు 50 గ్రాముల బరువు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. దొంగలు ఎత్తుకెళ్లిన మూడు హుండీలను సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో పగులగొట్టి అందులో ఉన్న కానుకలు తీసుకుని ఖాళీ హుండీలను అక్కడే వదిలి వెళ్లారు. పీఠం నిర్వాహకుడు విశ్వనాథుని మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

చోరీ జరిగిన నవశక్తి క్షేత్రం

గుంటూరులో ఓపెన్ పికిల్ బాల్ టోర్నీ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో జిల్లా పికిల్ బాల్ సంఘం సహకారంతో డిసెంబర్ 6, 7 తేదీల్లో స్థానిక హనుమాన్‌నగర్ ఒకటో లైన్‌లోని వీవీవీ హెల్త్ హబ్‌లో గుంటూరు ఓపెన్ ప్రైజ్ మనీ పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ మన్నే తెలిపారు.

■ స్థానిక క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అనూరాధ మాట్లాడుతూ అండర్-14, అండర్-16 మిక్స్‌డ్ , మహిళలు, సింగిల్స్, ఓపెన్ పురుషుల డబుల్స్ ఈవెంట్లలో పోటీలు జరుగుతాయన్నారు.

■ ఈ క్రీడ అభివృద్ధి కోసం గుంటూరులో పోటీలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా మహిళలు కూడా పాల్గొనాలన్నారు. మహిళలకు సింగిల్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

■ ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను డిసెంబర్ 2ల తేదీ లోపు ఆనంద్ కుమార్ వాట్సాప్‌కు 955333 5375 పంపాలన్నారు.

■ సింగిల్స్ ఎంట్రీ ఫీ రూ.500 , డబుల్స్‌కి రూ.1000 ఎంట్రీ ఫీజును ఫోన్ పే 8143783999 చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు.

■ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను అనూరాధతోపాటు ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్. శ్రీధర్, రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ్ కార్యదర్శి వాణికుమారి నందిపాటి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ అశోక.బి, జిల్లా పికిల్ బాల్ సంఘం అధ్యక్షులు టి.హరికిషన్, వీవీవీ హెల్త్ హబ్, అధినేత టి.పద్మావతి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పికిల్ బాల్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, నిర్వాహక కార్యదర్శి కె. అరుణ్ కుమార్, కోశాధికారి కె. సుస్మిత, ఉపాధ్యక్షులు డాక్టర్ హనుమంతరావు, టి.మధు స్మిత, శిక్షకులకు ఆనంద్ కుమార్, కె. రవి ఎస్.శివారెడ్డి, సుబ్బారావు పసుపులేటి పాల్గొన్నారు.

పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనూరాధ, అరుణ్ కుమార్, పద్మావతి తదితరులు

విశ్రాంత ఏఎస్ఐపై దౌర్జన్యం: అట్రాసిటీ కేసు నమోదు

తాడికొండ: విశ్రాంత ఏఎస్ఐపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించిన కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం.. తాడికొండ గ్రామానికి చెందిన విశ్రాంత ఏఎస్ఐ తోడేటి పోలరాజు అడ్డరోడ్డు సెంటర్‌లో మథర్ థెరిస్సా స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసి గత 10 సంవత్సరాలుగా పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం ఈడే మురళీకృష్ణ, యర్రంశెట్టి రవి, అద్దంకి శ్రీ కృష్ణ యాదవ్‌లు హైకోర్టులో స్టే ఉండగా తన కార్యాలయాన్ని కూల్చివేశారని, ఎందుకు కూల్చివేశారని అడగ్గా తనపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి బెదిరించారని పోలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

గుంటూరు లీగల్ : తాడికొండ మండలం నిడుముక్కల గ్రామానికి చెందిన మహిళపై జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ఐదవ జిల్లా జడ్జి కె.నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ఆటోలో ఉంగుటూరు వెళ్తున్న మహిళపై సత్తెనపల్లి నాగార్జున కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ పల్లపు రమేష్ అలియాస్ నల్లోడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు తాడికొండ పోలీసులకు 2019 జులై 02న ఫిర్యాదు చేసింది. తాడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. జడ్జి నీలిమ నిందితుడికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. ఐఓ పి.శేషగిరిరావు, సీఎంఎస్ నరసింహారావు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరిగింది.

సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు

సర్టిఫికెట్ కోర్సులో చేరిన విద్యార్థులతో శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: గుంటూరులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సమగ్ర యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ పాల్గొని మాట్లాడుతూ అభ్యర్థులకు విచక్షణ రహితంగా ఎరువులను వినియోగించడం వలన నేలలో సేంద్రియ కర్బనం తగ్గి భూమి సారాన్ని కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యంపై విజ్ఞానాన్ని పెంచుకోవాలని తద్వారా రైతులు అవగాహన కల్పించాలన్నారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.మనోజ్, వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న 30 మంది జిల్లాస్థాయి వెస్టీస్ స్టోర్ ఇన్చార్జిలు రావేప్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు బలమైన చట్టాలు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్

గుంటూరు లీగల్: మహిళల రక్షణ కోసం మన చట్టాలు బలంగా ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలపై జరిగే శారీరక, లైంగిక, మానసిక, ఆర్థిక, హింసలు, సైబర్ హింసల గురించి వివరించారు. వాటి ద్వారా మహిళలు ఎదుర్కొనే సమస్యలను తెలిపారు. ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (లింగ వివక్ష నిరాకరణ), ఆర్టికల్ 21(జీవించే హక్కు) ద్వారా మహిళల హక్కులకు పూర్తి రక్షణ కల్పిస్తుందన్నారు. గృహ హింస, మెయింటెనెన్సు వంటి చట్టాల గురించి సమాజంలో, ఇంట్లో, పనిచేసే చోట మహిళలకు జరిగే శారీరక, మానసిక హింసలపై అవగాహన కల్పించారు. మీడియేషన్ అడ్వకేట్ వసుమతి పూర్ణిమ మాట్లాడుతూ మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కుల గురించి వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు, మహిళలకు అందే హక్కుల గురించి వివరించారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ ద్వారా డిజిటలైజ్డ్ క్రైమ్స్ ఎక్కువగా జరగడానికి అవకాశం ఉందన్నారు. మహిళలను కాపాడుకునే బాధ్యత మనందరి మీద ఉందని తెలిపారు. హక్కుల దుర్వినియోగం, పని చేసేచోట, ఇంట్లో వేధింపులకు గురి అవ్వడం, మహిళలకు ఉన్న ఇష్టాలు, అభిప్రాయాలను నియంత్రించడం ద్వారా ఎక్కువగా హింసలకు గురవుతున్నారని తెలిపారు. మహిళలకు జరిగే హింసల నియంత్రణకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియా ఉద్దీన్

బాలుడి మృతదేహం లభ్యం

తాడేపల్లిరూరల్: విజయవాడ కృష్ణానది నీటిలో సీతమ్మవారి పాదాల వద్ద కృష్ణలంక పోలీసులు మంగళవారం గుర్తు తెలియని ఓ బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం సీతానగరం నుంచి విజయవాడ వైపు వచ్చి ఉండవచ్చని భావించి తాడేపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. బాలుడి వయస్సు సుమారు 14 సంవత్సరాలు ఉండవచ్చని గుర్తించిన వారు తాడేపల్లి, కృష్ణలంక పోలీసుస్టేషన్‌లకు సమాచారం ఇవ్వాలని విజయవాడ పోలీసులు కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొలకలూరు రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 50 ఏళ్ల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కళాశాల బస్సు

తెనాలి రూరల్: ఇంజినీరింగ్ కళాశాల బస్సు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. చేబ్రోలు మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సు విద్యార్థులతో మంగళవారం తెనాలి వచ్చింది. ఇక్కడి ప్రకాశం రోడ్డులో పెట్రోలు బంకు వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. విద్యార్థులు అద్దాలపై పడడంతో అవి పగిలి పలువురు గాయపడ్డారు. తమకు ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ మొదటి సెమిస్టర్
పరీక్షల ఫీజు షెడ్యూలు ప్రకటన

స్పాట్ అడ్మిషన్లు జరగకుండానే షెడ్యూల్ ప్రకటనపై విద్యార్థుల విస్మయం

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూ అధికారుల వింత ధోరణికి విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాలేదు. పీజీ కౌన్సెలింగ్‌లో రెండు విడతల్లో అడ్మిషన్లు నిర్వహించిన నిర్వాహకులు స్పాట్ అడ్మిషన్లపై ఇప్పటి వరకూ ఏ నిర్ణయం తీసుకోలేదు. యూనివర్సిటీ అధికారులు స్పాట్ అడ్మిషన్ల వ్యవహారంపై ఉన్నత విద్యామండలి, విద్యాశాఖ మంత్రి నుంచి అనుమతి కోసం వేచి చూస్తున్నారు. వర్సిటీలోని పలు విభాగాల్లో స్పాట్ అడ్మిషన్ల వల్ల సీట్లు భర్తీ అయ్యే అవకాశాలు ఉంటాయి. అనివార్య కారణాల వల్ల సకాలంలో దరఖాస్తు చేసుకోలేని వారి కోసం ప్రతి ఏడాది స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. స్కాలర్‌షిప్ రాకపోయినా పర్వాలేదు, సంవత్సరం వృథా కాకూడదనే భావనతో విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ ద్వారా ఆయా కోర్సుల్లో చేరుతూ ఉంటారు.

ఈ సారి స్పాట్ అడ్మిషన్ జరగకుండానే ఫీజుల షెడ్యూల్ ప్రకటించడం గందగోళానికి దారి తీసింది. వర్సిటీ అధికారుల నిర్ణయంతో తమకు ఏడాది కాలం వృథా అవుతుందని స్పాట్ అడ్మిషన్ల కోసం ఎదురు చూస్తున్న పలువురు విద్యార్థులు వాపోయారు. దీనిపై సీఈఓ ఆలపాటి శివప్రసాద్‌ను వివరణ కోరగా అడ్మిషన్లకు తనకు సంబంధం లేదని, అకడమిక్ క్యాలండర్ ప్రకారం మంగళవారం నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్టు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.మల్లికార్జునరావు తెలిపారు. 69వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ఎన్టీఆర్ జిల్లా నున్నా జెడ్పీ హైస్కూల్ నిర్వహించారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం పేర్కొన్నారు. ట్రాక్ విభాగంలో సీహెచ్ విజయలక్ష్మి, ఎన్.పరమాత్ములు ప్రథమ స్థానం, రోడ్ విభాగంలో ఎస్కే నబీర్ (అండర్-17), వై.తేజస్విని (అండర్-14), ఎన్.సింధు (అండర్-14)లు ప్రథమస్థానం, ఎన్.బిందుశ్రీ (అండర్-17), జి.నరేంద్ర (అండర్-14), ఎస్కే ఆమన్ (అండర్-14) ద్వితీయ స్థానం, జి.మణికంఠ (అండర్-17), ఎ.లావణ్య (అండర్-14)లు తృతీయ స్థానాలు సాధించినట్టు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. నం॥ 9121469383

■ ప్రముఖ మార్కెటింగ్ సంస్థ వెంకటేశ్వర ఎస్టేట్ నందు నరసరావుపేటలో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. మంచి జీతం+ ఇన్సెంటివ్స్.8978057827, 8106264847

■ గుంటూరు అంకిరెడ్డిపాలెంలో రోడ్డు ప్రక్కనే 150 గజాల స్థలం అమ్మకమునకు కలదు. తక్షణమే ఇల్లు నిర్మించుకోవచ్చు. 9390011971, 9396242802

■ గుంటూరు, ఒంగోలు లో గల కాలేజి నందు పనిచేయుటకు క్లీనర్, వాచ్‌మెన్, బస్సు డ్రైవర్ మరియు 35 సంవత్సరాల పైబడిన లేడి వార్డెన్స్ కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 8122461164, 9440681862

■ Wanted a Female DTP Operator with Good Communication skills for a books publication, Q: Any Degree. 7815916553, 9381137392

■ చీరాల పట్టణములో నూతనంగా ప్రారంభం కానున్న వజ్రపూర్ణ ఆర్గానిక్ స్టోర్ నందు పనిచేయుటకు మహిళలు కావలెను ఆసక్తి కల మహిళలు సంప్రదించండి. Ph:98668 99390

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబి కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్ రూ. 475 ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు

గుంటూరు 7075167663 7075167541

పంజాబ్ నేషనల్ బ్యాంక్

(భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు !

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్ డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం – 530003. మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

బ్రాంచ్ ఆఫీస్: పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేషన్ రోడ్డు, గుంటూరు: ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: మెస్సర్స్ గుంటూరు టొబాకోస్ & పార్ట్‌నర్స్ : శ్రీ వేములపల్లి వెంకట నరసయ్య & శ్రీమతి నాగోతు సవిత & హామీదారులు: శ్రీ వేములపల్లి వెంకట నరసయ్య, శ్రీమతి నాగోతు సవిత, శ్రీ వి. రమేష్ బాబు & శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ & 2-14-470, శ్యామల నగర్, 1బి లేన్, గుంటూరు – 522006. డిమాండ్ నోటీసు తేది.19-01-2018, బకాయి మొత్తం: తేది.31-12-2024 నాటికి రూ.3,65,19,334.60 పై + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి. లాంఛనాత్మక స్వాధీనత తేది : 13-08-2019

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 17-12-2025, మధ్యాహ్నం 3 గం॥ల లోపు

ఇ-వేలం తేది మరియు సమయం : 17-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు

ఆస్తి-1: వేములపల్లి వెంకట నరసయ్య గారి పేరున కలదు (డాక్యుమెంట్ నెం.7314/2008): ప్రస్తుత పల్నాడు జిల్లా, సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట మండలం, ఇస్సపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం.67/ఎ, 69/ఎ, 69, 68, 65, 66/ఎలోని ప్లాట్ నెం.54తో గల 246.5 చ॥గ॥ల స్థలం అందు క్రింద మరియు మొదటి అంతస్తులతో కూడిన ఆర్‌సిసి రూఫ్ భవనం. హద్దులు : తూర్పు: ప్లాటు నెం.59 (43.60 అ॥లు), దక్షిణం: ప్లాట్ నెం.53 (51 అ॥లు), పడమర: 30 అ॥ల వెడల్పు రోడ్డు (43.60 అ॥లు), ఉత్తరం: ప్లాట్ నెం.55 (51 అ॥లు). Latitude and Longitude:16.257547,80.056241

రిజర్వు ధర : రూ.42.10 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.4.21 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.50,000/-

ఆస్తి-2: వేములపల్లి వెంకట నరసయ్య గారి పేరున కలదు (డాక్యుమెంట్ నెం.7315/2008): ప్రస్తుత పల్నాడు జిల్లా, సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట మండలం, ఇస్సపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం.67/ఎ, 69/ఎ, 69, 68, 65, 66/ఎలోని ప్లాట్ నెం.59తో గల 246.5 చ॥గ॥ల స్థలం అందు క్రింద మరియు మొదటి అంతస్తులతో కూడిన ఆర్‌సిసి రూఫ్ భవనం. హద్దులు : తూర్పు: 30 అ॥ల వెడల్పు రోడ్డు (43.60 అ॥లు), దక్షిణం: ప్లాట్ నెం.60 (51 అ॥లు), పడమర: ప్లాటు నెం.54 (43.60 అ॥లు), ఉత్తరం: ప్లాట్ నెం.58 (51 అ॥లు). Latitude and Longitude:16.257492,80.056401

రిజర్వు ధర : రూ.34.20 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.3.42 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.50,000/-

ఆస్తి-3 : వేములపల్లి రమేష్ బాబు గారి పేరున కలదు (డాక్యుమెంట్ నెం.6481/2011): ప్రత్తిపాడు, ఈదులపాలెం గ్రామము, డిటిసిపి అప్రూవల్ నెం.1/2011, డి.నెం.89/5లోని ప్లాట్ నెం.4తో గల 243 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ భూమి యావత్తు ఆస్తి. హద్దులు : తూర్పు: 33 అ॥ల వెడల్పు రోడ్డు (35 అ॥లు), దక్షిణం: బొమ్మిడి సాంబశివరావు గారి ప్లాట్ నెం.4, పడమర: చింతపాటి రామ్‌నాథ్ గారి ప్లాటు (35 అ॥లు), ఉత్తరం: ప్లాట్ నెం.3 (62.60 అ॥లు). Latitude and Longitude:16.227914,80.315829

ఆస్తి-4 : వేములపల్లి రమేష్ బాబు గారి పేరున కలదు (డాక్యుమెంట్ నెం.6482/2011), ప్రత్తిపాడు, ఈదులపాలెం గ్రామము, డిటిసిపి అప్రూవల్ నెం.1/2011, డి.నెం.89/5, ప్లాట్ నెం.3తో గల 243 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ భూమి యావత్తు ఆస్తి. హద్దులు : తూర్పు: 33 అ॥ల వెడల్పు రోడ్డు (35 అ॥లు), దక్షిణం: ప్లాట్ నెం.4 (62.60 అ॥లు), పడమర: చింతపాటి రామ్‌నాథ్ గారి ప్లాటు (35 అ॥లు), ఉత్తరం: ప్లాట్ నెం.2 (62.60 అ॥లు). Latitude and Longitude:16.227914,80.315829

రిజర్వు ధర : రూ.14.50 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.1.45 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

ఆస్తి-5 : శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరున కలదు (మోర్టగేజ్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4278/2013, తేది.27.11.2013), గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామం, ఈదులపాలెం గ్రామ పంచాయితీ పరిధి, అప్రూవ్డ్ లేఅవుట్ ప్రణాళికతో టిఎల్‌పి నెం.42/2013/జి, తేది:21.03.2013 ప్రకారం దిగువ తెలిపిన సర్వే నెం. మరియు ప్లాట్ నెం.లతో గల 9 (తొమ్మిది) నివాస ప్లాట్లు ఒక్కొక్కటి 200 చ॥గ॥ల చొప్పున మరియు 1 (ఒకటి) నివాస ప్లాటు 194 చ॥గ॥ల చొప్పున మొత్తం 10 (పది) నివాస ప్లాట్ల వివరములు దిగువ తెలుపబడినవి. హద్దులు : 1) సర్వే నెం.29/1లోని ప్లాట్ నెం.17బితో గల 194 చ॥గ॥లు : తూర్పు: 33 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: ఖాళీ ప్రదేశం, పడమర: 33 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.17బి. 2) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.22తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.23, దక్షిణం: 50 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.21, ఉత్తరం: ప్లాట్ నెం.37. 3) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.23తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.24, దక్షిణం: 50 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.22, ఉత్తరం: ప్లాట్ నెం.36. 4) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.26తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.27, దక్షిణం: 50 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.25, ఉత్తరం: ప్లాట్ నెం.33. 5) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.27తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.28, దక్షిణం: 50 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.26, ఉత్తరం: ప్లాట్ నెం.32. 6) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.32తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.31, దక్షిణం: ప్లాట్ నెం.27, పడమర: ప్లాట్ నెం.33, ఉత్తరం: 33 అ॥ల వెడల్పు రోడ్డు. 7) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.33తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.32, దక్షిణం: ప్లాట్ నెం.26, పడమర: ప్లాట్ నెం.34, ఉత్తరం: 33 అ॥ల వెడల్పు రోడ్డు. 8) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.36తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.35, దక్షిణం: ప్లాట్ నెం.23, పడమర: ప్లాట్ నెం.37, ఉత్తరం: 33 అ॥ల వెడల్పు రోడ్డు. 9) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.37తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.36, దక్షిణం: ప్లాట్ నెం.22, పడమర: ప్లాట్ నెం.38, ఉత్తరం: 33 అ॥ల వెడల్పు రోడ్డు. 10) సర్వే నెం.29/2లోని ప్లాట్ నెం.86తో గల 200 చ॥గ॥లు: తూర్పు: ప్లాట్ నెం.113, దక్షిణం: ప్లాట్ నెం.87, పడమర: 33 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం:ప్లాట్ నెం.85.

రిజర్వు ధర : రూ.59.40 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.5.94 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.50,000/-

సెక్యూర్డ్ క్రెడిటర్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.17.12.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 25-11-2025
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

పీపీపీ నిర్ణయం.. పేద విద్యార్థులకు శాపం

- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

కోటి సంతకాల సేకరణ పత్రాలను తీసుకుంటున్న వేమారెడ్డి

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం పేద విద్యార్థులకు శాపమేనని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా సేకరించిన పత్రాలను మంగళగిరి పట్టణ, తాడేపల్లి మండల నాయకులు వేమారెడ్డికి అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 24, 25, 27 వార్డుల్లో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారంతో పూర్తయిన సందర్భంగా ఆ పత్రాలను వేమారెడ్డికి అందజేశారు. తాడేపల్లి మండల పరిధిలోని 10 గ్రామాల అధ్యక్షులు ఆ పత్రాలను వేమారెడ్డికి అందజేశారు. పెనుమాకలో 2,000, ఉండవల్లి 2,200, కుంచనపల్లి 1,400, వడ్డేశ్వరం 1,500, కొలనుకొండ 1,000, ప్రాతూరు 500, గుండిమెడ 500, చిర్రావూరు 500, ఇప్పటం 500, మెల్లెంపూడి 500 సంతకాల సేకరణ పత్రాలను మొత్తంగా తాడేపల్లి మండల పరిధిలో

మంగళగిరిలో సేకరించిన సంతకాల పత్రాలను వేమారెడ్డికి అందజేస్తున్న నాయకులు

10,600 సంతకాలు సేకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు ఆయా గ్రామాల అధ్యక్షులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులను వేమారెడ్డి అభినందించారు.

బాబు పాలనలో రాష్ట్రం అధోగతి..

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని చంద్రబాబు సర్కార్ వెంటనే ఉపసంహరించుకోవాలని వేమారెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలు అధోగతి పాలైందని విమర్శించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాసరావు, 24వ వార్డు అధ్యక్షులు మురళి, 25వ వార్డు అధ్యక్షులు గుంటి లవిన్, 27వ వార్డు అధ్యక్షులు అల్లూరు శ్రీనివాసరావు, పట్టణ మహిళా విభాగ కార్యవర్గ సభ్యురాలు ధనశ్రీ, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, వివిధ గ్రామాల అధ్యక్షులు శివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, గొడవర్తి శ్రీను, నూతక్కి శ్రీనివాసరావు, దోగిపర్తి చలపతి, నాయుతోటి శంకర్, మేకల సాంబశివరావు, ప్రవీణ్, రాజాలాల్‌రెడ్డి, నాయకులు బాణావత్ వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, గడ్డం తాతయ్య, రాఘవరావు, బుల్లబ్బాయి, చంద్రయ్య, మీరావలి, యేసుబాబు, అశోక్‌రెడ్డి, అంజిరెడ్డి, దామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు ప్రజలు వ్యతిరేకం..

తాడేపల్లి రూరల్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వేమారెడ్డి అన్నారు. మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం తాడేపల్లి రూరల్‌లో మెడికల్ కళాశాలలను వ్యతిరేకంగా సేకరించిన సంతకాల పత్రాలను ఆయనకు నాయకులు అందజేశారు. వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం నిర్లక్ష్యం చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు సహించేది లేదు

మహిళలతో కలిసి ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

తాడికొండ: మహిళలపై దాడులను సహించేది లేదని తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, వారిని దూషించడం హక్కులకు భంగం కలిగించడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని వివరించారు. మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మార్పు కోసం ముందడుగు వేయాలని, వికసిత్ భారత్‌లో భాగంగా గ్రామాల్లో సమ్మిళిత వృద్ధికి ఆర్థిక స్వావలంభనకు మహిళలు ముందుండాలని సూచించారు. అనంతరం మహిళలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.అనురాధ, ఎస్‌ఐ ఎం.జోజి, ఏపీఎం ఆర్.సాంబశివరావు, ఏపీవో జయకుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిత్తు

తాడేపల్లిరూరల్: మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు నాశనం చేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ అన్నారు. తాడేపల్లి రూరల్ మండలంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నులకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'మాదకద్రవ్యాలు.. ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్, చెర్రస్ తదితర మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం వనజకుమారి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

మంగళగిరి టౌన్: ప్రభుత్వం కాపులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు కోరారు. మంగళగిరి బీవీఎన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విజయానికి 26 జిల్లాల్లో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలు అందరూ కలిసి పనిచేశామని గుర్తుచేశారు. పదవుల కన్నా, రాజకీయ భవిష్యత్తు కన్నా జాతి ప్రయోజనాలే ముఖ్యంగా భావించి ప్రభుత్వం రావడానికి పనిచేశామని పేర్కొన్నారు. అనంతరం మంగళగిరి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుంకర రఘుపతిరావు ఏసుదాసును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు ప్రసాదరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లింగవివక్ష నిర్మూలనకు కృషి

ఫిరంగిపురం: లింగవివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. మండలకేంద్రంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి సత్తెనపల్లి రోడ్డు వరకు లింగవివక్ష వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుమారుడు, కుమార్తె అనే వ్యత్యాసం లేకుండా తల్లిదండ్రులు పిల్లలను సమానంగా చూడాలని తెలిపారు. ఏపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి డిసెంబరు 23వ తేదీ వరకూ లింగవివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఎంఈవో మహబూబ్ సుబానీ, డ్వాక్రా సభ్యులు, వెలుగు కార్యాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో శానిటేషన్ బ్లాక్ ఏర్పాటు

దుగ్గిరాల: విద్యార్థినుల ఉపయోగార్థం శానిటేషన్ బ్లాక్‌ను ఏర్పాటు చేశామని దుగ్గిరాల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.శోభాదేవి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. నెస్టెల్ ఇండియా కంపెనీ లిమిటెడ్ వారి సౌజన్యంతో బాలికల సౌకర్యార్థం నాలుగు యూనిట్లతో కూడిన శాశ్వత శానిటేషన్ బ్లాక్‌లను పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనికి సహకరించిన కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నెస్టల్ కంపెనీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

తాడికొండ: ఏపీ సీఆర్డీయే ఆధ్వర్యంలో వీఐటీ–ఏపీ యూనివర్సిటీ సహకారంతో రాజధాని ప్రాంత మహిళలకు ఇటీవల ప్రారంభమైన హౌస్ కీపింగ్ ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి సీఆర్డీయే సామాజిక విభాగ గ్రూప్ డైరెక్టర్ వి.రాములు పాల్గొని మాట్లాడారు. మహిళలకు అవకాశాలను అందిపుచ్చుకొని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరిలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దైవ సేవకులు

మంగళగిరి టౌన్: మంగళగిరిలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు క్యాపిటల్ రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ రవిప్రకాష్ తెలిపారు. సంబంధిత పోస్టర్, పాంప్లేట్లను మంగళవారం మంగళగిరి ఇమ్మానియేల్ చర్చిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డులో గల ఈద్గా షాదీ మహల్‌లో క్రైస్తవ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రజలు పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు దైవ సేవకులు రత్నకుమార్, సహదేవ్, సాల్మన్‌రాజు, సాంసోన్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరులో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మేడికొండూరు: అకాల వర్షాల కారణంగా పత్తి పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మండల కేంద్రంలోని పేరేచర్ల గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులను నష్టపోకుండా అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. కనీస గిట్టుబాటు ధరను సీసీఐ ద్వారా రైతులకు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని.. పంట నష్టపోయిన రైతులకు ఏ విధమైన సహాయం అందించాలనే అంశంపై అధికారులతో సమీక్షించి సరైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, ప్రభుత్వ అధికారులు, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్నే శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షులుగా కామాక్షి

దుగ్గిరాల: దుగ్గిరాల మండల యూటీఎఫ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని.. మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా కె.కామాక్షి, ప్రధాన కార్యదర్శిగా బి.చలపతిరావులను ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎండీ గయాసు దౌలా తెలిపారు. మంగళవారం దుగ్గిరాల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గౌరవ అధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, సలహాదారులుగా జి.విజయలక్ష్మీ, ఆర్‌వీ ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా హుస్సేన్, కార్యదర్శులుగా 9 మంది సభ్యులు, కౌన్సిలర్లుగా 7 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, నిరుద్యోగ సమస్యల పట్ల యూటీఎఫ్ నిబద్ధతతో పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీత ఎండీ కరీముల్లా, ఎస్.కోటేశ్వరమ్మలను యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూటీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధి డోలాస్‌నగర్‌లో నివసించే ఓ కుటుంబం అయిన వారిని కోల్పోవడంతో జీవనం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న బ్రహ్మానందపురం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి మంగళవారం నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రెసిడెంట్ రాజశేఖర్, ట్రస్ట్ సెక్రటరీ దర్శి రమేష్, బాబు, ఎస్ మహ్మద్, రఫీ, అక్కుల కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అనారోగ్య సమస్యలపై అవగాహన

దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం

తాడేపల్లిరూరల్: కాలానుగుణంగా ప్రజల జీవనశైలి కూడా మారుతుందని.. పౌష్టికాహారాన్ని వదిలి జంక్‌ఫుడ్ తీసుకోవటంతో ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు రావడంతో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని ఇన్‌ఫెక్షన్లు సులువుగా సోకడంతో ఫ్లూ, క్షయ, హెపటైటిస్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని కేఎల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్ సుప్రియ అన్నారు. కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామంలో ఫార్మసీ వాలంటీర్లుతో కలిసి ఇంటింటికి వెళ్లి ఇన్‌ఫెక్షన్లను నివారించండి, మధుమేహాన్ని నియంత్రిండండి అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చక్రవర్తి మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లాఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

■ సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు నేడు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో గల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రవిశంకర్ మంగళవారం తెలిపారు. ఉదయం స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు జరుపుతామని పేర్కొన్నారు. అనంతరం అష్టోత్తర, సహస్రనామ పూజలు చేస్తామన్నారు. యాగశాలలో రుత్వికులతో హోమం, సాయంత్రం స్వామివార్ల శాంతికల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఫిరంగిపురం: మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆ వ్యక్తికి తీవ్రగాయాలైయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వేమవరం గ్రామ శివారు పెట్రోలు బంకు సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి నరసరావుపేటకు మోటారుసైకిల్‌పై వెళుతున్న తిమోతిని నరసరావుపేట నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తిమోతి తీవ్రగాయాలతో కిందపడిపోయాడు. పీఎస్‌ఐ నవీన్ నాయక్, కానిస్టేబుల్ ప్రదీప్‌లు తిమోతిని చికిత్స కోసం నరసరావుపేట గవర్నమెంట్ వైద్యశాలకు తరలించారు.

■ మద్యం మత్తులో రెచ్చిపోయిన వలస కార్మికులు

తాడేపల్లి రూరల్: బతుకుదెరువు కోసం ఊరుకాని ఊరొచ్చి.. తాగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన మున్న, పశ్చిమగోదావరి మొగల్తూరుకు చెందిన మోటూరు కిరణ్‌కుమార్‌లు బతుకుదెరువు కోసం విజయవాడ వచ్చారు. స్థానిక హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. పని ముగించుకుని సీతానగరం శివాలయం దగ్గర్లో గల ఓ బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేసి పుష్కర ఘాట్‌పై కూర్చుని తాగారు. కిక్కు తలకెక్కడంతో ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగారు. మద్యం మత్తులో మున్న కత్తిలాంటి పదునైన ఆయుధంతో కిరణ్‌కుమార్‌పై దాడి చేశాడు. దాడిలో కిరణ్‌కుమార్ తీవ్రంగా గాయపడగా స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన మున్న పరారీలో ఉన్నాడు.

■ సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తాడేపల్లిరూరల్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 28న రాజధాని పర్యటన సందర్భంగా రాజధాని ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ డివిజన్ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు రాజధాని ముఖద్వారం ఉండవల్లి నుంచి రాయపూడి సీఆర్డీయే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

■ ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడికొండ: తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తాడికొండ ట్యూబ్‌లైట్ సెంటర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలున్న వారిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. బీఎస్ఎస్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.మేరీ సువర్ణలత, ఎన్ఎస్ఎస్ విభాగాధికారులు ఎం.వేణుబాబు, షేక్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

■ మైనింగ్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు

తాడికొండ: తాడికొండ మండలంలో మైనింగ్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ మెహర్‌కుమార్, సీఐ కె.వాసు తెలిపారు. ఇటీవల కాలంలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు రచ్చకెక్కి ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై అధికారులు స్పందించారు. లచ్చన్నగుడిపూడి గ్రామంలో సర్వే నంబరు 113, 114లో 6.20 ఎకరాలకు బత్తుల వెంకటేష్ అనే వ్యక్తికి 2024కు ముందుకు మైనింగ్ అనుమతులు ఉన్నాయని, ప్రస్తుతం అలాంటివి మంజూరు చేయలేదన్నారు. మోతడక వేదికగా జరిగిన భారీ మైనింగ్‌పై ప్రశ్నించగా తమవద్ద నుంచి కానీ మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని అధికారులు పేర్కొన్నారు.

■ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో విద్యార్థుల ఎంపిక

మేడికొండూరు: డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు జరిగిన టాటా ఎలక్ట్రానిక్స్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం జరిగిన డ్రైవ్‌లో 16 మంది డిప్లమా విద్యార్థులు ఇండో–ఎంఐఎం కంపెనీకి ఎంపిక కాగా.. మంగళవారం 19 మంది డిప్లమా విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డిప్లమో ప్రిన్సినాల్ జయరామిరెడ్డి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, వివిధ శాఖల అధిపతులు, బోధన.. బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

■ తాడేపల్లిలో ఎల్‌వోసీ చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు. తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, మాజీ కౌన్సిలర్ కాటాబత్తిని నిర్మల, చల్లా శ్రీనివాస్, చల్లా రంగయ్య, సైకం సాంబయ్య, షేక్ బాజి, ఎస్కే సైదా, దామర్ల దుర్గారావు, కుందుర్తి కోటేశ్వరావు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2, డి.నెం. 54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) కింద డిమాండ్ నోటీసు

[illegible]

తేది : 25-11-2025
ప్రదేశం : విజయవాడ
అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

यूनियन बैंक Union Bank of India
అసెట్ రికవరీ బ్రాంచి (79170)
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
[illegible] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ వారిచే ఇ-వేలం ద్వారా ది.30-12-2025న అమ్ముటకు [illegible]

ఇ-వేలం తేది మరియు సమయం : 30-12-2025 ఉ॥ 12.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ లు
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపుతో)

ఋణగ్రహీత: 1) శ్రీ దివీల ప్రవీణ్ కుమార్, తండ్రి: శివరామ కృష్ణ మూర్తి, ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, అయ్యప్ప టవర్స్, బ్రాహ్మణ వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా- 520001. 2) శ్రీ దివీల ప్రవీణ్ కుమార్, తండ్రి: శివరామ కృష్ణ మూర్తి, ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్3, మొదటి అంతస్తు, బాలాజీ రెసిడెన్సీ, ఉండవల్లి గ్రామ పంచాయితీ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501. 3) శ్రీ దివీల ప్రవీణ్ కుమార్, కేరాఫ్ : విజయగణపతి గార్లపాటి స్టీల్స్, శివాలయం వీధి, 1 టౌన్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001. 4) శ్రీమతి వెలుగూరి జి.ఆలేఖ్య, తండ్రి : వి.వి. సురేష్, 32-26-61/2, ఎస్.వి.ఆర్. వీధి, మాచవరం, విజయవాడ, కృష్ణా జిల్లా-520004. 5) శ్రీమతి వెలుగూరి జి.ఆలేఖ్య, భర్త: దివీల ప్రవీణ్ కుమార్, ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్3, మొదటి అంతస్తు, బాలాజీ రెసిడెన్సీ, ఉండవల్లి గ్రామ పంచాయితీ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501. 6) శ్రీమతి వెలుగూరి జి.ఆలేఖ్య, భర్త: దివీల ప్రవీణ్ కుమార్, కేరాఫ్ : విజయగణపతి గార్లపాటి స్టీల్స్, శివాలయం వీధి, 1 టౌన్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001.

బకాయి మొత్తం: ది.31-10-2025 నాటికి బకాయిసొమ్ము రూ.36,03,021.74 పైు॥ [illegible]

[illegible]

రిజర్వుధర: రూ.24,40,000/- | ధరావత్తు: రూ.2,44,000/- | బిడ్ పెంపుదల మొత్తం: రూ.24,400/-

[illegible] https://baanknet.com [illegible] www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx [illegible] Mail ID : arb.vijayawada@unionbankofindia.bank [illegible]

ప్రదేశం : విజయవాడ, తేది : 18-11-2025

కరెంటు స్తంభంపై పదో తరగతి విద్యార్థి మృతి

విద్యుదాఘాతానికి బలై మృత్యువాత

స్తంభంపైనే వేలాడుతున్న వరుణ్ మృతదేహం

కనగానపల్లి: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో మంగళవారం సాయంత్రం ఓ విద్యార్థి విద్యుదాఘాతానికి బలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బిల్లే నాగభూషణం, సరోజమ్మ దంపతుల కుమారుడు బిల్లే వరుణ్(16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గ్రామంలోని తన స్నేహితులతో కలిసి ఎలక్ట్రీషియన్ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తన మిత్రుడు వంశీతో కలిసి గ్రామ సమీపంలో రాంపురం రహదారి పక్కన ఉన్న బాబు అనే రైతు పొలంలో విద్యుత్ స్తంభంపైకి మరమ్మతు పనులు చేయడానికి వెళ్లాడు. విద్యుత్ సరఫరా లేదన్న ఉద్దేశంతో స్తంభంపైకి ఎక్కి పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో విద్యుదాఘాతానికి గురై, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ మండల ఏఈ కొండారెడ్డి, స్థానిక పోలీసులు ప్రమాదస్థలికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణంగా భావిస్తూ నాగరాజు, వంశీ, బాబు తదితరులపై కేసు నమోదు చేశారు.

బాణసంచా కాలుస్తుండగా విషాదం

తెగిపడిన బాలుడి చెయ్యి

టపాసులు పేలడంతో గాయపడ్డ బాబి

నరసాపురం రూరల్: తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరు బాలురు చేసిన చిలిపి చేష్టలు ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపాయి. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి నాగదేవత కాలనీలో నివాసం ఉంటున్న కుమార సాయి, నాగులమ్మ దంపతులకు అసబ్ (11), బాబి (7) ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడంతో ఈ చిన్నారులు ఆడుకునేందుకు ఇంట్లో ఉన్న టపాసులు అంటించారు. ఈ క్రమంలో టపాసులు చేతిలో పేలిపోయి బాబికి చేయి మణికట్టు వరకు తెగిపడింది. అసబ్‌కు కాలు కాలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ పేలుడుకు కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై గాయపడిన అసబ్, బాబీలను నరసాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్యే సేవలో తరించిన ఉపాధ్యాయులు

శ్రీకాకుళం జిల్లాలో ఘటన.. నిలిచిన బోధన

ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక సంఘ సభ్యులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండల ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే సేవలో తరించారు. రెండు గంటల పాటు పర్మిషన్ తీసుకుని, పిల్లలను స్కూళ్లకు వదిలేసి ఎమ్మెల్యేకు ఆత్మీయ సత్కారం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సత్కరించేందుకు ఇచ్ఛాపురం మండల ఉపాధ్యాయ ఐక్యవేదిక నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా ఇద్దరు ఎంఈవోలతో పాటు సుమారు 120 మంది ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారుల వద్ద రెండు గంటల పాటు పర్మిషన్ తెచ్చుకుని ఇచ్ఛాపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మంగళవారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడటం విశేషం. పర్మిషన్ రెండు గంటలే అయినా ఒక పూటంతా విద్యార్థులు ఇబ్బంది పడినట్లు సమాచారం. నూతన డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారితో పాటు పాత టీచర్లు కూడా ఎమ్మెల్యేను సత్కరించారు. కాగా టీచర్ల తీరును విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుబట్టారు.

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA

Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No.	Tender ID	Name of the work	Estimate Contract Value (in Rs.)
1	867026	Tender notice for "Completion of incomplete Kreeda Vikasa Kendra at Kota, Gudur Constituency, Tirupati District (Part-1).	30,73,876/-
2	867027	- do - (Part-2)	31,22,065/-
3	867029	- do - (Part-3)	31,08,089/-
4	867030	- do - (Part-4)	30,78,305/-
5	867031	- do - (Part-5)	29,83,170/-
6	867033	- do - (Part-6)	23,96,824/-

Bid Strating Date: 26-11-2025. Bid end date: 04-12-2025

Tender documents are available on e-procurement platform tender.**apeprocurement.gov.in.** Tenders will be opened in the presence of company representatives who attend evaluation. For further details contact: 8501074922.

Sd/- Vice Chairman and Managing Director

DIPR RO No.4604PP/CL/Advt/1/1/2021-22, Dt: 25.11.2025

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ : www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

నం.GNT/C.79 /Catering/e-Auction/2025
తేది:24-11-2025

PUB/1486

'ఇ'-వేలం లీజింగ్ ద్వారా ఇచ్చే కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్ట్స్ కోసం గుంటూరు డివిజన్‌లో కంబైన్డ్ మంత్లీ కేటలాగ్

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు IREPS వెబ్ పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-బిడ్లు కోరుతున్నారు. ప్రచురించబడిన క్యాటరింగ్ కేటలాగ్స్ వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

10-12-2025 మరియు 16-12-2025న క్యాటరింగ్ స్టాల్స్ ఇ-వేలం

క్ర. సం.	కాంట్రాక్ట్ రకం	స్టేషన్/కేటగిరి/లొకేషన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1.	టీ స్టాల్	సత్తెనపల్లి-D (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	10-12-2025న 11.00 గం.లు
2.	టీ స్టాల్	నల్గొండ-B (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	10-12-2025న 11.00 గం.లు
3.	జ్యూస్ బార్	మిర్యాలగూడ-D (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	16-12-2025న 11.00 గం.లు

12-12-2025న MPS స్టాల్స్ ఇ-వేలం

క్ర. సం.	కాంట్రాక్ట్ రకం	స్టేషన్ / లొకేషన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1.	MPS స్టాల్	మంగళగిరి (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	12-12-2025న 11.00 గం.లు
2.	MPS స్టాల్	నడికుడి (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	12-12-2025న 11.00 గం.లు
3.	MPS స్టాల్	దొనకొండ (PF నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	12-12-2025న 11.00 గం.లు

ఇ-టెండర్లలో పాల్గొనుటకు ireps ఇ-వేలం లీజింగ్‌లో డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుటకు మరియు తమంతటతాము నమోదు చేసుకొనుట టెండరుదారుదే బాధ్యతగా ఉంటుంది. ireps పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో నమోదు చేసుకొనుటకు మరియు పాల్గొనుటకు ముందస్తు ఆవశ్యకతలు **www.ireps.gov.in** పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. దిగువ సంతకందారు కోరినపుడు టెండరుదారు అవసరమైన డాక్యుమెంట్లను కార్యాలయంలో దాఖలు చేయాలి. టెండరుకు సంబంధించి చెల్లింపు సమయంలో లేదా డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ సమయంలో IREPS పోర్టల్‌లో సంభవించే ఏదేని అవాంతరానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించిన నిబంధనలన్నింటినీ నెరవేర్చకుండా స్వీకరించిన టెండర్లు కచ్చితంగా తిరస్కరించబడును. పైన తెలిపిన టెండరు యొక్క పూర్తి వివరాలు **www.ireps.gov.in** పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి.

A1886 — సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

'బిడ్డా'.. తప్పుకో!

మంత్రి చెప్పిన వారికే లక్కీ 'డిప్'!

- ఏపీటీడీసీ టెండర్లలో పారదర్శకతకు పాతర
- అర్హత లేని సంస్థలకు రూ.కోట్ల విలువైన కాంట్రాక్టులు
- తాజాగా సింహాచలం దేవస్థానం సాంకేతిక సేవలను పిలిచిన టెండర్లలోనూ ఇదే తీరు!
- ఏడాదిన్నరగా అనుకున్న సంస్థకు టెండర్ రాకపోవడంతో బిడ్లు రద్దు చేస్తున్న వైనం

అన్నింటా అనర్హ సంస్థే!

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)లో టెండర్ల ప్రక్రియ తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ నచ్చినోళ్లకు నచ్చినట్లు రూ.కోట్ల విలువైన కాంట్రాక్టులను కట్టబెట్టే తంతు యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా సింహాచలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం మెరుగైన సాంకేతిక సేవలు అందించేందుకు తలపెట్టిన 'స్పిర్చువల్ డిజిటల్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు (డీఐపీ-డిప్)' కాంట్రాక్టునూ అడ్డగోలుగా దోచిపెట్టేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రసాద్ పథకంలో భాగంగా రూ.2 కోట్లతో అధునాతన మల్టీమీడియా సేవలతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ రూపకల్పన, నిర్వహణకు ఏపీటీడీసీ ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) బిడ్లను ఆహ్వానించింది. అయితే,ఏడాదిన్నరగా మూడు సార్లు బిడ్ల ప్రక్రియ రద్దవగా.. ఇప్పుడు నాలుగో సారి సైతం గందరగోళంగా మారింది.

అమాత్యులు చెప్పారని బెదిరింపులు..

టెండర్ల ప్రక్రియలో అనర్హ కాంట్రాక్టు సంస్థలకు ఈడీ స్థాయి అధికారులు కొమ్ముకాస్తుండటం వ్యవస్థ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోంది. వాస్తవానికి 'డిప్' ప్రాజెక్టులో అమాత్యుని అనుకూల వ్యక్తులకు టెండర్లు దక్కకపోవడంతో మూడు సార్లు రద్దు చేసినట్టు సమాచారం. ఇప్పుడు నాలుగోసారి మళ్లీ అర్హులను.. అనర్హులుగా చిత్రీకరించి అమాత్యుని అనుయాయుడికే టెండర్ కట్టబెట్టేందుకు పావులు కదుపుతుండటం అవినీతికి పరాకాష్టగా మారింది. నాలుగు కంపెనీలు బిడ్లు వేయగా అందులో రాజమహేంద్రవరానికి చెందిన ఓ కంపెనీకి ప్రాజెక్టు దక్కేలా ప్రణాళిక రూపొందించడం చర్చనీయాంశమైంది. పైగా మిగిలిన మూడు కాంట్రాక్టు సంస్థలకు స్వయంగా ఏపీటీడీసీ అధికారులు 'మంత్రిగారి తాలూకా మనిషికి' టెండర్ దక్కుతోందని, మీరు తప్పుకోవాలని ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతుండటం దిగజారిన పరిస్థితికి అద్దం పడుతోంది. వాస్తవానికి ఇదే రాజమహేంద్రవరం కంపెనీకి అనుబంధంగా ఉన్న మరో మౌలిక వసతుల కంపెనీకి అన్నవరం, అఖండగోదావరి వంటి ప్రాజెక్టులను ఇలానే బెదిరింపు ధోరణిలో కట్టబెట్టినట్టు విమర్శలొస్తున్నాయి.

రాజమహేంద్రవరానికి చెందిన కంపెనీకి టెండర్ నిబంధనల ప్రకారం ఏడాదికి రూ.2 కోట్ల టర్నోవర్ లేదు. గత మూడేళ్లలోనూ సదరు సంస్థ ఎన్నడూ రూ.2 కోట్ల మార్కును చేరుకోలేదు. పైగా సంస్థ సమర్పించిన ఆర్థిక లావాదేవీలకు, చార్టెడ్ అకౌంటెంట్ ఇచ్చిన నివేదికలో తీవ్ర వ్యత్యాసం ఉన్నట్టు సమాచారం. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత ముఖ్యమైన, ప్రాథమికంగా టెండర్ దరఖాస్తుల్లో సమర్పించాల్సిన 'ఐఎస్ఓ' సర్టిఫికెట్ లేదు. ఇన్ని లోపాలు ఉన్న సంస్థకు టెండర్ కట్టబెట్టాలని అధికార యంత్రాంగం ఉవ్విళ్లూరుతోంది. ఏపీటీడీసీ రూపొందించిన నిబంధనల్లో సాంకేతిక బిడ్‌లో టెండర్ రేటును ప్రస్తావిస్తే బిడ్డును తిరస్కరిస్తామని పేర్కొంది. ఇక్కడే సదరు రాజమహేంద్రవరం సంస్థ నిబంధనలకు విరుద్ధంగా సాంకేతిక బిడ్‌లో టెండర్ రేటును కోట్ చేసినప్పటికీ క్వాలిఫై చేయడం అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది. అంతేకాదు రూ.2 కోట్ల ప్రాజెక్టు చేసే కంపెనీలకు ఏడాదికి రూ.6కోట్ల టర్నోవర్ ఉండాలని నిబంధన ఉంటుంది. కానీ, ఏపీటీడీసీ అధికారులు మాత్రం ఆ పద్ధతికి తిలోదకాలు ఇస్తూ రూ.2కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు టర్నోవర్‌ని బట్టి కంపెనీలకు మార్కులు నిర్ణయించింది. అంటే, తాము అనుకున్న సంస్థకు రూ.2 కోట్ల టర్నోవర్ ఉంటే టెండర్లలోకి తీసుకొచ్చే యత్నం చేసింది. మరోవైపు సాంకేతిక మూల్యాంకనంలో ప్రెజంటేషన్‌కు 50 మార్కులు పెట్టింది. ఇక్కడ మూల్యాంకనం కమిటీ ప్రెజంటేషన్ బాగోలేదని మార్కులు తగ్గించి తాము అనుకున్న సంస్థకు అధిక మార్కులు వేసే ఎత్తుగడ వేసింది. తద్వారా నచ్చిన సంస్థకు టెండర్‌ను కట్టబెట్టేందుకు రాచమార్గాన్ని వేసుకోవడం గమనార్హం.

లోకేశ్ ఆదేశాల మేరకే 'పరకామణి' విచారణ

- సీఐడీ విచారణకు ముందు.. అనంతరం మీడియాతో భూమన
- మహా సముద్రంలో ఎన్ని నీళ్లున్నాయంటే ఏం చెబుతాం!
- ఈ కేసులో నాకూ అంతే తెలుసని చెప్పాను
- చంద్రబాబు టీటీడీ ప్రతిష్టను ఉద్దేశ పూర్వకంగా మంట కలుపుతున్నారు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ''నాకు ఈ పరకామణి కేసుకు.. భూమికి, నక్షత్ర మండలానికి ఉన్నంత వ్యత్యాసం ఉంది. పసిఫిక్ మహా సముద్రంలో ఎన్ని నీళ్లు ఉన్నాయి.. నిన్న తిరుపతిలో కురిసిన వాన చినుకులు ఎన్ని.. అంటే ఏం చెబుతాం? ఈ పరకామణి కేసులో నాకూ అంతే తెలుసు'' అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యానించారు. తిరుమల పరకామణి కేసులో భాగంగా మంగళవారం సాయంత్రం సీఐడీ విచారణకు హాజరు కావాలని సీఐడీ ఉదయం నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఆయన తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. విచారణకు హాజరు కావడానికి ముందు, ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ''పరకామణి కేసులో కేవలం లోకేశ్ నాయుడు ఆదేశాల మేరకు.. బీఆర్ నాయుడు, వర్ల రామయ్య, పట్టాభి వంటి దుష్టచతుష్టయాల ఒత్తిడితోనే నన్ను విచారణకు పిలిచారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని మోసే పిచ్చి శునకాలు అక్షరాలా విరేచనాలతో తమ పత్రికలను నింపేస్తున్నాయి. అయినను హస్తినకు పోయిరావలె..'' అంటూ భూమన, సీఐడీ విచారణ కార్యాలయంలోనికి వెళ్లారు. 25 నిమిషాల అనంతరం వెలుపలికి వచ్చి తిరిగి మీడియాతో మాట్లాడుతూ.. ''పసిఫిక్ మహా సముద్రంలో ఎన్ని నీళ్లు ఉన్నాయి? నైలు నదిలో ఎన్ని మొసళ్లు ఉన్నాయి? మానవ శాస్త్ర చరిత్రకారులు.. టాంజానియా ఎండు మైదానంలో మన డీఎన్ఏకి మూలమైన ఓ మహాతల్లి ప్రసవించిన శిశువు అస్థి పంజరానికి 'లూసీ' అని నామకరణం చేశారట. లూసీ వాళ్ల అమ్మ పేరేమి? అని అడిగితే..? 1,500 ఏళ్లలో శ్రీవారిని దర్శించుకుని తలనీలాలు ఇచ్చినటువంటి వారు ఎంత మంది? నిన్న తిరుపతిలో కురిసిన వాన చినుకులు ఎన్ని? అని అడిగితే.. నేను ఏం సమాధానం చెప్పగలనో ఈ పరకామణి కేసులో నాకు అంతే సంబంధం ఉందని డీజీ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చాను'' అని స్పష్టం చేశారు.

ఇరికించడానికి విశ్వ ప్రయత్నం

''టీటీడీలో జరుగుతున్న తప్పొప్పులపై నేను నిరంతరం మాట్లాడుతున్నందున చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నాపై కక్షతో ఏదో ఒక రకంగా పరకామణి కేసులో నన్ను ఇరికించాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఆ సమయంలో నేను టీటీడీ అధ్యక్షుడిగా ఉండకపోయినా నేనే అధ్యక్షుడిగా ఉండి చేశానని ఒకసారి, నేనే ఒత్తిడి పెట్టి రవికుమార్‌తో రాజీ చేయించానని మరొకసారి.. ఎలా పడితే అలా నిరంతరం బాబును మోస్తున్న ప్రసార మాధ్యమాల ద్వారా నా మీద మాట్లాడుతున్నారు. కరుణాకర్ రెడ్డి ఇక దొరికిపోయినాడు దొంగ అని.. లోకేశ్ మాట్లాడితే సమాధానం ఇవ్వాల్సిన అవసరం మాకు ఉంది. మీ ప్రయత్నాలకు భయపడి లొంగిపోయే మనస్తత్వం కాదు నాది. ఏ విషయంలోనూ నేను ఏ తప్పు చేయలేదు. మిడ్ నైట్ మసాలా కార్యక్రమాన్ని నడిపిన వ్యక్తి, హైదరాబాద్‌ను కబళించినటు వ్యక్తి, దొంగ మందులు అమ్మిన వ్యక్తి, చానల్‌ను అడ్డుపెట్టుకుని దాదాగిరి, బ్లాక్ మెయిల్ చేసిన బీఆర్ నాయుడు లాంటి పనికి మాలిన వ్యక్తిని అధ్యక్షుడిగా చంద్రబాబు చేసినప్పుడే టీటీడీ ప్రతిష్టను ఉద్దేశ పూర్వకంగా మంట కలుపుతున్నారని అందరికీ అర్థమైంది. విస్తృత ప్రచార వేదికలను అడ్డుపెట్టుకుని మా నాయకుడు వైఎస్ జగన్‌పై, వైఎస్సార్‌సీపీ నేతలపై నిందలు వేస్తున్న వికృత చేష్టలను ప్రజలందరూ గమనిస్తున్నారు. వాస్తవంగా తప్పు చేసిన వారెవరన్నది బయటకు రాకుండా పోదు. ఆ రోజు మీరు దోషులు, నేరస్తులు, హీనులుగా మిగిలిపోక తప్పదు'' అని భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు. పరకామణి కేసులో నిందితుడు రవికుమార్‌ను, ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం సీఐడీ అధికారులు విచారించారు.

భారత క్రికెట్ అధికారిక కలర్ పార్ట్‌నర్‌గా ఏషియన్ పెయింట్స్

సాక్షి, హైదరాబాద్: బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) భారత క్రికెట్ అసోసియేషన్ అధికారిక కలర్ పార్ట్‌నర్‌గా ఏషియన్ పెయింట్స్‌తో మూడేళ్ల పాటు భాగస్వామ్యం కుదుర్చుకుంది. మహిళలు, పురుషులు, దేశవాళీ క్రికెట్‌లో మూడేళ్ల పాటు 110 మ్యాచ్‌లకు ఈ ఒప్పందం వర్తిస్తుంది. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో అమిత్ సింగిల్ మాట్లాడుతూ 'క్రికెట్ బిలియన్ల హృదయాలను ఏకం చేస్తుంది. బీసీసీఐతో భాగస్వామ్యం చేసుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు.

థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ర్యాలీ భగ్నం

సరుబుజ్జిలి: శ్రీకాకుళం జిల్లాలోని సురుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని స్థానిక గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం వెన్నెలవలస నుంచి సరుబుజ్జిలి జంక్షన్ వరకు ర్యాలీ తలపెట్టారు. కానీ దీన్ని పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో 340 మంది పోలీసులు థర్మల్ ప్రతిపాదిత ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామాలను చుట్టుముట్టారు.

పవిత్రం.. పంచమీ తీర్థం

పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీపద్మావతి అమ్మవారు ఆవిర్భవించిన తిరుచానూరులోని పద్మ సరోవరం(పుష్కరిణి)లో మంగళవారం పంచమీతీర్థం(చక్రస్నానం) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరోవరంలో ఏటా కార్తీక మాసంలో నిర్వహించే పంచమీ తీర్థం రోజున స్నానమాచరిస్తే సకల పాపాలు హరించుకుపోయి కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీన్లో భాగంగా అమ్మవారిని వేకువజాము 3గంటలకు సుప్రభాతంతో నిద్రమేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు అమ్మవారికి పల్లకి ఉత్సవం, 8గంటలకు సన్నిధి ముఖ మండపంలో అమ్మవారికి చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించిన తరువాత అమ్మవారు, చక్రత్తాళ్వార్లను సన్నిధి నుంచి వేంచేపుగా పుష్కరిణిలోని పంచమీ తీర్థం మండపానికి తీసుకొచ్చి కొలువు దీర్చారు. అనంతరం శ్రీవారు పంపించిన ముత్తయిదువు సారెతో ఉదయం 10 గంటల నుంచి అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జీయర్ స్వాముల సమక్షంలో ఆలయ అర్చకులు నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. 12.15 గంటలకు పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పుష్కరిణిలో చక్రత్తాళ్వార్లను చక్రస్నానం చేయించారు. కాగా, శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి.

అమ్మవారి చక్రస్నానానికి ఆర్మేనియా మహిళా భక్తులు

''హైందవ సంస్కృతి సంప్రదాయాలు మమల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతదేశ నాగరికత మాకు ఎంతో నచ్చింది. తిరుపతి మొదటిసారి పర్యటన మంచి అనుభూతిని ఇచ్చింది''అంటూ ఆర్మేనియా దేశానికి చెందిన అనహిత్ 'సాక్షి'తో తన తిరుపతి పర్యటన అనుభూతులను పంచుకున్నారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నాన ఘట్టానికి ఆర్మేనియా దేశానికి చెందిన నలుగురు మహిళలు పాల్గొన్నారు. వారు 'సాక్షి'తో మాట్లాడుతూ..శ్రీవారి, శ్రీపద్మావతి అమ్మవారి దర్శనం తమకు చాలా మంచి అనుభూతి ఇచ్చిందన్నారు. ఇక్కడి ప్రజలు, సంస్కృతి సంప్రదాయాలు చాలా బాగున్నాయన్నారు. మూడు రోజులుగా తిరుపతితో పాటు పరిసరాల్లో తాము పర్యటిస్తున్నామని చెప్పారు.

ఆపరేషన్ థియేటర్ డ్రెస్సింగ్ రూమ్‌లో.. డాక్టర్ల నగ్న వీడియోల చిత్రీకరణ

కాటూరి మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో ఘటన

- మొబైల్‌తో గోడపై నుంచి న్యూడ్ వీడియోలను తీసిన మేల్ నర్స్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కళాశాల యాజమాన్యం
- మొబైల్ సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ

ప్రత్తిపాడు: ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులు దుస్తులు మార్చుకునే సమయంలో నగ్న వీడియోలు తీస్తున్న మేల్ నర్స్‌ను ప్రత్తిపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ కథనం మేరకు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం ఈదులపాలెంలోని కాటూరి మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో సుమారు నెల రోజుల కిందట చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తమపట్నంకు చెందిన రాచపూడి వెంకటసాయి మేల్ నర్స్‌గా విధుల్లో చేరాడు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ సమీపంలోని డ్రెస్సింగ్ రూమ్‌లో మహిళా డాక్టర్లు, వైద్య విద్య చదువుతున్న పీజీ విద్యార్థులు దుస్తులు మార్చుకునే సమయంలో వెంకటసాయి తన మొబైల్ ద్వారా గోడపై నుంచి నగ్న వీడియోలు తీస్తున్నాడు. వైద్యులు, విద్యార్థులు విషయాన్ని గమనించి ఫోన్ లాక్కుని అందులో ఉన్న వీడియోలను డిలీట్ చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంకటసాయిని అదుపులోనికి తీసుకుని, అతని మొబైల్‌ను సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అందులో ఉన్న డిలీటెడ్ డేటా రికవరీ చేసిన వెంటనే ఛార్జిషీటు ఫైల్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆర్ఐ సతీష్ కుమార్ మృతిపై విచారణ వేగవంతం చేయాలి

బీసీ సంఘాల వినతి

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి కేసులో ముఖ్య సాక్షి దర్యాప్తు అధికారి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ అనుమానాస్పద మరణంపై విచారణ వేగవంతం చేయాలని యునైటెడ్ బీసీ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు పావులూరి హనుమంతురావు కోరారు. ఆంధ్రప్రదేశ్ బీసీ పెన్షనర్స్ ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ మాదాసు రంగనాయకులు ఆధ్వర్యంలో గుంటూరులోని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై అనేక దాడులు జరుగుతున్నా కూడా ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. సతీష్ కుమార్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం వెంటనే విచారణ వేగవంతం చేసి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

హాస్టల్ అన్నంలో పురుగులు

- అడిగితే వెళ్లిపోమంటున్నారు
- పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన ప్రత్తిపాడు ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులు
- విచారణ చేపట్టిన ఎస్సీ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య

విచారణ చేస్తున్న డీడీ చెన్నయ్య

ప్రత్తిపాడు: ''అన్నంలో పురుగులు వస్తున్నాయి. తింటే వాంతులవుతున్నాయి. అదేమని అడిగితే మమ్మల్ని హాస్టల్ నుంచి వెళ్లమంటున్నారు'' అంటూ హాస్టల్ విద్యార్థినులు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన ఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో జరిగింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు చెందిన కుంచాల నాగమణి మూడేళ్లుగా ఫిరంగిపురంలో నివాసం ఉంటుంది. ఆమె తన కుమార్తెలు కుంచాల అఖిల (6వ తరగతి), కుంచాల అక్షయ (5వ తరగతి)లను ఈ ఏడాది ప్రత్తిపాడు ఎస్సీ బాలికల వసతి గృహంలో చేర్పించింది. కొద్దిరోజుల కిందట హాస్టల్‌లో పెట్టిన భోజనంలో పురుగులు రావడంతో అఖిల వాంతులు చేసుకుంది. దీంతో ఆమె తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పింది. తోటి పిల్లలు కూడా కొడుతున్నారని, వచ్చి తీసుకుని వెళ్లాలని ఫోన్‌లో రోదించింది. దీంతో ఆదివారం తల్లి నాగమణి హాస్టల్‌కు వచ్చి అఖిలను ఇంటికి తీసుకువెళ్లింది. తిరిగి మంగళవారం హాస్టల్‌కు వచ్చింది. ''మీ పాపను హాస్టల్లో చేర్చుకోం.. మీతో తీసుకువెళ్లిపోండి. మీ పిల్ల వల్ల మిగిలిన వారు ఇబ్బంది పడుతున్నారు. మీ పాప ఆరోగ్యం సరిగా లేదు. మెడికల్ సర్టిఫికెట్ తీసుకుని వస్తేనే చేర్చుకుంటా.' అంటూ వార్డెన్ నాగమణికి చెప్పింది.

స్టేషన్ మెట్లు ఎక్కిన హాస్టల్ విద్యార్థినులు

దీంతో ఏమి చేయాలో పాలుపోని నాగమణి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఎస్ఐ నరహరి ఎదుట వాపోయింది. మిగిలిన పిల్లలు మమ్మల్ని కొడుతున్నారని, మా పుస్తకాలను లాక్కుని బయట పడేస్తున్నారని ఎస్ఐకి పిల్లలు వివరించారు.

హాస్టల్లో డీడీ విచారణ..

హాస్టల్ విద్యార్థినులు స్టేషన్ మెట్లు ఎక్కిన ఘటన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ యు.చెన్నయ్య దృష్టికి వెళ్లడంతో ఆయన రాత్రి హాస్టల్‌కు చేరుకున్నారు. భోజనం, సదుపాయాలను పరిశీలించారు. బాధిత విద్యార్థినులతోపాటు మిగిలిన విద్యార్థినులతో మాట్లాడారు. బాధిత విద్యార్థినులు డీడీ చెన్నయ్య ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం డీడీ మీడియాతో మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఉన్న బియ్యాన్ని మారుస్తామన్నారు.

అన్నంలో పురుగులు.. కూరగాయల్లో ఎలుకలు

- నలుగురు విద్యార్థులకు తీవ్ర అస్వస్థత
- గోరంట్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఘటన
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలో దైన్యం
- పర్యవేక్షణను గాలికొదిలేసిన అధికారులు

చికిత్స పొందుతున్న విద్యార్థినులు

గోరంట్ల: నాసిరకం కూరగాయలు, పురుగుల బియ్యం, తిరుగుతూ పారాడుతున్న ఎలుకలు, వాలుతున్న ఈగలు... చంద్రబాబు సర్కార్ పర్యవేక్షణ లోపం.. గిరిజన సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం... బీసీ సంక్షేమ శాఖ మంత్రి సొంత ఇలాకాలో గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినుల ప్రాణాల మీదకు తెస్తోంది. నాణ్యత లేని సరుకులతో వండిన భోజనం తిని మంగళవారం రాత్రి శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడ పదో తరగతి వరకు 400 మంది చదువుతున్నారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఇటీవల బదిలీ కాగా, హిందూపురం ప్రిన్సిపాల్ తులసికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారు. కొంతకాలంగా రెగ్యులర్ వంట మనిషి లేరు. నైట్ వాచ్ ఉమెన్ వంట చేస్తున్నారు. నిర్వహణ సరిగా లేక శిథిలావస్థలోని వంట గది దుర్వాసన వస్తోంది. అపరిశుభ్రత తాండవిస్తోంది. అయినా, నాసిరకం పదార్థాలతోనే వంట వండి విద్యార్థులకు పెడుతున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన అనంతరం వైష్ణవి (9వ తరగతి), వైష్ణవి (10వ తరగతి), భానుప్రియ (6వ తరగతి), జాహ్నవి (8వ తరగతి) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ సమాచారం ఇవ్వడంతో ఏఎన్ఎం వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అయినా తగ్గకపోవడంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పురుగుల అన్నం.. కుళ్లిన కూరగాయాలతో వండుతున్న ఆహారంపై గతంలోనే తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అధికారుల్లో చలనం రాలేదు. పదుల సంఖ్యలో విద్యార్థినులు విషజ్వరాల బారిన పడ్డారు.

ప్రతి అడవికీ కావాలి నేచర్ గైడ్స్

పాయల్ మెహతా

దేశంలో విస్తారంగా అడవులు ఉన్నాయి. వాటిని తిప్పి చూపే స్థానికులూ ఉన్నారు. కాని వారిని 'గైడ్స్'గా మార్చి, అడవి గురించి వివరించే శిక్షణ ఇవ్వాలి. స్థానికులను 'గైడ్స్'గా మారిస్తే అడవులను తెలుసుకునేందుకు ప్రజలు వస్తారు. పర్యాటక రంగమూ అభివృద్ధి చెందుతుంది... అంటారు పాయల్ మెహతా. దేశంలోనే మొదటి 'నేచర్ గైడ్స్ అకాడెమీ' స్థాపించి వివిధ అడవుల్లో క్యాంప్స్ నిర్వహిస్తూ నేచర్ గైడ్‌లను తయారు చేస్తున్న పాయల్ పరిచయం.

'మన దగ్గర అడవులకు వెళ్లడమంటే అక్కడకు వెళ్లి పిక్నిక్ చేసుకోవడమే. ఫొటోలు తీసుకోవడం, పార్టీ చేసుకోవడం, పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ వినడం అంతే. వీరిలో కేవలం ఏ ఒక్క శాతమో ప్రకృతిని ఆస్వాదించాలనుకుంటారు. ఇక ఎకో టూరిజం పేరుతో అడవుల దాపున ఉన్న రిసార్ట్‌లకు వెళ్లడం ఎలా ప్రకృతిని చూడటమో నాకు అర్థం కాదు. అలాంటి రిసార్టుల్లో లగ్జరీ రూముల్లో ఉండి, స్విమింగ్ పూల్స్‌లో స్నానం చేస్తే ప్రకృతిలో గడిపినట్టా? అడవి నిజమైన సౌందర్యం తెలియాలంటే అడవి గురించి తెలిసిన స్థానికులతో అడవి లోపలికి వెళ్లాలి. అడవితో గడపాలి. అప్పుడు అడవి తెలుస్తుంది. ఆ పని చేయాలంటే ప్రతి అడవికి గైడ్స్ కావాలి. అలాంటి గైడ్స్‌ను మేం తయారు చేస్తున్నాం' అంటారు పాయల్ మెహతా.

గత సంవత్సరం పాయల్ తన భర్త హర్ష.జెతో కలిసి 'నేచర్ గైడ్స్ అకాడెమీ'ని స్థాపించారు. కన్హా నేషనల్ పార్క్ (మధ్యప్రదేశ్‌లో) 18 మందితో కూడిన ఒక బ్యాచ్‌కు శిక్షణ పూర్తి చేశారు కూడా. 'ఇప్పుడు నేచర్ గైడ్స్‌కి మంచి డిమాండ్ ఉంది. ప్రకృతి అంటే ఆసక్తి ఉన్నవారు దీనిని కెరీర్ ఆప్షన్‌గా స్వీకరించవచ్చు' అంటారామె.

ప్రకృతి ప్రేమికురాలు

పాయల్ మెహతా ముంబయి అమ్మాయి. 'నా తల్లిదండ్రులకు ప్రకృతి పట్ల విపరీతమైన ఇష్టం ఉండేది. ఇష్టం అనే కన్నా అదొక అంటువ్యాధి అనొచ్చు. అలా అది నాకు అంటుకుంది. రాత్రిపూట కనిపించే ఆకాశం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు, విరిసే పువ్వులు, మెరిసే మిణుగురులు... చిన్నప్పటి నుంచి నేను ఆసక్తిగా గమనించేదాన్ని. బడిలో నేర్పే ప్రకృతి పాఠాలను సైతం శ్రద్ధగా వినేదాన్ని. అందుకే యుక్త వయసులోనే పర్వతారోహకురాలిగా శిక్షణ పొందాను. భూగర్భ శాస్త్రంపై విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేశాను. గ్రాడ్యుయేషన్ అనంతరం 'భారతీయ సఫారీ గైడ్‌ల కోసం కన్హా నేషనల్ పార్క్‌లో విదేశీ నిపుణులు ఇచ్చిన శిక్షణను పూర్తి చేశాక ఇక నా జీవితం అడవులకే అంకితం అనుకున్నాను' అంటారామె. పాయల్ ఇప్పటికే నేపాల్, భూటాన్, భారతదేశం, శ్రీలంక, బోర్నియోలలో ఎక్స్‌పెడిషన్ లీడర్‌గా వ్యవహరించారు. భర్త హర్ష జె.తో కలిసి ఆమె భారతదేశం అంతటా గైడ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

రెండు ప్రపంచాల మధ్య సాగే ప్రయాణం

'ప్రస్తుతం నా రోజులు రెండు ప్రపంచాల మధ్య సాగుతున్నాయని చెప్పాలి. ఒక ప్రపంచం మనుషులది. మరో ప్రపంచం అడవులది. మనుషులను మనం ఇష్టపడకపోతే వారితో సంభాషణ జరిపి వారికి ప్రకృతి మీద ప్రేమ కలిగించలేం. అంటే ఒక నేచర్ గైడ్‌కు కావాల్సిన మొదటి లక్షణం మనిషిని ప్రేమించడం. ఒక గైడ్‌గా సూర్యోదయానికి ముందే లేచి, అడవి చూద్దామని వచ్చే ప్రకృతి ప్రేమికులతో కలిసి అడవిలోకి వెళ్తాను. అక్కడ పెద్ద, చిన్న జీవుల కోసం వెతుకుతాం. భోజనం పంచుకుంటాం. కొన్నిసార్లు కథలు చెప్పడానికి మంట చుట్టూ గుమిగూడతాం. ఇక్కడితో నా పాత్ర ముగియదు. ఆ ప్రాంత చరిత్ర, పర్యావరణ పరిరక్షణ, పర్యాటక అంశాలపై ఫీల్డ్ సెషన్‌లు నిర్వహిస్తుంటాను. నా పనిలో కీలకమైన, నాకు నచ్చే సమయం అడవిలో ఉండటం, ప్రతిరోజూ అక్కడ కొత్త విషయం నేర్చుకోవడం' అంటారామె.

మంచి గైడ్ ప్రకృతి శాస్త్రవేత్త

'మన దేశంలో టూరిజం పెరిగింది. ఎకో టూరిజం కూడా పెరిగింది. అయితే ఈ టూరిజం ఆపరేటర్లు తమ దారిన, అటవీ శాఖ తమ దారిన, మాలాంటి వాళ్లు ఒక దారిన ఉన్నారు. ఇది కరెక్ట్ కాదు. ఇవాళ బర్డ్ వాచర్స్, నేచురలిస్ట్స్, ఫారెస్ట్ హైకర్స్ అడవులకు వచ్చేందుకు చాలా ఆసక్తి చూపుతున్నారు. వీరికి అడవిని సరిగ్గా చూపే గైడ్స్‌ల కొరత ఉంది. వారికి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పాలి. అలాగే అడవులకు వారిని బాధ్యులను చేయాలి. అంటే వారు తిరుగుతూ అడవిలో ఏదైనా మార్పు కనిపించినా, జంతువులు అపాయంలో ఉన్నా, కార్చిచ్చులు చూసినా వెంటనే అధికారులకు ఇన్‌ఫార్మ్ చేసేలా శిక్షణ ఇవ్వాలి. ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్‌గా కూడా నేచర్ గైడ్స్‌గా పని చేయవచ్చు. యువత ఈ పనిలోకి వచ్చి పర్యావరణాన్ని కాపాడుకోవాలి' అంటున్నారు పాయల్ మెహతా.

● సోషల్ మీడియా

ఇదెక్కడి గోల!

వీడియో వైరలై పేరు రావడం మాట ఎలా ఉన్నా, కొందరి విషయంలో మాత్రం రకరకాల తలనొప్పులు క్యూ కడుతుంటాయి. దీనికి తాజా ఉదాహరణ ప్రియంగన అనే నెటిజెన్.

'ఏ మాయా చేశావో' అనే మాటను ఈ అమ్మాయి విషయంలో వందశాతం వాడవచ్చు. కేవలం రెండు సెకన్ల వీడియో క్లిప్‌తో ఇంటర్నెట్ అబ్సెషన్‌గా మారింది. 'మేకప్ ఈరోజు అదిరిపోయింది' అనే కాప్షన్‌తో 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ రాత్రికి రాత్రే వైరల్ అయింది.

ఈ రెండు సెకన్‌ల సెల్ఫీ వీడియోకు తక్కువ వ్యవధిలోనే 50 మిలియన్‌ల వ్యూస్ రావడం విశేషం.

ఈ అమ్మాయి గురించి వివరాలు పెద్దగా అందుబాటులో లేకపోవడంతో ఆమె హెడ్ బ్యాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 'బందన అమ్మాయి' అని పిలుచుకుంటున్నారు.

'వస్తే గిస్తే 1,000 లైక్‌లు వస్తాయనుకున్నాను. 50 మిలియన్‌ల వ్యూస్ వస్తాయని కలలో కూడా అనుకోలేదు' అంటుంది 365 పార్టీ గర్ల్. తనను తాను '365 పార్టీ గర్ల్'గా పరిచయం చేసుకుంది ప్రియంగన. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 22.9 కె ఫాలోవర్స్ ఉన్నారు. 'ఎక్స్'లో 3,340 ఫాలోవర్స్ ఉన్నారు. వీడియో క్లిప్ పుణ్యమా అని తక్కువ టైమ్‌లోనే ప్రియంగన సెలబ్రిటీగా మారడం మాట ఎలా ఉన్నా, ఆమెకు రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. అందులో ఒకటి... ప్రియంగన ఏఐ జనరేటెడ్ ఇమేజ్, వీడియోలు. దీంతో ఆమె తన సోషల్ మీడియా పోస్ట్‌లను తొలగించడం మొదలుపెట్టింది.

'ఇదే నా లాస్ట్ ట్వీట్'... అంటూ ఇలా విన్నపం చేసింది...

'నా ఏఐ జనరేటెడ్ ఇమేజ్‌లను, వీడియోలను సర్క్యులేట్ చేయడం నాకు, నా కుటుంబ సభ్యులకు చాలా ఇబ్బందిగా ఉంది. సంబంధిత వ్యక్తుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఏఐ ఇమేజ్‌లు, వీడియోలను జనరేట్ చేయడం ఆపండి' అంటోంది ప్రియంగన.

● ప్రేమ కానుక

శ్రీమతికి ఒక బహుమతి

'భార్యకు ప్రేమతో...' అంటూ తాజ్‌మహలే కట్టించనక్కర్లేదు.

ప్రేమే పెద్ద కానుక. విషయంలోకి వస్తే...

కాన్పూర్‌లోని ఓ పాన్‌షాప్ యజమాని అభిషేక్ యాదవ్ రోజూ భార్య పేరు మీద చిల్లర డబ్బులు దాచడం మొదలుపెట్టాడు. సంవత్సరం తరువాత ఆ డబ్బులతో భార్యకు గోల్డ్‌చైన్ కొనిపెట్టాడు. ఆ భార్య సంతోషం ఇంతా అంతా కాదు.

సంపన్నులు తమ భార్యలకు ఇచ్చే గిఫ్ట్‌తో పోల్చితే ఇది చా...లా చిన్న గిఫ్టే కావచ్చు. కానీ సోషల్ మీడియాలో మాత్రం అభిషేక్ గిఫ్ట్ వైరల్‌గా మారింది.

నిజానికి గోల్డ్‌చైన్ కొనడానికి మరిన్ని డబ్బులు కావాల్సి వచ్చింది. అభిషేక్‌కు భార్యపై ఉన్న ప్రేమకు ముచ్చటపడిన నగల షాప్ యజమాని 'ఫరవాలేదు. మిగిలిన డబ్బులు ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లించు' అని చెప్పాడు.

'ప్రతి భర్త తన భార్య కోసం ఇలాంటి సేవింగ్స్ తప్పనిసరిగా చేయాలి'

'అభిషేక్ గురించి చదివిన తరువాత నేను ఈరోజు నుంచే సేవింగ్ మొదలుపెట్టాను. మా పెళ్లి రోజు ఆమెకు గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నాను'.

'ఇలాంటివి కేవలం భార్యకు ఇచ్చే కానుకలు మాత్రమే కాదు, కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు బాగా ఉపయోగపడతాయి'... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి.

● సోషల్ మీడియా

ప్రియమైన కుమారుడికి మీ అమ్మ వ్రాయునది...



తన టీనేజ్ కుమారుడు అదేపనిగా ఫోన్‌లో మునిగిపోవడం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం ఆ తల్లిని బాగా బాధపెట్టింది. మందలిస్తే ఏ అఘాయిత్యానికి పాల్పడతాడోనని భయపడింది. అయితే తన మనసులోని ఆవేదనను మాత్రం ఒక కాగితంపై పెట్టింది. ఆ కాగితం ఆమె నుంచి ఎలా మిస్ అయిందో తెలియదుగానీ ఇటు వెళ్లి అటు వెళ్లి సోషల్ మీడియాకు చేరింది.

తన ఉత్తరంలో టీనేజర్‌ల మితిమీరిన స్క్రీన్ టైమ్ గురించి ఆందోళన వ్యక్తం చేసింది చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌కు చెందిన మహిళ.

చాలా స్కూల్స్‌లో మొబైల్ ఫోన్‌ను అనుమతించనప్పటికీ విద్యార్థులు వాటిని రహస్యంగా వాడుతున్నారు. అధిక స్క్రీన్ టైమ్ వలన వారి చదువు దెబ్బతింటుంది.

చైనాకు చెందిన ఆ తల్లి ఉత్తరంపై 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

'ఇది చైనా తల్లి సమస్య మాత్రమే కాదు ఎన్నో దేశాలలోని తల్లుల సమస్య'

'ఆ తల్లి ఉత్తరాన్ని ఎన్నో దేశాల ప్రజలు చదివి ఉంటారు. ఆమె కుమారుడు కూడా చదివే ఉంటాడు. అతడు మారుతాడని ఆశిద్దాం'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

● బ్యూటిప్

చక్కదనానికి చిట్కాలు

ప్రకృతి ప్రసాదించిన సహజ పదార్థాలను ఉపయోగించి చర్మాన్ని అందంగా, ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు.

ఫేషియల్ స్క్రబ్: ● ఒక టేబుల్ స్పూను చక్కెరలో ఆరు చుక్కల ఆలివ్ అయిల్ కాని కొబ్బరినూనె కాని కలిపి ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి సున్నితంగా మర్దన చేయాలి. శీతకాలంలో మోచేతుల దగ్గర చర్మం గట్టిపడుతూంటుంది, ఇలాంటిచోట్ల కూడా ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం మీద ఉన్న మృతకణాలు తొలగిపోయి చర్మం మృదువుగా, కాంతివంతంగా ఉంటుంది. పాదాలకు కూడా ఇదే పద్ధతి.

● ఒక టేబుల్ స్పూను ఆలివ్ ఆయిల్ లేదా కొబ్బరి నూనెలో అంతే మోతాదులో ఉప్పు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసి మర్దన చేయాలి. చక్కెరకు బదులుగా ఉప్పు వాడినట్లయితే కొన్ని రకాల చర్మ సంబంధ వ్యాధులు కూడా తగ్గుతాయి.

నైట్ క్రీమ్

ఒక నిమ్మచెక్క రసం తీసి అందులో ఒక కప్పు పెరుగు కలిపి ఆ మిశ్రమాన్ని రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసి రాత్రంతా ఉంచుకోవాలి.

● లీగల్

ఒరిజినల్ సర్టిఫికెట్లు వారి దగ్గర ఉంచుకునే అధికారం లేదు

9 నెలల క్రితం ఒక ప్రైవేటు సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగానికి చేరాను. నియామక సమయంలో మూడు సంవత్సరాల పాటు బాండు రాయించుకున్నారు. ట్రెనింగ్ ఇస్తాము అని చెప్పారు కానీ ఒక నెలరోజులు వీడియోలు చూపించి, తర్వాత టీం లీడర్ చెప్పిన పని చేయిస్తున్నారు. దానికి మళ్ళీ టార్గెట్స్ కూడా. రోజుకి 9 గంటల పని వేళలు కాస్తా 12–13 గంటలు చేయవలసి వస్తోంది. జీతం కూడా సరైన సమయానికి ఇవ్వడం లేదు. ఇదేమిటి అని అడిగితే, 10 లక్షల జరిమానా కట్టి రిజైన్ చేయమని అంటున్నారు. నాకు వేరే కంపెనీలో ఉద్యోగాలు చూసుకోవాలి అని ఉంది కానీ ఇదే సాఫ్ట్వేర్ లో నేను ఒక సంవత్సరం పాటు పనిచేయడానికి వీలు లేదు అని కూడా అగ్రిమెంట్‌లో రాసి ఉంది. ఈ టార్చర్ తట్టుకోలేను. ఇప్పుడు నేను మానేస్తే వాళ్ళకి 10 లక్షలు కట్టాలా? ఇలాంటి బాండ్లు చెల్లుతాయా? నా సర్టిఫికెట్లు వాళ్ళ దగ్గిరే ఉన్నాయి.

– రాజ్ కుమార్, హైదరాబాదు

యాజమాన్యాలు ఇలాంటి కాంట్రాక్టులు రాయించుకోవడం చట్టరీత్యా తప్పేమీ కాదు. సాధారణంగా ఒక వ్యక్తిని చట్టబద్ధమైన ఉద్యోగం, వ్యాపారం మొదలైనవి చేసుకోనివ్వకుండా అగ్రిమెంటు అయినా కాంట్రాక్టు అయినా, ఇండియన్ కాంట్రాక్ట్ చట్టం లోని సెక్షన్ 27 ప్రకారం చెల్లవు. మీరు ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నప్పుడు మరొక సంస్థలో కూడా పనిచేస్తాను; సెక్షన్ 27 ప్రకారం నన్ను ఆపడానికి వీల్లేదు అంటే తప్పు కానీ, ఒక ఉద్యోగం మానేసిన తర్వాత మీరు ఫలానా పని చేయడానికి వీల్లేదు అని మీ మీద నిబంధన పెట్టడం కుదరదు. అగ్రిమెంట్‌లో కూడా అసమంజసమైన, అసంబద్ధమైన నిబంధనలు ఉండకూడదు. మీరు పది లక్షలు జరిమానా కట్టాలి అంటే, మీకు నెలకి కనీసం మూడు లక్షల పైన జీతం ఉండి ఉండాలి. కూడా అలా ఉందా? ఎందుకంటే... మీకు కంపెనీ వారు ఇచ్చిన ట్రెనింగ్ విలువ వారు విధించే జరిమానాకి, వారికి జరుగుతుంది అనుకునే నష్టానికి పరిహారం లాగా ఉండాలి తప్ప మీకు శిక్ష విధించే లాగా, కక్ష సాధింపులాగా ఉండకూడదు. ఇకపోతే మీరు అసలు సర్టిఫికెట్లు వాళ్లకి ఎందుకు ఇచ్చారు? ఏ కంపెనీకి, ఏ వ్యవస్థకి కూడా ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసి వారి దగ్గర ఉంచుకునే అధికారం లేదు. వెరిఫికేషన్ కోసం లేదా ధ్రువీకరణ కోసం వారు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి మీకు తిరిగి అందజేయవలసి ఉంటుంది. మీరు మీ సర్టిఫికెట్లను తిరిగి తీసుకోండి. అవసరం అనుకుంటే లీగల్ నోటీసు ఇచ్చి మరీ తీసుకోండి. మీకు వేరే చోట ఉద్యోగం వస్తే ఇక్కడ రిజైన్ చేసి మీ కెరియర్ మీరు చూసుకోండి. అయితే పది లక్షలు కాకుండా ఎంతో కొంత పరిహారం కట్టవలసిన పరిస్థితి వస్తుందా లేదా అనేది మీ అగ్రిమెంట్, ఆఫర్ లెటర్, అపాయింట్‌మెంట్ లెటర్; అన్నీ పరిశీలించిన తర్వాత మాత్రమే చెప్పగలము. ఎవరైనా ఒక న్యాయవాదిని కలిసి మీ పత్రాలను చూపించిన తర్వాత ఇంకా క్షుణ్ణమైన నిర్ణయం తీసుకోవచ్చు. భయపడవలసిన పనేమీ లేదు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

యాత్ర

సైకిల్‌పై కశ్మీర్ టు కన్యాకుమారి

వారు ప్రొఫెషనల్ సైకిలిస్ట్‌లు కాదు. ఎలీట్ అథ్లెట్స్ అంతకంటే కాదు. వారి ఉత్సాహమే వారి అనుభవం అయింది. శక్తిగా మారింది. కేంద్రప్రభుత్వ కార్యక్రమం 'కశ్మీర్ టు కన్యాకుమారి సైకిల్ రైడ్'కు ఎంపికైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన రైడర్స్ నాలుగు వేల కిలోమీటర్‌ల సైకిల్ యాత్ర చేశారు...

సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'సైకిల్ రైడ్' కార్యక్రమం నిర్వహించగా, దేశవ్యాప్తంగా మూడు వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలోనుంచి నూట యాభైమందిని ఎంపిక చేశారు. ఆ ఎంపికైన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుపతిరెడ్డి, వంశీకృష్ణ, గాంధీ, రామారావు, శశికళ, ప్రత్యూత్ అగర్వాల్, నాగరాజు, గోపి ఉన్నారు. పదహారు రోజులలో పది రాష్ట్రాలలో ప్రయాణం చేసి లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రతిరోజు 250 కిలోమీటర్లు సైక్లింగ్ చేసేవారు. ఎవరి సైకిల్ వారే వెంట తెచ్చుకోగా, భోజన వసతులను కేంద్ర ప్రభుత్వం కల్పించింది. సైకిల్ మెకానిక్‌తోపాటు, మూడు వాహనాల కాన్వాయ్ ఉండేది.

కష్టమైనా... ఇష్టంగా...

'కశ్మీర్ టూ కన్యాకుమారి యాత్ర మర్చిపోలేని అనుభూతినిచ్చింది. నవంబర్ 1న కశ్మీర్‌లో యాత్ర మొదలుపెట్టాం. పది రాష్ట్రాలు దాటుతూ నవంబర్ 16న సైకిల్ యాత్ర పూర్తి చేశాం. ఆసియాలో అతికష్టమైన, పెద్దదయిన సైక్లింగ్ రూట్ ఇది. 2023 నవంబర్‌లో కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైక్లింగ్ రైడ్ చేయాలని ఏర్పాట్లు చేసుకున్నాను. కానీ యాక్సిడెంట్‌లో గాయపడటంతో చేయలేకపోయాను' అంటున్నాడు గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికుడు వెంకట తిరుపతిరెడ్డి.

అనారోగ్య సమస్యలు వచ్చినా...

'నాలుగు వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేయడం ఇదే మొదటి సారి. కొన్ని అనారోగ్య సమస్యలు వచ్చినా ఆగిపోవాలనిపించలేదు. సుదీర్ఘ సైకిల్ యాత్ర చేయాలనే నా లక్ష్యం ఇంత తొందరగా నెరవేరుతుందని అనుకోలేదు' అంటున్నాడు హైదరాబాద్‌లోని బోయినపల్లికి చెందిన వంశీకృష్ణ.

భవిష్యత్‌లో మరిన్ని యాత్రలు

'గతంలో హెచ్‌సీజీ (హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్) తరపున సైకిల్ యాత్రలో పాల్గొన్నాను. కశ్మీర్ టూ కన్యాకుమారి వెళ్లాం. అన్ని రాష్ట్రాల్లో మంచి ఆదరణ లభించింది. భవిష్యత్‌లో మరిన్ని సైకిల్ యాత్రలు చేస్తాను' అంటున్నాడు హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన జన్ని గాంధీ.

యువతలో స్ఫూర్తి కోసం...

'చలి ప్రాంతంలో మొదలై ఉష్ణ ప్రాంతానికి వచ్చాం. అన్ని రకాల వాతావరణాన్ని తట్టుకున్నాం. యువతకు స్ఫూర్తి కల్పించాలనే ఆలోచనతో సైకిల్ యాత్రలో పాల్గొన్నాను. సెల్‌ఫోన్‌తో గంటల తరబడి సమయాన్ని వృథా చేసే బదులు ఇలాంటి సైకిల్ యాత్రలు చేస్తే మంచిది. సైకిల్ రైడింగ్ వల్ల కాలుష్యం తగ్గుతుంది' అంటున్నాడు వరంగల్‌లోని కొత్తవాడకు చెందిన ఎ.రామారావు.

ప్రత్యూత్ అగర్వాల్

కశ్మీర్ అందాలు కళ్లారా...

'జీవితంలో మర్చిపోలేని అనుభూతిని మిగిల్చిన సైకిల్ యాత్ర ఇది. ఎన్నో రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు పరిశీలిస్తూ ముందుకెళ్లాం. అన్నిటికన్నా కశ్మీర్ అందాలు కళ్లారా చూడటం చాలా సంతోషంగా ఉంది' అంటున్నాడు ములుగు జిల్లాకు చెందిన అంగోతు నాగరాజు.

అనారోగ్య సమస్యలు దూరం అయ్యాయి...

స్ట్రెస్ రిలీఫ్ కోసం సైకిల్ రైడింగ్ చేస్తుండేదాన్ని. రెండు కిలోమీటర్లు, ఏడు కిలోమీటర్లతో సైకిల్ రైడింగ్ మొదలుపెట్టాను. నాలుగు వేల కిలోమీటర్లు పాల్గొనడం జీవితంలో ఇదే మొదటిసారి. ఇతర సైక్లింగ్ రైడర్‌లతో మాట్లాడి అనేక కొత్త విషయాలు తెలుసుకున్నాను. ఈ సైకిల్ యాత్ర వలన బరువు తగ్గాను. అనారోగ్య సమస్యలు దూరం అయ్యాయి.

– శశికళ పొన్నుస్వామి, గృహిణి, హైదరాబాద్

రేగళ్ల గోపి

ప్రతిరోజూ సాహసమే..

'మహారాష్ట్రలో రోడ్లు సరిగా లేవు. జైపూర్, ఢిల్లీ రోడ్లు బిజీగా ఉంటాయి. ప్రాణాలతో చెలగాటమాడుతూ రైడింగ్ ప్రతిరోజు కత్తిమీద సాములాగే నడిచింది. ప్రతిరోజు ఐదుగంటలే నిద్రపోయాం' అంటున్నాడు ఖమ్మంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రేగళ్ల గోపి. 'తమిళనాడులో రోడ్లు చాలా బాగున్నాయి. ఉదయ్‌పూర్ నుంచి గోద్రా దారి వెంట ప్రకృతి అందాలు మర్చిపోలేనివి' అంటున్నాడు హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన ప్రత్యూత్ అగర్వాల్.

– కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, సాక్షి, గోదావరిఖని

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) నవంబర్ 25న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,26,810	1,25,650	1,27,040	1,29,230	1,25,900	1,27,850
బంగారం (22 క్యారెట్లు)	1,13,110	1,15,180	1,16,450	1,19,940	1,15,830	1,17,200
వెండి	1,61,500	1,56,620	1,74,000	1,61,000	1,61,600	1,74,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్
బుధవారం
26-11-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
314	75
84,587	25,885

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,901	▲	29
డోజోన్స్	46,968	▲	519
ఎఫ్‌టీఎస్ఈ 100	9,612	▲	78
డాక్స్	23,452	▲	212
షాంఘై	3,870	▲	33
నికాయ్	48,659	▲	33

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.65	89.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.40	118.36
€	యూరో	ఎస్‌బీఐ	101.40	104.13
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.22	57.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.26	58.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.26	69.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.91	24.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.40	24.41
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.72	13.54

టాటా సియెరా రీఎంట్రీ..

- ధర రూ. 11.49 లక్షల నుంచి ప్రారంభం
- డిసెంబర్ 16 నుంచి బుకింగ్స్
- డెలివరీలు జనవరి 15 నుంచి షురూ

ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ తమ సియెరా కారును సరికొత్త రూపంలో తిరిగి మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) సెగ్మెంట్లో హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారాలాంటి మోడల్స్‌తో పోటీపడనుంది. సియెరా ధర రూ. 11.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. మూడు ఇంజిన్ ఆప్షన్లలో (రెండు పెట్రోల్, ఒకటి డీజిల్) లభిస్తుంది. బుకింగ్స్ డిసెంబర్ 16 నుంచి, డెలివరీలు జనవరి 15 నుంచి ప్రారంభమవుతాయి. వచ్చే ఆర్థిక సం

వత్సరంలో ఎలక్ట్రిక్ వెర్షన్‌ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. గతంలో ఎంతో ప్రాచుర్యం పొందిన సియెరాని జెన్ వై, జెన్ జెడ్ తరం వారికి కూడా ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు. దీన్ని మిడ్–సైజ్ సెగ్మెంట్ వాహనంగా విక్రయించనున్నట్లు వివరించారు. దీనితో తమ కంపెనీ మొత్తం కార్ల విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 70 శాతానికి చేరుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇది 65–70 శాతం మధ్యలో ఉంటోందన్నారు. జీఎస్‌టీ 2.0 తర్వాత కాంపాక్ట్ ఎస్‌యూవీ, సబ్–కాంపాక్ట్ ఎస్‌యూవీల సెగ్మెంట్లతో పాటు హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాల పరిమాణం గణనీయంగా పెరిగినట్లు చంద్ర పేర్కొన్నారు. ప్యాసింజర్ వాహనాల పరిశ్రమ 2 నెలల్లో 5 శాతం, 17 శాతం వృద్ధి చెందినట్లు తెలిపారు.

250 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో మహీంద్రా

ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం మహీంద్రా గ్రూప్ భారీ స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉంది. 2027 ఆఖరు నాటికి తమ చార్జ్–ఇన్ అల్ట్రాఫాస్ట్ నెట్‌వర్క్ కింద ఒక్కొక్కటి 180 కిలోవాట్ల సామర్థ్యం గల 250 చార్జింగ్ స్టేషన్లను, 1,000 పైగా

చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. దేశీయంగా ఈవీల చార్జింగ్ మౌలిక సదుపాయాలను పటిష్టం చేసేందుకు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ఇవి తోడ్పడగలవని సంస్థ తెలిపింది. చార్జ్–ఇన్ స్టేషన్లను కీలకమైన హైవే కారిడార్లలు, కస్టమర్ల రద్దీ ఎక్కువగా ఉండే పాయింట్లలోనూ ఏర్పాటు చేయనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా సీఈవో (ఆటోమోటివ్ విభాగం) నళినికాంత్ గొల్లగుంట తెలిపారు. ఇప్పటికే రెండింటిని నెలకొల్పినట్లు వివరించారు. తమ మీ4యూ యాప్ ద్వారా చార్జింగ్ స్టేషన్లను కనుగొనవచ్చని తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత వృద్ధి అంచనాలకు బూస్ట్
డెట్ ఫండ్స్‌కు పెట్టుబడుల కళ

సిల్వర్ ఈటీఎఫ్‌ల మెరుపులు

1,800 టన్నులకు వెండి హోల్డింగ్స్

- గత 18 నెలల్లో భారీగా కొనుగోలు
- 2024 ముగింపుకంటే 51% అప్
- వెండి కొనుగోళ్లకు టాప్–2లో భారత్
- బంగారం వినియోగంలో చైనాతో పోటాపోటీ

అలుపెరుగకుండా పరుగుతీస్తున్న బంగారం బాటలోనే వెండిలో కూడా పెట్టుబడులు చేపట్టేందుకు మూడేళ్ల క్రితం దేశీయంగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ప్రొడక్టు (ఈటీపీ)లకు తెరతీశారు. వీటిలో ఈటీఎఫ్‌లు ప్రధాన భాగం. దీంతో 2022లో వెండి ఈటీఎఫ్‌లు ఊపిరిపోసుకున్నాయి. తొలి దశలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అంతగా ఆసక్తి చూపకపోయినప్పటికీ ఏడాదిన్నర కాలంగా ఇవి జోరందుకున్నాయి. దీంతో 2007లోనే ప్రారంభమైన పసిడి ఈటీఎఫ్‌లను వెనక్కి నెడుతూ వెండి ఈటీఎఫ్‌లు భారీస్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయి. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

ప్రపంచంలోనే అత్యంత విలువైన లోహాలు బంగారం, వెండిలో పెట్టుబడులకు వీలుగా రూపొందించిన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు)కు ఆదరణ పెరుగుతోంది. ప్రపంచ దేశాలలో బంగారం వినియోగంలో భారత్, చైనాలు టాప్ ర్యాంకులో నిలుస్తుంటే.. వస్తురూపేణా (ఫిజికల్) వెండి కొనుగోళ్లకు సైతం భారత్ రెండో ర్యాంకులో నిలుస్తోంది. దేశీయంగా ఇటీవల ఈటీఎఫ్‌ల ప్రవేశంతో ప్రధానంగా వెండిలో పెట్టుబడులు అధికమయ్యాయి. పసిడి ధరల ర్యాలీతో పోలిస్తే కొద్ది నెలలుగా వెండి వెనుకబాటు దీనికి కారణమైనట్లు బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇటీవల కొద్ది నెలలుగా సౌర విద్యుదుత్పత్తితోపాటు.. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహన తయారీ, వినియోగానికి పెరుగుతున్న డిమాండ్ వెండి ధరలకు జోష్నివ్వనున్న అంచనాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు తెలియజేశాయి. ఫలితంగా ఇటీవల వెండిలో ఫిజికల్ కొనుగోళ్లు, ఈటీఎఫ్‌ల ద్వారా పెట్టుబడులు ప్రవహిస్తున్నట్లు వివరించాయి.

200 శాతం జూమ్

2022తో పోలిస్తే సిల్వర్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 200 శాతం దూసుకెళ్లాయి. న్యూయార్క్ సిల్వర్ ఇన్‌స్టిట్యూట్ వివరాల ప్రకారం ఈ కాలంలో దేశీ ఇన్వెస్టర్ల హోల్డింగ్స్ 18 రెట్లు ఎగశాయి. ఈ బాటలో గత 18 నెలల్లో పెట్టుబడులు భారీగా జంప్‌చేశాయి. తాజాగా వెండి హోల్డింగ్స్ 5.8 కోట్ల ఔన్సలు (1,800 టన్నులు)ను దాటాయి. 2024 చివరితో పోలిస్తే ఇది 51 శాతం అధికం!

పెట్టుబడుల దూకుడు

మూడేళ్ల క్రితం(2022 తొలి త్రైమాసికం) వెండి ఈటీఎఫ్‌లు ప్రవేశపెట్టినప్పుడు హోల్డింగ్స్ 2.1 మిలియన్ ఔన్సలు (65 టన్నులు) మాత్రమే. తదుపరి పెట్టుబడులు ఊపందుకోవడంతో 2024 చివరి క్వార్టర్‌కల్లా 3.8 కోట్ల ఔన్సల (1,183 టన్నులు)కు చేరాయి. ఇది వార్షికంగా 200 శాతం వృద్ధికాగా.. ఒక్క 2024లోనే 2.51 కోట్ల ఔన్సల (782 టన్నులు) పెట్టుబడులు జత కలిశాయి. ఆపై వెండి ఈటీఎఫ్‌లు మరింత జోరందుకున్నాయి.

పసిడి వెనుకడుగు

వెండి ఈటీఎఫ్‌లతో పోలిస్తే ఇన్వెస్టర్లు పసిడి ఈటీఎఫ్‌లలో పెట్టుబడులకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు బంగారం కాయిన్లు, ఆభరణాల(ఫిజికల్) కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభావం చూపుతోంది. ఫలితంగా 2007లో ప్రారంభమైన గోల్డ్ ఈటీఎఫ్‌ల హోల్డింగ్స్ 2 మిలియన్ ఔన్సల(64 టన్నులు)కు చేరినట్లు తెలియజేశాయి. 2024లో గోల్డ్ ఈటీఎఫ్‌లలో కేవలం 0.5 మిలియన్ ఔన్సలు(15 టన్నులు) జమయ్యాయి. అయితే 2024కల్లా గత నాలుగేళ్ల కాలంలో ఇవి 27.4 టన్నుల నుంచి 54.5 టన్నులకు పుంజుకున్నాయి. 2025లో కొనుగోళ్లు మరింత పెరిగాయి. కాగా.. ఈ ఏడాది(2025)లో ఇప్పటివరకూ వెండి ధరలు 75 శాతం దూసుకెళ్లగా.. పసిడి 55 శాతం బలపడిన విషయం విదితమే.

పసిడి రూ. 3,500 జూమ్

- ఢిల్లీలో రూ. 1,28,900కి గోల్డ్
- వెండి కూడా రూ. 5,800 అప్

న్యూఢిల్లీ: పసిడి ధరలు మరోసారి పరుగు తీశాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో మంగళవారం 99.9% స్వచ్ఛత గల పది గ్రాముల బంగారం ధర రూ. 3,500 పెరిగి రూ. 1,28,900కి చేరింది. వెండి ధర కూడా కిలోకి రూ. 5,800 పెరిగి రూ. 1,60,800కి చేరింది. మరోవైపు, ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో డిసెంబర్ డెలివరీ పసిడి కాంట్రాక్టు ధర రూ. 1,458 ఎగిసి ఒక దశలో రూ. 1,25,312 వద్ద ట్రేడయ్యింది. వెండి కూడా రూ. 2,583 మేర ఎగిసి రూ. 1,57,065 వద్ద ట్రేడయ్యింది.

న్యూయార్క్ కామెక్స్‌లో పసిడి డిసెంబర్ కాంట్రాక్టు ధర ఔన్సుకి (31.1 గ్రాములు) 47.8 డాలర్లు పెరిగి 4,142 డాలర్ల స్థాయిని తాకింది. సిల్వర్ ఫ్యూచర్స్ రేటు 1.94 శాతం పెరిగి 51.30 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ రైట్స్ ఇష్యూ

షేరుకి రూ. 1,800 ధరలో షురూ • రూ. 24,930 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ రైట్స్ ఇష్యూ ప్రారంభమైంది. షేరుకి రూ. 1,800 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 24,930 కోట్లకుపైగా సమీకరించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా 13.85 కోట్ల షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా దేశీయంగా అతిపెద్ద రైట్స్ ఇష్యూలలో ఒకటిగా నిలవనుంది. రైట్స్‌కు అనుమతించిన ధరతో పోలిస్తే 24 శాతం డిస్కౌంట్‌లో వీటిని జారీ చేయనుంది. డిసెంబర్ 10న ఇష్యూ ముగియనుంది. రైట్స్‌లో భాగంగా వాటాదారులవద్దగల ప్రతీ 25 షేర్లకుగాను 3 షేర్లు ఆఫర్ చేస్తోంది. ప్రమోటర్లుసహా వాటాదారులందరికీ ఆఫర్ వర్తిస్తుంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లవాటా 74 శాతం కాగా.. వాటాదారులు తొలుత ఒక్కో షేరుకి రైట్స్ ధరలో 50 శాతం(రూ. 900) చొప్పున చెల్లించవలసి ఉంటుంది. మిగిలిన రూ. 900 తదుపరి రెండు దశలలో చెల్లించవలసి ఉంటుంది.

రైట్స్ ప్రారంభం నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 2,334 వద్ద ముగిసింది.

మూడో రోజూ మార్కెట్లు డీలా

314 పాయింట్లు డౌన్

- 84,587 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ 75 పాయింట్ల క్షీణత

ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు వెనకడుగు వేశాయి. మరోసారి చివరి అర్ధగంటలో అమ్మకాలు ఊపందుకోవడంతో ప్రధాన ఇండెక్సులు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 314 పాయింట్లు తక్కువగా 84,587 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 75 పాయింట్లు నీరసించి 25,885 వద్ద స్థిరపడింది. అయితే మార్కెట్లు తొలుత సానుకూలంగా ప్రారంభంకావడంతో సెన్సెక్స్ 204 పాయింట్లు ఎగసి 85,100 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 73 పాయింట్లు బలపడి 26,033కు చేరింది. వరుసగా మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,045 పాయింట్లు, నిఫ్టీ 307 పాయింట్లు చొప్పున కోల్పోవడం గమనార్హం!

ఐటీ, ఆటో షేర్లు వీక్

ఎన్‌ఎస్‌ఈలో ఐటీ, కన్జూమర్ డ్యురబుల్స్ రంగాలు బలహీనపడగా.. రియల్టీ, పీఎస్‌యూ బ్యాంక్స్ 1.5% చొప్పున బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, టీఎంపీవీ, ట్రెంట్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా కన్జూమర్ 3–1% నష్టపోయాయి. అయితే బీఈఎల్, హిందాల్కో, ఎస్‌బీఐ, శ్రీరామ్ ఫైనాన్స్, డాక్టర్ రెడ్డీస్ 1.6–1% మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

మార్కెట్లు నీరసించినప్పటికీ బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.2 శాతం చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 2,160 నష్టపోగా.. 2,026 బలపడ్డాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ.785 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 3,912 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి. సోమవారం ఎఫ్‌పీఐలు రూ. 4,172 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోగా.. దేశీ ఫండ్స్ రూ. 4,513 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

సాక్షి సినిమా

భీమవరం బల్మా

• మీనాక్షీ చౌదరి, నవీన్ పొలిశెట్టి

'జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి సినిమాలతో ప్రేక్షకులకు తనదైన శైలిలో వినోదం పంచిన నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న తాజా కామెడీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా 2026 జనవరి 14న విడుదల కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'భీమవరం బల్మా...' అంటూ సాగే పాటని ఈ నెల 27న విడుదల చేయనున్నారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. నవీన్ పొలిశెట్టి నుంచి ప్రేక్షకులు ఆశించే వినోదంతో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు మారి. మిక్కీ జె. మేయర్ చక్కని సంగీతం అందించారు. ఈ మూవీలోని 'భీమవరం బల్మా...' అంటూ సాగే పాట విడుదల వేడుకని భీమవరంలోని ఎస్‌కేఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సాయంత్రం నిర్వహిస్తున్నాం'' అని యూనిట్ తెలిపింది.

అప్పట్నుంచి థియేటర్స్‌కు వెళ్లడం మానేశాను

– ఉపేంద్ర

''మొదట్లో నా జీవితంలో బర్త్ డే సెలబ్రేషన్స్ లేవు. ఎప్పుడైతే నేను సినిమాల్లోకి వచ్చానో నా బర్త్ డేని నా ఫ్యాన్స్ సెలబ్రేట్ చేయడం స్టార్ట్ చేశారు. వాళ్లే వస్తారు... కటౌట్స్ పెడతారు... కేక్ కట్ చేస్తారు. లక్షల్లో ఖర్చు పెడతారు. ఇలా ప్రతి ఏడాది సెప్టెంబరు 18న జరుగుతుంది. అందుకే ఆ రోజుని నేను నా బర్త్ డే అని కాకుండా ఫ్యాన్స్ డే అని డిక్లేర్ చేశాను'' అని ఉపేంద్ర చెప్పారు. రామ్, భాగ్యశ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా ఉపేంద్ర ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యేర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమాలో సినీ సూపర్‌స్టార్ సూర్యగా ఉపేంద్ర, ఆయన అభిమాని సాగర్‌గా రామ్ నటించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో ఉపేంద్ర పంచుకున్న విశేషాలు.

- 'ఆంధ్ర కింగ్ తాలూకా' కథను ఒక ప్రేక్షకుడిలా విన్నాను. ఈ సినిమాలో చూపించినది అందరి జీవితంలో జరిగే ఉంటుంది. అందుకే ఈ చిత్రానికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. ఇందులో నేను సూర్యకుమార్ అనే సూపర్ స్టార్ పాత్రలో కనిపిస్తాను. అందరి సూపర్ స్టార్స్ జీవితాల్లో ఉన్నట్లే ఫ్యాన్స్, కెరీర్‌లో అప్స్ అండ్ డౌన్స్... వంటివి సూర్య కెరీర్‌లోనూ ఉంటాయి. ఒక స్టార్‌ని ఆయన ఫ్యాన్స్ ఎందుకు అంత గొప్పగా ఆరాధిస్తారో, ఎందుకు అంత ప్యూర్‌గా ప్రేమిస్తారో లాజిక్ దొరకదు. కొన్నిసార్లు అనిపిస్తుంది వారి ప్రేమకు మేము అర్హులమా? అని.
- ఈ చిత్రంలో రామ్‌గారి పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటుంది. ఇంట్రవెల్ సీన్‌కి థియేటర్‌లో ఆడియన్స్ గూస్‌బంప్స్ ఫీలవుతారు. ధనిక, పేద వర్గాల మధ్య ఉండే తారతమ్యాలు, ప్రేమ, భావోద్వేగాలు వంటివి కమర్షియల్‌గా చక్కగా చూపించారు దర్శకుడు మహేశ్‌బాబు. నిజ జీవితంలో ఓ యాక్టర్‌గా నా ఫ్యాన్స్‌కి ఏదైనా చెప్పాలనే కోరిక నాకు ఉంటుంది. ఆ చాన్స్ నాకు ఈ సినిమాతో లభించిందని అనుకుంటున్నాను.
- 'ఏ' సినిమా చూద్దామని థియేటర్‌కి వెళ్లాను. ఫస్ట్ డేనే నా సినిమాకు అంతమంది జనాలు వస్తారని నేను ఊహించలేదు. సినిమా చూడకుండా నన్ను చూస్తూ, ఫ్యాన్స్ కేరింతలు కొట్టారు. ఆ తర్వాత అందరూ థియేటర్ నుంచి బయటకు వచ్చారు. డిఫికల్ట్ స్క్రీన్‌ప్లే ఉన్న 'ఏ'ను చూడకుండా ఆడియన్స్ అందరూ బయటకు వచ్చారేంటి? అనుకున్నాను. అందరూ నన్ను చుట్టు ముట్టడంతో పోలీసులు వచ్చి అక్కడ్నుంచి నన్ను తీసుకుని వెళ్లారు. నేను థియేటర్‌కి వెళితే ఆ సినిమా స్క్రీనింగ్ డిస్టర్బ్ అవుతుందేమోనని అప్పట్నుంచి థియేటర్స్‌కు వెళ్లడం లేదు.
- ఒక ఫిల్మ్ మేకర్‌కు సంతృప్తి ఉండదు. ప్రేక్షకులకు ఇంకా ఏదైనా కొత్తగా చెప్పాలనే ఆకాంక్ష ఉంటుంది. నా సినిమాల గురించి ఆడియన్స్ చర్చించుకోవాలని, డీ కోడ్ చేయాలని నా సినిమా టైటిల్స్‌ను కొత్తగా ప్రయత్నిస్తుంటాను. 'ఏ, ఓం, సూపర్, యూఐ' టైటిల్స్ ఇలా వచ్చినవే. ఇక స్క్రిప్ట్ సిద్ధమైన వెంటనే నా దర్శకత్వంలోని సినిమాను ప్రకటిస్తాను. చిరంజీవిగారితో సినిమా చేయడం నా డ్రీమ్. ఆయనతో సినిమా చేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. నేను ఓ లీడ్ రోల్ చేసిన '45' సినిమా డిసెంబరులో రిలీజ్ అవుతుంది.

ఆస్కార్ బరిలో...


• 'మహావతార్ నరసింహ' పోస్టర్

యానిమేషన్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచింది. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ మైథలాజికల్ యాక్షన్ ఫిల్మ్ ఈ ఏడాది జూలైలో థియేటర్స్‌లో విడుదలై, ప్రేక్షకులను మెప్పించి, బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు రూ. 40 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా రూ. 300 కోట్లకు పైనే వసూలు చేసింది. తాజాగా ఆస్కార్ అకాడమీ దృష్టిలో నిలిచింది. వచ్చే ఏడాది మార్చి 15న అమెరికాలో 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానం జరగనుంది. ఇందులో భాగంగా బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్, బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్, బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగాల్లో ఆస్కార్ అవార్డుల నామినేషన్ ఎంట్రీ పోటీకి అర్హత సాధించిన చిత్రాల జాబితాను అకాడమీ విడుదల చేసింది. బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్ విభాగంలో భారతీయ యానిమేషన్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ'కు చోటు దక్కింది. అలాగే బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో హిందీ చిత్రం 'హోమ్ బౌండ్'కూ చోటు దక్కింది. కాగా యానిమేషన్ విభాగంలో 'కె–పాప్: డెమాన్ హంటర్స్, డెమాన్ స్లేయర్: ఇన్ఫినిటీ కాజిల్, ది బ్యాడ్ గైస్ 2, జుటోపియా 2' వంటి చిత్రాలు 'మహావతార్ నరసింహ'కు గట్టి పోటీని ఇస్తున్నాయి. అలాగే బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారతీయ చిత్రం 'హోమ్ బౌండ్' (భారత దేశం తరపున ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీగా పంపబడిన సినిమా) తో పాటు మరో 85 చిత్రాలు ఆస్కార్ పరిశీలన జాబితాలో ఉన్నాయి. ఇక ఆస్కార్ నామినేషన్స్‌కు అర్హత సాధించిన షార్ట్ లిస్ట్ జాబితాను ఈ డిసెంబరు 16న నిర్ణయిస్తారు. అయితే ఈ జాబితాను వచ్చే ఏడాది జనవరి 22న ప్రకటిస్తారు. ఒకవేళ 'మహావతార్ నరసింహ'కు నామినేషన్ దక్కితే యానిమేషన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఆ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్రంగా ఈ మూవీ నిలుస్తుందనే వార్తలు ఉన్నాయి.

సందీప్ రెడ్డి మెచ్చుకోవడం ఆనందం

– కృష్ణ బూరుగుల

''జిగ్రీస్' సినిమాలో నాది రగ్డ్, చిచోరే పాత్ర. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగారు మా సినిమా చూసి, చాలా బాగా చేశావని నన్ను అభినందించడం హ్యాపీగా అనిపించింది. అలాగే యూత్ నా పాత్రకు కనెక్ట్ అవడం ఒక నటుడిగా నాకు ఉత్సాహాన్నిచ్చింది'' అని హీరో కృష్ణ బూరుగుల తెలిపారు. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వంలో కృష్ణ బూరుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా కృష్ణ బూరుగుల మాట్లాడుతూ– ''గతంలో 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ఆడిషన్స్‌కి వెళ్లాను... ఓ ప్రమాదంలో నాకు చెయ్యి విరిగినప్పటికీ ఆడిషన్స్‌లో పాల్గొనడంతో ఓ చిన్న పాత్ర చేసే అవకాశం వచ్చింది. అయితే అది ఎడిటింగ్‌లో పోయింది. కానీ ఆ ఆడిషన్స్, అప్పటి నా పరిస్థితి... ఇవన్నీ నాలో తెలియని నమ్మకాన్ని పెంచి, ఎనర్జీ ఇచ్చాయి. రవిబాబుగారు డైరెక్ట్ చేసిన 'క్రష్' హీరోగా నా తొలి చిత్రం. ఆ తర్వాత 'మా నాన్న నక్సలైట్', 'కృష్ణమ్మ' సినిమాలతో పాటు 'ఏటీఎం' వెబ్ సిరీస్ చేశాను. త్వరలోనే నా కొత్త సినిమాను ఆరంభిస్తాను'' అని పేర్కొన్నారు.

ద్రౌపది దేవిగా...

• రక్షణ ఇందుచూడన్

రిచర్డ్ రిషి హీరోగా రూపొందుతోన్న చిత్రం 'ద్రౌపది 2'. మోహన్ .జి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రక్షణ ఇందుచూడన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నేతాజి ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై సోల చక్రవర్తి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రక్షణ ఇందుచూడన్ పోషిస్తున్న ద్రౌపది దేవి పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ''వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న చిత్రం 'ద్రౌపది 2'. ద్రౌపది దేవిగా రక్షణ ఇందుచూడన్ గాంభీర్యంగా, ఎంతో హుందాగా కనిపిస్తారు. అంతేకాదు... ఆమె కట్టుబొట్టూ, ఆహార్యం ప్రేక్షకుల్ని మెప్పించేలా ఉంటాయి. భారీ బడ్జెట్‌తో రాజీ పడకుండా ఈ సినిమాని గొప్పగా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలో అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గిబ్రాన్ వైబోధ, కెమెరా: ఫిలిప్ ఆర్. సుందర్.

డిసెంబరులో ఫిక్స్

• మేఘనా రాజ్‌పుత్

'రక్త కన్నీరు' సినిమా ఫేమ్, దివంగత నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్, 'బిగ్ బాస్' ఫేమ్ రోహిత్ సహాని హీరోలుగా, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిస్ టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో జై వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమాని డిసెంబరు 12న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది యూనిట్. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ– ''ఒక కొత్త స్క్రీన్‌ప్లేతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మిస్ టీరియస్'. మా సినిమా ప్రేక్షకుడిని ఒక కొత్త అనుభూతికి లోను చేసేలా ఉంటుంది'' అని తెలిపారు. ''మా సినిమాని 150 థియేటర్స్‌లో విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం'' అని జై వల్లందాస్ చెప్పారు. ''రాజీ పడకుండా ఈ చిత్రం నిర్మించాం'' అన్నారు సహ నిర్మాతలు ఉషా, శివాని. ఈ చిత్రానికి పాటలు–సంగీతం: ఎంఎల్ రాజా, కెమెరా–ఎడిటింగ్: పరవస్తు దేవేంద్ర సూరి (దేవా).

యాక్షన్... కామెడీ

• అర్జున్ అశోకన్

అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ, ఇషాన్ షౌకత్, విశాఖ్ నాయర్, పూజా మోహన్‌దాస్ ప్రధాన పాత్రలు పోషించిన మలయాళ చిత్రం 'చతా పచా–రింగ్ ఆఫ్ రౌడీస్'. ఈ చిత్రానికి అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించారు. రీల్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ (ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లెన్స్‌మాన్ గ్రూప్) సంస్థ నిర్మించింది. రమేశ్, రితేష్ రామకృష్ణన్, షిహాన్ షౌకత్, ఎస్. జార్జ్, సునీల్ సింగ్ ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వాములు. 2026 జనవరిలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని మలయాళంలో దుల్కర్ సల్మాన్ నేతృత్వంలోని వేఫేరర్ ఫిల్మ్స్ రిలీజ్ చేయనుంది. తెలుగు విడుదల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) హక్కులను మైత్రీ మూవీ మేకర్స్ సొంతం చేసుకుంది. ''మలయాళంలో పూర్తి నిడివితో రూపొందిన తొలి డబ్ల్యూడబ్ల్యూఈ–జానర్ యాక్షన్ కామెడీ చిత్రం 'చతా పచా–రింగ్ ఆఫ్ రౌడీస్'. ఫోర్ట్ కొచ్చిలోని డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లింగ్ క్లబ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చేలా ఉంటుంది. ఈ చిత్రం నార్త్ థియేట్రికల్ హక్కులను ధర్మ ప్రొడక్షన్స్ సొంతం చేసుకుంది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ తమిళనాడు, కర్ణాటకలో రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రం మలయాళ, తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో 115 కంటే ఎక్కువ దేశాల్లో విడుదలవుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో

రైల్వే గ్రూప్-డి ఉచిత స్టడీ మెటీరియల్స్!

నవంబర్ 27, 2025 నుంచి జనవరి 16, 2026 వరకు జరగనున్న ఆర్ఆర్‌బీ గ్రూప్-డి పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుభవార్త. సాక్షిఎడ్యుకేషన్.కామ్ వెబ్‌సైట్‌లో గ్రూప్-డి పరీక్షా సిలబస్, సబ్జెక్టుల వారీగా స్టడీ మెటీరియల్స్, బిట్ బ్యాంకులు, గత ప్రశ్నాపత్రాలు, రోజువారీ కరెంట్ అఫైర్స్ బిట్ బ్యాంక్ ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ స్టడీ మెటీరియల్స్‌ను నేరుగా చదువుకోవచ్చు.

‘డిజిటల్ టెక్నాలజీస్ ఆవిష్కరణల కారణంగా ఒక్క సాఫ్ట్‌వేర్ రంగంలోనే అవకాశాలు లభిస్తాయని.. ఐటీలో సైతం కొన్ని ప్రొఫైల్స్ మరుగున పడతాయనే వాదనలో వాస్తవం లేదు. విద్యార్థులు ఆసక్తితో నిరంతర కృషి చేస్తే.. అన్ని రంగాల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయి’ అని అంటున్నారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ -హైదరాబాద్(ఐఐటీ-హైదరాబాద్) డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి. ఏఐతో ఉద్యోగాలకు ముప్పు, జాబ్ మార్కెట్ అవకాశాలు, విద్యార్థులు నేర్చుకోవాల్సిన నైపుణ్యాలు, విదేశీ విద్య తదితర అంశాలపై ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తితో ప్రత్యేక ఇంటర్వ్యూ..

అన్ని రంగాల్లోనూ అవకాశాలు

విద్యార్థులు ఆసక్తి, నిరంతర కృషి పెంచుకోవాలి

కోర్ ఇంజనీరింగ్‌లోనూ డిజిటల్ టెక్నాలజీస్

వీటిని అందిపుచ్చుకునేలా కదలాలి

ఐఐటీ - హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి

ప్రొఫెసర్. బి.ఎస్. మూర్తి

కోర్ బ్రాంచ్‌లతో పోల్చితే సీఎస్ఈ వారికే ఎక్కువ అవకాశాలు అంటున్నారు?

ఇది కరెక్ట్ కాదు. సీఎస్ఈ విద్యార్థులు ప్రోగ్రామింగ్, కోడింగ్‌లలో నైపుణ్యవంతులుగా మారుతున్నారు. కానీ.. కోర్ బ్రాంచ్‌ల వారు 20 శాతం మేరకు ఏఐ టూల్స్, ఇతర డిజిటల్ టెక్నాలజీస్ నేర్చుకుంటే.. వారికి కోర్‌తోపాటు టెక్నికల్ నైపుణ్యాలు కూడా లభిస్తాయి. భవిష్యత్తులో మల్టీ డిసిప్లినరీల్లో పని చేసే సామర్థ్యం కూడా లభిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కోర్ బ్రాంచ్‌ల వారు ఆశావాహ దృక్పథం అలవర్చుకోవాలి.

క్వాంటం కంప్యూటింగ్ విస్తరణ, అవకాశాలు ఎలా ఉండబోతున్నాయి?

గత కొంత కాలంగా క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు క్రమేణా పెరుగుతున్నాయి. దీంతో ఈ రంగంలో నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో పలు ఇన్‌స్టిట్యూట్‌లు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సులను అందిస్తున్నాయి. గతంలో పీహెచ్‌డీ స్థాయిలోనే ఈ కోర్సు ఉండేది. యూజీ, పీజీ స్థాయిలోనూ ప్రవేశ పెట్టడం ఫలితంగా ఈ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందంజలో నిలుస్తారనడంలో సందేహం లేదు.

జాబ్ మార్కెట్‌లో ప్రస్తుతం ఏయే రంగాల్లో ఉద్యోగావకాశాలు అభిలషణీయంగా ఉన్నాయి?

ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి అన్ని రంగాల్లోనూ ఇప్పుడు అవకాశాలు ఉన్నాయి. సివిల్, మెకానికల్, మెటలర్జీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్.. ఇలా అన్ని కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు స్వాగతం పలుకుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పాలసీల కారణంగా అన్ని రంగాల్లోనూ కార్యకలాపాలు, విస్తరణలు పెరిగి అవకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థులు తమకు అర్హత ఉన్న రంగంలో కొత్త నైపుణ్యాలను సొంతం చేసుకునేలా అడుగులు వేయాలి.

దేశంలో రీసెర్చ్‌కు ఎలాంటి అవకాశాలున్నాయి?

రీసెర్చ్.. అనేది ఎవర్‌గ్రీన్ అంశం. ప్రభుత్వం కూడా ఈ దిశగా పలు చర్యలు, ప్రోత్సాహకాలు చేపడుతోంది. ఉదాహరణకు ఏఐ రీసెర్చ్‌లకు సంబంధించి సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ప్రారంభిస్తూ నిర్ణయం తీసుకుంది. అదే విధంగా సెమీ కండక్టర్ పాలసీ, క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి క్వాంటం మిషన్‌ను ప్రారంభించింది. అదే విధంగా డీఎస్‌టీ ఆధ్వర్యంలోనూ పలు రీసెర్చ్ అవకాశాలున్నాయి. వీటి ద్వారా ఔత్సాహికులు పలు రీసెర్చ్ కార్యకలాపాలు చేపట్టి.. కొత్త ఆవిష్కరణలకు అవకాశం లభిస్తోంది. ఇన్నోవేషన్స్‌పై ఆసక్తి ఉన్న వారు ఈ దిశగా అడుగులు వేస్తే.. ఉన్నతంగా రాణించే అవకాశం ఉంది.

యూఎస్‌లో ఉన్నత విద్య, విదేశీయులపై ఆంక్షలు మనకు మేలేనా?

ఒక రకంగా ఇది మన దేశానికి మేలు చేస్తుందనే చెప్పొచ్చు. మన విద్యార్థులు మన దగ్గరే ఉండి వారి నైపుణ్యాలను ఇక్కడే ఉపయోగించే అవకాశం లభిస్తుంది. ఇది మన దేశ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. వాస్తవానికి పాత తరం ఐఐటీ క్యాంపస్‌ల నుంచి విదేశాలకు వెళుతున్న వారి సంఖ్య 5 శాతం కూడా ఉండడం లేదు. ఐఐటీ హైదరాబాద్‌లోనైతే ఈ సంఖ్య 3 శాతం మాత్రమే. దీనికి కారణం.. ఈ విద్యార్థులకు ఇక్కడి అవకాశాలపై అవగాహన ఉండడమే.

విద్యార్థులకు మీరిచ్చే సలహా?

ఏ పనిలోనైనా.. దాన్ని సాధించాలనే ఆసక్తి, ఉత్సుకత పెంపొందించుకోవాలి. అప్పుడే ఫలితం రావడం కొంత జాప్యమైనా.. ఎలాంటి నిరాశ లేకుండా అడుగులు వేసే సంసిద్ధత లభిస్తుంది. సహజ నైపుణ్యాలు, వ్యక్తిగత ఆసక్తి మేరకు అడుగులు వేసి.. తమ రంగంలోని ఆధునిక పరిస్థితులు, టెక్నాలజీస్‌పై అవగాహన ఏర్పరచుకుంటే.. కోర్ బ్రాంచ్‌లైనా.. కంప్యూటర్ విద్యార్థులకైనా.. విజయం లభించడం ఖాయం.

ఏఐ కారణంగా లక్షల ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందనే అంచనాలపై మీ అభిప్రాయం?

ఇది వాస్తవం కాదు. కంప్యూటర్స్, సాఫ్ట్‌వేర్ టూల్స్ అందుబాటులోకి వచ్చిన కొత్తలో కూడా ఇదే విధమైన భావనతో ఎందరో ఆందోళన చెందారు. కానీ.. ఇప్పుడు చూడండి.. సాఫ్ట్‌వేర్ రంగంలో లక్షల్లో కొలువులు లభిస్తున్న విషయం తెలిసిందే. కొత్త వాటిని స్వీకరించేందుకు మానసికంగా సన్నద్ధం కాకపోవడమే ఆందోళనకు కారణం. ఏఐ కారణంగా మరిన్ని కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని గుర్తించాలి. ఆశావాహ దృక్పథంతో అడుగులు వేస్తూ అవసరమైన నైపుణ్యాలు పొందితే..ఎలాంటి కొత్త టెక్నాలజీ వచ్చినా ఉద్యోగాలకు ముప్పు ఉండదు.

ఏఐను ఒక బబుల్‌గా పేర్కొంటూ.. ఆ బుడగ పేలుతుందని హెచ్చరిస్తున్నారు కదా?

మానవ మేధస్సుకు, ఆలోచన శక్తికి ఫుల్‌స్టాప్ పెట్టి.. అంతా ఏఐతోనే కానిద్దాం అనుకుంటే ఈ పరిస్థితి తలెత్తుతుంది. ఏఐని కేవలం డేటా కలెక్షన్ టూల్‌గా భావించి.. నిర్ణయాలు మాత్రం మానవ మేధస్సును ఉపయోగించి తీసుకోవాలి. అప్పుడు ఈ ప్రమాదం ఉండదు. వాస్తవానికి ఏఐ టూల్స్ ఇప్పుడు డేటా రీకలెక్షన్ టూల్స్‌గా ఉన్న విషయాన్ని గుర్తించాలి. ఏదైనా ఒక సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు పాత డేటాను పరిశీలించి.. గతంలో ఇదే సమస్యకు ఎలాంటి పరిష్కారం కనుగొన్నారు.. దాని వల్ల కలిగిన ఫలితం, దాని ప్రభావాలను తెలుసుకోవాలి. వాటి ఆధారంగా.. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోవచ్చు అని స్వీయ ఆలోచన, నిర్ణయాత్మక సామర్థ్యాలను ఉపయోగించాలి. దీనికి భిన్నంగా ఏఐ డేటా ఆధారంగా గత పరిష్కారాన్నే.. ప్రస్తుత సమస్యకు కూడా వర్తింపజేద్దాం అనుకుంటే పొరపాట్లు తలెత్తి వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది.

ప్రవాస భారతీయ నిపుణులను దేశంలోని విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీగా నియమించే ప్రణాళికపై మీ అభిప్రాయం?

ఇది ఆహ్వానించదగ్గ నిర్ణయం. ఎందుకంటే.. విదేశాల్లో ముఖ్యంగా యూఎస్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో విదేశాల్లో స్థిరపడిన మన దేశ నిపుణులను ఫ్యాకల్టీగా నియమించడం వల్ల మన విద్యార్థులకు విస్తృత పరిజ్ఞానం లభిస్తుంది. ఇతర రంగాల్లో వీరిని నియమించుకునే అంశం.. ఇండస్ట్రీ వర్గాల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

జాబ్ స్కిల్స్

ఏఐ ప్రవేశంతో జాబ్ మార్కెట్ ఎన్నడూ లేనంత వేగంగా మారిపోతోంది. ఈ ఏడాది పలు ప్రత్యేక స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ఆఫర్‌లు భారీగా లభించినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2025 ముగింపు దశకు చేరుకుంటోంది. ఈ ఏడాది టాప్‌లో నిలిచిన నైపుణ్యాలు కొత్త సంవత్సరంలోనూ కొలువులు ఖాయం చేయనున్నాయి. ఆ స్కిల్స్ ఏంటి, వాటికున్న డిమాండ్ గురించి తెలుసుకుందాం..

నేటి మేటి నైపుణ్యాలివే!

జనరేటివ్ ఏఐ/ ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్

జనరేటివ్ ఏఐ.. 2025 జాబ్ మార్కెట్‌లో హాట్ కేక్ మాదిరిగా బాగా వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా చాట్ జీపీటీ, కోపైలెట్ వంటి వాటిని ఉపయోగించి ఏఐ టూల్స్‌ను రూపొందించడం ముఖ్యమైన నైపుణ్యంగా మారింది. ఎందుకంటే.. ప్రపంచ వ్యాప్తంగా అనేక కంపెనీలు తమ పనివిధానాల్లో ఏఐ వినియోగాన్ని పెంచుతున్నాయి. దీంతో ఏఐ నిర్వహణ మాత్రమే కాకుండా ఏఐని ఉపయోగించి కొత్త టూల్స్‌ను నిర్మించగలిగే ప్రతిభావంతులకు బాగా డిమాండ్ పెరిగింది. ఇండియా స్కిల్ రిపోర్ట్-2025, ఇండియాస్ ఫ్యూచర్ ఆఫ్ వర్క్ రెడినెస్ నివేదికల్లో టాప్‌లో నిలిచిన నైపుణ్యం ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్.

డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్

నేటి పోటీ ప్రపంచంలో బిజినెస్ వ్యూహాలు రూపొందించేందుకు, ప్రధానమైన వ్యాపార నిర్ణయాలు తీసుకునేందుకు డేటా కీలకంగా మారింది. దీంతో డేటా విశ్లేషణ నైపుణ్యాలున్న వారికి భారీగా డిమాండ్ పెరిగింది. ఫలితంగా స్టాటిస్టికల్ అనాలసిస్, డేటా విశ్లేషణ ఆధారంగా వ్యాపార సమస్యను స్పష్టంగా, లోతుగా అవగాహన చేసుకొని దృశ్య రూపం(గ్రాఫ్‌లు, చార్టులు)లో ప్రదర్శించగలిగే నైపుణ్యం ఉన్న నిపుణులకు కంపెనీలు ఎర్ర తివాచీ పరుస్తున్నాయి. పైథాన్, ఎస్‌క్యూఎల్, డేటా స్టోరీటెల్లింగ్, డేటా విజువలైజేషన్‌పై పట్టుతో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

క్లౌడ్ కంప్యూటింగ్

క్లౌడ్ కంప్యూటింగ్.. ఇంటర్నెట్ ద్వారా సర్వర్లు, డేటాబేస్‌లు, నెట్‌వర్కింగ్, సాఫ్ట్‌వేర్ వంటి సేవలను అందిస్తుంది. ఇది క్లౌడ్ అని పిలిచే ఆన్‌లైన్ నిల్వ స్థలం ద్వారా జరుగుతుంది. దీనిద్వారా వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే ఎక్కడి నుంచైనా ఫైల్‌లు, అప్లికేషన్లను యాక్సెస్ చేసుకోవచ్చు. ఇటీవల ఖర్చు తగ్గించుకునేందుకు అనేక సంస్థలు క్లౌడ్ విధానానికి మారుతున్నాయి. దీంతో ఈ క్లౌడ్ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన నైపుణ్యాలున్న నిపుణులకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. ఏడబ్ల్యూఎస్ నైపుణ్యం, అజ్యూర్, గూగుల్ క్లౌడ్‌పై పట్టు ముఖ్యంగా ఆర్కిటెక్చర్, మైగ్రేషన్, హైబ్రిడ్ క్లౌడ్‌పై అవగాహన ఉన్న వారికి కంపెనీలు మంచి ఆఫర్లు ఇస్తున్నాయి. దీంతోపాటు క్లౌడ్ సెక్యూరిటీ, డెవ్‌అప్స్, సర్వర్‌లెస్ కంప్యూటింగ్ కీలకంగా మారుతున్నాయి.

సైబర్ సెక్యూరిటీ

ఆన్‌లైన్ కార్యకలాపాలు, డిజిటల్ డేటా పెరుగుతున్న కొద్దీ సైబర్ దాడుల ముప్పు రెట్టింపవుతోంది. వ్యక్తుల నుంచి వ్యవస్థల వరకూ సైబర్ దాడుల బారిన పడి రూ.కోట్లలో నష్టపోతున్నారు. దీంతో గతంలో ఎన్నడూలేనంతగా సైబర్‌సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. 2025లో టాప్ టెక్నికల్ స్కిల్‌గా సైబర్ సెక్యూరిటీ నిలిచింది. ఈ రంగంలో కొలువు సొంతం చేసుకునేందుకు ఎథికల్ హ్యాకింగ్, రిస్క్ అసెస్‌మెంట్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ నైపుణ్యాలుండాలి.

డిజిటల్ మార్కెటింగ్

నేటి ఈ కామర్స్ ప్రపంచంలో ఆన్‌లైన్‌లో వినియోగదారులను ఆకట్టుకునే విధానమే డిజిటల్ మార్కెటింగ్. ఇంటర్నెట్ ద్వారా వస్తు సేవలకు ప్రచారం కల్పించే విధానం ఇది. ఏఐ ఆధారిత మార్కెటింగ్‌గా రూపాంతరం చెందుతోంది. దీంతో డిజిటల్ మార్కెటింగ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ విభాగంలో కెరీర్ అవకాశాలు సొంతం చేసుకునేందుకు ఎస్ఈవో (సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్), కంటెంట్ మార్కెటింగ్, ఏఐ అసిస్టెడ్ కాపీ రైటింగ్, మార్కెటింగ్ అనలిటిక్స్ స్కిల్స్ కీలకంగా మారుతున్నాయి.

సాఫ్ట్‌స్కిల్స్ ముఖ్యమే

టెక్నికల్ నైపుణ్యాలతోపాటు క్లిష్ట సమస్యలను విశ్లేషించగలిగే నైపుణ్యాలు, వ్యూహాత్మకంగా ఆలోచించడం, ఇన్నోవేటివ్ థింకింగ్ ఉన్న వారు అత్యంత విలువైన మానవ వనరులుగా కంపెనీలు పరిగణిస్తున్నట్లు తాజా సర్వేలు పేర్కొంటున్నాయి. దీంతోపాటు నేర్చుకోవాలనే ఆసక్తి, తపన, మార్పులను వేగంగా ఆకళింపు చేసుకోవడం, పరిస్థితులకు తగ్గట్లు తమను తాము మలచుకునే నేర్పు, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కలిగి ఉండాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. టెక్నికల్ స్కిల్స్‌పై పట్టుతోపాటు టెక్నాలజీ, ఆటోమేషన్, ఏఐ, డిజిటలైజేషన్, ఎమర్జింగ్ టెక్నాలజీపట్ల సౌకర్యవంతంగా ఉండే మానవ వనరులు కావాలని భావిస్తున్నాయి. అలాగే సోషల్ స్కిల్స్, సహానుభూతి (ఎంపతీ) వంటివి పని ప్రదేశాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్, గుడ్‌గావ్‌లో 252 అప్రెంటిస్‌లు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్)లిమిటెడ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 252.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-146, డిప్లొమా అప్రెంటిస్-49, ట్రేడ్(ఐటీఐ) అప్రెంటిస్‌లు-57.
- **విభాగాలు:** సివిల్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, మెకానికల్, కెమికల్, మెటలర్జీ, ఫైనాన్స్, హెచ్ఆర్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.14,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,000, ఐటీఐ(ట్రేడ్) అప్రెంటిస్‌కు రూ.10,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.12.2025.
- **వెబ్‌సైట్:** https://www.rites.com/

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో..

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంఫార్మసీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
- **ఫెలోషిప్:** నెలకు రూ.30,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.11.2025.
- **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

మిథాని, హైదరాబాద్‌లో 210 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిథాని) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 210.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-30, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్-20, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్-160.
- **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, ఏపీ మెకానిక్, వెల్డర్, సీవోపీఏ, ఫోటోగ్రాఫర్, ప్లంబర్, కార్పెంటర్, మెటలార్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, గ్రాడ్యుయేట్, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, టెక్నీషియన్‌కు రూ.10,900, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9,600.
- **ఎంపిక విధానం:** మార్కులు, సర్టిఫికేట్ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తు హార్డ్‌కాపీలను అడిషనల్ జనరల్ మేనేజర్, ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, మిథాని, కాంచన్‌బాగ్, హైదరాబాద్ చిరునామాకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.12.2025.
- **వెబ్‌సైట్:** https://midhaniindia.in

ఆర్ఆర్‌సీ-సౌత్ ఈస్ట్రన్ రైల్వేలో 1,785 యాక్ట్ అప్రెంటిస్‌లు

కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- సౌత్ ఈస్టర్న్ రైల్వే ఎస్ఈఆర్ పరిధిలోని డివిజన్‌లో ఉన్న వర్క్‌షాప్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,785.
- **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ ఏసీ మెకానిక్, లైన్ మ్యాన్ తదితరాలు.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.01.2026 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.12.2025.
- **వెబ్‌సైట్:** https://www.rrcser.co.in

ఫిబ్రవరి 15న పాక్‌తో భారత్ పోరు

2026 టి20 ప్రపంచకప్ టోర్నీ షెడ్యూల్ విడుదల

తొలి మ్యాచ్‌లో అమెరికాతో ఆడనున్న టీమిండియా ● మార్చి 8న ఫైనల్

ముంబై: భారత్, పాకిస్తాన్ మధ్య మరోసారి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టోర్నీలో పోరుకు రంగం సిద్ధమైంది. 2026 టి20 వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో టీమిండియా తలపడుతుంది. మార్చి 8న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌తో వరల్డ్ కప్ ముగుస్తుంది. ఈ మెగా టోర్నీ పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ చైర్మన్ జై షా విడుదల చేశారు. డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టు హోదాలో భారత్ ఫిబ్రవరి 7న ముంబైలో జరిగే టోర్నీ తొలి పోరులో అమెరికాతో తలపడుతుంది. అనంతరం ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో... ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌తో భారత్ లీగ్ దశను ముగిస్తుంది. గత టోర్నీ తరహాలోనే మొత్తం 20 జట్లు బరిలోకి దిగుతున్నాయి. మొత్తం 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, అమెరికాతో పాటు నెదర్లాండ్స్, నమీబియా ఉన్నాయి. లీగ్ దశ తర్వాత తమ గ్రూప్‌లలో అగ్రస్థానంలో నిలిచిన రెండేసి జట్లు తర్వాతి దశ 'సూపర్–8'కు అర్హత సాధిస్తాయి. 'సూపర్–8'కు చేరిన 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఒక్కో గ్రూప్‌లో 4 జట్లు ఉంటాయి. 'సూపర్–8' మ్యాచ్‌ల తర్వాత రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మార్చి 3న తొలి సెమీఫైనల్... మార్చి 5న రెండో సెమీఫైనల్ జరుగుతుంది. మార్చి 8న జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది.

ఎనిమిది వేదికలు ఖరారు...

టి20 వరల్డ్ కప్‌లో భాగంగా మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి. మొత్తం 8 వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్‌లో అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నైలలో మ్యాచ్‌లు నిర్వహించనుండగా... శ్రీలంకలో కొలంబో (ప్రేమదాస), కొలంబో (ఎస్ఎస్‌సీ), పల్లెకెలెలను వేదికలుగా నిర్ణయించారు. గతంలోనే ఐసీసీ స్పష్టం చేసినట్లుగా పాక్ జట్టు తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడనుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లకు కోల్‌కతా, ముంబై వేదికలు కాగా... ఒకవేళ పాక్ సెమీస్ చేరితే ఆ జట్టు తమ సెమీఫైనల్‌ను కోల్‌కతాలో కాకుండా కొలంబోలోనే ఆడుతుంది. పాక్ ఫైనల్ చేరినా ఇదే వర్తిస్తుంది. భారత్, పాక్ ఏ దశలో తలపడినా...ఆ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే నిర్వహిస్తారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మ...

భారత మాజీ కెప్టెన్, 2 టి20 ప్రపంచకప్‌ల విజేత రోహిత్ శర్మను ఐసీసీ 2026 టి20 వరల్డ్ కప్ ప్రచారకర్తగా నియమించింది. తన కొత్త పాత్ర పట్ల రోహిత్ సంతోషం వ్యక్తం చేశాడు. 'ఆటగాడిగా కొనసాగుతున్న సమయంలో ఇలా ఎవరినీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించలేదని తెలిసింది. నాకు దక్కిన ఈ గౌరవం పట్ల ఆనందంగా ఉన్నా. 9 వరల్డ్ కప్‌లు ఆడిన తర్వాత ఆటగాడిగా మైదానంలో కాకుండా ప్రేక్షకుడిగా భారత్ ఆడే టి20 మ్యాచ్‌లను చూడటం కొత్తగా అనిపించడం ఖాయం' అని రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా, భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పాల్గొన్నారు.

గ్రూప్‌ల వివరాలు

గ్రూప్ 'ఎ': భారత్, పాకిస్తాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా. **గ్రూప్ 'బి':** ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్.
గ్రూప్ 'సి': ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ. **గ్రూప్ 'డి':** దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్, కెనడా, యూఏఈ.

పుష్కర కాలం పాటు సొంతగడ్డపై టెస్టు సిరీస్ ఓడిపోని జట్టు ఇప్పుడు 12 నెలల వ్యవధిలో రెండో సిరీస్ పరాజయానికి చేరువైంది. స్వదేశీ పిచ్‌లపై పరుగుల వరద పారించి ప్రత్యర్థికి సవాల్ విసిరే టీమ్ ఇప్పుడు సరిగ్గా దానికి వ్యతిరేక దిశలో పరువు కోసం పోరాడుతోంది. టెస్టులో చివరి రోజు ఒక్కో బంతి గండంలా కనిపిస్తుంటే... మ్యాచ్‌ను కాపాడుకునేందుకు విదేశీ జట్లు పడిన పాట్లు ఎన్నో చూశాం. ఇప్పుడు మన జట్టు సరిగ్గా అలాగే కనిపిస్తోంది. అవతలి వైపు బౌలర్లు చెలరేగిపోతుంటే ఎనిమిది వికెట్లతో రోజంతా నిలిచి బేలగా 'డ్రా' కోసం ఆడాల్సిన స్థితిలో టీమిండియా నిలిచింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 549 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం ఏ రకంగానూ సాధ్యం కాదు కాబట్టి సిరీస్ ఓటమి అనేది ఖాయమైపోయింది. ఇక తేడా 0–1తోనా లేక 0–2తోనే అని తేలడమే మిగిలింది! ఏదైనా అద్భుతం జరిగి ఓటమి నుంచి తప్పించుకుంటారేమో అనే ఆశ ఉన్నా... ఈ సిరీస్‌లో భారత్ ఆట చూస్తే అలాంటి నమ్మకం కూడా కనిపించడం లేదు.

మరో పరాభవం పిలుస్తోంది!

రెండో టెస్టులో ఓటమి దిశగా భారత్

- లక్ష్యం 549... ప్రస్తుతం 27/2
- చేతిలో 8 వికెట్లతో 'డ్రా' కోసం పోరాటం
- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 260/5 డిక్లేర్డ్


స్టబ్స్
యశస్వి జైస్వాల్
టోనీ జోర్జి, యాన్సెన్

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లోనూ భారత్ ఓటమి దిశగా పయనిస్తోంది. 549 పరుగుల అసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 15.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (13), కేఎల్ రాహుల్ (6) అవుట్ కాగా... ప్రస్తుతం సాయి సుదర్శన్ (2 బ్యాటింగ్), కుల్దీప్ యాదవ్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఆఖరి రోజు భారత్ మరో 522 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 26/0తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌ను 78.3 ఓవర్లలో 5 వికెట్లకు 260 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (180 బంతుల్లో 94; 9 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... టోనీ జోర్జి (68 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో జడేజాకు 4 వికెట్లు దక్కాయి. మంగళవారం ఆటలో జడేజాకు వికెట్లు దక్కిన తీరు, ఆ తర్వాత హార్మర్ బౌలింగ్‌లో రాహుల్ బౌల్డ్ అయిన బంతిని చూస్తే చివరి రోజు పిచ్‌పై అనూహ్యమైన టర్న్ ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇలాంటి స్థితిలో మన బ్యాటర్లు రోజంతా నిలవడం కూడా అసాధ్యం కావచ్చు. స్థానిక వాతావరణ పరిస్థితిని బట్టి 80 ఓవర్ల ఆట మాత్రమే జరిగే అవకాశం ఉంది.

కీలక భాగస్వామ్యాలు...

ఓవరాల్‌గా 314 పరుగుల ఆధిక్యం ఉన్నా... దక్షిణాఫ్రికా వేగంగా ఆడి డిక్లేర్ చేసే ప్రయత్నం చేయలేదు. సాధారణ టెస్టు ఇన్నింగ్స్ తరహాలోనే బ్యాటర్లు పట్టుదలగా క్రీజ్‌లో నిలిచి జాగ్రత్తగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు జోడించారు. ఫలితంగా ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు నమోదయ్యాయి. తొలి వికెట్‌కు 59 పరుగులు జోడించిన తర్వాత ఓపెనర్లు రికెల్టన్ (64 బంతుల్లో 35; 4 ఫోర్లు), మార్క్‌రమ్ (84 బంతుల్లో 29; 3 ఫోర్లు)లను తక్కువ వ్యవధిలో వెనక్కి పంపించగా, బవుమా (3)ను సుందర్ లెగ్ స్లిప్ ఉచ్చులో పడేశాడు. అయితే స్టబ్స్, జోర్జి కలిసి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి భాగస్వామ్యం 27 ఓవర్ల పాటు సాగింది. 129 బంతుల్లో స్టబ్స్ అర్ధ సెంచరీని చేరుకోగా, జడేజా బౌలింగ్‌లో స్వీప్ చేసే ప్రయత్నంలో జోర్జి అర్ధసెంచరీ కోల్పోయాడు. లంచ్ విరామ సమయానికే దక్షిణాఫ్రికా ఆధిక్యం 508 పరుగులకు చేరింది. అయినా సరే ఆ జట్టు డిక్లేర్ చేసేందుకు ఆసక్తి చూపించలేదు. విరామం తర్వాత స్టబ్స్ జోరు పెంచాడు. తాను ఆడిన తర్వాతి 24 బంతుల్లో 34 పరుగులు రాబట్టిన అతను సెంచరీకి చేరువయ్యాడు. అయితే జడేజా ఓవర్లో సిక్స్ బాది 94కు చేరిన అతను మరో సిక్స్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. దాంతో బవుమా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

అదే తడబాటు...

రెండో ఇన్నింగ్స్‌ను జైస్వాల్ కొంత ధాటిగా మొదలు పెట్టినా, రాహుల్ వికెట్ కాపాడుకునేందుకే ప్రాధాన్యతనిచ్చాడు. అయితే మరోసారి యాన్సెన్ చక్కటి బంతితో జైస్వాల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టగా... హార్మర్ స్పిన్‌కు రాహుల్ స్టంప్ కూలింది. తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక బంతులు ఆడిన భారత బ్యాటర్ కుల్దీప్ ఈసారి కూడా డిఫెన్స్ ఆడే పాత్రను పోషిస్తూ 22 బంతులు సమర్థంగా ఎదుర్కొన్నాడు. సాయి, కుల్దీప్ కలిసి 39 బంతులు ఆడి మరో వికెట్ పడకుండా రోజును ముగించారు. దక్షిణాఫ్రికా ఆలస్యంగా డిక్లేర్ చేసినట్లు అనిపించినా... జట్టు తీసిన 2 వికెట్లు వారి నిర్ణయాన్ని సరైందిగా నిరూపించాయి.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 201; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికెల్టన్ (సి) సిరాజ్ (బి) జడేజా 35; మార్క్‌రమ్ (బి) జడేజా 29; స్టబ్స్ (బి) జడేజా 94; బవుమా (సి) నితీశ్ (బి) సుందర్ 3; జోర్జి (ఎల్బీ) (బి) జడేజా 49; ముల్డర్ (నాటౌట్) 35; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (78.3 ఓవర్లలో 5 వికెట్లకు డిక్లేర్డ్) 260.** **వికెట్ల పతనం:** 1–59, 2–74, 3–77, 4–178, 5–260. **బౌలింగ్:** బుమ్రా 6–0–22–0, సిరాజ్ 5–1–19–0, జడేజా 28.3–3–62–4, కుల్దీప్ 12–0–48–0, సుందర్ 22–2–67–1, జైస్వాల్ 1–0–9–0, నితీశ్ రెడ్డి 4–0–24–0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13; రాహుల్ (బి) హార్మర్ 6; సుదర్శన్ (బ్యాటింగ్) 2; కుల్దీప్ (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (15.5 ఓవర్లలో 2 వికెట్లకు) 27.** **వికెట్ల పతనం:** 1–17, 2–21. **బౌలింగ్:** యాన్సెన్ 5–2–14–1, ముల్డర్ 4–1–6–0, హార్మర్ 3.5–2–1–1, మహరాజ్ 3–1–5–0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తుల గడువు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు(రెట్రోఫిటెడ్ మోటారైజ్డ్ వెహికల్స్) మంజూరు కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 30 వరకు పొడిగించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవిప్రకాశ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు గడువులోగా www.apdascac.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏపీలోనూ నంది అవార్డులు

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

మంత్రులు దుర్గేష్, సుభాష్

మలికిపురం: ఉత్తమ తెలుగు చిత్రాలకు రాష్ట్రంలోనూ నంది అవార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో మంగళవారం 'రాజీ... నో కాంప్రమైజ్' సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో మరో మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నంది అవార్డుల ప్రదానం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికే చర్చలు జరిపారన్నారు. అలాగే నంది నాటకోత్సవాల నిర్వహణ కూడా చేపడతామన్నారు. కార్మిక శాఖా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, సినిమాలతో పాటు కార్మికుల అన్ని ప్రయోజనాలూ కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

చిన్నారులకూ హెల్మెట్ తప్పనిసరి

శివాజీనగర: ద్విచక్ర వాహనాలపై చిన్న పిల్లల్ని కూర్చోబెట్టుకుని ప్రయాణిస్తున్నప్పుడు వారికి హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాద తీవ్రత పెరగవచ్చు. ఈ నేపథ్యంలో కర్ణాటక హైకోర్టు కొన్ని ముఖ్య సూచనలు చేసింది. పిల్లలతో వెళ్లేటప్పుడు గరిష్ట వేగ పరిమితి, పిల్లలకు కూడా హెల్మెట్ తప్పనిసరి చేయడం గురించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఇటీవలే కోర్టు ఈ ఆదేశాలివ్వగా ప్రభుత్వం వాటిని అమలు పరిచేందుకు సిద్ధమైంది.

ఇళ్ల లెక్క.. తిక్క తిక్క

పేదల ఇళ్లపై సీఎం ఒకలా... మంత్రి మరోలా

మూడేళ్లలో 17 లక్షలకుపైగా ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు

ఐదేళ్లలో 15 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం అని మంత్రి కొలుసు వెల్లడి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల పాలనలో పేదలకు గజం స్థలం ఇవ్వలేదు. ఒక్క ఇల్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో మంజూరు చేసి నిర్మించిన 3 లక్షల ఇళ్లను మేమే కట్టేశామని గొప్పలకు పోయిన చంద్రబాబు సర్కారు నవ్వులపాలైంది. పైగా, లక్షల్లో ఇళ్లు నిర్మిస్తామని డాబుసరి ప్రకటనలిస్తున్నారు. అందులోనూ గందరగోళమే. పేదల ఇళ్ల నిర్మాణంపై సీఎం ఒకలా, ఆయన మంత్రివర్గంలోని గృహ నిర్మాణ శాఖ మంత్రి మరోలా ప్రకటనలు చేసి అభాసుపాలయ్యారు. వచ్చే మూడేళ్లలో 17 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించేస్తామని ఈ నెల 21న గృహ నిర్మాణ శాఖపై సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు గొప్పగా ప్రకటించారు. ఈ ప్రకటన చేసి జస్ట్ నాలుగు రోజులయిందో లేదో.. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం మీడియా ముందుకు వచ్చి ఐదేళ్లలో 15.59 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు, మంత్రి పార్థసారథి చేసిన భిన్న ప్రకటనలు పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేమికి అద్దం పడుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

అసలైతే అంతా బూటకమే!

పేదల ఇళ్ల నిర్మాణంలో వాస్తవాల్లోకి వెళితే సీఎం, మంత్రి ఇరువురి ప్రకటనలు బూటకమేనని స్పష్టం అవుతుంది. రాష్ట్రంలోని పేదలందరి సొంతింటి కల సాకారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద 31.19 లక్షల మంది పేద అక్కచెల్లెమ్మలకు వైఎస్ జగన్ ఉచితంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అంతే కాకుండా 21.75 లక్షల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కరోనా సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూ రికార్డు స్థాయిలో 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. గతేడాది జూన్ నాటికి నిర్మాణం పూర్తయిన, తుది దశలో నిర్మాణంలో ఉన్న 3 లక్షల ఇళ్లకు స్టేజ్ అప్‌డేట్ చేసేసి తామే కట్టేశామని బాబు ప్రచారం చేసుకున్నారు. ఆనాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసి, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లనే పూర్తి చేసినట్టు కలరింగ్ ఇవ్వాలని ఇప్పుడు బాబు సర్కార్ స్కెచ్ వేసుకుంది. అంతే తప్ప కొత్తగా నిర్మించేవి, ఇచ్చేవి ఉండవని అధికారవర్గాలే అంటున్నాయి.

15.59 లక్షల ఇళ్లు పూర్తే లక్ష్యం: మంత్రి

ఐదేళ్లలో 15.59 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై–1 పథకం అమలు గడువును మరో ఏడాది పాటు పొడిగించిందని చెప్పారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకు 81 వేల మందిని గుర్తించినట్టు తెలిపారు. దాదాపు 1.15 లక్షల మంది ప్రభుత్వ, పోరంబోకు స్థలాలలో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు.

కృష్ణా జలాల పునఃపంపిణీ చట్టవిరుద్ధం

బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు కొనసాగించాల్సిందే

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం వాదన



సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాలను పంపిణీ చేస్తూ బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) ఇచ్చిన తీర్పు (అవార్డు)ను పునఃసమీక్షించడం చట్ట విరుద్ధమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)–1956లో సెక్షన్–6(2) ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీం కోర్టు డిక్రీతో సమానమని వివరించారు. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను యథాతథంగా కొనసాగించాల్సిందేనని.. లేదంటే పరిస్థితి తలకిందులు అవుతుందని మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ 2013 నవంబర్ 29న కేడబ్ల్యూడీటీ–2 కేంద్రానికి ఇచ్చిన తుది నివేదికలో వెల్లడించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లో సెక్షన్–89 ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు యథాతథంగా కొనసాగించాల్సిందేనన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్, కేడబ్ల్యూడీటీ–2 పంపిణీ చేసిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పునఃపంపిణీ చేసేందుకు జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా కేంద్రం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా తుది వాదనలు వినిపించారు. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 811 టీఎంసీలు కేటాయించిందన్నారు. అప్పట్లోనే ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేసిందన్నారు. కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీ చేస్తూ కేంద్రానికి కేడబ్ల్యూడీటీ–2 కూడా 2010 డిసెంబర్ 31న ఇచ్చిన తొలి నివేదిక.. 2013, నవంబర్ 29న తుది నివేదికలోనూ బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను యథాతథంగా కొనసాగించిందని వివరించారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ చేస్తూ 2015 జూలై 18–19న కేంద్రం తాత్కాలిక సర్దుబాటు చేసిందన్నారు. ఆ కేటాయింపులను కొనసాగించాలని కోరారు. కావేరి ట్రిబ్యునల్ దిగువ పరివాహక రాష్ట్రమైన తమిళనాడు హక్కులను పరిరక్షిస్తూ నీటి కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చిందని, ఇదే విధంగా కృష్ణా బేసిన్‌లో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా నీటిని కేటాయించాలని కోరారు, తెలుగు గంగ, ఆర్డీఎస్ కుడి కాలువలకు కేడబ్ల్యూడీటీ–2 నీటి కేటాయింపులు చేసిందని, వాటితోపాటు హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు నీటిని కేటాయించాలని కోరారు. బుధవారం, గురువారం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలు కొనసాగనున్నాయి. ట్రిబ్యునల్ విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, రెండు రాష్ట్రాల అంతర్రాష్ట్ర జలవనరుల విభాగాల అధికారులు హాజరయ్యారు.

10 రోజులపాటు శ్రీవారి వైకుంఠ ద్వారదర్శనాలు

- డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు అమలు
- తొలి మూడు రోజులకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా దర్శన టోకెన్ల జారీ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వారదర్శనాలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వాదశి, నూతన సంవత్సరం సందర్భంగా మొదటి మూడు రోజుల వైకుంఠ ద్వారదర్శనాలకు అంటే డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీలకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా సర్వదర్శన టోకెన్లను ఆన్‌లైన్‌లో కేటాయించనున్నారు. కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఉండే విధంగా 1+3 విధానంలో టోకెన్లు జారీ చేస్తారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు ఎలక్ట్రానిక్ డిప్ నమోదుకు అవకాశం కల్పించారు. మొదటి మూడు రోజులకు వైకుంఠ ద్వారా దర్శనాలకు నవంబర్ 27న ఉదయం 10 గంటల నుండి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టీటీడీ వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in/, మొబైల్ యాప్ https://apps.apple. com/in/app-/ttdevasthanams/, వాట్సాప్‌లో ఏపీ గవర్నమెంట్ బాట్‌లో టీటీడీ ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు భక్తులకు అందిస్తారు. వైకుంఠ ద్వారదర్శనాల్లో మొదటి మూడు రోజులైన డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీల్లో ఎస్ఈడీ, శ్రీవాణి దర్శనాలు, ఇతర ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

రోదసి యాత్ర అంత ఈజీ కాదు

శుభాంశు శుక్లా

బెంగళూరు (బనశంకరి): రోదసి యాత్ర అంత సులభం కాదని, శారీరక, మానసిక ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ అలవరచుకుంటే వ్యోమగామి కావచ్చని భారత అంతరిక్ష యాత్రికుడు శుభాంశు శుక్లా తెలిపారు. మంగళవారం బెంగళూరులోని నెహ్రూ ప్లానిటోరియంలో శుభాంశు శుక్లా అభినందన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. 'మీరు కూడా నాలా వ్యోమగామి కావచ్చు. నా రోదసి యాత్రకు వేలాదిమంది పనిచేశారు. అందులో ఇంజినీర్లు, వైద్యులు ఇలా అనేకమంది ఉన్నారు. మీరు కూడా వారిలా కావచ్చు' అని వ్యాఖ్యానించారు. తాను 20 రోజుల అంతరిక్ష యాత్రకు 5 ఏళ్లు శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. రోదసిలో తేలియాడటం నేర్చుకున్నానని, యాత్ర అనంతరం భూమిపైకి వచ్చిన మొదట్లో చాలా కష్టంగా ఉండేదని పేర్కొన్నారు. వారం వరకు సక్రమంగా లేచి నిలబడటం కూడా సాధ్యం కాలేదని వివరించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో 27 పురపాలికల విలీనం

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను విస్తరించేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లంటినీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్)కి లోపల, బయట, దానిని ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం జీహెచ్ఎంసీ చట్టం, తెలంగాణ మున్సిపాలిటీల చట్టాలకు అవసరమైన సవరణలు చేయాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో మంత్రివర్గం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అనంతరం ఐటీ, పరిశ్రమల శాఖ డి.శ్రీధర్ బాబు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి సచివాలయంలో మీడియాకు మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. శివారు పురపాలికలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విలీనం తర్వాత జీహెచ్ఎంసీని విభజించి ఎన్ని కార్పొరేషన్లు చేయాలో ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజల్, మణికొండ, నార్సింగి, ఆదిబట్ల, తుక్కుగూడ, సంగారెడ్డి జిల్లాలోని బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నట్టు వివరించారు.

చెన్నై వేదికగా స్క్వాష్ ప్రపంచ కప్ పోటీలు

డిసెంబరు 9 నుంచి 14 వరకు పోటీలు

సాక్షి, చెన్నై: ఎస్‌డీఏటీఎస్ స్క్వాష్ ప్రపంచ కప్–2025 పోటీలు చెన్నై వేదికగా డిసెంబరు 9 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. తమిళనాడు ప్రభుత్వ సహకారంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీల నిమిత్తం ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్క్వాష్ క్రీడాకారులు చెన్నైకు తరలి రానున్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవ వేడుక డిసెంబరు 8న ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో జరగనుంది. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధిస్టాలిన్, వరల్డ్ స్క్వాష్ అధ్యక్షుడు జెనా వూల్డ్రిడ్జ్, సీఈఓ విలియం లూయిస్ మేరీ, యూరోపియన్ స్క్వాష్ అధ్యక్షుడు థామస్ ట్రోడ్ సన్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ పోటీల షెడ్యూల్‌ను మంగళవారం తమిళనాడు క్రీడల శాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సభ్య కార్యదర్శి జె.మేఘనాథరెడ్డి ప్రకటించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

సంక్రాంతి వరకు ఆప్కోలో 40శాతం డిస్కౌంట్

సాక్షి, అమరావతి: సంక్రాంతి వరకూ ఆప్కో షోరూమ్‌ల్లో 40 శాతం డిస్కౌంట్‌కు చేనేత వస్త్రాలను విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో చేనేత వస్త్రాల వినియోగంపై మక్కువ పెరుగుతోందన్నారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో డిస్కౌంట్ అమ్మకాలు వచ్చే సంక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 40 శాతం డిస్కౌంట్‌కు ఆప్కో షో రూమ్‌ల ద్వారా చేనేత వస్త్రాల రోజువారీ అమ్మకాలు రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

ఏపీ ఎంఎస్ఎంఈలకు అండగా జర్మనీ సహకారం

సాక్షి, అమరావతి: చిన్న తరహా పరిశ్రమలకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలో జరిగిన ఇండో జర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యక్రమానికి ఏపీ తరఫున మంత్రి హాజరయ్యారు. ఇండో జర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఏపీ ప్రభుత్వం కలసికట్టుగా ఏపీలో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకానికి గానూ జర్మన్ ఎంఎస్ఎంఈలకు సంబంధించిన నిపుణులు రాష్ట్రంలో అడుగుపెట్టేందుకు గానూ, లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకం చేశారు.

రూ.9.20 లక్షల డిపాజిట్‌కు అనుమతించండి

ఏసీబీ కోర్టులో సిట్ మెమో

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసు దర్యాప్తులో భాగంగా జప్తు చేసిన రూ.9.20 లక్షల నగదుపై తదుపరి చర్యల కోసం సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. షేక్ ముబారక్ అలీ నుంచి స్వాధీనం చేసుకున్న ఈ నగదును డిపాజిట్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ ఈ మెమో దాఖలు చేశారు.

సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా బాలకోటయ్య

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా పోతుల బాలకోటయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలకోటయ్య రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

బాలల కోసం రాష్ట్రస్థాయి తనిఖీ కమిటీ

సాక్షి, అమరావతి: వీధి బాలల సంక్షేమం, బాలల సంరక్షణ, రక్షణ కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి తనిఖీ కమిటీని నియమించింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. బాలల సంక్షేమం, వీధి బాలల సంక్షేమం, బాలల సంరక్షణ(జేడబ్ల్యూ,సీఎస్, డబ్ల్యూఎస్‌సీ) డైరెక్టర్‌ను చైర్‌పర్సన్‌గా నియమించిన ఈ కమిటీలో మరో ఏడుగురు సభ్యులను నియమించింది. బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ, బాలల సంక్షేమంపై తనిఖీలు చేపట్టి ప్రతి మూడు నెలలకోసారి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉంటుంది.

స్టేట్ కమిటీ ఆన్ డ్యామ్ సేఫ్టీ పునర్వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: కేంద్ర జల్ శక్తి శాఖ మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల భద్రత పర్యవేక్షణకు ఏర్పాటైన స్టేట్ కమిటీ ఆన్ డ్యామ్ సేఫ్టీ(ఎస్‌సీడీఎస్)ను పునర్వ్యవస్థీకరిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఎస్‌సీడీఎస్‌కు ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా ఈఎన్‌సీ వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా హైడ్రాలజీ, ఎస్‌డీఎస్‌వో, సీడీవో, కృష్ణా డెల్టా, కర్నూల్ ప్రాజెక్ట్స్, నార్త్ కోస్ట్, తెలుగు గంగ ప్రాజెక్టుల సీఈలు, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ప్రతినిధులు, ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ సీవీవీ సత్యనారాయణరెడ్డి, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ సుబధీప్ బెనర్జీ, చెన్నై ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు, కేంద్ర విద్యుత్ శాఖ డైరెక్టర్ ముఖేష్‌కుమార్ ఉంటారు.

మావోయిస్టులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలి

సాక్షి, అమరావతి: ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై జరుగుతున్న నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్రాన్ని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం చేసిన తీర్మానాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలని తీర్మానంలో కోరారు. మావోయిస్టుల భౌతిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసే ప్రకటనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు ఆధీనంలో ఉన్న మావోయిస్టులను కోర్టుముందు హాజరుపర్చాలని, ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణకు ఆదేశించాలని సీపీఎం డిమాండ్ చేసింది.

కొల్లేరుకు అతిథులొచ్చారు!

- శీతాకాలంలో విడిది పక్షుల సందడి
- ఏటా 71 జాతులకు చెందిన 1.20 లక్షల విదేశీ వలస పక్షులు
- అక్టోబరు నుంచి మార్చి చివరి వరకు కనువిందు
- స్థానికంగా 210 రకాల పక్షి జాతులు ఉన్నట్టు గుర్తింపు

కొల్లేరులో పెయింటెడ్ స్టోక్ పక్షుల విన్యాసాలు

కైకలూరు మండలం ఆటపాక పక్షుల విహార కేంద్రంలో బోటు షికారు

కైకలూరు: శీతాకాలపు విడిది పక్షుల కిలకిలారావాలతో కొల్లేరు కళకళలాడుతోంది. లక్షల కిలోమీటర్ల దూరం నుంచి తన రెక్కల చప్పుళ్లతో కొల్లేరుకు విదేశీ అతిథి పక్షులు వచ్చేశాయ్. ఏటా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కొల్లేరు పక్షుల వీక్షణకు అనువైన కాలం. ఈ ఏడాది ఎక్కువ మంది పర్యాటకులు కొల్లేరుకు విచ్చేస్తారని అటవీ శాఖ అంచనా వేస్తోంది. సర్వేల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 482 పక్షి జాతులు ఉన్నాయి. సింహభాగం 210 పక్షి జాతులు కొల్లేరులో సంచరిస్తాయి. కొల్లేరు ప్రాంతానికి రష్యా, బ్రిటన్, సైబీరియా, బంగ్లాదేశ్, నైజీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర 29 దేశాల నుంచి 71 జాతులకు చెందిన వలస జాతి పక్షులు 1.20 లక్షలు వస్తాయని అంచనా. ప్రపంచంలో పక్షి జాతులు 11,145 ఉండగా, భారతదేశంలో 1,378 ఉన్నాయి. భారతదేశ పక్షి జాతుల వాటా 12.3 శాతంగా ఉంది. కొల్లేరులో స్వదేశీ, విదేశీ అన్ని పక్షులూ కలిపి 4 లక్షల వరకు శీతాకాలంలో విహరిస్తాయి.

పక్షుల అత్తారిల్లు కొల్లేరు

రెండు తెలుగు రాష్ట్రాల్లో రామ్‌సార్ సదస్సు గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. దీని విస్తీర్ణం 2,22,300 ఎకరాలు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విస్తరించింది. కొల్లేరు 5వ కాంటూరు వరకు 77,135 ఎకరాలను కొల్లేరు అభయారణ్యంగా గుర్తించారు. ఇరు జిల్లాల్లో ఆటపాక, మాధవాపురం పక్షుల విహార కేంద్రాలు ప్రసిద్ధమైనవి. ఏటా శీతాకాలంలో విదేశీ పక్షులు ఇక్కడ గూళ్లు కట్టుకుని సంతానోత్పత్తితో మార్చి మొదటి వారంలో పుట్టింటికి వెళతాయి. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షులు అధికంగా రావడంతో దీనికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణ చేశారు.

బార్ టెయిల్డ్ గాడ్విట్

నిర్విరామంగా అత్యధిక దూరం ప్రయాణించే పక్షి బార్ టెయిల్డ్ గాడ్విట్. ఈ పక్షి ఎక్కడా ఆగకుండా 11 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇవి కొల్లేరు అభయారణ్య ప్రాంతానికి ఏటా వస్తాయి.

ఆర్కిటిక్ టర్న్

అత్యధిక దూరం వలస పోయే పక్షి ఆర్కిటిక్ టర్న్. ఏకంగా 12,200 కిలోమీటర్ల దూరాన్ని కేవలం ఎనిమిదిన్నర రోజుల్లోనే చేరుకుంటుంది. అలస్కా నుంచి న్యూజిలాండ్‌కు వలస వెళ్తుంది.

బార్ హెడెడ్ గీస్

ఎక్కువ ఎత్తున ఎగిరే వలస పక్షి బాతు జాతికి చెందిన బార్ హెడెడ్ గీస్. ఇది సముద్రమట్టానికి దాదాపు 8.8 కిలోమీటర్ల ఎత్తున ఎగురుతుంది. ఈ జాతికి చెందిన పక్షులు హిమాలయాల నుంచి ప్రయాణించి, భారత భూభాగంలోని చిలుకా, పులికాట్ తదితర సరస్సులకు వస్తాయి.

గ్రేట్ స్నైప్

అత్యధిక వేగంతో ప్రయాణించే వలస పక్షి గ్రేట్ స్నైప్, ఈ పక్షి గంటకు 96.5 కిలోమీటర్ల వేగంతో దాదాపు 6,500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దీనిని పరికరాలతో వీక్షించడం కూడా కష్టం.

కొల్లేరుకు ప్రతి ఏటా వచ్చే విదేశీ వలస పక్షులు..

నార్తరన్ పిన్‌టైల్ (సూది తోక బాతు), రెడ్ క్రిస్టడ్ పోచర్డ్ (ఎర్రతల చిలువ), కామన్ శాండ్ పైపర్ (ఉల్లంకి పిట్ట), పసిఫిక్ గోల్డెన్ ప్లోవర్ (బంగారు ఉల్లంకి), కామన్ రెడ్ షాంక్ (ఎర్రకాళ్ల ఉల్లంక్), బ్రాహ్మణి షెల్ డక్(బాపన బాతు), గ్రేట్ వైట్ పెలికాన్ (తెల్ల చిలుక బాతు), బ్లాక్ క్యాప్డ్ కింగ్‌ఫిషర్(నల్ల తల బుచ్చిగాడు), గుల్ బిల్డ్ టర్న్(గౌరి కాకి ముక్కు రేవుపిట్ట), కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి), గ్రేటర్ శాండ్ ప్లోవర్(పెద్ద ఇసుక ఉల్లంకి), రూఫ్ (ఈల వేసే పెద్ద చిలువ), మార్స్ శాండ్‌పైపర్ (చిత్తడి ఉల్లంకి) వంటివి దాదాపు 71 జాతులు ఉన్నట్టు గుర్తించారు.

పక్షులకు ఎల్లలుండవు

ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పిట్టలకు ఎల్లలుండవు. శీతాకాలంలో హిమాలయాలకు దూరంగా నార్తరన్ దేశాలు మంచుతో ఉంటాయి. దీంతో ఆహారం కోసం పక్షులు వలస వస్తాయి. చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరు వీటికి అనువైన ప్రాంతం. ఈ ప్రాంతంలో కాలుష్యం కారణంగా వలస పక్షులు తగ్గుతున్నాయి. చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యతగా ఉండాలి.

– శ్రీరామ్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల ఈ-బర్డ్ సమీక్షకుడు, హైదరాబాదు

పక్షులను ప్రేమించాలి

పక్షులను నేస్తాలుగా భావించి ఆదరించాలి. కొల్లేరు వాతావరణం అనుకూలంగా ఉండటంతో పక్షులు వలస వస్తున్నాయి. అటవీ శాఖ పక్షుల రక్షణకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది డిసెంబర్ చివరన ఏషియన్ వాటర్ బర్డ్స్ సెన్సస్(ఏడబ్ల్యూసీ) చేయాలని భావిస్తున్నాం. ఏలూరు జిల్లాలో ఆటపాక, మాధవాపురంలో పక్షుల విహార కేంద్రాలను అభివృద్ధి చేశాం. కొల్లేరు పక్షుల వీక్షణకు ఇదే అనువైన సమయం.

– బి.విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు

బ్రౌన్ హెడెడ్ గల్

నార్తరన్ షెవలర్

రూఫ్

గర్గానీ

బ్రాహ్మణి డక్

బ్లాక్ హెడ్ కింగ్ ఫిషర్

మిథున్‌రెడ్డి బెయిల్ షరతుల సడలింపు పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడలీగల్: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ ఎంపీ మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు బుధవారానికి వాయిదా వేశారు.

మద్యం అక్రమ కేసులో విచారణలు వాయిదా

మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటీషన్లపై విచారణను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు బుధవారానికి వాయిదా వేశారు. జైలులో మంచం, టేబుల్, ఇంటి భోజనం ఏర్పాటు చేయాలని కోరుతూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 27వ తేదీకి వాయిదా వేశారు.

అలాగే ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ గుంటూరు జైలు నుండి విజయవాడ జైలుకు మార్చాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ తరపున కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను న్యాయమూర్తి ఈనెల 27కి వాయిదా వేశారు.

ఇదే కేసులో ఎ–49గా ఉన్న అనిల్ చోక్రాను 7 రోజుల కస్టడీకి కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు మంగళవారం పూర్తయ్యాయి. దీనిపై తీర్పును ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు.

మద్యం అక్రమ కేసుతో ఈషా ఇన్‌ఫ్రా నగదుకు సంబంధం లేదు

ఎన్నికల సమయంలో పట్టుబడ్డ రూ. 8.63 కోట్లు తమ సంస్థ ఈషా ఇన్‌ఫ్రాకు చెందిన నగదుగా పరిగణించాలని ఏసీబీ న్యాయస్థానంలో ఆ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. 2024 ఎన్నికల సమయంలో సీజ్ చేసిన నగదుతో మద్యం అక్రమ కేసుకు ఎటువంటి సంబంధం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ నగదును అటాచ్ చేయవద్దని కోరారు. దీనికి సంబంధించి లక్ష్మీ తేజస్విని జీపీఏ హోల్డర్‌గా నియమించాలని కోరారు. దీనిపై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను న్యాయమూర్తి ఈనెల 27కి వాయిదా వేశారు.

ఆయిల్ అవకతవకల్లో అసలైన బాధ్యులను గుర్తించాలి

ఆర్టీసీ చైర్మన్‌కు ఎమ్మెల్సీ బొర్రా లేఖ

సాక్షి, అమరావతి: ఏలూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఆయిల్ అవకతవకలకు పాల్పడిన అసలైన బాధ్యులను గుర్తించాలని ఆర్టీసీ చైర్మన్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మంగళవారం లేఖ రాశారు. ఈ తప్పులతో సంబంధం లేని ముగ్గురిపై విధించిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరారు. ఏలూరు ఆర్టీసీ డిపోలోని ఆయిల్ బంక్‌లో రూ.82 లక్షల కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. సదరు వ్యక్తులను గుర్తించి సొమ్మును రికవరీ చేసిన అనంతరం శిక్షించాలని, కానీ అందుకు భిన్నంగా బాధ్యులుగా నిర్ధారణ కాని 9 మంది నుంచి రూ.50.30 లక్షలు వసూలు చేయడం విచారకరమన్నారు. ప్రధాన బాధ్యులైన నాటి ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్, జోనల్ మేనేజర్ విజయరత్నంలు అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు.

సీఐఎస్ఎఫ్ భద్రతా ఛత్రం కిందకు పోర్టులు

77 ఎగ్జిమ్ పోర్టుల భద్రత నోడల్ ఏజెన్సీగా సీఐఎస్ఎఫ్.. కేంద్ర హోమ్‌శాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: దేశంలో తీరప్రాంత భద్రత, రవాణా వ్యవస్థ భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దేశంలోని అన్ని పోర్టులను కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగం(సీఐఎస్ఎఫ్) ఛత్రం పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. సీఐఎస్ఎఫ్ ఇక నుంచి పోర్టుల భద్రతకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. అందుకే ఆ విభాగాన్ని పోర్టుల భద్రతకు 'రికగ్నైజ్డ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్(ఆర్ఎస్‌వో)'గా ప్రకటించింది. దేశంలో 12 మేజర్ పోర్టులు, 65 మైనర్ పోర్టులు ఎగుమతులు, దిగుమతులు నిర్వహించే 77 ఎగ్జిమ్ పోర్టులు ఉన్నాయి. వాటితోపాటు దాదాపు మరో 200 మైనర్ పోర్టులు ఉన్నాయి. వాటిలో 13 పోర్టులకు ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ భద్రతా విధులను నిర్వర్తిస్తోంది. మిగిలిన పోర్టుల భద్రతను కేంద్ర షిప్పింగ్ శాఖకు చెందిన ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ పర్యవేక్షిస్తోంది. కాగా పోర్టుల భద్రతను ప్రత్యేక భద్రత దళాలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించింది. దేశంలోని అన్ని పోర్టుల భద్రత కూడా సీఐఎస్ఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చింది. పోర్టుల భద్రతపై సీఐఎస్ఎఫ్, షిప్పింగ్ శాఖల ఉన్నతాధికారులతో నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించింది.

ఐఎస్‌పీఎఫ్ఎస్‌సీ ప్రమాణాలకు అనుగుణంగా పటిష్ట భద్రత

ఇక నుంచి 'ఇంటర్నేషనల్ షిప్, పోర్టు ఫెసిలిటీ సెక్యూరిటీ కోడ్(ఐఎస్‌పీఎఫ్ఎస్‌సీ) నిర్దేశించిన ప్రమాణాల మేరకు పోర్టులకు భద్రత కల్పిస్తారు. అంతర్జాతీయంగా పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థ కోసం ఐఎస్‌పీఎఫ్ఎస్‌సీ ఆ భద్రతా ప్రమాణాలను నిర్దేశించింది. అందుకోసం ముందుగా దేశంలోని 77 ఎగ్జిమ్ పోర్టుల భద్రత బాధ్యతలను సీఐఎస్ఎఫ్ చేపట్టనుంది. ఎగుమతి దిగుమతి కార్యకలాపాలు నిర్వహించని ఇతర మైనర్ పోర్టుల భద్రతను కూడా దశలవారీగా సీఐఎస్ఎఫ్ నిర్వర్తిస్తుంది. ఈ మేరకు పోర్టుల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఓ బ్లూప్రింట్‌ను రూపొందిస్తుంది. కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు, మరింత పటిష్టంగా స్క్రీనింగ్ ప్రక్రియను అమలులోకి తెస్తుంది. సీసీటీవీలతో తీరం వెంబడి, సముద్ర జలాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయడం, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయడం, కమాండ్ కంట్రోల్ సెంటర్ నెలకొల్పడం తదితర భద్రతా చర్యలు చేపడుతుంది. పోర్టుల భద్రత కోసం బలగాలకు ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతుంది.

నకిలీ మద్యం కేసులో రిమాండ్ పొడిగింపు

విజయవాడ లీగల్: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్, జోగి రాము, అద్దేపల్లి జనార్ధనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మిథున్ దాస్, అంతాదాస్‌ల రిమాండ్ ముగియడంతో వారిని మంగళవారం విజయవాడలోని 6వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారి రిమాండ్‌ను వచ్చే నెల 9వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆదేశాలు జారీచేశారు. అనంతరం నిందితులను జైలుకు తరలించారు. మిగిలిన 10 మంది నిందితులను వర్చువల్‌గా న్యాయస్థానంలో హాజరు పరచగా, వారికి కూడా వచ్చే నెల 9వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు.

జోగి రమేష్, రాము కస్టడీకి అనుమతి

నకిలీ మద్యం కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో వున్న జోగి రమేష్, జోగి రామును 4 రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ 6వ అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. వీరిని 7 రోజుల కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దానిపై ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి వారిద్దరినీ నాలుగు రోజులపాటు కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈనెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు పోలీసులు వారిని విచారించనున్నారు. న్యాయవాది కనుచూపు మేర సమక్షంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించకుండా విచారణ జరపాలని న్యాయమూర్తి ఆదేశించారు. ప్రతిరోజూ విచారణ అనంతరం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి, సాయంత్రం 5 గంటలకల్లా విజయవాడ జిల్లా జైలులో అధికారులకు అప్పగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న నకిరికంటి రవి, అంగలూరు కళ్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు తరపున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణను 6వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఈనెల 27కి వాయిదా వేశారు.

రాష్ట్రంలో వచ్చే నెల 3 నుంచి ఉద్భవ్ ఉత్సవాలు

ఏకలవ్య గురుకుల పాఠశాలల విద్యార్థులకు జాతీయస్థాయి సాంస్కృతిక పోటీలు

పోటీలకు 22 రాష్ట్రాల నుంచి 1800 మంది.. ఏపీ నుంచి 110 మంది

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో వచ్చే నెల 3 వ తేదీ నుంచి రాష్ట్రంలో ఉద్భవ్–2025 పేరుతో ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల (ఈఎంఆర్ఎస్) విద్యార్థులకు 6వ జాతీయ స్థాయి సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. ఈ ఉత్సవాల పోస్టర్, లోగోను మంత్రి మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలకు 22 రాష్ట్రాలకు చెందిన 405 ఈఎంఆర్ఎస్‌లకు చెందిన 6 నుండి 12వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు, టీమ్ మేనేజర్లు, ఉన్నతాధికారులు కలిపి 1,800 మంది వస్తున్నారని చెప్పారు. ఏపీ నుంచి 28 పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ఆటపాటలు, గిరిజన ముఖచిత్రం ప్రతిబింబించేలా ఆర్ట్స్, లిటరేచర్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఇందుకోసం కేఎల్ యూనివర్సిటీలో 12 వేదికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఈ ఉత్సవాలను మన రాష్ట్రంలో నిర్వహించడం ఇదే తొలిసారి అన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి ఎం.గౌతమి, గిరిజన సంక్షేమ కార్యదర్శి ఎస్.భార్గవి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ 28కి వాయిదా

సాక్షి అమరావతి: మద్యం అక్రమ కేసులో బెయిల్ కోరుతూ కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు కేసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ గత 7 నెలలుగా జైల్లో ఉన్నారని తెలిపారు. పిటిషనర్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసు పెట్టిన అధికారులు... అదే చట్టం సెక్షన్ 17(ఏ) ప్రకారం అనుమతి తీసుకోలేదని చెప్పారు. అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. దర్యాప్తు పూర్తి చేసినందున, పిటిషనర్ జైల్లో ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. సీఐడీ కొందరినే లక్ష్యంగా చేసుకుని ఏకపక్షంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రధాన నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి , సత్యప్రసాద్‌ను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదన్నారు. సహ నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సీఐడీ దర్యాప్తు చేస్తోందని సుధాకర్ రెడ్డి వివరించారు.

వయోజన విద్య కోసం 'అక్షరాంధ్ర'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకుగాను 'అక్షరాంధ్ర' అమల్లోకి తేనున్నారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వయోజన విద్యలో జాతీయ స్థాయి కంటే రాష్ట్రం వెనుకబడి ఉందని, దీన్ని అధిగమించేందుకు జాతీయ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. దీనికి అనుబంధంగా రాష్ట్ర ప్రాజెక్టుగా అక్షరాంధ్రను అమలు చేయనున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని 15 నుంచి 59 ఏళ్ల వయసు వారిలో అక్షర జ్ఞానాన్ని అందించడమే దీని ఉద్దేశంగా పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ అక్షరాస్యత సగటు 74.04 శాతంగా ఉంటే రాష్ట్రంలో అది 67.41శాతంగా ఉందన్నారు. అలాగే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023–24 లెక్కల ప్రకారం జాతీయ అక్షరాస్యత రేటు 80.9శాతం ఉండగా, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 2024 ఫిబ్రవరిలో నిర్వహించిన క్యాస్ట్ సెన్సస్ ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యత 72.6 శాతంగా ఉందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అక్షరాంధ్ర అమలు చేస్తున్నామని, దీనికి వయోజన విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, గ్రామ, వార్డు సచివాలయం, ప్లానింగ్, ఉన్నత విద్య, సెర్ప్, మెప్మా, నైపుణ్యాభివృద్ధి సంస్థ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వచ్చేనెల 12 నుంచి బిజినెస్ ఎక్స్‌పో

ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

బిజినెస్ ఎక్స్ పో బ్రోచర్, ఏవీ లోగోను ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

సాక్షి, అమరావతి: వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న బిజినెస్ ఎక్స్‌పోకు సంబంధించిన బ్రోచర్, ఏవీ లోగోను మంగళవారం మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సానుకూలతతో ముందుకు వెళుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనేక రాయితీలతో కొత్తగా పారిశ్రామిక పాలసీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. బిజినెస్ ఎక్స్‌పోను పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసేకోవాలని, ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ రావూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా

56 INTERNATIONAL FILM FESTIVAL OF INDIA

తరగని ఉత్తేజం తారా లోక విహారం

- గోవాలో ఘనంగా 'ఇఫీ' చలన చిత్రోత్సవం
- తరలి వస్తున్న సినీ ప్రముఖులు... సినీ అభిమానులు
- ఈవెంట్ల హోరు... ఇంటర్నేషనల్ సినిమా జోరు
- జయహో దక్షిణాది అంటున్న సినీ ప్రపంచం.
- కళా బృందాల ఆటపాటలతో కళకళలాడుతున్న వేదికలు

గోవాలోని పంజిమ్‌లో 56వ ఇండియన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ నెల 20న ఆరంభమైన ఈ చిత్రోత్సవం మరో 2 రోజుల్లో ముగియనుంది. ఈ ఉత్సవంలో 81 దేశాల నుంచి 240కి పైగా సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. వీటిలో 13 ప్రపంచ ప్రీమియర్‌లు, అనేక అంతర్జాతీయ ఆసియా ప్రీమియర్‌లు ఉన్నాయి. ఈ చిత్రోత్సవానికి జపాన్ కంట్రీ ఆఫ్ ఫోకస్‌గా, స్పెయిన్ 'భాగస్వామి దేశం'గా ఆస్ట్రేలియా 'స్పాట్‌లైట్ దేశం'గా వ్యవహరిస్తున్నాయి.

భానుమతి శత జయంతుత్సవాలు...

ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమా దిగ్గజాలు గురుదత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్ భూపేన్ హజారికా, సలీల్ చౌదరిలతో పాటు మన తెలుగు సినీరంగానికి చెందిన దివంగత నటి స్వర్గీయ పి. భానుమతి శతజయంతి ఉత్సవాలను జరుపుతున్నారు. ఆమె నటించిన సూపర్ హిట్ సినిమా 'మల్లీశ్వరి'ని చిత్రోత్సవాల్లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. ఇదే ఫెస్టివల్‌లో భాగంగా గత ఏడాది స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. అదే విధంగా సినిమా రంగంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు ప్రారంభ వేడుకలో టాలీవుడ్ నటుడు బాలకృష్ణను సన్మానించారు. ముగింపు వేడుకలో ప్రముఖ నటుడు రజనీకాంత్‌ను సన్మానించనున్నారు అలాగే ఆయన సినిమాలు ల'ాల్ సలామ్, జైలర్' లను చిత్రోత్సవాల్లో ప్రదర్శిస్తున్నారు.

తెలుగు చిత్రాల సందడి...

పలు టాలీవుడ్ చిత్రాలకు ఈ చిత్రోత్సవంలో చోటు దక్కింది. నేడు (26వ తేదీ బుధవారం) 'కమిటీ కుర్రోళ్లు' సినిమాను, 28న 'సంక్రాంతికి వస్తున్నాం'ను ప్రదర్శించనున్నారు. ప్రారంభ చిత్రాల్లో ఒకటిగా తమిళ చిత్రం 'అమరన్' చోటు దక్కించుకోగా, మరికొన్ని తమిళ, మలయాళ చిత్రాలను కూడా ప్రదర్శించారు. పనోరమా విభాగంలో 25 చలన చిత్రాలు, 20 నాన్–ఫీచర్ చిత్రాలు ఉన్నాయి.

సినిమా... అంతకు మించి...

ఈసారి చిత్రోత్సవంలో సినిమాల ప్రదర్శనతో పాటు మరెన్నో వైవిధ్యభరిత, ఆసక్తికరమైన కార్యక్రమాలకు చోటు కల్పించారు. కొత్త తరాన్ని ప్రోత్సహించడం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచడం వంటి లక్ష్యాలతో వీటిని నిర్వహిస్తున్నారు.

క్రియేటివిటీకి క్లాప్...

చిత్రోత్సవాల్లో సినిమాల ప్రదర్శనతో పాటు నూతన తరాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' (సీఎమ్ ఓటి) నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 128 మంది యువతీ యువకులు 48 గంటల చిత్ర నిర్మాణ పోటీలో పాల్గొన్నారు. వీరిని 5 విభాగాలుగా విభజించి పోటీ నిర్వహించారు. దీనిలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పలువురు ఎంపిక అవడం విశేషం.

మాస్టర్ క్లాస్... సూపర్ హిట్...

చిత్రోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మాస్టర్ క్లాస్‌లు అత్యంత ఆదరణ పొందుతున్నాయి. బాలీవుడ్ సినీ ప్రముఖుడు విధు వినోద్ చోప్రా నిర్వహించిన మాస్టర్ క్లాస్ ఆకట్టుకుంది. అందులో ఆయన పంచుకున్న జీవితానుభవాలు యువతను మేల్కొలిపేలా ఉన్నాయి. అలాగే చిత్రోత్సవాల్లో దాదాపు పూర్తి స్థాయిలో కనిపించిన మరో సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ సమర్పించిన మాస్టర్ క్లాస్ సినీరంగంలో రాణించాల్సిన వారికి ఉండాల్సిన ఓర్పు పట్టుదల అవసరాన్ని నొక్కి చెప్పింది.

సెషన్స్... లెసన్స్...

'ఇన్ –కన్వర్జేషన్' పేరిట కీలకమైన అంశాలపై సాగుతున్న పలు చర్చలు కూడా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా సుహాసిని, ఖుష్బూ నిర్వహించిన చర్చా కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. అలాగే సినిమా రంగంలో మహిళల అంశంపై దేశ విదేశీ ప్రముఖులు సాగించిన చర్చ కూడా ఆలోచనలు రేకెత్తించేలా ఉండి, ఆకట్టుకుంది.

ఏఐ ఫెస్ట్... రేపటికి మస్ట్...

ఇఫీలో తొలిసారిగా 'సినిమాఏఐ హ్యాకథాన్' పేరిట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సినిమాటిక్ సృజనాత్మకథ కలయికలో హ్యాకథాన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏఐ ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఈ సెక్షన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపొందించిన ఫిల్మ్‌లు ప్రదర్శిస్తున్నారు.

ఇఫీస్టా...

మరోవైపు ప్రధాన ఉత్సవానికి సమాంతరంగా 'ఇఫెస్టా' సాంస్కృతిక సంబరం ఏర్పాటైంది. ఇది సంగీతాభిమానులను తనివి తీరా ఆనందింపజేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యక్ష సంగీత ప్రదర్శనలు, జానపద నృత్యాలు.. వంటివి ఉంటున్నాయి. 'బాటిల్ ఆఫ్ బాండ్స్' (భారతీయ, అంతర్జాతీయ బ్యాండ్స్) మరో ఆకట్టుకునే కార్యక్రమం. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన కళాబృందాల్లో మన తెలంగాణ నుంచి గుస్సాడీ నృత్య కళాకారుల బృందం కూడా ఒకటి.

అలలోత్సవం... వేవ్స్ బజార్...

మారియట్ హోటల్ వేదికగా నిర్వహిస్తోన్న వేవ్స్ బజార్ పెద్ద సంఖ్యలో ఆహుతుల్ని ఆకర్షిస్తోంది. ఈ ప్రాంగణంలో రోజూ పదుల సంఖ్యలో సినిమాల ప్రదర్శనతో పాటు స్టార్టప్స్ వేదికలు, సాంకేతిక పరికరాల ప్రదర్శనలు... ఇంకా మరెన్నింటికో చోటు కల్పించారు. ఎన్‌ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ఈవెంట్స్ ఆకట్టుకుంటున్నాయి. ఫిల్మ్ + టెక్‌ను కలిపే ఉద్దేశంతో స్టార్ట్–అప్ – ఇన్నోవేషన్‌ను కలుపుతూ వేవ్ ఎక్స్ అనే జోన్ కూడా ఏర్పాటు చేశారు.

సెలబ్రిటీకి రైట్ రైట్... రెడ్ కార్పెట్..

సినిమాల ప్రదర్శన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్‌పై సినీ సెలబ్రిటీలు వాక్ చేస్తున్నారు. ఆ సందర్భంగా వీరు సందర్శకులు, మీడియాతో ముచ్చటిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో అతిరథ మహారధుల వంటి సినిమా ప్రముఖులు కనపడుతుండడంతో ఔత్సాహిక రూపకర్తలకు అభిమానులకు అవధుల్లేని ఆనందం కలుగుతోంది.

దక్షిణ కొరియా ఎంపీ జేవాన్ కిమ్ మన వందే మాతరంను అత్యంత శ్రావ్యంగా గానం చేయడం గోవాలో జరిగిన వేవ్స్ ఫిల్మ్ బజార్ ప్రారంభ వేడుకలో హర్ష ధ్వానాలు అందుకుంది. ఒక విదేశీయురాలు ఇంత అందంగా పాడగలగడం చూడటం గొప్ప విషయం అని పలువురు అతిథులు అభినందనలు కురిపించారు.

ప్రత్యేక ఆకర్షణలు...

ఇఫీలో ఆహుతులను ఆకట్టుకుంటున్న అనేక ప్రదర్శనల్లో కొన్ని మరింత విశేషంగా అనిపిస్తున్నాయి. వాటిలో..

- 'షోలే' సినిమా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ సినిమాలో వినియోగించిన బైక్‌ను ఈ ఈవెంట్‌లో ప్రదర్శిస్తున్నారు. దాంతో ఆహుతులు ఆ బైక్‌తో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.
- కళా అకాడమీలో ఏర్పాటైన కెమెరా ప్రదర్శన ఔరా అనిపిస్తోంది. అక్కడ వందల సంఖ్యలో కొలువుదీరిన అనేక కెమెరాల్లో శతాధిక వయస్సు ఉన్నవి కూడా ఉండడం విశేషం. పలు కెమెరాలు మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తాయి. మహారాష్ట్రకు చెందిన సర్వేష్ అనే కెమెరాల సేకర్త ఈ ప్రదర్శనను సమర్పిస్తున్నారు. ఆహుతులు పెద్ద సంఖ్యలో ఈ కెమెరాలను తమ కెమెరాల్లో నిక్షిప్తం చేసుకుంటున్నారు.
- ప్రాంగణంలో నెలకొల్పిన అనేక స్టాల్స్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టాల్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సాంకేతిక ప్రగతికి చిహ్నంగా కనిపించే అనేక విశేషాలను ఈ స్టాల్ ప్రదర్శిస్తోంది. పైగా యువతను ఆకట్టుకునేలా అప్పటికప్పుడు గెలుపోటముల్ని తేల్చేసే టెక్ గేమ్స్ నిర్వహిస్తుండడంతో యువత పెద్ద సంఖ్యలో గుమి కూడుతోంది.

పంజిమ్‌లోని పీబీబి సెంటర్, ఐనాక్స్ థియేటర్ ప్రాంగణం, కళా అకాడమీ, మారియట్ హోటల్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియం... తదితర ప్రదేశాల్లో ఇఫీ విస్తరించింది. ఈ దఫా ఓపెన్ ఎయిర్ స్క్రీనింగ్స్‌కు కూడా చోటు కల్పించడం మరో విశేషం. వందల సంఖ్యలో ఈవెంట్లు ఆకర్షణలు, విశేషాలతో దేశ విదేశాలకు చెందిన వేలాది మంది ఆహుతులను ఆకర్షిస్తోంది. మరో 2 రోజుల్లో ముగియనున్న ఇఫీ... మరో ఏటా తన కోసం వేచి చూసేవారి సంఖ్యని ఈ ఏడాది కార్యక్రమాలతో మరింతగా పెంచుకోనున్నదని చెప్పవచ్చు.

- సత్యబాబు

విజయ్ సేతుపతి

శింబుకు విలన్‌గా?

హీరో శింబు, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా సినిమా 'అరసన్' (తెలుగులో 'సామ్రాజ్యం'). కలైపులి ఎస్. థాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. కాగా, ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్రలో విజయ్ సేతుపతి నటిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ మంగళవారం ప్రకటించింది. అయితే విజయ్ సేతుపతి విలన్ రోల్ చేస్తున్నారనే టాక్ కోలీవుడ్‌లో తెరపైకి వచ్చింది. ఇక మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'చెక్క చివంద వానం' (తెలుగులో 'నవాబు') సినిమా తర్వాత శింబు, విజయ్ సేతుపతి కలిసి నటిస్తున్న సినిమా ఇది. అలాగే వెట్రిమారన్ దర్శకత్వం వహించిన గత చిత్రం 'విడుదలై' తర్వాత ఆయన దర్శకత్వంలోని తాజా చిత్రం 'అరసన్'లోనూ విజయ్ సేతుపతి ఓ లీడ్ రోల్‌లో నటిస్తుండటం మరో విశేషం. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా సమంత, శ్రీలీల వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. వచ్చే ఏడాది ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రత్నమాల...

శివ కార్తికేయన్, శ్రీలీల జోడీగా నటిస్తున్న చిత్రం 'పరాశక్తి'. 'గురు, ఆకాశమే నీ హద్దురా' చిత్రాల ఫేమ్ సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. రవి మోహన్, అథర్వ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రెడ్ జాయింట్ మూవీస్ ఉదయనిధి సమర్పణలో ఆకాశ్ భాస్కరణ్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'రత్నమాల...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, జీవీ ప్రకాశ్‌కుమార్ స్వీయ సంగీత దర్శకత్వంలో పాడారు. శివ కార్తికేయన్, శ్రీలీలపై అద్భుతమైన మెలోడీగా ఈ సాంగ్‌ని తెరకెక్కించారు. ఈ పాటకి బృందా మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. రవి కె.చంద్రన్ విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకులముందుకు రానుంది.

శ్రీలీల, శివకార్తికేయన్

బిజినెస్ రీల్

గల్ఫ్ దేశాల్లోకి ఆర్ఎన్ఐటీ ఏఐ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐ ఆధారిత గవర్నెన్స్, ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్ సొల్యూషన్స్ సంస్థ ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ తాజాగా అజ్నిహత్ అల్‌నజహ్ గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. గల్ఫ్ ప్రాంత మార్కెట్లలోకి విస్తరించేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. ప్రాంతీయంగా అధునాతన ఆటోమేషన్, డిజిటల్ సొల్యూషన్స్‌ని అందుబాటులోకి తెచ్చేందుకు తోడ్పడుతుందని పేర్కొంది. మరోవైపు, బీఎస్ఈలో కంపెనీ లిస్ట్ చేసినట్లు సంస్థ ఎండీ రాజా శ్రీనివాస్ నందిగం తెలిపారు. వివిధ రంగాల్లో మనుషుల స్థానాన్ని భర్తీ చేసేదిగా కాకుండా వారికి సేవలు అందించేదిగా ఏఐని వినియోగంలోకి తేవాలన్న తమ లక్ష్య సాకారానికి ఈ లిస్టింగ్ తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

అసంఘటిత రంగంలో స్వల్పంగా పెరిగిన ఉద్యోగాలు

జూలై–సెప్టెంబర్ గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో అసంఘటిత రంగ సంస్థల్లో (యూఎస్ఈ) ఉద్యోగాలు స్వల్పంగా పెరిగాయి. క్రితం క్వార్టర్‌లో 12,85,72,500గా ఉండగా సెప్టెంబర్ త్రైమాసికంలో 12,85,95,600కి చేరాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన సర్వే డేటాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. తయారీ, వాణిజ్యం, ఇతర సర్వీసులు అనే మూడు వ్యవసాయేతర రంగాల గణాంకాలను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. దీని ప్రకారం, ప్రత్యేకంగా చట్టబద్ధమైన సంస్థలుగా నమోదు చేసుకోని ఈ తరహా సంస్థల్లో ఉద్యోగాలు జనవరి–మార్చి క్వార్టర్‌లో నమోదైన 13,13,38,000తో పోలిస్తే రెండో ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో తగ్గాయి. ఈ రంగంలో ఇంటర్నెట్ వినియోగం జూన్ క్వార్టర్‌లో నమోదైన 36 శాతంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికంలో 39 శాతానికి పెరిగింది. సెప్టెంబర్ త్రైమాసికంలో తయారీలో ఉపాధి పెరిగింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-11-2025

విశాఖ	635–00
చిత్తూరు	673–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645–00
విజయవాడ	660–00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	650–00
వరంగల్	652–00
రిటైల్ ధర	7.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	410.20	1.58
HINDALCO	785.80	1.44
SBIN	983.50	1.33
SHRIRAMFIN	838.60	1.26
DRREDDY	1,236.00	0.80

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,329.40	-2.91
TMPV	352.60	-1.59
TRENT	4,246.50	-1.49
INFY	1,530.20	-1.15
POWERGRID	272.65	-1.14

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,570
ఎన్ఎస్ఈ	87,713
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,53,756
ఎఫ్ఐఐ	+ 785
డీఐఐ	+ 3,912

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.60	$	58.92
బ్రెంట్	61.48	$	62.72

భారత వృద్ధి అంచనాలకు బూస్ట్

7 శాతానికి పెంచిన ఇండియా రేటింగ్స్

- గత అంచనా 6.3 శాతమే

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి అంచాలను ప్రముఖ రేటింగ్ సంస్థ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) ఎగువకు సవరించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.3 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా వ్యక్తీకరించగా, తాజాగా దీన్ని 7 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో అధిక వృద్ధి రేటు (7.8 శాతం) నమోదు కావడం, ప్రపంచ వృద్ధి, వాణిజ్యంపై అమెరికా టారిఫ్‌ల పెంపు ప్రభావం అనుకున్నంత లేకపోవడం 2025–26 వృద్ధి అంచాలను పెంచడానికి కారణాలుగా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.8 శాతంగా ఉండొచ్చన్నది ఆర్‌బీఐ అంచనా. ఇంతకంటే మెరుగ్గా ఇండ్–రా అంచనాలుండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంది. తాము జూలైలో ప్రకటించిన అంచనాల అనంతరం దేశీయంగా, అంతర్జాతీయంగా పరిణామాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నట్టు ఇండ్–రా తెలిపింది. ద్రవ్యోల్బణం చాలా వేగంగా తగ్గుముఖం పట్టడం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు పెరగడం, జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణ అంశాలను ఇండ్–రా ముఖ్య ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్ ప్రస్తావించారు. ముఖ్యంగా జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి అంచనాలకంటే ఎంతో అధికంగా నమోదు కావడం, అమెరికా టారిఫ్‌ల ప్రభావం ప్రపంచ వాణిజ్యంపై ఏమంత లేకపోవడం వృద్ధి అంచనాల పెంపులో ప్రధానపాత్ర పోషించినట్టు ఇండ్–రా తెలిపింది.

సానుకూల పరిస్థితులు..

''భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వేగంగా పట్టాలెక్కడం, శీతాకాలంలో సానుకూల వాతావరణ పరిస్థితులు జీడీపీ వృద్ధి రేటును 7 శాతానికి తీసుకెళతాయి. ఒకవేళ డిమాండ్ కోలుకోవడం (వినియోగం; పెట్టుబడులు) అన్నది అంచనాలకంటే తక్కువగా ఉంటే కనుక అది జీడీపీ వృద్ధి అంచనాలను కిందకు తీసుకెళ్లొచ్చు''అని ఇండ్–రా తెలిపింది. జీఎస్టీ రేట్ల క్రమబద్దీకరణ, తక్కువ ద్రవ్యోల్బణంతో తుది ప్రైవేటు వినియోగం 2025–26లో 7.4 శాతం పెరగొచ్చని పేర్కొంది. ''అమెరికాకు ఎగుమతులు సెప్టెంబర్‌లో 11.9 శాతం (గతేడాది ఇదే నెలతో పోల్చినప్పుడు), అక్టోబర్‌లో 8.9 శాతం చొప్పున తగ్గాయి. ఎగుమతులు 2024–25లో సగటున నెలవారీ 7.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు చూస్తే నెలవారీ సగటు 7.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కానీ సెప్టెంబర్–అక్టోబర్ కాలాన్నే పరిశీలించి చూస్తే నెలవారీ ఎగుమతులు 5.9 బిలియన్ డాలర్లకు (టారిఫ్‌ల కారణంగా) తగ్గాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం సాకారం కావడం లేదంటే భారత ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను గుర్తించడం అన్నది ఎగుమతులు పుంజుకోవడానికి కీలకం''అని ఇండ్–రా తన నివేదికలో పేర్కొంది.

ఏఐ వ్యూహంలో భారత్ కీలకం

దేశీయంగా డేటా సెంటర్ విభాగంలో 30 శాతం వాటా

ఎన్‌టీటీ డేటా సీనియర్ వీపీ జాన్ వెల్లడి



టోక్యో: గ్లోబల్ ఐటీ సేవల దిగ్గజం ఎన్‌టీటీ తమ కృత్రిమ మేధ (ఏఐ) వ్యూహాలకు సంబంధించి భారత్ అత్యంత కీలక మార్కెట్‌గా నిలుస్తోందని వెల్లడించింది. భారత ప్రభుత్వం ప్రారంభించిన ఇండియేఏఐ మిషన్ మొదలైనవి ఇందుకు దన్నుగా ఉంటున్నాయని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ వపర్‌మ్యాన్ తెలిపారు. దేశీయంగా డేటా సెంటర్ విభాగంలో తమకు 30 శాతం మార్కెట్ వాటా ఉందని, సమీప భవిష్యత్తులో దీన్ని మరింతగా పెంచుకోనున్నామని ఆయన పేర్కొన్నారు. 'ఏఐ నిపుణులకు భారత్ మాకు హబ్‌గా నిలుస్తోంది. అలాగే ఇక్కడి డెలివరీ సెంటర్‌కి మా ఆసియా పసిఫిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనుబంధంగా పని చేస్తోంది. భారత్‌లో ప్రతిభావంతులైన యువత లభ్యత ఎక్కువగా ఉంటుంది. వారికి శిక్షణనివ్వడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాం' అని జాన్ తెలిపారు.

దేశీయంగా బీసీజీ, యాక్సెంచర్, డెలాయిట్ లాంటి సంస్థలు తమకు ప్రధాన పోటీదార్లుగా ఉంటున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో డేటా సెంటర్లతో పాటు బెంగళూరు, ఢిల్లీ, ముంబైలాంటి ప్రధాన నగరాల్లోనూ కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు జాన్ చెప్పారు. కేవలం డేటా సెంటర్ల మౌలిక సదుపాయాలనే కాకుండా ఏఐ, కన్సల్టింగ్ సామర్థ్యాలను కూడా పటిష్టం చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే ఫైనాన్షియల్, బ్యాంకింగ్, బీమా రంగాలతో పాటు కన్సల్టింగ్ మొదలైన విభాగాలపైనా ఇన్వెస్ట్ చేశామని జాన్ వివరించారు. నవంబర్ 19 నుంచి 26 మధ్యన టోక్యోలో నిర్వహించిన ఎన్‌టీటీ ఆర్అండ్‌డీ ఫోరమ్‌లో ఎన్‌టీటీ గ్రూప్ కంపెనీలు 100కు పైగా వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సెక్యూరిటీ, మొబిలిటీ తదితర విభాగాలకు చెందిన సొల్యూషన్స్ వీటిలో ఉన్నాయి.

గూగుల్ ఏఐ ఫ్యూచర్స్ ఫండ్‌తో యాక్సెల్ జట్టు

ఏఐ అంకుర సంస్థల్లో పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఆటమ్స్ ప్రోగ్రాం కింద 2026 ఏఐ బ్యాచ్‌ను ప్రారంభించేందుకు గూగుల్ ఏఐ ఫ్యూచర్స్ ఫండ్ (ఏఐఎఫ్ఎఫ్)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు అంతర్జాతీయ వెంచర్ క్యాపిటల్ సంస్థ యాక్సెల్ వెల్లడించింది. దీని ప్రకారం భారత్‌లో వినూత్న ఏఐ కంపెనీల్లో యాక్సెల్, గూగుల్ ఇన్వెస్ట్ చేస్తాయి. స్టార్టప్‌లను వృద్ధిలోకి తేవడంలో యాక్సెల్‌కి గల అనుభవం .. పరిశోధనలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక మద్దతు కల్పించడంలో గూగుల్ సామర్థ్యాల కలయికతో అంకుర సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందని ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. 2026 ఆటమ్స్ ఏఐ ప్రోగ్రాం కింద ఒక్కో అంకుర సంస్థలో ఇరు సంస్థలు కలిసి చెరి సగం చొప్పున 2 మిలియన్ డాలర్ల వరకు ఇన్వెస్ట్ చేస్తాయి. పెట్టుబడితో పాటు వ్యవస్థాపకులకు 3,50,000 డాలర్ల విలువ చేసే గూగుల్ క్లౌడ్, జెమిని, డీప్‌మైండ్ వనరులకు సంబంధించిన కంప్యూట్ క్రెడిట్స్, జెమిని..డీప్‌మైండ్ మోడల్స్‌కు ముందస్తుగా యాక్సెస్ లాంటి ప్రయోజనాలు లభిస్తాయి. దేశీ ఏఐ అంకుర సంస్థలు మరింత వేగంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి వచ్చేందుకు ఇది ఉపయోగపడనుంది. యాక్సెల్ తమ ఆటమ్స్ ప్రోగ్రాం ద్వారా దాదాపు 40 పైగా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఇవి తదుపరి దశలో సుమారు 300 మిలియన్ డాలర్ల పైచిలుకు పెట్టుబడులను సమకూర్చుకున్నాయి.

వెల్త్ కంపెనీ 'సిఫ్'కు సెబీ అనుమతి

న్యూఢిల్లీ: ద వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ 'స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సిఫ్)' ప్రారంభించేందుకు సెబీ అనుమతి జారీ చేసింది. సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) మధ్య అంతరాన్ని భర్తీ చేసేందుకు సిఫ్ పేరుతో సెబీ కొత్త విభాగాన్ని ప్రవేశపెట్టడం తెలిసిందే. 'డబ్ల్యూఎస్ఐఎఫ్' పేరుతో సిఫ్‌ను నిర్వహించనున్నట్టు పాంటోమ్యాథ్ గ్రూప్ సంస్థ అయిన ద వెల్త్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. క్లయింట్ల అసెట్ అలోకేషన్ ప్రాధాన్యతలు, వారి రిస్క్‌కు అనుగుణంగా సిఫ్ కింద పలు ఉత్పత్తులను అందించే ప్రతిపాదన ఉన్నట్టు ద వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో లూనావత్ మధు తెలిపారు. సిఫ్‌లో కనీస పెట్టుబడి రూ.10 లక్షలు.

డెట్ ఫండ్స్‌కు పెట్టుబడుల కళ

లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్స్‌కు ఆదరణ

- అక్టోబర్‌లో రూ.1.6 లక్షల కోట్లు రాక

న్యూఢిల్లీ: డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి అక్టోబర్‌లో భారీగా పెట్టుబడులు తరలివచ్చాయి. ప్రధానంగా లిక్విడ్ ఫండ్స్, ఓవర్‌నైట్ ఫండ్స్‌కు ఆదరణ లభించింది. మొత్తం మీద రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడులను డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు ఆకర్షించాయి. అంతకుముందు నెలలో (సెప్టెంబర్) డెట్ ఫండ్స్ నుంచి రూ.1.02 లక్షల కోట్లు బయటకు వెళ్లడం గమనార్హం. ఆగస్ట్‌లోనూ రూ.7,980 కోట్లు ఈ విభాగం నుంచి బయటకు వెళ్లగా, జూలైలో రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్ చివరికి పరిశ్రమ వ్యాప్తంగా డెట్ ఫండ్స్ నిర్వహణ ఆస్తుల (ఏయూఎం) విలువ 10 శాతం మేర పెరిగి రూ.19.51 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబర్ చివరికి ఈ మొత్తం రూ.17.8 లక్షల కోట్లుగా ఉన్నట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) వెల్లడించింది. ''ఇక ముందూ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్) విభాగంలో పెట్టుబడులు ప్రధానంగా లిక్విడ్, మనీ మార్కెట్, అధిక నాణ్యతతో కూడిన అక్రూయెల్ కేటగిరీల్లోకే రావొచ్చు. భవిష్యత్ రేట్ల తగ్గింపు విషయంలో స్పష్టత తర్వాతే డ్యురేషన్ ఫండ్స్ విషయంలో ఇన్వెస్టర్లు నిర్ణయం తీసుకోవచ్చు''అని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ తెలిపారు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు మిగులు నిల్వలను తిరిగి లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్లే పెట్టుబడులు గణనీయంగా పెరిగేందుకు దారితీసినట్టు చెప్పారు.

విభాగాల వారీగా..

- ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో మొత్తం 16 విభాగాలు ఉంటే, అందులో పదింటిలోకి అక్టోబర్‌లో పెట్టుబడులు వచ్చాయి.
- లిక్విడ్ ఫండ్స్ అత్యధికంగా రూ.89,375 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. సెప్టెంబర్‌లో ఇదే విభాగం నుంచి రూ.66,042 కోట్లు బయటకు వెళ్లాయి.
- ఓవర్‌నైట్ ఫండ్స్‌లోకి రూ.24,051 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- మనీ మార్కెట్ ఫండ్స్ సైతం నికరంగా రూ.17,916 కోట్లను రాబట్టాయి.
- షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు సైతం ఆదరణ లభించింది. అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోకి రూ.15,067 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- కార్పొరేట్ బాండ్ ఫండ్స్‌లోకి రూ.5,121 కోట్లు వచ్చాయి.
- గిల్ట్ ఫండ్స్ నుంచి రూ.931 కోట్లు, డైనమిక్ బాండ్ ఫండ్స్ నుంచి రూ.232 కోట్లు చొప్పున బయటకు వెళ్లాయి. క్రెడిట్ రిస్క్ ఫండ్స్ సైతం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు పెరిగిన డిమాండ్

పండుగల సమయంలో బలంగా అమ్మకాలు

- డిమాండ్ ఇకపైనా కొనసాగుతుందా? చూడాల్సిందే
- రేటింగ్ సంస్థ ఇక్రా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగదారులపై పన్నుల భారం తగ్గిందని, దీంతో పండుగల సమయంలో కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు డిమాండ్ పెరిగినట్టు రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. కాకపోతే ఈ డిమాండ్ ఇక ముందూ స్థిరంగా కొనసాగుతుందా అన్నది చూడాల్సి ఉందని పేర్కొంది. సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రేట్లతో 375 వస్తువులపై పన్ను భారం తగ్గడం గమనార్హం. వినియోగ ధరలను మరింత అందుబాటులోకి తీసుకురావడం, వ్యాపార సంస్థలకు నిర్వహణ వ్యయాలను తగ్గించడం, వివిధ విభాగాల్లో డిమాండ్‌కు ప్రేరణనివ్వడం జీఎస్టీ సంస్కరణల వెనుక లక్ష్యంగా ఇక్రా పేర్కొంది. పండుగల సీజన్‌లో అమ్మకాలు ఈ ప్రయోజనాలను రుజువు చేస్తున్నాయని, డిమాండ్ తిరిగి పుంజుకోవడాన్ని సూచిస్తున్నాయని తెలిపింది. జీఎస్టీ రేట్ల తగ్గింపునకు తోడు పెంటప్ డిమాండ్ (గతంలో నిలిచిన డిమాండ్ తోడవడం), పండుగల ముందస్తు సానుకూలత సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో డిమాండ్‌కు మద్దతునిచ్చాయని, ఇది అక్టోబర్‌లో తయారీ వృద్ధికి ఊతమిచ్చినట్టు పేర్కొంది. జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణతో పండుగలు ముగిసిన తర్వాత కూడా చిన్న ప్యాక్‌లకు డిమాండ్ కొనసాగుతుందని, అదే సమయంలో పెద్ద వస్తువులకు డిమాండ్ ఎలా ఉంటుందో చూడాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ''అక్టోబర్ నెల క్రెడిట్ కార్డు లావాదేవేల డేటా నవంబర్ చివరికి గానీ విడుదల కాదు. అలాగే, అక్టోబర్ నెలకు సంబంధించి లావాదేవీలపై నవంబర్‌లో వసూలైన జీఎస్టీ డేటా డిసెంబర్ 1న విడుదల అవుతుంది. అక్టోబర్‌లో వినియోగ ధోరణులపై ఈ డేటాతో స్పష్టత ఏర్పడుతుంది''అని ఇక్రా పేర్కొంది.

తీరప్రాంతంలేని రాష్ట్రాల ఎగుమతిదార్లకు కేంద్రం మద్దతు

మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: తీరప్రాంతంలేని రాష్ట్రాలు కూడా ఎగుమతుల్లో పోటీపడేలా ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ కింద కేంద్రం తోడ్పాటు అందించనున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. ఇటీవల రూ. 25,060 కోట్లతో రూపొందించిన ప్రణాళికలో ఇందుకు సంబంధించిన స్కీములు ఉంటాయని పేర్కొన్నారు. ఎగుమతుల వృద్ధికి దోహదపడేలా కేంద్రం, రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం పటిష్టంగా ఉండాలని ఆయన చెప్పారు. వాణిజ్య బోర్డ్ (బీవోటీ) నాలుగో సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు వివరించారు. తీరప్రాంతం లేని రాష్ట్రాల్లో తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి. రాష్ట్రాల నుంచి వచ్చే వివరాలను బట్టి కొత్తగా తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు అమలు చేయతగిన చర్యలపై సంబంధిత ఏజెన్సీలతో తమ శాఖ కలిసి పని చేస్తుందన్నారు. అమెరికా విధించిన భారీ టారిఫ్‌ల వల్ల తలెత్తిన అనిశ్చితుల ప్రభావం నుంచి ఎగుమతిదార్లకు రక్షణ కల్పించేలా నవంబర్ 12న రూ. 25,060 కోట్లతో కేంద్రం ఎగుమతుల ప్రమోషన్ మిషన్‌ను ఆమోదించింది. 2025–26 నుంచి మొదలై ఇది ఆరేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

పన్ను కోతలతో ఆదాయ వృద్ధి కష్టమే

- ద్రవ్య స్థిరీకరణకు అవరోధాలు
- మూడిస్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సర్కారు తీసుకున్న పన్ను తగ్గింపు నిర్ణయాలు ఆదాయ వృద్ధిని అడ్డుకుంటాయని.. దీంతో ద్రవ్యపరమైన మద్దతుకు పెద్ద అవకాశాల్లేవని మూడిస్ రేటింగ్స్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ''ఆదాయ వృద్ధిలో బలహీనత స్పష్టంగా కనిపిస్తోంది. ద్రవ్య స్థిరీకరణ పరంగా అవరోధాలు ఎదుర్కోవచ్చు. కొన్ని పన్ను తగ్గింపులను కూడా చూశాం. ఇది ఆదాయ వృద్ధికి మరింత అడ్డుగా మారొచ్చు. కనుక ద్రవ్యపరమైన మద్దతుకు అవకాశాలు తక్కువగానే ఉన్నాయి'' అని మూడిస్ రేటింగ్స్ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ పెట్చ్ పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరికి నికర పన్ను వసూళ్లు 12.29 లక్షల కోట్లుగా ఉన్నట్టు ప్రభుత్వ డేటా ఆధారంగా తెలుస్తోంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.12.65 లక్షల కోట్ల కంటే స్వల్పంగా తగ్గడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ప్రభుత్వం వేసుకున్న పన్ను వసూళ్ల అంచనాల్లో 43.3 శాతమే సెప్టెంబర్ చివరికి (ఆరు నెలల్లో) సమకూరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఆదాయం అంచనాల్లో 49 శాతం మేర తొలి ఆరు నెలల్లో రావడం ఉంది. ఆదాయపన్ను మినహాయింపును కొత్త విధానంలో రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచుతూ కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ఇక సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ శ్లాబుల్లో తీసుకొచ్చిన మార్పులతో 375 ఉత్పత్తులపై పన్ను తగ్గింది. వాస్తవానికి ఈ రేటు తగ్గింపుతో వినియోగం పెరుగుతుందన్నది కేంద్రం అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటు 4.4 శాతానికి పరిమితం చేయాలన్నది కేంద్రం లక్ష్యం.

వినియోగం, వ్యయాలే అండ..

ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగిరావడం, వడ్డీ రేట్ల తగ్గింపుతో గృహాల కొనుగోలు శక్తి పెరుగుతుందని, ఇది వినియోగానికి మద్దతునిస్తుందని మార్టిన్ పెట్చ్ అన్నారు. దేశీ వినియోగానికి తోడు మౌలిక వసతుల అభివృద్ధికి చేసే వ్యయాలు భారత ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని.. అమెరికా టారిఫ్‌ల ప్రభావాన్ని సర్దుబాటు చేస్తాయని పేర్కొన్నారు. ఒకవేళ టారిఫ్‌లు ఇక ముందూ గరిష్ట స్థాయిలోనే కొనసాగితే, అది ఇకపై పెట్టుబడులను ప్రతికూలంగా మారొచ్చన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 2025లో 7 శాతం, 2026లో 6.5 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని గత వారం మూడిస్ అంచనాలు వ్యక్తం చేయడం తెలిసిందే.

విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను క్రమబద్ధీకరించాలి

- కస్టమ్స్ వివాద పరిష్కారాలను డిజిటలైజ్ చేయాలి
- బడ్జెట్‌పై కేంద్ర సర్కారుకు డెలాయిట్ సూచనలు



న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్‌లో (2026–27) విత్ హోల్డింగ్ ట్యాక్స్ (మూలం వద్దే పన్ను వసూలు)ను క్రమబద్ధీకరించాలని డెలాయిట్ ఇండియా కేంద్రానికి సూచించింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ), పునరుత్పాదక ఇంధన వనరులు, ఏఐ వంటి వర్ధమాన, అధిక వృద్ధి అవకాశాలున్న రంగాల్లో పెట్టుబడులు, ఆవిష్కరణలకు మద్దతునిచ్చేందుకు పన్ను ప్రోత్సాహకాలను ప్రకటించాలని కోరింది. కస్టమ్స్ వివాద ప్రక్రియలను డిజిటలైజ్ చేయాలని.. తద్వారా లెటర్లను డిజిటల్‌గా ఫైలింగ్ చేయడంతోపాటు, అప్పీళ్లు, కస్టమ్స్ అధికారులతో అన్ని రకాల సంప్రదింపులను డిజిటల్‌గా నిర్వహించుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొంది. అలాగే, ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) రిఫండ్‌ల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించుకునేందుకు పన్ను చెల్లింపుల పోర్టల్‌పై డాష్‌బోర్డ్‌ను ప్రవేశపెట్టాలని.. రిఫండ్ ఎప్పటిలోపు వస్తుందన్న సమాచారం కూడా అక్కడ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. గడువులోపు రిఫండ్‌లు రాని సందర్భాల్లో 'రైజ్ కన్సర్న్' లేదా 'ఎస్కలేట్' బటన్లు ఉండాలని పేర్కొంది. దీనివల్ల భౌతికంగా విచారించుకోవాల్సిన అవసరం తప్పుతుందని, పన్ను చెల్లింపుదారుల అనుభవం మెరుగవుతుందని తెలిపింది.

ఎగుమతిదారులకు ప్రత్యేక నిధి..

అమెరికా టారిఫ్‌ల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రంగాలను ఆదుకునేందుకు లేదా సరఫరా పరమైన సమస్యలను ఎదుర్కొనేందుకు 'ట్రేడ్ రీసైలెన్స్ ఫండ్'ను ఏర్పాటు ఏయాలని డెలాయిట్ ఇండియా సూచించింది. టారిఫ్‌లు లేదా ముడి సరుకుల ధరల కారణంగా మార్జిన్లపై ఒత్తిడి ఎదుర్కొనే ఎగుమతిదారులకు ద్రవ్యపరమైన లేదా రుణపరమైన సహకారం అందించాలని కోరింది. ఎన్‌బీఎఫ్‌సీలు/ఫిన్‌టెక్‌ల రూపంలో ఎంఎస్ఎంఈలకు రుణ సాయాన్ని పెంచేందుకు వీలుగా సూచనలు సైతం చేసింది. ప్రస్తుత విత్‌హోల్డింగ్ పన్ను విధానంలో ఒకటికి మించిన టీడీఎస్/టీసీఎస్ రేట్లు (0.1 శాతం నుంచి 35 శాతం వరకు) ఉండడాన్ని ప్రస్తావించింది. నిబంధనల అమలును మరింత సంక్లిష్టంగా, లోపాలమయంగా ఇది మారుస్తున్నట్టు వివరించింది. ఎక్కువ మొత్తాన్ని పన్ను రూపంలో ముందే మినహాయించుకోవడం వల్ల పన్ను చెల్లింపుదారులకు నిధులపరమైన సమస్యలకు దారితీస్తుందని పేర్కొంది. కనుక విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను క్రమబద్ధీకరించేందుకు, నిబంధనల అమలును మరింత సమర్థవంతంగా మార్చేందుకు గాను జీఎస్టీని వినియోగించుకోవాలని సూచించింది. విత్‌హోల్డింగ్ ట్యాక్స్ నిబంధనలను.. వస్తువుల, సేవలు, రెసిడ్యూరీ లావాదేవీలు (వడ్డీ, డివిడెండ్) అని మూడు విభాగాలుగా చేయాలని కోరింది. దక్షిణ కొరియా తదితర దేశాలు పన్ను ప్రోత్సాహకాలతో ఆర్అండ్‌డీపై పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

శ్రమించి గెలిచిన గాయత్రి-ట్రెసా జోడీ

లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ తొలి అడ్డంకిని దాటడానికి తీవ్రంగా శ్రమించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ గాయత్రి-ట్రెసా ద్వయం 19-21, 22-20, 21-9తో చెంగ్ సు హుయ్-టాన్ జింగ్ యి (మలేసియా) జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా జోడీ తొలి గేమ్‌ను కోల్పోయినా... రెండో గేమ్‌లో తేరుకొని మ్యాచ్‌లో నిలిచింది. ఆ తర్వాత నిర్ణాయక మూడో గేమ్‌లో సమన్వయంతో ఆడి విజయాన్ని అందుకుంది. భుజం గాయం కారణంగా ఐదు నెలలపాటు ఆటకు దూరంగా ఉన్న గాయత్రి గతవారం ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 టోర్నీతో పునరాగమనం చేసింది. మరోవైపు ప్రియ-శ్రుతి మిశ్రా జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో ప్రియ-శ్రుతి 21-8, 21-11తో రీవా-సమృద్ధి సింగ్‌లపై గెలుపొందారు. భారత్‌కే చెందిన రుతుపర్ణ పాండా-శ్వేతాపర్ణ పాండా... దీప్షిక సింగ్-సోనాలీ సింగ్... అపర్ణ బాలన్-దివ్య... కవిప్రియ సెల్వం-సిమ్రన్... రష్మీ-సానియా సికందర్... తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో గొబ్బూరు విశ్వతేజ్-అరిగెల భార్గవ్ రామ్ (భారత్) జోడీ 16-21, 14-21తో చియా వెజి-షెంగ్ హావో (మలేసియా) జంట చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ ద్వారా ఆర్య భివ్‌పాథకి, అభినవ్, భరత్ రాఘవ్, ఊర్జిత్... మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ ద్వారా అదితి రావు, అలీషా నాయక్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు.

డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు (ఫైల్)

ధనాధన్ ధమాకా

నేటి నుంచి ముస్తాక్ అలీ దేశవాళీ టి20 టోర్నీ

- ఐపీఎల్ జట్ల దృష్టిలో పడేందుకు కుర్రాళ్ల తహతహ
- ఫిట్‌నెస్ నిరూపించుకునే పనిలో హార్దిక్ పాండ్యా
- సత్తా చాటుకోవాలనే లక్ష్యంతో పృథ్వీ షా
- డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి ముంబై

ఐపీఎల్‌పైనే పృథ్వీ ఆశలు

ఐపీఎల్ సహా టీమిండియా తరపున ఆడిన పృథ్వీ షా చాన్నాళ్లుగా ఫామ్ లేమి, ఫిట్‌నెస్, ప్రవర్తన సరళి బాగోలేక జాతీయ జట్టుతో పాటు సొంత ముంబై జట్టుకు దూరమయ్యాడు. ఇప్పుడు మహారాష్ట్ర తరపున రంజీలాడుతున్న పృథ్వీ... టీమిండియా బెర్త్ సంగతి దేవుడెరుగు ముందు ఐపీఎల్ ఫ్రాంచైజీల కంటపడితే చాలనే ఆశతో ముస్తాక్ అలీ టోర్నీలో మెరిపించేందుకు తెగ కష్టపడుతున్నాడు. నేటి నుంచి హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతా, లక్నో వేదికల్లో ఈ దేశవాళీ టి20 టోర్నీ జరుగుతుంది.

హైదరాబాద్: క్రికెట్ ప్రపంచం మొత్తం కన్నేసే ఐపీఎల్‌లో ఫ్రాంచైజీల కంట... వేలం పంట పండించుకునేందుకు యువ ఆటగాళ్లకు చక్కని అవకాశమిది. నేటి నుంచి జరిగే దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరుపులు మెరిపించేందుకు భారత కుర్రాళ్లు సై అంటున్నారు. కుర్రాళ్లతో పోటీ పడేందుకు, తిరిగి టీమిండియా తరపున పునరాగమనం చేసేందుకు భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా సన్నద్ధమవుతున్నాడు. ఇతనొక్కడే కాదు... మరో 74 రోజుల్లోనే ఐసీసీ టి20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, సంజూ సామ్సన్, శార్దుల్ ఠాకూర్‌లతో పాటు తెరమరుగైన పృథ్వీ షా కూడా ముస్తాక్ అలీ టోర్నీ బరిలోకి దిగుతున్నాడు.

బరోడా బలం పాండ్యా

హార్దిక్ పాండ్యా ఆసియా కప్ సందర్భంగా కండరాల గాయానికి గురయ్యాడు. దీంతో టైటిల్ గెలిచిన సూర్యకుమార్ జట్టులో లేడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకున్న ఈ ఆల్‌రౌండర్ ఫామ్‌పై ఎవరికి ఏ అనుమానాలు లేకపోయినా... భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమివ్వబోయే టి20 మెగా ఈవెంట్‌కు మధ్యలో ఉన్నది ఒకే ఒక్క టి20 సిరీస్ దక్షిణాఫ్రికాతో డిసెంబర్ 9న మొదలవుతుంది. దీంతో ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు హార్దిక్‌కు ఈ టోర్నీ కీలకంగా మారింది. అతనింకా బరోడా జట్టుతో చేరకపోయినప్పటికీ ఎక్కువ మ్యాచ్‌లు ఆడేందుకు సిద్ధంగానే ఉన్నట్లు కోచ్ ముకుంద్ పర్మార్ వెల్లడించారు. ముంబై తరపున సూర్యకుమార్ గ్రూప్ దశ మ్యాచ్‌లన్నీ ఆడేందుకు ఆసక్తి కనబరిచినట్లు తెలిసింది. సహచరుడు శివమ్ దూబే సైతం ముంబైకి సై అంటున్నాడు. అయితే డిఫెండింగ్ చాంపియన్ ముంబైకి శార్దుల్ ఠాకూర్ సారథ్యం వహిస్తున్నాడు. 'మిస్టరీ స్పిన్నర్' వరుణ్ చక్రవర్తి తమిళనాడు కెప్టెన్‌గా, సంజూ సామ్సన్ కేరళ కెప్టెన్‌గా తమ జట్లను నడిపించనున్నారు.

ఏ గ్రూప్‌లో ఎవరున్నారంటే...

గ్రూప్ 'ఎ' (8): ఆంధ్ర, అస్సాం, ఛత్తీస్‌గఢ్, కేరళ, ముంబై, ఒడిశా, రైల్వేస్, విదర్భ.
గ్రూప్ 'బి' (8): హైదరాబాద్, బిహార్, చండీగఢ్, గోవా, జమ్మూ కశ్మీర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్.
గ్రూప్ 'సి' (8): బరోడా, బెంగాల్, గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి, పంజాబ్, సర్వీసెస్.
గ్రూప్ 'డి' (8): ఢిల్లీ, జార్ఖండ్, కర్ణాటక, రాజస్తాన్, సౌరాష్ట్ర, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్.

టోర్నీ జరిగేదిలా...

మొత్తం 32 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో 8 జట్లకు చోటు కల్పించారు. గ్రూప్‌లోని ఒక జట్టు మిగతా ఏడు జట్లతో ఒక్కోసారి తలపడుతుంది. గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగిశాక... నాలుగు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు (8) 'సూపర్ లీగ్' దశకు అర్హత సాధిస్తాయి. సూపర్ లీగ్‌కు అర్హత పొందిన 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. గ్రూప్ 'ఎ'లో 4 జట్లు... గ్రూప్ 'బి'లో 4 జట్లు ఉంటాయి. 'సూపర్ లీగ్' మ్యాచ్‌లు ముగిశాక గ్రూప్ 'ఎ' విజేత... గ్రూప్ 'బి' విజేత ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

మ్యాచ్‌లు ఎక్కడంటే...

గ్రూప్ దశ లీగ్ మ్యాచ్‌లు దేశంలోని నాలుగు వేదికల్లో జరుగుతాయి. గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లను లక్నోలో... గ్రూప్ 'బి' మ్యాచ్‌లను కోల్‌కతాలో... గ్రూప్ 'సి' మ్యాచ్‌లను హైదరాబాద్‌లో... గ్రూప్ 'డి' మ్యాచ్‌లను అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. 'సూపర్ లీగ్' మ్యాచ్‌లకు, ఫైనల్ మ్యాచ్‌కు ఇండోర్ ఆతిథ్యమిస్తుంది. గ్రూప్ దశ లీగ్ మ్యాచ్‌లు డిసెంబర్ 10వ తేదీ వరకు జరుగుతాయి. 'సూపర్ లీగ్' మ్యాచ్‌లు డిసెంబర్ 12 నుంచి 16 వరకు నిర్వహిస్తారు. ఫైనల్ మ్యాచ్ డిసెంబర్ 18న జరుగుతుంది.

సుమిత్ నగాల్ శుభారంభం

చెంగ్డూ (చైనా): ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026 గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ ఆసియా పసిఫిక్ వైల్డ్ కార్డు ప్లే ఆఫ్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆరో సీడ్ సుమిత్ 2-6, 6-0, 6-2తో మింగ్‌హుయ్ జాంగ్ (చైనా)పై గెలుపొందాడు. 1 గంట 42 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తొలి సెట్‌ను కోల్పోయినా... వెంటనే తేరుకొని తర్వాతి రెండు సెట్‌లను నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మూడు ఏస్‌లు సంధించిన ప్రపంచ 276వ ర్యాంకర్ సుమిత్ ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. తొలి సర్వీస్‌లో 28 పాయింట్లకుగాను 22 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 10 పాయింట్లకుగాను 6 పాయింట్లు సాధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన సుమిత్... ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు.

పోరాడి ఓడిన సహజ

ఇదే టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. జియాంగ్‌జుయ్ హాన్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 307వ ర్యాంకర్ సహజ 2-6, 7-5, 6-7 (4/7)తో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక్క ఏస్ సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 80 పాయింట్లకుగాను 43 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 23 పాయింట్లకుగాను 8 పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక మూడో సెట్ టైబ్రేక్‌లో సహజ కీలకదశలో పాయింట్లు కోల్పోయి ఓటమి పాలైంది. ఈ టోర్నీ విజేతలకు మాత్రమే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి వైల్ కార్డు కేటాయిస్తారు.

ప్రి వెడ్డింగ్ 'పోస్ట్'లను తొలగించిన స్మృతి మంధాన



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ప్రి వెడ్డింగ్ తాలూకు వీడియోలు, ఫోటోల్ని తొలగించింది. పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమైన స్మృతి... తన తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురవడంతో చివరి నిమిషంలో పెళ్లి వాయిదా వేసింది. అప్పటివరకు టీమిండియా సహచరిణిలతో హల్దీ వేడుకలో చేసిన సందడి, కాబోయే భర్త పలాశ్ ముచ్చల్‌తో మైదానంలో ఉంగరాలు మార్చుకున్న మురిపెంను ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకుంది. అయితే అనూహ్యంగా పెళ్లి వాయిదా పడటంతో ఈ పోస్ట్‌లను స్మృతి తన ఖాతా నుంచి తొలగించింది. వరుడు పలాశ్ కూడా అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యాడు. స్మృతి నాన్న అనారోగ్యం వల్లే ప్రస్తుతానికి పెళ్లి వాయిదా వేశామని, ఇలాంటి సమయంలో రెండు కుటుంబాల ప్రతిష్టను గౌరవించాలని పలాశ్ సోదరి, గాయని పలక్ సూచించింది.

ఎసిపెంకో

విజేత తేలేది టైబ్రేక్‌లోనే...

- ప్రపంచకప్ చెస్ ఫైనల్ రెండో గేమ్ కూడా 'డ్రా'
- ఎసిపెంకోకు మూడో స్థానం
- క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

పనాజీ: పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ కొత్త విజేత ఎవరో నేడు తేలనుంది. సిందరోవ్ జవోఖిర్ (ఉజ్బెకిస్తాన్), వె యి (చైనా) మధ్య ఫైనల్ మ్యాచ్‌లోని నిర్ణీత రెండు క్లాసిక్ గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. దాంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. ఫలితంగా వీరిద్దరి మధ్య నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. సిందరోవ్, వె యి మధ్య మంగళవారం జరిగిన రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా' అయింది. అంతకుముందు భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి రెండో గేమ్‌ను ప్రారంభించింది.

టైబ్రేక్ జరిగేది ఇలా...

సిందరోవ్, వె యి మధ్య నేడు ముందుగా 15 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు నిర్వహిస్తారు. ఇందులో ఫలితం తేలకపోతే 10 నిమిషాల నిడివిగల మరో రెండు గేమ్‌లను ఆడిస్తారు. ఇక్కడా ఫలితం రాకపోతే 5 నిమిషాల నిడివిగల మరో రెండు గేమ్‌లను నిర్వహిస్తారు. అయినా విజేత తేలకపోతే 3 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లను ఆడిస్తారు. ఇక్కడా స్కోరు సమమైతే ఇద్దరి మధ్య 'సడన్ డెత్' గేమ్ నిర్వహిస్తారు. ఒకవేళ 'సడెన్ డెత్' గేమ్ కూడా 'డ్రా' అయితే నల్లపావులతో ఆడిన ప్లేయర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

మరోవైపు రష్యా గ్రాండ్‌మాస్టర్ ఆండ్రీ ఎసిపెంకో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. నొదిర్‌బెక్ యాకుబొయేవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన పోటీలో ఎసిపెంకో 2-0తో గెలిచి వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాడు. నొదిర్‌బెక్‌తో సోమవారం జరిగిన తొలి గేమ్‌లో 38 ఎత్తుల్లో గెలిచిన ఎసిపెంకో... మంగళవారం జరిగిన రెండో గేమ్‌లో 26 ఎత్తుల్లో విజయం సాధించాడు.



కొన్ని మార్చుకున్నా... ఇంకొన్ని నేర్చుకున్నా!

- భారత నంబర్‌వన్ షట్లర్ లక్ష్య సేన్ వ్యాఖ్య
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో సీజన్ ముగింపు

న్యూఢిల్లీ: వైఫల్యాలను అధిగమించేందుకు నేర్చుకున్న పాఠాలు, మార్చుకున్న ఆటతీరే ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టైటిల్ విజయానికి కారణమని భారత నంబర్‌వన్ షట్లర్ లక్ష్యసేన్ అన్నాడు. పారిస్ ఒలింపిక్స్ వైఫల్యం తన గుండెను బద్దలు చేసిందని, తన ఆత్మవిశ్వాసాన్ని సన్నగిల్లేలా చేసిందని... దీంతో శారీరక ఫిట్‌నెస్, మానసిక స్థైర్యంపైనే ఎక్కువగా దృష్టి పెట్టానని 24 ఏళ్ల ఈ భారత బ్యాడ్మింటన్ స్టార్ చెప్పాడు. 'పారిస్'లో కాంస్య పతకం కోసం గట్టిగానే పోరాడినా... చివరకు నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో తనకెదురైన అనుభవాలు, ఆటలో లక్ష్యాలు లక్ష్య సేన్ మాటల్లోనే...

ఫలితాలు పక్కనబెట్టి...

నాకెదురైన చేదు అనుభవాలు నాలోని స్ఫూర్తిని కొరవడేలా చేశాయి. దీంతో నా పంథా మార్చుకున్నా. ఫలితాల కోసం కాదు... ముందు ఆటతీరును మెరుగు పర్చుకోవడం కోసమే ఆడటం మొదలుపెట్టాను. దీంతో ఈ సీజన్‌లో టైటిల్స్‌లో వెనుకబడినప్పటికీ ఆటలో మార్పు, ఫిట్‌నెస్‌లో మెరుగుదల, మానసిక బలం అన్ని సానుకూలంగా మలచుకున్నాను. ఇవే తాజా విజయానికి కారణం.

పోటీ పెరిగింది

బ్యాడ్మింటన్‌లో పోటీ బాగా పెరిగింది. ఎంతో మంది మేటి షట్లర్లు వస్తున్నారు. నిలకడగా రాణిస్తున్నారు. మనం కూడా దీటుగా తయారు కావాలి. అదే ఉత్సాహంతో ఆటను కొనసాగించాలి. వచ్చే ఏడాది మాకెంతో కీలకం. రెగ్యులర్ ఈవెంట్లతో పాటు అంతర్జాతీయ టోర్నీలున్నాయి. ఫిట్‌నెస్, నిలకడ ఎంతో ముఖ్యం. అయితే ప్రస్తుతానికి ఒక్కో టోర్నీ ఆడటంపైనే దృష్టి పెట్టాను.

వైవిధ్యం చూపించాల్సిందే

సీనియర్ సర్క్యూట్‌లోకి వచ్చి మూణ్నాలుగేళ్లవుతోంది. ప్రత్యర్థులకు మన ఆట ఏంటో ఈ పాటికే అర్థమై ఉంటుంది. కాబట్టి ఇప్పుడు వైవిధ్యం చూపించాల్సిందే. నా కోచ్ యూ యంగ్ సాంగ్ కూడా ఇదే విషయాన్ని గట్టిగా చెప్పాడు. ఫిట్‌నెస్‌తో చురుకుదనం, షాట్ల వైవిధ్యంతో ఆటతీరు నన్ను మేటిగా మార్చుతుంది. అందుకే ఇప్పుడు ఒకప్పటిలా కాకుండా కొత్తగా ఆడేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నా. పూర్తి వైవిధ్యమైన ఆటతీరును కనబరచడంపైనే ఉత్సాహంగా ఉన్నా.

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ భారత్ తొలి ఓటమి చవిచూసింది. బెల్జియం జట్టుతో మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. భారత్ తరపున అభిషేక్ (33వ నిమిషంలో), శిలానంద్ లాక్రా (57వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బెల్జియం తరపున రోమన్ డువెకోట్ (17వ, 57వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా... నికోలస్ డె కెర్పెల్ (45వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. బెల్జియం జట్టుకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక దానిని సద్వినియోగం చేసుకుంది. భారత జట్టుకు లభించిన ఏకైక పెనాల్టీ కార్నర్ వృథా అయింది. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఒక మ్యాచ్‌లో గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓడి మూడు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరోవైపు బెల్జియం ఒక మ్యాచ్‌లో నెగ్గి, మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. నేడు జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియా జట్టుతో భారత్ ఆడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాక తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో టైటిల్ కోసం పోటీపడతాయి.

రామ్ దర్బార్‌లో మోహన్ భాగవత్‌తో కలిసి మోదీ పూజలు

రామ్‌లల్లాకు మోదీ ప్రత్యేక పూజలు

అయోధ్య రామాలయంలో మంగళవారం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు. (ఇన్‌సెట్) జెండా

భారత్‌లోని యూదులను తీసుకెళ్లేందుకు

ఇజ్రాయెల్ ఆమోదం

- ఐదేళ్లలో 5,800 మందిని తీసుకెళ్లాలని ప్రణాళిక
- 2026లో 1,200 మంది వలసకు అవకాశం

జెరూసలేం: ఈశాన్య భారతంలో ఉన్న 5,800 మంది యూదులను రాబోయే ఐదేళ్లలో ఇజ్రాయెల్‌కు తీసుకెళ్లే ప్రతిపాదనకు ఆ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతంలో ఉన్న బ్నీ మెనాషే కమ్యూనిటీ వలసలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని యూదు ఏజెన్సీ తెలిపింది. '2030 నాటికి 5,800 మంది కమ్యూనిటీ సభ్యులను ఇజ్రాయెల్‌కు తీసుకొస్తుంది. 2026లో 1,200 మంది ఇజ్రాయెల్‌కు రానున్నారు'అని వెల్లడించింది. ప్రీ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియకు ఒక యూదు ఏజెన్సీ నాయకత్వం వహించడం ఇది మొదటిసారి. వీరు ఇజ్రాయెల్ చీఫ్ రబ్బినేట్, కన్వర్షన్ అథారిటీ, పాపులేషన్–ఇమిగ్రేషన్ అథారిటీతో కలిసి అర్హత ఇంటర్వ్యూలు నిర్వహించడం, అర్హత ఉన్న వారిని తీసుకెళ్లడానికి విమానాలను నిర్వహించడం, ఇజ్రాయెల్‌లో వారు కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం ఈ ఏజెన్సీనే చేస్తుంది. వలసదారుల విమాన ఖర్చులు, వారి మత మార్పిడి, గృహ నిర్మాణం, హిబ్రూ పాఠాలు చెప్పడంతోపాటు ఇతర ప్రయోజనాలను కల్పించడానికి 90 మిలియన్ షెకెల్స్ బడ్జెట్‌ను అంచనా వేసింది. దీనిని ఇమ్మిగ్రేసన్, ఇంటిగ్రేషన్ మంత్రి ఓఫిర్ సోఫర్‌మంత్రి వర్గానికి సమర్పించారు. ఈ ప్రక్రియ నిర్వహణ కోసం రబ్బీల ప్రతినిధి బృందం రాబోయే రోజుల్లో ఇండియాకు రానుంది. ఇలా వసల వెళ్లినవారికి ప్రారంభంలో వెస్ట్‌బ్యాంక్‌లో పునరావాసం కల్పించారు. ఇటీవల వారిని ఇజ్రాయెల్‌లోని నజరేత్‌కు చాలా దగ్గరగా ఉన్న అరబ్ నగరం నోఫ్ హగలిల్ పట్టణానికి పంపారు. రాబోయే ఐదేళ్లలో షెడ్యూల్ చేసిన వారిని కూడా అక్కడే స్థిరపడేలా చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో బ్నీ మెనాషే యూదుల గురించి అనేక చర్చలు జరిగాయి. బ్నీ మెనాషే అనేది మణిపూర్, మిజోరాంలలో ఉన్న యూదు కమ్యూనిటీ. ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయిన 12 తెగలలో ఒక తెగకు చెందినవారుగా భావిస్తారు. 2005లోఎ అప్పటి చీఫ్ రబ్బీ వారిని ఇజ్రాయెల్ వారసులుగా గుర్తించి వారి ఇజ్రాయెల్ వలసలకు మార్గం సుగమం చేశారు. ఇప్పటికే బ్నీ మెనాషేలో దాదాపు సగం మంది ఇజ్రాయెల్‌కు వలస వెళ్లి ఆ దేశ పౌరులుగా స్థిరపడ్డారు.

ఏప్రిల్‌లో ట్రంప్ చైనా పర్యటన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వచ్చే ఏప్రిల్‌లో చైనాలో పర్యటించనున్నారు. టారిఫ్ వార్ తరువాత రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తాను ఫోన్‌లో సంభాషించానని, వచ్చే ఏడాది చివర్లో అమెరికా పర్యటనకు జిన్‌పింగ్‌ను ఆహ్వానించానని ఎక్స్‌వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. చైనాతో అమెరికా సంబంధం బలంగా ఉందని, ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలు మెరుగు పడేందుకు సహాయపడుతుందని వెల్లడించారు. నెల రోజుల కిందట ఇద్దరు నాయకులు దక్షిణ కొరియాలో భేటీ అయ్యారు. అనంతరం ఫోన్‌లో సంభాషించారు. ఉక్రెయిన్, ఫెంటానిల్, అమెరికన్ సోయాబీన్స్ కొనుగోళ్లు వంటి అంశాలపై చర్చించామని ట్రంప్ తెలిపారు.

పర్యటనలు ప్రస్తావించని చైనా

అయితే ముందుగా ఫోన్ కాల్ గురించి ప్రకటించిన చైనా మాత్రం పర్యటనల గురించి వెల్లడించలేదు. కేవలం ఇరు దేశాల మధ్య వాణిజ్యం, తైవాన్, ఉక్రెయిన్ గురించి చర్చించారని పేర్కొంది. ''చైనా ప్రధాన భూభాగానికి తైవాన్ తిరిగి రావడం 'యుద్ధానంతర అంతర్జాతీయ క్రమంలో అంతర్భాగం'అని జిన్‌పింగ్ ట్రంప్‌తో అన్నారు. ట్రంప్ తన పోస్ట్‌లో ప్రస్తావించని బీజింగ్‌కు ఇది కీలకమైన సమస్య. ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడిన తర్వాత రెండో ప్రపంచ యుద్ధం విజయాన్ని సంయుక్తంగా కాపాడుకోవాలని జిన్ పింగ్ ట్రంప్‌తో అన్నారు. తెవాన్ ప్రశ్న చైనాకు ఎంత ముఖ్యమో అమెరికా అర్థం చేసుకుంటుంది.''అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

తైవాన్‌కు సాయంపై అమెరికా అస్పష్టత

వాణిజ్య యుద్ధాన్ని తగ్గించడానికి వరుస చర్చల ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ.. రెండు అగ్రరాజ్యాల మధ్య వైరుధ్యాలు కొనసాగుతున్నాయని రెండు వైపుల నుంచి వచ్చిన ప్రకటనల్లోని లోపాలు సూచిస్తున్నాయి. తైవాన్‌పై చైనా చర్య తీసుకుంటే, అమెరికాకు కీలకమైన మిత్రదేశమైన జపాన్‌లోని సైన్యం జోక్యం చేసుకోవచ్చని జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి ఇటీవల చేసిన వ్యాఖ్యలతో చైనా–జపాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. తకైచి వ్యాఖ్యలను బీజింగ్ ఖండించింది. ఎవరూ తాకకూడని ఎర్ర గీతను జపాన్ దాటిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి అన్నారు. స్వయం పాలనలో ఉన్న తైవాన్ సార్వభౌమాధికారంపై అమెరికా ఎలాంటి కామెంట్ చేయలేదు. కానీ తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడానికి బలప్రయోగాన్ని వ్యతిరేకిస్తుంది. ఏదైనా సాయుధ దాడిని నిరోధించడానికి ద్వీపానికి సాయంగా అమెరికా దళాలను పంపే విషయంలో స్పష్టత లేదు. తైవాన్ తన రక్షణ బడ్జెట్‌ను పెంచాలని అమెరికా చెబుతోంది. తైవాన్‌కు 330 మిలియన్ డాలర్ల ఆయుధ అమ్మకాలకు అమెరికా ఈ నెలలో ఆమోదం తెలిపిందని తైవాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. వాటిలో యుద్ధ విమానాల విడిభాగాలు కూడా ఉన్నాయి. దీనిపై చైనా నిరసన వ్యక్తం చేసింది.

మిషన్ బెంగాల్ షురూ!

- రాష్ట్రాన్ని ఆరు జోన్‌లుగా విభజించిన బీజేపీ
- కీలక నేతలకు బాధ్యతలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల ఘన విజయంతో తమ తదుపరి లక్ష్యం పశ్చిమబెంగాల్ అని ప్రకటించిన బీజేపీ, ఆ దిశగా మిషన్ బెంగాల్‌ను షురూ చేసింది. వచ్చే ఏడాది మార్చి–ఏప్రిల్ నెలల్లో జరుగనున్న ఎన్నికలను ఎదుర్కొనేందుకు, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే సన్నాహాలు మొదలు పెట్టింది. స్థానిక నాయకత్వాన్ని సమన్వయం, బలోపేతం చేయడం లక్ష్యంగా క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసేలా రాష్ట్రాన్ని ఆరు జోన్‌లుగా విభజించి వివిధ రాష్ట్రాల సీనియర్‌నేతలకు బాధ్యతలు కట్టబెట్టింది.

సీనియర్ నేతలు రంగంలోకి

294 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్‌లో ఈసారి టీఎంసీ అధినేత మమతా బెనర్జీ ఏకఛత్రాధిపత్యానికి కళ్లెం వేయాలన్న సంకల్పంతో ఉన్న బీజేపీ 160 సీట్లు లక్ష్యంగా పెట్టుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 38 శాతం ఓట్లతో 77 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి 50శాతం ఓట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లో పార్టీని విజయపథంలో నడిపించిన సునీల్ బన్సల్ చాలా కాలంగా బెంగాల్‌లో స్థిరపడ్డారు. రాష్ట్ర నాయకుల మధ్య సమన్వయం చేసే బాధ్యత భూపేంద్ర యాదవ్, విప్లవ్‌దేవ్ చూస్తున్నారు. వీరికి సహాయకంగా ఉండేందుకు కొత్తగా రాష్ట్రాన్ని ఆరు డివిజన్‌లుగా విభజించి, సీనియర్లతో కూడిన టీమ్‌లకు కీలక బాధ్యతలు కట్టబెట్టింది. జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీకి డార్జిలింగ్, కొండ ప్రాంతాల బాధ్యతలను అప్పగించారు. ఈ బృందం డార్జిలింగ్, అలీపుర్దువార్, కూచ్ బెహార్‌లలో పని చేస్తుంది. ఇక ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ సాయి, ఉత్తరాఖండ్ ఆరోగ్య మంత్రి డాక్టర్ ధన్ సింగ్ రావత్‌లను పురులియా, బంకురా, బిర్భూమ్, పుర్బా, పశ్చిమ్ బర్ధమాన్‌లను కలిగి ఉన్న రథ్ బాంగ్ బెల్ట్‌కు కేటాయించారు. హౌరా–హుగ్లీ–మేదినీపూర్ ప్రాంతాన్ని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ రాణా, హర్యానా మాజీ ఎంపీ సంజయ్ భాటియాకు కేటాయించారు. ఈ ప్రాంతం టీఎంసీకి బలమైన కోటగా ఉంది.బీజేపీ కోల్పోయిన సీట్లను గెలుచుకోవడానికి అనుకూల వాతావరణాన్ని తయారుచేయడం, ప్రణాళికలు వేయడం ఈ నాయకుల విధి. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.సిద్ధార్థన్ కోల్‌కతా మెట్రోపాలిటన్, దక్షిణ 24 పరగణాల పట్టణ ప్రాంతాలకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఆయనతో పాటు కర్ణాటకకు చెందిన జాతీయ ప్రధాన కార్యదర్శి సిటి రవి కూడా ఉన్నారు. నవద్వీప్, ఉత్తర 24 పరగణాల బాధ్యతను ఏపీ వ్యవహారాలు చూస్తున్న ఎన్.మధుకర్‌కు ఇచ్చారు.

ఉగ్రవాదానికి భారత్ తలవంచదని

ఆపరేషన్ సిందూర్ చాటింది

గురుతేగ్ బహదూర్ బలిదాన దినం కార్యక్రమంలో మోదీ వ్యాఖ్య

కురుక్షేత్ర: భారత్ ఎల్లప్పుడూ శాంతి మంత్రం జపిస్తుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ భద్రత విషయంలో రాజీపడబోదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌తో ఇదే విషయాన్ని ప్రపంచదేశాలకు భారత్ మరోసాటి చాటిచెప్పిందని మోదీ అన్నారు. మంగళవారం హరియాణాలోని కురుక్షేత్ర పట్టణంలో సిక్కుల తొమ్మిదవ మత గురువు గురు తేగ్ బహదూర్ 350వ బలిదాన దినం వార్షిక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహదూర్ స్మారక నాణెం, తపాలా బిళ్లలను ఆవిష్కరించాక మోదీ మాట్లాడారు. ''భారత వారసత్వ సంగమాన్ని నేను ఈరోజు ఒకేసారి చూశా. ఉదయం అయోధ్యలో రామాయణకాలంనాటి నగరాన్ని దర్శించా. ఇప్పుడు శ్రీకృష్ణకాలంనాటి కురుక్షేత్రను సందర్శించా. 2019 నవంబర్ 9న పంజాబ్‌లో సరిహద్దుల్లోని డేరాబాబా నానక్‌ను దర్శించా. కోట్ల మంది రామభక్తుల ఆకాంక్షలను నెరవేరాలని వేడుకున్నా. అదేరోజు రామమందిరానికి అనుకూలగా సుప్రీంకోర్టులో చరిత్రాత్మక తీర్పు వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఈరోజు సిక్కు సంగత్‌లో ఆశీస్సులుపొందే అవకాశం దక్కింది. అందరి సంక్షేమం కోరేవారికి తేగ్ బహదూర్ జీవితమే ఒక చక్కటి ఉదాహరణ. కష్టాలకు ఎదురొడ్డి నిలబడడమే అసలైన విద్య. అదే స్ఫూర్తితో మనం ఎన్ని సవాళ్లు ఎదురైనా దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా మార్చుదాం. ఈ క్రమంలో ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. భయపడుతూ బతకాల్సిన అవసరం లేదు. ఇదే సూత్రాన్ని భారత్ ఆచరిస్తోంది. స్నేహపూర్వకంగా ఉంటూనే సరిహద్దులను కాపాడుకోవడంఎలాగో ప్రపంచానికి భారత్ నేర్పిస్తోంది''అని అన్నారు.

అవి మత ఘర్షణలు కావు

- ఆసు, ఏజీఎస్‌పీలే కారణమని నిర్ధారణ
- 1983 అసోం హింసపై అసెంబ్లీలో తివారీ కమిషన్ నివేదిక

గౌహతి: 1983లో అసోంలో చోటుచేసుకున్న తీవ్రమైన హింసాత్మక ఘటనలు, నెల్లీ మారణ కాండకు మతంతో సంబంధం లేదని తివారీ కమిషన్ స్పష్టం చేసింది. విధ్వంస కాండ అత్యంత తీవ్రమైన స్థాయిలో ముందస్తు ప్రణాళిక ప్రకారమే చోటుచేసుకుందని తెలిపింది. అయితే, అన్ని వర్గాల ప్రజలు బాధితుల్లో ఉన్నారని వెల్లడించింది. రాష్ట్రంలో మైనారిటీలుగా మారుతామని అస్సామీ ప్రజలు పడుతున్న భయాందోళనల్లో కొంత వాస్తవం కూడా ఉందని పేర్కొంది. వలసదారులు భూములను ఆక్రమించుకోవడం అస్సామీల్లో తీవ్రమైన ఆగ్రహానికి కారణంగా మారిందని కమిటీ తెలిపింది. ఆ ఏడాది మొదటి నాలుగు నెలల్లో జరిగిన ఘటనలపై దర్యాప్తు జరిపిన తర్వాత ఈ విషయం నిర్ధారణైందని కమిషన్ తెలిపింది. తీవ్ర నిరసనలు, సంబంధిత పరిణామాలకు ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్(ఆసు), అసోం గణ సంగ్రామ్ పరిషత్(ఏజీఎస్‌పీ)లే ప్రాథమికంగా కారణమని స్పష్టం చేసింది. ఈ కమిటీ నివేదిక ప్రతులను ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో పంపిణీ చేసింది. అప్పట్లో దాదాపు ఆరేళ్లపాటు అక్రమ చొరబాట్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాన్ని ఆసు, ఏజీఎస్‌పీయే నడిపించాయి. ఈ రెండు సంస్థలు అనంతరం 1985లో కేంద్రంతో జరిగిన ఒప్పందంపై సంతకాలు చేయడంతో ఉద్యమం ముగిసింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నివేదిక ప్రతులను ఎమ్మెల్యేలందరికీ ఇవ్వలేదు. దీంతో, ఇటీవల సీఎం హిమంత ప్రభుత్వం నివేదిక హార్డ్, సాఫ్ట్ కాపీలను ఎమ్మెల్యేలందరికీ ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఆ ఉద్యమం సందర్భంగా కొట్లాటల్లో 2,072 మంది, పోలీసు కాల్పుల్లో 235 మంది ప్రాణాలు కోల్పోయారు. 1983 ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి మోరిగావ్ జిల్లా నెల్లీలో జరిగిన మారణ హోమంలో 2 వేల మందికి పైగా చనిపోయారు. వీరిలో అత్యధికులు ముస్లింలు.

శవపేటిక నుంచి

యూటర్న్..

చివరి నిమిషంలో కళ్లు తెరిచిన వృద్ధురాలు

బ్యాంకాక్: అది బ్యాంకాక్ శివార్లలో నిశ్శబ్దం తాండవించే వాట్ రాట్ ప్రకోంగ్ థామ్ బౌద్ధ ఆలయం. అంత్యక్రియల కోసం వచ్చేవారితో రద్దీగా ఉండే ప్రదేశం. ఆ రోజు, ఆలయ జనరల్ మేనేజర్ పైరాట్ సూద్థూప్ రోజువారీ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అప్పుడే ఫిత్సనులోక్ ప్రావిన్స్ నుండి 500 కిలోమీటర్లు ప్రయాణించి ఒక వ్యక్తి 65 ఏళ్ల తన సోదరి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకొచ్చాడు. ఇంతలో శవపేటికలో శబ్దాలు వినిపించడంతో.. ఆలయ సిబ్బంది నిశ్చేష్టులయ్యారు. లోపల కదులుతున్న వృద్ధురాలిని గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. బ్యాంకాక్ శివార్లలోని నాన్‌థాబురి ప్రావిన్స్‌లోని వాట్ రాట్ ప్రకోంగ్ థామ్ బౌద్ధ ఆలయంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి.

అసలేం జరిగిందంటే..

ఆలయ జనరల్, ఫైనాన్షియల్ అఫైర్స్ మేనేజర్ పైరాట్ సూద్థూప్ మాట్లాడుతూ.. 'రెండు రోజుల క్రితం ఒక వృద్ధురాలు ఊపిరి ఆగిపోయి, చనిపోయినట్లు కనిపించడంతో ఆమె సోదరుడు శవపేటికలో భద్రపరిచి తీసుకొచ్చాడు. అంత్యక్రియల కోసం ఏర్పాట్లు జరుగుతుండగా, శవపేటిక నుండి సన్నని శబ్దం వినిపించింది. నాకు కాస్త ఆశ్చర్యం వేసింది, అందుకే శవపేటిక తెరవమని కోరాను. ఆమె మెల్లగా కళ్లు తెరుస్తూ, శవపేటిక పక్కకు తడుతూ కనిపించింది. ఆమె చాలాసేపటి నుండి తడుతూ ఉందేమో'.. అని ఆ సంఘటనను గుర్తు చేసుకున్నారు.

మరణ ధ్రువపత్రం లేక..

వాస్తవానికి, ఆ మహిళ గతంలోనే తన అవయవ దానానికి సమ్మతించడంతో.. ఆమె సోదరుడు మొదట బ్యాంకాక్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. కానీ, అధికారిక మరణ ధ్రువపత్రం లేకపోవడంతో ఆసుపత్రి తిరస్కరించింది. అనంతరం వాట్ రాట్ ప్రకోంగ్ థామ్ బౌద్ధ ఆలయంలో ఉచిత దహన సంస్కారాలు చేస్తారని తెలిసి ఆదివారం శవపేటికను తీసుకురాగా, అక్కడ కూడా అదే ధ్రువ పత్రం అడిగారు. ఆలయ జనరల్, ఫైనాన్షియల్ అఫైర్స్ మేనేజర్ పైరాట్ సూద్థూప్.. ఆ పత్రం గురించి వృద్ధురాలి సోదరునికి వివరిస్తున్నప్పుడే.. శవపేటికలో శబ్దం వినిపించింది. వెంటనే ఆలయ సిబ్బంది ఆమెను పరీక్షించి, సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఖర్చులను తామే భరిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు ప్రకటించారు. చనిపోయిందనుకున్న మహిళ తిరిగి ప్రాణాలతో రావడం, ఆలయ సిబ్బందికి, ఆమె సోదరుడికి జీవితంలో మర్చిపోలేని అనుభవాన్ని మిగిల్చింది.

చెట్టు కొమ్మకు చిన్నారి

అల్లరి నెపంతో వేలాడదీసిన ఉపాధ్యాయిని

సూరజ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): తరగతి గదిలో అల్లరి చేస్తున్నాడని, తోటి విద్యార్థులను కొడుతున్నాడంటూ.. కిండర్ గార్టెన్ (కేజీ) చదువుతున్న ఐదేళ్ల చిన్నారికి ఒక ఉపాధ్యాయిని విధించిన అత్యంత క్రూరమైన శిక్ష నివ్వెరపరిచింది. చిన్నారి టీ–షర్ట్‌కు తాడు కట్టి, పాఠశాల ఆవరణలోని ఒక చెట్టు కొమ్మకు వేలాడదీసింది. ఎవరో ఈ దృశ్యాన్ని రహస్యంగా వీడియో తీయడంతో, అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభం శుభం తెలియని ఆ పసివాడు గాలిలో వేలాడుతూ భయంతో వణికిపోతుండగా, పక్కనే ఉన్న మరో మహిళ ఆ ఉపాధ్యాయినికి మద్దతుగా మాట్లాడటం వీడియోలో కనిపించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సూరజ్‌పూర్ జిల్లా రామానుజ్ నగర్ బ్లాక్, నారాయణ్‌పూర్ గ్రామంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఈ దారుణం జరిగింది. సోమవారం ఈ వీడియో క్లిప్ వెలుగులోకి రావడంతో, విద్యాశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి అజయ్ మిశ్రా ఆదేశించారు. వివరణ అందిన తర్వాత నియమ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా, సదరు ఉపాధ్యాయినిని తక్షణమే విధుల నుంచి తొలగించారు. అయితే, పాఠశాల డైరెక్టర్ సుభాష్ శివహారే మాత్రం ఈ చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. 'ఆ సంఘటన జరిగినప్పుడు అక్కడ లేను. కానీ ఉపాధ్యాయిని.. బాలుడిని బెదిరించడానికి మాత్రమే టీ–షర్ట్‌తో చెట్టుకు వేలాడదీయడానికి ప్రయత్నించింది. తరగతి గదిలో పిల్లలు ఇతరులను కొడుతున్నందున, వారిని క్రమశిక్షణలో పెట్టడానికి మాత్రమే ఈ ప్రయత్నం జరిగింది'.. అని విలేకరులకు వివరణ ఇచ్చారు. ఈ సంఘటనపై మానవ హక్కుల సంఘాలు, బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

కస్టోడియల్ మరణాలను ఉపేక్షించం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కస్టడీలో ఉన్న వారిని చిత్ర హింసలకు గురిచేయడం, వారి ప్రాణాలను హరించడం పోలీసు వ్యవస్థపై మాయని మచ్చ అని, ఇలాంటి చర్యలను జాతి సహించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలీస్‌స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయకపోవడంపై దాఖలైన సుమోటో కేసుపై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పైవ్యాఖ్య చేసింది. వీటిని ఎవరూ సమర్థించడం లేదంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొనగా ..మరైతే ఇప్పటి వరకు తగు విధంగా అఫిడవిట్‌ను ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. ఈ విషయాన్ని కేంద్రం చాలా తేలిగ్గా ఎందుకు తీసుకుంటోందని నిలదీయగా మూడు వారాల్లో అఫిడవిట్ వేస్తామని తుషార్ మెహతా బదులిచ్చారు. రాజస్థాన్‌లో 2025లో మొదటి 8 నెలల కాలంలో 11 కస్టడీ మరణాలు సంభవించడంపై ప్రచురితమైన కథనాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరుపుతుండటం తెల్సిందే. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏలు సహా అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, రికార్డింగ్ పరికరాలను ఏర్పాటు చేయాలని 2020లో జారీ చేసిన ఉత్తర్వులపై 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే స్పందించాయని అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే ధర్మాసనానికి వివరించారు. ఇందులో మధ్యప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవడంపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, తదుపరి విచారణ జరిగే డిసెంబర్ 16 కల్లా కేంద్రం సహా అన్ని రాష్ట్రాలు అఫిడవిట్‌లు వేయాలని ఆదేశించింది. లేకుంటే కేంద్ర దర్యాప్తు విభాగాల చీఫ్‌లు సహా వివరణతో అందరూ స్వయంగా హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ప్రతి విద్వేష ప్రసంగాన్నీ పట్టించుకోలేం

ఇందుకోసం ప్రభుత్వాలు, హైకోర్టులు ఉన్నాయి: సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో జరిగే ప్రతి విద్వేషపూరిత ప్రసంగం కేసును పర్యవేక్షించడానికి, ఉత్తర్వులివ్వడానికి తాము సిద్ధంగా లేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇందుకోసం చట్టపరమైన చర్యలు, పోలీస్‌స్టేషన్లు, హైకోర్టులు ఉన్నాయని తెలిపింది. ఒక వర్గాన్ని ఆర్థికంగా బహిష్కరించాలంటూ ఆన్‌లైన్ వేదికగా వస్తున్న విజ్ఞాపనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. దేశంలో ఏదో ఒక మూల జరిగే ప్రతి చిన్న సంఘటనను తాము పరిశీలించలేమని తెలిపింది. ఇందుకోసం ఇప్పటికే ఇతర ప్రత్యామ్నాయాలు చాలానే ఉన్నాయంది. 'ఈ ఫిర్యాదుపై ముందుగా అధికారుల వద్దకు వెళ్లండి. వారు చర్యలు తీసుకోనివ్వండి. స్పందించని పక్షంలో సంబంధిత హైకోర్టుకు వెళ్లండి'అని పిటిషనర్‌కు సూచించింది. ప్రజా ప్రయోజన సంబంధమైన అంశం కాకుంటే హైకోర్టులు తగు రీతిలో స్పందిస్తాయని తెలిపింది. భాగల్పూర్ హింస, బిహార్‌లో ఎస్ఐఆర్‌కు సంబంధించి చేసిన విద్వేష వ్యాఖ్యలపై డిసెంబర్ 9వ తేదీన విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

వేధింపులపై ఎన్‌సీపీసీకి వెళ్లండి: సుప్రీం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నడిచే ఇస్కాన్(ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్‌నెస్) స్కూళ్లలో లైంగిక వేధింపులపై ఫిర్యాదులను నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీ) ముందుంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పిటిషనర్లు పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలోని చిన్నారుల హక్కుల కమిషన్‌లనూ ఆశ్రయించవచ్చని తెలిపింది. వారు తగు రీతిలో చర్యలకు ఆదేశిస్తారని సూచించింది. ఇస్కాన్ విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు చోటుచేసుకుంటున్నాయంటూ రజనీశ్ కపూర్ తదితరులు వేసిన పిటిషన్లను కొట్టివేస్తూ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఇస్కాన్ సీనియర్ నాయకులు 200 మందికి పైగా చిన్నారులపై లైంగిక, భౌతిక, మానసిక వేధింపులకు పాల్పడినట్లు ఆధారాలున్నాయని పిటిషనర్లు తెలిపారు. వీటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సెనేటర్ హాన్సన్‌పై నిషేధం

పార్లమెంటులో బురఖా ధారణపై చర్య

మెల్బోర్న్: బురఖాను నిషేధించాలంటూ దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న ఆస్ట్రేలియన్ సెనేటర్ పౌలిన్ హాన్సన్.. తన నిరసనలో భాగంగా పార్లమెంట్ హాలులో బురఖా ధరించినందుకు ఈ ఏడాది పార్లమెంటు సమావేశాలకు హాజరుకాకుండా నిషేధం విధించారు. యాంటీ–ముస్లిం, యాంటీ–ఇమ్మిగ్రేషన్ మైనర్ పార్టీ అయిన 'వన్ నేషన్' నాయకురాలు, 71 ఏళ్ల పౌలిన్ హాన్సన్, సోమవారం సెనేట్‌లోకి బురఖాతో ప్రవేశించడం తెలిసిందే. బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధారణను నిషేధించాలని ఆమె ప్రవేశపెట్టిన బిల్లును సెనేటర్లు పరిగణనలోకి తీసుకోనందుకు ఆమె ఇలా నిరసన తెలిపారు. ఈ చర్యను సెనేటర్లు తీవ్రంగా పరిగణించారు. సోమవారం ఆమెను ఆ రోజు సమావేశాల నుండి సస్పెండ్ చేశారు. అయితే, క్షమాపణ చెప్పడానికి హాన్సన్ నిరాకరించడంతో, మంగళవారం సెనేట్ ఆమెపై సెన్సూర్ తీర్మానం ఆమోదించింది. హాన్సన్‌ను వరుసగా ఏడు సెనేట్ సమావేశాలకు హాజరుకాకుండా నిషేధం విధించారు. సెనేట్ సమావేశాలు గురువారం ముగియనుండగా, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంట్ తిరిగి ప్రారంభమయ్యే వరకు హాన్సన్‌పై నిషేధం కొనసాగుతుంది. గత కొన్ని దశాబ్దాలలో సెనేటర్‌పై విధించిన కఠిన శిక్షలలో ఇది ఒకటని భావిస్తున్నారు.

పాక్‌లో 22 మంది ఉగ్రవాదులు హతం

పెషావర్: నిషేధిత తెహ్రీక్ ఇ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ)కి చెందిన 22 మంది ఉగ్రవాదులను పాకిస్తాన్ భద్రతా దళాలు హతమార్చాయి. ఉత్తర వజీరిస్తాన్ సరిహద్దులోని బన్ను జిల్లాలో ఉగ్రవాదుల ఉనికిపై నిఘా వర్గాల సమాచారం ఆధారంగా సోమవారం ఆపరేషన్ నిర్వహించాయి. దేశం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి భద్రతా దళాలు పనిచేస్తున్నాయని మిలిటరీ మీడియా విభాగం తెలిపింది. ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. భద్రతా దళాలను ఆయన ప్రశంసించారు. ఉగ్రవాదంపై యుద్ధంలో మొత్తం దేశం పాకిస్తాన్ సాయుధ దళాలకు అండగా నిలుస్తుందని షరీఫ్ అన్నారు. 2022 నవంబర్‌లో టీటీపీ కాల్పుల విరమణను ముగించిన తర్వాత పాకిస్తాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయి. సోమవారం ఉదయం పెషావర్‌లోని పారా మిలటరీ బలగాల హెడ్‌ఆఫీసుపై జరిగిన ఆత్మాహుతి దాడిలో ముగ్గురు మరణించగా 12 మంది గాయపడటం తెల్సిందే.

గాయకుడు జుబీన్ గార్గ్‌ది హత్యే

అసోం ముఖ్యమంత్రి హిమంత ప్రకటన

గౌహతి: ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ మరణించలేదని, అతనిది హత్యని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. గాయకుడి మృతిపై ప్రతిపక్షం అసెంబ్లీలో ప్రతిపాదించిన వాయిదా తీర్మానంపై చర్చ సందర్భంగా మంగళవారం హిమంత ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. నిందితులలో ఒకరు గార్గ్‌ను చంపగా.. ఇతరులు అతనికి సహాయం చేశారని, హత్య కేసులో నాలుగు లేదా ఐదుగురిపై హత్య కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సిట్ త్వరలోనే చార్జిషీట్ దాఖలు చేస్తుందని, హత్య వెనుక ఉన్న ఉద్దేశం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తుందని పేర్కన్నారు. సెప్టెంబర్ 19న సింగపూర్‌లో స్కూబా డైవింగ్ చేస్తూ జుబీన్ గార్గ్ మరణించారు. అక్కడ నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఒకరోజు ముందే ఈ ప్రమాదం జరగడంతో, అతని మరణంపై పలు అమానాలు వ్యక్తమయ్యాయి. డీజీ ఎంపీ గుప్తా నేతృత్వంలోని 10 మందితో కూడిన సిట్ బృందం కేసును దర్యాప్తు చేస్తోంది. జుబీన్ గార్గ్ సన్నిహితులు, మేనేజర్, ఇతర అనుమానితుల మీద దృష్టి సారించింది. ఆయన మేనేజర్, వ్యక్తిగత భద్రతా సిబ్బందితో సహా ఏడుగురిని అరెస్టు చేసింది. 252 మంది సాక్షులను విచారించింది. 29 వస్తువులను స్వాధీనం చేసుకుంది.

అసోం అసెంబ్లీలో బహుభార్యత్వం నిషేధ బిల్లు

గౌహతి: బహుభార్యత్వాన్ని నిషేధించే బిల్లును అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. గాయకుడు జుబీన్ గార్గ్ మరణంపై చర్చ తర్వాత ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వాకౌట్ అనంతరం ఆయన బిల్లును సభలో ప్రవేశ పెట్టారు. చర్చ తరువాత సభ ఈ బిల్లును ఆమోదించనుంది. బహుభార్యత్వం నిషేధ బిల్లుకు కేబినెట్ ఈ నెల ప్రారంభంలో ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ప్రకారం ఇప్పటికే చట్టబద్ధమైన జీవిత భాగస్వామి ఉన్నవారు, విడాకులు తీసుకోకుండా, మొదటి వివాహం చట్టబద్ధంగా రద్దుకుండా రెండో వివాహం చేసుకుంటే ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. మతంతో సంబంధం లేకుండా ఈ నిషేధం వర్తిస్తుంది.

భారత రాజ్యాంగంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలకు సమప్రాధాన్యం ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ తనకున్న న్యాయ సమీక్షాధికారం, క్రియాశీలతలతో చురుగ్గా పనిచేస్తూ మిగిలిన రెండు వ్యవస్థల పనితీరును పర్యవేక్షిస్తోంది. ఆ క్రమంలో న్యాయవ్యవస్థ తనకున్న సమీక్షాధికారంతో సమాజానికి, ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా తీర్పులు ఇస్తూ, మిగతా వ్యవస్థలకూ మార్గనిర్దేశం చేస్తోన్న తీరుతెన్నుల గురించి విశ్లేషణ.

న్యాయ సమీక్షాధికారం..
రాజ్యాంగంలో మౌలిక అంశం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

న్యాయ వ్యవస్థకు గల న్యాయ సమీక్షాధికారం భారత రాజ్యాంగంలో ఓ ముఖ్యాంశం. మన న్యాయ వ్యవస్థ రూపురేఖలు, అధికారాల గురించి విశ్లేషించేటప్పుడు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలకు(సుప్రీంకోర్టు, హైకోర్టులకు) గల ప్రత్యేక న్యాయ సమీక్షాధికారం గురించి స్పష్టంగా తెలుసుకోవాలి. రాజ్యానికి ముఖ్యం గా శాసన, కార్యనిర్వాహక, జ్యుడీషియరీ (న్యాయ) అనే మూడు వ్యవస్థలు ఉన్నాయి. అధికారాల విభజన (Separation of powers) ప్రకారం – ఒక వ్యవస్థ పనితీరులో మరో వ్యవస్థ జోక్యం చేసుకోకూడదు. అయితే న్యాయ సమీక్షాధికారాన్ని వీటికి మినహాయింపుగా చెప్పుకోవచ్చు.

న్యాయ సమీక్షాధికారం - నేపథ్యం

ఇంగ్లండ్‌లోని ప్రముఖ న్యాయమూర్తి ఎడ్వర్డ్ కోక్ 1610లో ఓ కేసులో తీర్పునిస్తూ.. ప్రభుత్వం చేసిన ఏ చట్టం అయినా/చేపట్టిన ఏ అధికారిక చర్య అయినా సహజసిద్ధంగా వచ్చే హక్కులకు (Natural Rights), కారణాలకు (Natural Reason) వ్యతిరేకంగా ఉంటే అలాంటి వాటిని న్యాయ స్థానాలు కొట్టేయొచ్చన్నారు. ఈ తీర్పును న్యాయ సమీక్షాధికారానికి నాందిగా పేర్కొంటారు. కానీ ఆ తీర్పు అప్పటి గ్రేట్ బ్రిటన్‌లో నిలవలేకపోయింది. అక్కడ వచ్చిన విప్లవాలు తదితర కారణాలతో 1688 తర్వాత బ్రిటన్‌లో పార్లమెంట్ ఆధిక్యత వచ్చింది.

మార్బురి వర్సెస్ మాడిసన్ కేసు

1803లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో మార్బురి వర్సెస్ మాడిసన్ కేసులో సుప్రీంకోర్టు ప్రస్ఫుటంగా న్యాయ సమీక్ష సిద్ధాంతాన్ని గుర్తించింది. రెండు రోజుల్లో పదవీ కాలం ముగిసిపోతున్న అమెరికా అధ్యక్షుడు.. జ్యుడీషియరీ యాక్ట్ ఆఫ్ 1801ను కాంగ్రెస్‌లో ఆమోదించి, తద్వారా కొత్తగా కోర్టులను ఏర్పాటు చేసి 40 మంది న్యాయమూర్తులను నియమించారు. నియమితులైన న్యాయమూర్తులకు సెక్రటరీ ఆఫ్ స్టేట్ నియామక పత్రాలను జారీ చేసినప్పటికీ కొన్ని కారణాల వల్ల నలుగురికి మాత్రం ఇవ్వలేకపోయాడు. తర్వాత అధ్యక్షుడైన థామస్ జెఫర్సన్ ఆ నలుగురికి ఎలాంటి అపాయింట్‌మెంట్ ఆర్డరూ జారీ చేయొద్దని తన సెక్రటరీ ఆఫ్ స్టేట్ – మాడిసన్‌ను ఆదేశించాడు.దీంతో ఆ నలుగురిలో ఒకరైన విలియం మార్బురి.. సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సెనేట్ ఆమోదంతో రాజ్యాంగబద్ధంగా నియమితుడినైన తనకు నియామక పత్రం పొందే హక్కు ఉందనీ, ఆ హక్కును ప్రస్తుత ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అప్పటి అమెరికన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ ఈ కేసులో మూడు వివాదాస్పద అంశాలను గుర్తించాడు. అవి..

- మార్బురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొందే హక్కు ఉందా? లేదా?
- సెక్రటరీ ఆఫ్ స్టేట్ – జేమ్స్ మాడిసన్‌కు ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత ఉందా? లేదా?
- ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం ఏమిటి?

అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొందే హక్కు మార్బురికి, ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత మాడిసన్‌కు ఉన్నప్పటికీ.. సుప్రీంకోర్టుకు మాత్రం ఇందుకు సంబంధించి తీర్పునిచ్చే అధికారం లేదని న్యాయమూర్తి జాన్ మార్షల్ తెలిపారు. ఏ చట్టం ద్వారా పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడో అది రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగం మాత్రమే అత్యున్నత చట్టం. దాని హోదాను, విశిష్టతను రక్షించాల్సిన బాధ్యత కోర్టుపై ఉంది. అందుకే ఏ చట్టం కింద పిటిషన్ దాఖలు చేశారో అది రాజ్యాంగ వ్యతిరేకం కాబట్టి ఈ చట్టాన్ని కొట్టేస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ బాధ్యత, అధికార పరిధి ప్రకారం– రాజ్యాంగాన్ని ఉల్లంఘించినా, దానికి వ్యతిరేకంగా చట్టాలు చేసినా.. వాటిని కొట్టేసే అధికారం కోర్టుకు ఉందని స్పష్టం చేశారు. ఈ తీర్పును న్యాయ సమీక్షాధికారానికి నాందిగా, జాన్ మార్షల్‌ను న్యాయ సమీక్షాధికారానికి పితామహుడిగా పేర్కొంటారు. అమెరికాలో ఈ సమీక్షాధికారానికి కొన్ని పరిమితులున్నాయి. భారత రాజ్యాంగంలో న్యాయ సమీక్షాధికారం గురించి ప్రస్తావన లేనప్పటికీ.. కొన్ని ఆర్టికల్స్ ద్వారా ఈ అధికారం సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు సంక్రమించింది.

- ఆర్టికల్ 13(1) ప్రకారం– రాజ్యాంగం అమల్లోకి రాకముందున్న చట్టాలు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉంటే అవి చెల్లవు.
- ఆర్టికల్ 13(2) ప్రకారం–ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా రాజ్యం ఎలాంటి చట్టాన్నీ చేయకూడదు. ఒకవేళ చేస్తే అది చెల్లదు.
- ఆర్టికల్–32 ప్రకారం ప్రాథమిక హక్కుల పరిరక్షణకు కూడా న్యాయసమీక్షాధికారాన్ని ఉపయోగిస్తారు.

అదే విధంగా ఆర్టికల్ 226 కింద రిట్లు వేసే అధికారం కూడా న్యాయ సమీక్షాధికార పరిధిలోకే వస్తుంది. ఆర్టికల్ 131 ప్రకారం – అంతర్రాష్ట్ర వివాదాల వంటివి న్యాయ సమీక్షాధికారంలో భాగంగానే ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానాలు చట్టాల రాజ్యాంగ బద్ధతను మాత్రమే న్యాయసమీక్ష ద్వారా పరీక్షిస్తాయి. ప్రస్తుతం చట్టాలకే పరిమితం కాకుండా.. అధికార చర్యలకు కూడా వీటిని విస్తృతపరిచారు. దీంతో కోర్టుకు చట్టాలను, ఆర్డినెన్స్‌లను, పరిపాలన చర్యలను సమీక్షించే అధికారం ఉంది. న్యాయ సమీక్షాధికారాన్ని సుప్రీంకోర్టు ఓ మౌలిక స్వరూపంగా (Basic feature) పరిగణించింది.

తీర్పులు

1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు; ఇందిరా గాంధీ వర్సెస్ రాజ్ నరైన్ కేసు తీర్పుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని మౌలిక స్వరూపంగానే పేర్కొంది. అదేవిధంగా ఆర్టికల్ 31(బి) ప్రకారం– 9వ షెడ్యూల్‌లో ఏదైనా చట్టాన్ని చేరిస్తే అది ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉందని ప్రశ్నించే అధికారం గానీ, న్యాయ సమీక్షాధికారం గానీ కోర్టులకు ఉండేది కాదు. కానీ 2007లో ఐ.ఆర్.కోయిల్హో వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం.. 1973, ఏప్రిల్ 24 (basic structures doctrine was propounded) తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగ బద్ధతను కూడా కోర్టులు సమీక్షించొచ్చని తీర్పునిచ్చింది

అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం 1985 ప్రకారం– అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ మాత్రమే వేయొచ్చు. సంబంధిత రాష్ట్ర హైకోర్టులకు అప్పీళ్లను వినే అధికారం కూడా లేదు. కానీ 1997లో ఎల్.చంద్రకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిశీలించి న్యాయ సమీక్షాధికారం అనేది మౌలిక అంశం కాబట్టి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను కూడా హైకోర్టు ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనం ఒక రిట్ పిటిషన్ ద్వారా సమీక్షించొచ్చని తీర్పునిచ్చింది.

- ఇలాంటి తీర్పుల నేపథ్యంలో న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగపరంగా, కోర్టు తీర్పుల పరంగా రాజ్యాంగంలోని ఒక మౌలిక అంశంగా మారిపోయింది. మన దేశంలో న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ సవరణలను కూడా కొట్టేసే విధంగా ఉంది. ఉదాహరణకు తాజాగా జాతీయ న్యాయ నియామక కమిషన్(ఎన్‌జేఏసీ)కి సంబంధించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టేశారు. 2014లో వచ్చిన జాతీయ న్యాయ నియామకాల చట్టాన్ని కూడా కొట్టేశారు. ప్రపంచంలో ఇలాంటి విస్తృత న్యాయ సమీక్షాధికారం భారత న్యాయస్థానాలకు మాత్రమే ఉంది.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయ వ్యవస్థ క్రియాశీలత (Judicial Activism) న్యాయ సమీక్ష అధికారంలో అంతర్భాగం. న్యాయ వ్యవస్థ క్రియాశీలత అంటే న్యాయ వ్యవస్థ తన విధులను, అధికారాలను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం! శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు అధికార విభజన అనుసరిస్తే ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోవడానికి అవకాశం లేదు. కానీ ఆధునిక ప్రజాస్వామ్య, సంక్షేమ రాజ్యాల్లో ఆయా వ్యవస్థల విధులు విస్తృతం కావడంతో ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. కానీ రాజ్యాంగం ప్రకారం– మూడు వ్యవస్థలకు సమప్రాధాన్యం ఉంటుంది. ఈ సమ ప్రాధాన్యం గురించి కింది ఉదాహరణ స్పష్టం చేస్తుంది. రాజ్యాంగ పరిషత్ సభ్యుడు టి.టి.కృష్ణమాచారి మూడు వ్యవస్థలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ పరిధిలోని none of them can be an empire with in an empire అని వ్యాఖ్యానించారు. భారత్ లో న్యాయవ్యవస్థ క్రియాశీలత 1980కి ముందు తక్కువగా ఉండేది. కొన్ని అరుదైన కేసుల్లో మాత్రమే న్యాయ స్థానాలు తమ అధికారాన్ని ప్రదర్శించాయి. కానీ 1980 తర్వాత న్యాయవ్యవస్థ క్రియాశీలత పెరిగింది.

క్రియాశీలత ఎప్పుడు?

- శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తాము చేయాల్సిన విధులను విస్మరించినప్పుడు లేదా వైఫల్యం చెందినప్పుడు న్యాయ వ్యవస్థ క్రియాశీలత ప్రదర్శిస్తుంది.
- వివిధ కారణాల వల్ల నిర్మాణాత్మక, కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో, ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచలేని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగితే న్యాయ వ్యవస్థ తన క్రియాశీలతను కనబరుస్తుంది.
- న్యాయ స్థానాలు స్వయం ప్రేరిత (సుమోటో) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీం కోర్టుల దృష్టికి తీసుకురావడం వల్ల కోర్టులు క్రియాశీలత చూపిస్తున్నాయి.
- సంకీర్ణ, బలహీన, అస్థిర ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థ క్రియాశీలకంగా పని చేస్తుంది.

క్రియాశీలత రూపాలు

ప్రజాప్రయోజన వ్యాజ్యం: పేదరికం, నిస్సహాయత, అవగాహనలేమి లాంటి వివిధ కారణాలతో కోర్టును ఆశ్రయించలేని వారు ప్రజాప్రయోజన వ్యాజ్యం రూపంలో కోర్టు మెట్లు ఎక్కవచ్చు. అలాగే మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడం జ్యుడీషియల్ యాక్టివిజం ముఖ్య రూపం.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత ద్వారా ఆర్టికల్ 21 ప్రకారం– ప్రాథమిక హక్కుల పరిధిని పెంచారు. ఉదాహరణకు జీవించే హక్కు అంటే right to live with basic human dignity అని కోర్టులు నిర్వచించాయి. 14 ఏళ్ల లోపు వారికి ఉచిత నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వం బాధ్యత అని చెబుతూ దాన్ని ఆర్టికల్ 21(ఎ)లో చేర్చారు. ఈ విధంగా ఉచిత న్యాయ సలహా పొందే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛా హక్కు మొదలైన వాటిని న్యాయ వ్యవస్థ తన క్రియాశీలతతో ప్రాథమిక హక్కుల్లోకి తీసుకొచ్చింది.

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం కూడా న్యాయ క్రియాశీలతే. ఉదాహరణకు 99వ రాజ్యాంగ సవరణను కొట్టేయడాన్ని న్యాయ వ్యవస్థ క్రియాశీలతకు శిఖరాగ్రంగా చెప్పొచ్చు. పర్యావరణ హక్కుల్ని రక్షించడంలో న్యాయ వ్యవస్థ పాత్ర కీలకం. ఆగ్రా నుంచి దాదాపు 300 కంపెనీలను తాజ్‌మహల్‌కు దూరంగా తరలించడం కూడా న్యాయ వ్యవస్థ క్రియాశీలత వల్లే సాధ్యపడింది.

విమర్శ

న్యాయ వ్యవస్థ క్రియాశీలత పేరుతో న్యాయమూర్తులు వారి పరిధి దాటుతున్నారనే విమర్శ ఉంది. సంబంధంలేని విషయాలపై ఆదేశాలు జారీచేస్తున్నారని, విధానపరమైన విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారని జస్టిస్ మార్కండేయ కట్జూ, జస్టిస్ మాథూర్ లాంటి న్యాయమూర్తులు ఓ తీర్పులో పేర్కొన్నారు. అలాగే జస్టిస్ కేజీ బాలకృష్ణన్ లాంటి న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమర్థిస్తున్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పనితీరు మెరుగ్గా లేకుంటే సాధారణ వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయిస్తారు. అందుకే న్యాయ వ్యవస్థ క్రియాశీలకం అని చెప్పొచ్చు. అలాగే నల్లధనానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడం, సల్వాజుడుం కేసు మొదలైన వాటిల్లో న్యాయ వ్యవస్థ క్రియాశీలతతోనే ఫలితాలు వచ్చాయి. నార్కో అనాలసిస్.. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కుకు వ్యతిరేకమని కోర్టు తీర్పునిచ్చింది. న్యాయ వ్యవస్థ క్రియాశీలతకు కొన్ని పరిధులు ఉంటాయి. రాజ్యాంగం ప్రకారం– న్యాయ వ్యవస్థ అత్యున్నతం కాదు. రాజ్యాంగం మాత్రమే అత్యున్నతమైంది. న్యాయ శాఖ ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తూ శాసన, కార్యనిర్వాహక అంగాలు పనిచేసేలా చూడాలి!!

నార్కో అనాలసిస్‌లో వాడే రసాయనాలు?

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

బయాలజీ

మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంది.

మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ఫ్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300–400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350–1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు) తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్‌మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సీజన్‌లో 20 శాతం, గ్లూకోజ్‌లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సీజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్‌సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్‌లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

నోట్: ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.

మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.

ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్థం ఉంటుంది. ఇది రాంబాయిడల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్‌గా విభజితమవుతుంది.

హైపోథలామస్ విధులు

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ

- హైపోథలామస్.. పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది. మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లంబికలు అంటారు.

మస్తిష్కం విధులు

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్‌కు, పాన్స్‌వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..
1) అనుమస్తిష్కం 2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

విధులు
1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

నోట్: మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యా న్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

విధులు
1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్‌గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

విధులు

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

ఉదాహరణలు:

- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కను రెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్ల మూసుకోవడం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేట
   4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది?
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అథో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా॥ 2) 1400 గ్రా॥
   3) 1500 గ్రా॥ 4) 1350 గ్రా॥
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్‌సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది?
    1) గుండె 2) చర్మం
    3) మెదడు 4) కాలేయం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1; 6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

తెలుగు సాహిత్యంలో ఆదికవి 'పాల్కురికి సోమన'

తెలంగాణ ప్రాంతానికి చెందిన పాల్కురికి సోమన తెలుగు సాహిత్యంలో ఆదికవి. ఈయన రాసిన 'బసవపురాణం' తొలి సాంఘిక కావ్యం. తెలుగులో తొలి ద్విపద కావ్యం కూడా ఇదే. ఇది ఏడు అశ్వాసాల ద్విపదం. సి.పి. బ్రౌన్ ప్రకారం ఇందులో 6288 ద్విపదలు ఉన్నాయి. పాల్కురికి తన రచనల్లో నాటి తెలంగాణా సాంఘిక జీవితాన్ని, శూద్రకులాలకు చెందిన వారి ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' కంటే ముందే ఈయన తన సాహిత్యంలో దళితుల గురించి వివరించాడు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర సంస్కృతి - వారసత్వం

తెలంగాణ కవులు - సాహిత్యం

శాతవాహన పూర్వ యుగం

పాతరాతి యుగం నుంచి తెలంగాణ ప్రాంతం నివాసయోగ్యంగా ఉండి క్రమంగా ఇక్కడ గ్రామాలు, పట్టణాలు, జనపదాలు ఏర్పడ్డాయి. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో 16 మహా జనపదాలు ఉండేవి.

అవి: 1) కాశీ – వారణాసి
2) అంగ – చెంప (బెంగాల్)
3) మగధ – పాటలీపుత్రం (బిహార్)
4) అవంతి – ఉజ్జయిని (మధ్యప్రదేశ్)
5) ఛేది – శుక్తిమతి
6) వత్స – కౌశాంబి
7) పాంచాల – అహిచ్ఛత్ర
8) శూరసేన – మధుర
9) మత్స్య – విరాటనగరం
10) అస్మక – పోతన(నేటి బోధన్)
11) గాంధార – తక్షశిల
12) కాంభోజ – రాజపురం
13) కోసల – శ్రావస్తి
14) మల్ల – పావాపురి
15) వజ్జి – వైశాలి
16) కురు – ఇంద్రప్రస్థ (ఢిల్లీ).

వీటిలో అస్మక (పాళీ భాషలో అశ్మక, అస్సక, అసక అనే పేర్లతో పిలిచేవారు) జనపదం గోదావరి, మంజీరా తీరాల వెంట కొంత మహారాష్ట్ర, కొంత తెలంగాణాలో ఉండేది. ఈ జనపదంలో, ముళక జనపదంలోని నేటి కొన్ని తెలంగాణా ప్రాంతాల్లో, కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో దొరికిన నాణేల ఆధారంగా శాతవాహనుల కంటే ముందే ఇక్కడ రాజ్యం ఏర్పడిందని తెలుస్తోంది.

మరిన్ని ఆధారాలు:

1. అశోకుడి 13వ శిలాశాసనంలో తెలంగాణ ప్రాంతంలోని అటవీ జాతుల గురించి వివరించారు.
2. సంగం (ప్రాచీన తమిళ కవుల సభ) సాహిత్యంలో కూడా తెలంగాణ ప్రాంత ప్రజల ఆహార, సామాజిక విషయాల గురించి ప్రస్తావించారు. శాతవాహనులు మొదట తమ రాజ్యాన్ని తెలంగాణ (కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలు)లో స్థాపించారు.

శాతవాహన యుగానికి చెందిన కవులు – గ్రంథాలు:

గుణాఢ్యుడు: ఇతడు పైశాచీ ప్రాకృత భాషలో 'బృహత్కథ' రచించాడు. పైశాచీ అంటే వాడుక భాష. ఇతడు తెలంగాణ వాడుక భాషలో ఈ గ్రంథాన్ని రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. పైశాచీ భాషపై ప్రాకృతం, ప్రాకృతంపై సంస్కృతం ఆధిపత్యం చూపాయి. ప్రాచీన తెలుగు భాషనే దేశీ భాష అని డాక్టర్ దినేశ్ చంద్ర సర్కార్ అనే పండితుడి అభిప్రాయం.

గుణాఢ్యుడిని తెలంగాణ మొదటి లిఖిత కవిగా పేర్కొంటారు. ఇతడు 'బృహత్కథ' గ్రంథాన్ని మెదక్ జిల్లాలోని కొండాపురంలో రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. బృహత్కథను మూలకథగా తీసుకొని క్షేమేంద్రుడు 'బృహత్కథామంజరి', సోమదేవసూరి 'కథా సరిత్సాగరం' రచించారు.

హాలుడు: శాతవాహన వంశానికి చెందిన 17వ రాజైన హాలుడు స్వయంగా కవి. ఇతడు 'గాథా సప్తశతి' గ్రంథాన్ని ప్రాకృత భాషలో రాశాడు. ఇందులో సుమారు 700 గ్రామీణ శృంగార కథలను సంకలనం చేశాడు. ఈ గ్రంథాన్ని శివస్తుతితో ప్రారంభించాడు. తెలంగాణలోని 350 కవుల గురించి కూడా వివరించాడు. తెలంగాణ శాసనాల్లో లభించిన తొలి కంద పద్యాలకు, గాథాసప్తశతిలోని పద్యాల చంధస్సుకు దగ్గరి పోలికలు ఉన్నాయి.

ఇక్ష్వాకులు (క్రీ.శ. 225-300)

శాతవాహన సామంత రాజుల్లో ఇక్ష్వాకులు ఒకరు. ఇక్ష్వాక వంశానికి చెందిన వాసిష్టిపుత్ర శాంతామూలుడు మరికొంత మంది సామంత రాజులతో కలిసి శాతవాహన చివరి రాజైన మూడో పులోమావిని ఓడించి స్వతంత్ర రాజ్య స్థాపన చేశాడు. ఈ రాజ్యాన్ని విజయపురి (నాగార్జునసాగర్)లో స్థాపించాడు. వీరి రాజ్యభాగాల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లాలు వీరి పాలనా కేంద్రాలని డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు.

ఇక్ష్వాకుల ప్రాధాన్యం

1. దేవాలయాలు నిర్మించిన తొలి రాజులు.
2. సంస్కృతంలో శాసనాలు ముద్రించిన తొలి దక్షిణ భారత రాజులు.
3. వీరు ప్రాకృతాన్ని పోషించినప్పటికీ తెలుగు భాష కూడా వాడుకలో ఉంది. వీరు మహాతలవర, సిరి, ఖండ, చలికి, బాపి, అంక తదితర పదాలను ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి.

వాకాటకులు (క్రీ.శ. 250-550)

వాకాటకుల తొలి రాజ్యం బీరార్ (విదర్భ). వీరు ఉత్తర తెలంగాణ జిల్లాలను పాలించారు. ఈ రాజ్యస్థాపకుడు వింధ్యశక్తి. వాకాటక పాలకులు పండిత పోషకులే కాకుండా స్వయంగా గొప్ప కవులు. గుప్తుల్లో ఏకైక రాణి ప్రభావతి గుప్త (రెండో చంద్రగుప్తుడి కుమార్తె) ఈ ప్రాంతాన్ని పాలించారు.

కాళిదాసు: ఇతడు నవరత్నాల్లో ఒకడు. కాళిదాసు మొదట వాకాటక రాజ్యంలో నివసించాడు. ఇతడు మేఘదూతం (మేఘ సందేశం) నాటకాన్ని వాకాటక రాజ్యంలో రాంటెక్ (కరీంనగర్ జిల్లా రామగిరి)లో రచించాడు.

రెండో ప్రవరసేనుడు: ఇతడు 'సేతుబంధం' (సంస్కృతం) రచించాడు. ఇది శ్రీరాముడు లంకా నగరంపై చేసిన దాడిని ఇతివృత్తంగా చేసుకొని రచించిన గ్రంథం. గాథాసప్తశతిలో ఉన్న అనేక గాథల్ని ఇందులో రచించాడు.

వాకాటకుల అజంతా, ఎల్లోరా గుహల్లో 16వ, 17వ నంబరు విహార గుహలను, 19వ నంబరు చైత్య గుహను నిర్మించారు. వీరి రాజధాని వత్సగుల్మ గొప్ప సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లింది.

విష్ణుకుండినులు (358-575)

ఈ రాజ్యస్థాపకుడు ఇంద్రవర్మ. ఏలేశ్వరం, మిర్యాలగూడ, నల్లగొండ, భువనగిరి, కీసర, ఇంద్రపాలనగరం ప్రాంతాలను ఆక్రమించి ఇంద్రపాల నగరం రాజధానిగా క్రీ.శ. 358లో రాజ్యం స్థాపించాడు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని రామన్నపేట సమీపంలో ఉన్న తుమ్మలగూడెమే నాటి ఇంద్రపాలనగరం.

మాదవ వర్మ: 'జనాశ్రయ చంధో విచ్ఛిత్తి' గ్రంథం రచించాడు. ఇందులో ద్విపద, త్రిపద పద్యాలతో పాటు వివిధ జాతుల పద్యాలు ఉన్నాయి.

బాదామి చాళుక్యులు (546-755)

జయసింహవల్లభుడు: ఇతడు బాదామి లేదా వాతాపి చాళుక్య వంశ స్థాపకుడు. చాళుక్యులు కృష్ణా – తుంగభద్ర నదుల అంతర్వేదికి చెందినవారని భావిస్తున్నారు. వీరు మొదట ఇక్ష్వాకుల వద్ద అధికారులుగా, సామంతులుగా ఉన్నారు. తర్వాత వాకాటక రాజ్యంలో ఉండి, ఆ రాజ్యం విష్ణుకుండినుల రాజ్యంలో విలీనమైన తర్వాత విష్ణుకుండినులకు సామంతులుగా వ్యవహరించారు. అనంతరం పశ్చిమ దిశలో బాదామి వైపు పయనించి అక్కడ స్వతంత్ర రాజ్యం స్థాపించారు.

భవభూతి: ఇతడు 'మాలతీమాధవం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. భవభూతి నాడు తెలంగాణ ప్రాంతంలో సుప్రసిద్ధ కవి. ఇతడు కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో నివసించాడు. ఇతడు కాళప్రియనాథుడి భక్తుడు. కృష్ణయజుర్వేద తైత్తరీయశాఖకు చెందినవాడు. ఇతడి కీర్తి ప్రతిష్ఠలను విని యశోవర్మ తన ఆస్థానకవిగా నియమించుకున్నాడు. కాళిదాసు, భారవి లాంటి మహాకవులకు సమానంగా ప్రశంసలు పొందిన గొప్ప వ్యక్తి. ఇతడు ఉత్తర రామ చరిత, మహావీర చరిత్ర అనే నాటకాలు కూడా రచించాడు.

రాష్ట్రకూటులు

ఈ రాజ్యస్థాపకుడు దంతిదుర్గుడు. వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉండి ఆ తర్వాత స్వతంత్ర్య రాజ్య స్థాపన చేశారు. తెలంగాణ ప్రాంతం కూడా రాష్ట్రకూటుల పాలనలోకి వచ్చింది. వీరి రాజధాని మాన్యఖేటం. ఈ వంశంలో చివరి రాజైన రెండో కర్కరాజు (1972–73)ను కల్యాణి చాళుక్య రాజైన రెండో తైలపుడు ఓడించడంతో రాష్ట్రకూట రాజ్యం అంతమైంది.

రాష్ట్రకూటుల సాహిత్యం:

అమోఘవర్షుడు కన్నడ భాషలో 'కవిరాజ మార్గం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు 'రత్నమాలిక' అనే చంధోవిచ్ఛిత్తి గ్రంథాన్ని కూడా రచించాడు.

ముదిగొండ చాళుక్యులు

మూడో కుసుమాయుధుడు: ఇతడికి 'వినేత జనాశ్రయుడు' అనే బిరుదు ఉంది. కొరివి శాసనం నిర్మాత ఇతడే. ఇది తెలుగులో తొలి గద్య శాసనం. ఇందులో వచన రచన మృదుమధురంగా ఉంది.

వేములవాడ చాళుక్యులు

మొదటి హరికేసరి: ఇతడు వేములవాడ శాసనం నిర్మాత. రాష్ట్రకూట రాజైన ధ్రువుడికి సామంతుడు.

రెండో హరికేసరి: ఇతడు కన్నడ భాషను పోషించిన వేములవాడ చాళుక్యరాజు. ఇతడి ఆస్థానంలో పంప మహాకవి ఉన్నాడు. పంపకవి 'విక్రమార్జున విజయం' రచించాడు. ఇతడు ఆదిపురాణం, తెలుగులో జినేంద్రపురాణం కూడా రచించాడు. రెండో హరికేసరి ఇతడికి 'ధర్మపురం' గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చి సత్కరించాడు.

సోమదేవసూరి: ఇతడు 'కథా సరిత్సాగరం' గ్రంథం రచించాడు. ఇతడు మూడో హరికేసరి ఆస్థానంలో ఉన్నాడు. సోమదేవసూరికి 'శద్వాద చల సింహ' అనే బిరుదు ఉంది. ఇతడు మూడు తరాల జైనగురువుగా ఉన్నాడు. ఇతడు 'యశస్తిలక చంపువు' అనే సంస్కృత కథా కావ్యం రచించాడు.

బద్దెన: 'నీతిశాస్త్ర ముక్తావళి' గ్రంథకర్త.
రేచన: 'కవిజనాశ్రయం' గ్రంథ రచయిత.

కల్యాణి చాళుక్యులు

నల్లగొండ జిల్లాలోని కొలనుపాక వీరి సైనిక కేంద్రం. వీరు వీరశైవాన్ని ఆదరించారు. వీరి కాలంలో సంస్కృతం స్థానంలో దేశభాషలు క్రమంగా గౌరవం, రాజాదరణ పొందాయి.

కందూరి చోళులు

వీరి కాలంలో తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపి ఉండేది. వీరి శాసనాలు తెలుగు, కన్నడ లిపుల్లో ఉన్నాయి. వీరు గొప్ప కవి పోషకులు.

ఒకటో గోకర్ణుడు: 'గోకర్ణ చంధస్సు' అనే లక్షణ గ్రంథం రచించాడు.

ఉదయాదిత్యుడు: 'ఉదయాదిత్యాలంకారం' అనే లక్షణ గ్రంథం రచించాడు.

విరియాల కామసాని: గూడూరి శాసనం వేయించారు. నన్నయకు ముందే వృత్త పద్యాలు వాడిన తొలి శాసనం ఇదే.

నరహరి: ప్రసిద్ధ లాక్షణికుడు మమ్మటుడు రచించిన కావ్య ప్రణాళికకు ఇతడు 'బాల చిత్తానురంజన' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. 'స్మృతి దర్పణం', 'తర్కరత్నం' ఇతడి రచనలు.

కాకతీయులు

కాకతీయులు రాష్ట్రకూట వంశానికి చెందిన వారు. వీరు మొదట తూర్పు చాళుక్యులకు సామంతులుగా ఉన్నారు. తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్వతంత్ర రాజ్య స్థాపన చేశారు. ఆ తర్వాత యావదాంధ్రకు విస్తరించారు.

రెండో ప్రోలరాజు: మాటేడు శాసనం రచించాడు. కాకతీయుల మొదటి తెలుగు గద్య, పద్యాత్మక శాసనం ఇదే.

రుద్రదేవుడు లేదా ప్రతాపరుద్రుడు: ఇతడు తెలుగులో 'నీతిసారం' గ్రంథాన్ని రచించాడు. మానవల్లి రామకృష్ణ సంస్కృతంలో 'నీతిసారం' రచించాడు. ఇందులోని 111 పద్యాలను మడికి సింగన 'సకల నీతి సమ్మతం'లో ఉదహరించాడు.

అచింతేంద్రయతి: వేయి స్తంభాల గుడిలోని శాసనం (హన్మకొండ శాసనం) నిర్మాత ఇతడే. 1163లో ప్రతాపరుద్రుడు హన్మకొండలో వేయి స్తంభాల గుడి నిర్మించి, రుద్రేశ్వరాలయంగా పిలిచాడు. ఇందులో త్రికూటశైలి ప్రవేశపెట్టాడు. ఈ గుడి 2013లో 850 ఏళ్లు పూర్తి చేసుకుంది.

పాల్కురికి సోమనాథుడు (1160–1240):

ఈయన 'పండితారాధ్య చరిత్ర' రచించాడు. ఏ సంస్కృత పురాణంలో లేని స్వతంత్ర ఇతి వృత్తాన్ని తీసుకొని, పూర్తిగా దేశీయమైన భాషను ఉపయోగించాడు.

పాల్కురికి రాసిన గ్రంథాలు:

1) అనుభవసారం
2) చతుర్వేద సార సూక్తులు
3) సోమనాథభాష్యం
4) రుద్రభాష్యం
5) బసవరగడ
6) గంగోత్పత్తి రగడ
7) శ్రీ బసవాద్య రగడ
8) సద్గురు రగడ
9) చెన్నమల్లు సీసములు
10) మల్లమదేవి పురాణం (అలభ్యం)
11) శీల సంపాదన (కన్నడ)
12) బసవపురాణం
13) బెజ్జమహాదేవికథ

జాయపసేనాని (1199–1259): ఇతడు నృత్త రత్నావళి, గీత రత్నావళి, నాట్య రత్నావళి గ్రంథాలను సంస్కృతంలో రచించాడు. పాకాల చెరువు శాసనం, కలువ కొలను శాసనం రచించాడే. నృత్యానికి సంబంధించిన లక్షణ గ్రంథం రాసిన తెలుగు వారిలో మొదటివాడు ఇతడే. కవి పోషకుడైన కాకతి గణపతిదేవుడికి ఇతడు బావమరిది. జాయపసేనాని గజ సైన్యాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. గణపతి దేవుడు ఇతడి సోదరిని వివాహం చేసుకొని చిన్నతనంలోనే ఇతడిని తీసుకెళ్లి గుండమాత్యుని దగ్గర చేర్పించాడు. గుండమాత్యుడు ఇతడిని గొప్ప సాహిత్య, సంగీత విద్వాంసుడిగా తీర్చిదిద్దాడు. జాయపసేనాని.. భరతుడి నాట్య శాస్త్రం మొదలు కొని తన కాలం దాకా వచ్చిన అనేక నాట్య, నృత్య, శాస్త్ర గ్రంథాలను కూలంకషంగా పరిశీలించి స్వతంత్ర ప్రతిపత్తితో ప్రామాణిక గ్రంథాన్ని రచించాడు. ఇతడు తన గ్రంథాల్లో పేరిణి నాట్యం గురించి కూడా వివరించాడు. ఇతడు 'కవి చక్రవర్తి'గా ప్రసిద్ధి చెందాడు.

Number of messages used per person?

BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be ______ it must be planned ______.
    1) affected…thoroughly
    2) affective…periodically
    3) executed…properly
    4) effective…systematically
    5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb ______.
    1) charged…blasts
    2) levied…plants
    3) claimed…attacks
    4) withdraw…pits
    5) involved…calls
13. She is very ______ to other people's feelings.
    1) sensible 2) sensibility
    3) sensation 4) sensitive
    5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
    1) pampering…appealing
    2) negligence…destruction
    3) attention…defeating
    4) care…appease
    5) love…developing
15. Market researches often segment the population on the _____ of age and ______ class.
    1) grade…economy
    2) rate…affluent
    3) unit…security
    4) track…wealthy
    5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you you had decided to give up.
B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.
C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."
D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.
E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.
F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions: (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidence 2) fastly
    3) purposely 4) currently
    5) no correction required
22. Rumours that he have flown from the country were promptly scotched by his wife.
    1) had to flow 2) had been flew
    3) had fled 4) had been flowing
    5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel reservation in the world.
    1) reserves 2) reserved
    3) reserve 4) reserving
    5) no correction required
24. Even among the native users of English, plain and direct language is regarded as a virtue in communication.
    1) between a native
    2) between an native
    3) among a native
    4) among nativity
    5) no correction required
25. Professional person at the work place frequently dealing in material which he must understand and also remember for future use.
    1) dealt with material
    2) deal in material
    3) deals with materials
    4) deal among materials
    5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon.** In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
    1) Philippines 2) Japan
    3) Australia 4) China
    5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
    1) more than the annual average SMS volume of countries in Europe, and even China
    2) more than the annual average SMS volume of countries in India, and even China
    3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
    4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
    5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
    1) emergency services
    2) fire services 3) mobile billing
    4) 108 services 5) counseling
29. Average number of messages used per person
    1) 10-12 messages a day
    2) 400 million text messages a day
    3) 100 text messages
    4) 500 messages
    5) 2000 messages per day
30. Lexicon means
    1) glossary 2) glossy
    3) lustrous 4) inventory
    5) catalog

key

1) 4	2) 3	3) 2	4) 4
5) 4	6) 5	7) 2	8) 1
9) 1	10) 3	11) 4	12) 1
13) 4	14) 3	15) 5	16) 5
17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 5	23) 1	24) 3
25) 3	26) 2	27) 1	28) 3
29) 1	30) 1		